లకు సమ్మతంబగు నీమార్గము. క్రమముక్తికి నిర్మలంబయినది. ఇక సాధ్యా
త్మంబున నీశరీరగతంబగు హృదయంబె సర్వతోభద్ర మనంబడును. అట్టిభద్రము
చేతనే అన్నియవయవములందును గళ్యాణము గలుగుచున్నది. అందుఁగల
పద్మమె బ్రహ్మకు నివాసస్థానమని చెప్పఁబడును. ఇట్లు దహరపుండరీక ధామము
ని శ్రుతియందుఁగూడఁ బ్రసిద్ధమైయున్నది. బ్రహ్మజ్ఞాన సాధనంబువలన సంపత్తినొం
దిన వారెవరా హృత్పుండరీకమున సమాహితచిత్తులై యుందురో వారలకాచా
ర్యోపదిష్టంబగు యుక్తిచేత నాపరబ్రహ్మ ప్రకాశించుచున్నాఁడు. పరమపురు
షుఁడు భూమియందు నాకసమునందుఁ గ్రిందుపైన వ్యాపించియున్నాఁడని మొద
లుగ శ్రుతులయందుఁ బల్కఁబడిన విషయంబంతయుఁ బ్రత్యక్షంబుగ నీదేహము
నందు గోచరించుచున్నదని శ్రుతినుడువుచున్నది. మఱియు నేన క్రిందనున్నాఁ
డను. నేనే పైనున్నాఁడను. నేనే యంతట వ్యాపించియున్నాఁడను. అను
మొదలగు సర్వవ్యాపకత్వమును శ్రుతిసమన్వయించి చెప్పినది. ఇందుచేతనే
మూఢులందఱికిఁగూడ నీదేహముగాక దీనియందు నిత్యమగు పరమాత్మ వస్తువు
వేరుగా నొకటియున్నదని తెలియవచ్చుచున్నది గదా! ఇచ్చట సంశయ మక్కఱ
లేదు అనువిషయమును నిరూపించుటకై ఏకాత్మస్వరూపులగు జీవపరమాత్మల
యందు భేదభ్రాంతి నశించుటకై ఆత్మమాత్ర మొక్కఁడేయని శ్రుతినిరూపక
వాక్యముగలిగినది. యిటులనే సర్వోపనిషత్తులయందును ఆత్మబ్రహ్మల కభేదము
చక్కగా నిశ్చితంబైయున్నది. మఱియు బృహదారణ్యకమున చతుర్థాధ్యాయ
మునందు మధుబ్రాహ్మణశ్రుతి బ్రహ్మైవేదమమృతమని యాత్మైక్యమును
వక్కాణించుచున్నది. కైవల్యోపనిషత్తు గూడతత్త్వమేవ త్వమేవతత్ అని జీవా
త్మకు పరమాత్మైక్యమును బోధించుచున్నది. ఛాందోగ్యోప నిషత్తునందు
తత్త్వమసియని బ్రహ్మాత్మైక్య ముపదేశింపఁబడిన జీవబ్రహ్మపదముల యేకత్వమును
నదియె సాక్షాన్మోక్షమునకుఁ గారణంబగుచున్నది. వానియొక్క ప్రజ్ఞానము (బోధ
ము) యుప్పరమాత్మగానుండును. సర్వజనములలోనఁ గనుబడునట్టియు వినఁబడు
నట్టియు పదార్థములయందు వెలుపలను లోపలను అంతటను వ్యాపించి
నారాయణుఁ డున్నాఁడని తైత్తిరీయోపనిషత్తును, “ఇదం సర్వం” సర్వంఖల్విదం
బ్రహ్మ. ఇత్యాదిశ్రుతులు నావిషయమునే ప్రతిపాదించుచున్నవి. మఱియు మను
ధర్మశాస్త్రమునందు ‘ఆత్మయందు సకలభూతంబులును సకలభూతంబులయం
దాత్మను గనుగొనినచో నతఁడాత్మారాధన పరుఁడగుచున్నాఁడని పలుకఁబడియు
న్నది. ఇట్టివిజ్ఞానమునొంది యనేకులగు బ్రహ్మవేత్తలు బ్రహ్మాత్మ స్వరూపము
నొందినవారలై తాముకృతకృత్యులయినదియేగాక యోగ్యులగు తమశిష్యుల
నుగూడ ననుగ్రహించుచున్నారు ఇచ్చటఁ జెప్పంబడిన వేదాంతాభిప్రాయము
నంతయు విద్వాంసులు చక్కగ నెఱుంగుదురు. పెక్కుమాటలచే ప్రయోజనం

దేమిగలదని సంక్షేపముగ నిట్లునిరూపింపఁ బడినది. ఓనారాయణ అచ్యుత జనార్దన వాసుదేవ గోవింద మాధవ ముకుంద రమేశ విష్ణో శంకర్షణ అజ నరసింహ పరావరాత్మ ఊరుగాయ శివ వామన శ్రీరామా? తత్వమునుదెలిసికొన నాసక్తుండగు నీశిష్యుని స్వస్వరూపజ్ఞానముఁ గలుగంజేసి పరిరక్షింపుము ఈప్రపంచ మెవనిచే నిట్లు వికృతినొందినదో దీనియందను ప్రవేశమొనర్చి నెవనిచే నిది చేతనంబై యున్నదో. ఎవనియందుఁ బ్రతిష్ఠింపఁబడియున్నదో అట్టిపరమాత్మకు నమస్కారము.

* అష్టోత్తర శతపదరామతోభద్రాది నానాభేదములు. *

ఇపుడు అష్టోత్తర శతపదాత్మకంబగు రామతోభద్రముయొక్కయు, లఘు ముద్రాంకితము యొక్కయు నానాభేదములు నిరూపింపఁబడును. పూర్వమందు వచించినట్లు యిరువదెనిమిది రేఖల నధికముగాఁ గల్పించునది. రెండుపరిధు లధికముగా లిఖించవలయును. ఆపంక్తులయందు లింగములను జేర్పవలయును. అందు మొదటిపంక్తియందు, 24 యిండ్లుగల 15 లింగములును, 13 యిండ్లతో నేర్పరచిన 16 వాపికలును, 25 యిండ్లుగల భద్రమొకటియు, వేయవలయును. పిదప రెండవపంక్తియందు, 12 లింగములు. 18 యిండ్లతోఁగూడిన, 13 నడబావులు. 12 యిండ్లుగల భద్రమొకటియు, నేర్పఱచి మిగిలినదంతయు ముందుఁజెప్పినట్లు లిఖించునది. ఇది యష్టోత్తరశతరామతో భద్రమనంబడును, అట్లుగానిరెండల మొదటిపంక్తియందు 6 ముద్రలు 6 లింగములు 6 నడబావులు (వాపికలు) వీని నొక్కొక్కదానికి 13 యిండ్లు గలుగునట్లు రచించునది. 16 యిండ్లుగల భద్రమొకటి వేయునది. ఇఁక రెండవపంక్తియందు. 5 ముద్రలు. 6 లింగములు. 6 వాపికలు (నడబావులు) 12 యిండ్లుగల భద్రమొకటియు లిఖించవలయును. పిదప తొమ్మిది పఙ్క్తులవరకు. మూడవపఙ్క్తియందు. 4 ముద్రలు. 6 లింగములు. 6 యిండ్లుగల భద్రమొకటియు. నాలవపంక్తియందు 5 ముద్రలు. 2 లింగములు. 8 యిండ్లుగల భద్రమొకటియు. నయిదవపంక్తియందు. 4 ముద్రలు. 2 లింగములు. 6 యిండ్లుగల భద్రము. నాఱవపంక్తియందు 2 ముద్రలు. 2 లింగములు. 20 యిండ్లుగల భద్రమొకటియు. నేడవపంక్తియందు. 1 ముద్రయు. 2 లింగంబులు. 8 యిండ్లుగల భద్రమొకటియు లిఖింపనగును. అట్లుగానిచో నెనిమిదవ పదమందు, ముద్రనొకటినేర్పరచి, అచ్చటనుండఁదగిన లింగము నాస్థానమునందే యుంచి, నాలవపదమున 20 యిండ్లుగల భద్రము నేర్పఱచునది. అంత సమానములగు ముద్రలనడుమ పరిధులు రెండును, 4 కోష్టములుగల వాపిక ముద్రాసీమాలింగముల సందియుండవలయును, లింగముల (స్కంధమున) పైభాగమునను నుండు కోష్ఠముల నిచ్చవచ్చినరంగులతో నేర్పఱుపవచ్చును, లింగలకు వాపికలకు మధ్యమమునందు నుర్వరితంబులగు పదంబులందు భద్రములను శృంఖలలను

లిఖింపవచ్చును. అట్లుగానిచో మొదటిపంక్తియందు, 10 ముద్రలు. 10 సీమాపరిధులు నడుమ 12 యిండ్లుగల భద్రమొకటియు, 2 పరిధులు. నిర్మింప వలయును. ఈలాగుననే రెండవపంక్తియందుఁ గూడ పరిఘుల నిర్మింపవలయును, మూడవపంక్తియందు. 8 ముద్రలును, 4 యిండ్లుగల భద్రమొకటియు, వేయవలయును. 5వ పఙ్క్తియందు 5 ముద్రలును, 12 యిండ్లుగల భద్రమొకటియు మాత్రము వేయునది. యిచట పరిధులు గూర్పఁదగవు, 7వ పఙ్క్తియందు 3 ముద్రలు, 4 యిండ్లుగల భద్రమొక్కటియు, 2వ పంక్తియందు 13 లింగములు, 14 వాపికలు (నడబావులును.) 4వ పంక్తియందు, 25 యిండ్లుగల భద్రమొకండును, 9 లింగములును, 10 వాపికలును, 6వ పంక్తిలో 25 యిండ్లుగల భద్రమొకండును, 5 లింగములును 6 వాపికలును, యిచ్చట 25 యిండ్ల భద్రమొకటితప్ప మిగిలినవన్నియు పూర్వమురీతిగనే లిఖింపఁదగును. కాదేని, మొదటిపంక్తియందు 15 లింగములును, 2వ పంక్తియందు, 8 ముద్రలును, మూడవపంక్తియందు, 6 యిండ్లుగల 2 లింగములును, 4వ పంక్తియందు 5 ముద్రలును 6వ పంక్తియందు 2 ముద్రలును, 7వ పంక్తియందు 8 ముద్రలును 2 లింగంబులును 2 వాపికలును, లిఖింపవచ్చును. ఇది, 7 పంక్తులుగలుగునట్టిదియొకవిధానము, యిందు భద్రపరిమాణము. 1వ పంక్తిమొదలు క్రమముగా 25. 6. 16. 8. 20. 16. 16. యిండ్లుకలిగి యుండవలయును. ఇట్లుకాదేని, మొదటిపంక్తియందు 1 ముద్రను నడుమ 1 లింగమును, కల్పించి 16 యిండ్లు (కోష్ఠములు) గల భద్రమును రచించి యేనుఁగునందాలింగమును లిఖింపవలయు, గజాకృతియందు వ్రాసినభద్రము 25 కోష్ఠములు (యిండ్లు) గలిగియుండవలయును, తక్కినదంతయు యథాపూర్వముగనే రచింపవలయును, అట్లుగాదేని, మొదటిపంక్తియందు 5 లింగములను 2వ పంక్తియందు 4 లింగములను 3వ పంక్తియందు 3 లింగములను ముద్రలనడుమవ్రాసి, పిదప సీమాంతపరిధుల నేర్పఱుపవలయును. భద్రప్రమాణము. 1వ పంక్తిలో 6 యిండ్లును 2వ పంక్తిలో 12 యిండ్లును 3వ పంక్తిలో 20 యిండ్లును కలిగియుండవలయును. పిదప రెండు పార్శ్వములందును, వాపికలను లింగములను రెండింటిని రెండింటిని వ్రాయవలయును. తక్కినదంతయు యథాపూర్వముగ రచించునది. ఇది యొకక్రమము. ఇట్లుకాదేని, మొదటినుండి, 4. 5. 6. 7. పంక్తులయందు, క్రమముగ 1. 2. 3. 8ముద్రలును, అటులనే సీమాపరిధులును, 6 స్థానములందును 44 యిండ్లుగల లింగములును, వ్రాయఁదగు. అయితే విశేషమేమన 2 లింగములు మాత్రము 68. 68. యిండ్లుగలిగి యుండవలయును. వాపికలుగూడ నటులనే యుండఁదగును. 1 మొదలు 6 పంక్తులవఱకు క్రమముగా 25. 16. 4. 6.6. 16. యిండ్లుగల భద్రముల నేర్పఱుపవలయును, తక్కినది యథాపూర్వముగ నాచరింపవలయును,

ఇఁక నయిదుపంక్తులుగలది చెప్పఁబడుచున్నది. 1. 2. 3. 4. 5. పంక్తులయందు క్రమముగా 6. 6. 5. 4. 3. ముద్రికలను నడుమ లింగము గలుగునట్లొనర్పవలయును ఆపైని, ఆపఙ్క్తియందే క్రమముగ 4. 2. 2. 2. 2. మర్యాదాపరిధులును, 68. 68. యిండ్లుగల రెండులింగములును క్రమముగా, 16. 16. 12. 6. 3. భద్రములును బుద్ధిజాగ్రత్తతోఁ జక్కఁగ లిఖింపవలయును. తక్కినదంతయు పూర్వము జెప్పఁబడినరీతిగ నివర్తింపఁదగును. ఓవిష్ణుదాసా ఇట్టిభేదంబు లనేకంబులు గలవు.

ఇది శ్రీ శతకోటి రామచరితాంతర్గతంబగు నానందరామాయణం బను వాల్మీకి కృతంబగు నాదికావ్యమునందు శ్రీరామదాస విష్ణుదాస సంవాదంబున ఉపనిషత్తత్వ విచారపూర్వకలఘురామతో భద్రవిస్తారమను నాలవసర్గము.

——:(o):——

శ్రీరామదాసవచనము.

* నానావిధ రామతోభద్రలింగతో భద్రరచనాక్రమము. *

విష్ణుదాసా? మున్నెఱిఁగించిన నుత్తమముద్రికలుగల రామతో భద్రయంత్ర విస్తారంబును వచించెద వినుము. నిలువుగను, అడ్డముగను 61 గీతలనుగీచి వానికోననుండి క్రమముగా నలుపు యెఱుపు తెలుపు పసుపు వర్ణములుగల పరిధులను నాలుగింటి(పార్శ్వములయందు) నేర్పరుపవలయును. 12వ వరుసకు కడపట మరల పసుపు నలుపు యెఱుపు తెలుపు రంగులతోడ పరిధుల నేర్పఱచి అయిదవ వరుసమాత్రము పచ్చనిరంగుతో లిఖింపవలయును. ఇది సర్వతోభద్రవిధానప్రకారము పిదప వెలుపలిదగు 12వ వరుసయందు పచ్చనిరంగుతో గాని యెఱ్ఱనిరంగుతోడ నైనంగాని సీమాపరిధుల లిఖించి మధ్యంబున మఱియు 2పరిధుల నేర్పఱుపవలయును. అంతట నడుమ రెండిండ్లయందును నాలుగు రంగులుగల రెండు ముద్రికలు లిఖించి, నాలుగు పార్శ్వములయందును, తొలినెఱిఁగించినరీతిగనే (రామ) నామంబులను లిఖింపవలయును. మూలయిండ్లయందు తెల్లనిరంగుతోడ మూఁడిండ్లుగల చంద్రరేఖయొకటియు, నల్లని వర్ణముతోడ 11 యిండ్లుగల గొలుసొకటియు పసుపు రంగుతోడ 10 యిండ్లుగల మఱియొక గొలుసునొక్కటియు, పచ్చనిరంగుతో 19 యిండ్లుగల తీగయొకటియు, లిఖింపవలయును. మఱియు, నెఱ్ఱనిరంగుతో 9 యిండ్లుగల భద్రమొక్కఁడును, తెల్లనిరంగుతోడ 13 యిండ్లుగల వాపిక (నడబావి) యొండును, నవల నడ్డముగ నెఱ్ఱనిరంగుతో 3 యిండ్లుగల భద్రంబును. పసుపువన్నెతో 9 యిండ్లుగల భద్రంబును. యెఱ్ఱనిరంగుతో 2 యిండ్లుగల భద్రముల రెండిఁటి నడుమ నంతట లిఖింపవలయును. ఇది యష్టముద్రాత్మక (8 ముద్రలుగల) రామతోభద్ర మనంబడుచున్నది. పచ్చని సంకిలను వదలి

నల్లని రంగుతోడ త్రిషట్పదాత్మకమ (63 యిండ్లుగలద)గు లింగమును, 2 ఖండ వాపికలు. 4 యిండ్లుగల 2 కమలములు. నెఱ్ఱనివర్ణముతో 6 యిండ్లుగల యొకభద్రమును, అడ్డముగా పచ్చనివర్ణముతోడ 9 యిండ్లుగల భద్రమొక్కండును. 4 యిండ్లుగల భద్రమొక్కండును. లిఖించి లింగముపైని నెఱ్ఱవర్ణముతోడ 3 యిండ్లయందు మాలికను వ్రాయవలయును. కాదేని లింగాకృతితో మాలికను వ్రాసినను వ్రాయవచ్చును. ఇది అష్టముద్రాత్మకసలింగ రామభద్ర యంత్రమని చెప్పంబడు. మఱియు అడ్డముగా నిలువుగా 53 రేఖలుగీచి మిగిలిన దంతయు పూర్వరీతిగనే లిఖించునది. 6 ముద్రికలను 6 పరిధులను తెల్లనిరంగుతో నిండింపవలయును. ఇది చతుర్ముద్రాత్మక రామభద్ర యంత్రము. సలింగక రామభద్రముగూడ నిట్లె మునుపటియట్ల నెఱుంగునది. మఱియు నడ్డముగా నిలువుగ 73 రేఖలు ఎఱ్ఱనివర్ణముతోడ వ్రాయవలయును. వాని నాలుగుపార్శ్వములయందును, క్రమముగా నలుపు. ఎఱుపు, తెలుపు, పసుపు, వన్నెలతోడ పరిధుల నేర్పఱుపవలయు, అంత 12 యిండ్లపైనియున్న యిండ్లయందు పరిధిని వ్రాసి, మఱియు 4వ పార్శ్వమందు పచ్చనివర్ణముతో నొకపరిధిని, దానిపైని యెఱ్ఱనివర్ణముతోడ నొక పరిధిని, దానియనంతరము పచ్చనివర్ణము గల నెనిమిది యిండ్లపరిధి నొకదానిని, దానిపైని మఱియొక్కం డాఱిండ్లపరిధిని పీతవర్ణముతోడనే రచింపవలయును. పిదప ఆద్యస్థానమునందు సీమాపరిధులను రక్తవర్ణముతోడనైనను పీతవర్ణము తోడనైనను నాలిగింటిని రచించునది. ఇటులనే 12 యిండ్లపైననుండు యిండ్లయందును జేయునది. కోణగృహమందు పూర్వమురీతి, నడుమ మూఁడుముద్రల రచింపవలయును, పిదప రెండవ స్థానమునందు. 1 చంద్రుఁడు నల్లనివర్ణముతోఁడ 1 సంకిలయు యిండ్లుగల తీగయొకటియు, 14 యిండ్లుగల తీగయొకటియు, రచించి యీరెండు తీగెల నడుమ, నెఱ్ఱనివర్ణముతోడ 6 యిండ్లుగల భద్రమొకటియు రచించి, యావల తెల్లని వర్ణముతోడ 13 యిండ్లుగల వాపికలు నాలుగును, నల్లని వర్ణముతోడ 26 యిండ్లెగల లింగములు మూఁడును, లిఖింపవలయును. లింగమధ్యమునందును ఇతరములగు యిండ్లయందును, రామయను నామములను మసితోడ కర్ణికాస్థానమునందు 13 నామములు వ్రాయఁదగును. 4 యిండ్లు శిరస్సును, 2 యిండ్లు కటిప్రదేశమును, లింగపార్శ్వములు రెండు నాలుగిండ్లును పాదములు స్కంధములు రెండురెండిండ్లును రెండ్లుయిండ్లను రెండు శివనేత్రములను తెల్లని రంగుతోడను వ్రాయవలయును. పిదప నడబావిపై మిగిలిన 8యిండ్లయందు ఎఱ్ఱనివర్ణముతోడ మూఁడిండ్లను, పచ్చనివర్ణముతోడ నయిదిండ్లను, పూర్తిసేయవలయును, ఆవలమున్నెఱింగించిన రీతిగనే సర్వతోభద్రము నడుమ రచించునది. ఇట్లు మూఁడు సర్వలింగ రామతోభద్రము లెఱిం

గంబడినవి. ఈ 12 ముద్రలచే రామలింగతోభద్రాత్మక చక్రంబగుచున్నది. ఇది మిక్కిలిరమ్యంబు, నాశ్చర్యకరంబును దీనియందు లింగాత్మక రామాత్మక భద్రాత్మక త్రివిధరచన మిమిడియున్నది గాన నీద్వాదశ ముద్రాత్మకంబు శ్రీరామునకు మిగుల సంతోషదాయకంబు, మఱియు నిలువుగ నడ్డముగ 79 గీతలం గీచి తక్కినదంతయు పూర్వముకీతిగనే లిఖించి నడుమ చతుర్ముద్రాత్మక భద్రమునం దెఱంగించినరీతి లిఖింపవలయు, మొదటిస్థలమందు 8 ముద్రలును 8 సీమాపరిధులును, నడుమ మూఁడు మూఁడు పరిధులును, అంతము నందు రెండు రెండు పరిధులును వ్రాయఁదగును. ఇయ్యది షోడశముద్రాత్మక రామతోభద్ర మనఁబడును. అంతర్గేహమున లింగమును జేర్చినచో సలింగతోభద్రమగును. మఱియు నిలువుగ నడ్డముగ 451 గీతలను ఎఱ్ఱనివర్ణముతో గీచి మధ్యమందు అష్టముద్రాత్మకమగు రామతోభద్రమును లిఖింపవలయును. అడ్డముగనిలువుగ పచ్చనిరంగుతో నంతటలిఖించి 12 యిండ్లపైని బహిఃపరిధుల నేర్పఱుపవలయు, కోణగృహాలును ముద్రలక్రమమును పూర్వరీతిగ నెఱుంగునది. రెండుపరిధులేర్ప ఱచునట్లు ముందెఱింగింపఁబడినది. ఆపరిధులక్రింద 4 ముద్రలును నడుమ నంతటయు రెండుముద్రలును వ్రాయవలయును' మఱియొకచో నెప్పుడును లిఖింపఁగూడదు. పిదప పంచమస్థలమునందు 8 పరిధులను నిర్మించి తరువాత 1 ముద్రికయు, 80 యిండ్లుగల 4 నడబావులును, ఆనడబావుల నడుమ 12 యిండ్లుగల కుండమొకటియు వాని పార్శ్వములయందు వేరువేరుగా నెఱ్ఱనిరంగుతోడ 15 యిండ్లుగల 4 భద్రములును వ్రాయవలయును, షష్ఠస్థానమునందు 12 ముద్రలును, అనంతరము 14 ముద్రలును పిదప 16 ముద్రలును ఆవల 20 ముద్రలును పిమ్మట 22 ముద్రలును, ఆవల 24 ముద్రలును పిదప 26 ముద్రలును, అటుపిమ్మట 28 ముద్రలును, లిఖించి 30-32 ముద్రల స్థానమునందు 16 ముద్రలను 16 వాపికలును, నడుమ 2 వాపికలును, వ్రాసినచో నిది అష్టోత్తరసహస్రరామతోభద్రమగుచున్నది. అటులనే 598 రేఖలుగీచి ప్రస్తారము వేసినచో అష్టోత్తర సహస్ర రామలింగతోభద్రమగును. ఎట్లన. నిలువుగ నడ్డముగ 598 గీతలు నెఱ్ఱనిరంగుతోగీచి. దానినడుమ మధ్యముద్రా స్థానమునందు 72 యిండ్లుగలుగనట్లు నల్లని రంగుతో నొక లింగమునుగాని 36 రామనామములనుగాని హ[illegible]ముతో లిఖించవలయును. కర్ణికను కృష్ణవర్ణముతో గీయునది. 4 యిండ్ల[illegible] శిరస్సును. 4 యిండ్లచే కటిభాగమును. 12 యిండ్లచే రెండుపార్శ్వములును 20 యిండ్లచే స్కంధమును. 20 యిండ్లచే మొదలుచున్న. 26 యిండ్లచే 2 వా[illegible] కాశకలములను తెల్లనిరంగుతోడనున్న. 2 యిండ్లచే లింగముయొక్క నేత్రములు తెల్లనిరంగుతోడనున్న. మిగిలిన యిండ్లలో యిండ్లను తెల్లనిరంగుతోడను 14 యిండ్లను పచ్చనిరంగుతోడ 5 మవ్రాసి యచట కణాద్వా[illegible]

మునున్ను లిఖింపవలయును మూడవస్థానమునందు 3 ముద్రలును 2 లింగములును. 4వ స్థానమందు 4 ముద్రలును. 3 లింగములును. లిఖింపవలయు. పిదప లిఖించుట లోకొంత విశేషముగలదు ఏమనిన. 15వ స్థానమునందు. 14 ముద్రలును 14 శివలింగములున్ను. 14వ స్థానమునందు 14 ముద్రలును. 14 లింగములును వ్రాయవలయును పైనివానివాని బుద్ధిబలముచే నాలోచించి వ్రాయందగు. కోణగృహములయందు 6 యిండ్లుగల లింగములను వ్రాసి. యష్టముద్రాత్మక లింగతోభద్రమున నెఱింగించిన రీతిముద్రలకన్న లింగవృద్ధిచేయ వలయును ఇట్లు కొనవరకు లింగములవృద్ధి నొనర్చునది. 22వ స్థానమునందు 12 ముద్రలును 13 లింగములును. పిదప బహిః పరిధులును. వ్రాసి యావల యుక్తిచే పూర్వము వలె చక్కగా రచించినయెడల నిది అష్టోత్తర సహస్ర రామలింగతో భద్రమని చెప్పఁబడును ఇయ్యది శ్రీరామునకు మిగులప్రీతి కరమయినది. మఱియు. నడ్డముగ నిలువుగ 165 రేఖల నేర్పఱచి. మధ్యమున నెనిమిది ముద్రలును అంతట పరిధులను లిఖించి 12 స్థానములపైని నడ్డముగా నూర్ధ్వముగా బహిః పరిధుల నేర్పఱచి నడుమ మాత్రము సీమాపరిధుల 2 నేర్పఱచి, నేత్రస్థానమునందు 4 ముద్రలు లిఖించి. 3వ స్థానమునందు 3 ముద్రలును, 4వ స్థానమందును. 8వ స్థానమందును 4 ముద్రలును 5వ స్థానమునందు 10 ముద్రలు లిఖింపవలయు. మిగిలినదంత మున్నెఱింగించిన రీతిగ నొనర్చునది. ఇది అష్టోత్తరశతరామతోభద్రమనఁబడును. మఱియునట్లు 203 రేఖల నడ్డముగ నిలువుగ లిఖించి. ప్రస్తరించిన నష్టోత్తరరామలింగతో భద్రాసనంబగుచున్నది. ఎట్లన దీనిమధ్యమునందు ముద్రాస్థానమునఁ దెల్లనిరంగుతోడ వాపికనొకదానిని వ్రాసి 12 స్థానములపై పూర్వమువలెనె పరిధులనుగీచి. పిదప నిలువుగ నడ్డముగ బహిః పరిధుల నేర్పఱుపవలయును. 3వ స్థానమునందు 3 ముద్రలును 2 లింగములును. 4వ స్థానంబున 4 ముద్రలును. 3 లింగములును. 5వ స్థానమునందు 5 ముద్రలును 4 లింగములును. 6వ స్థానమునందు 6 ముద్రలు. 7 లింగములును. కోణములందుండు 2 యిండ్లయందు 3 యిండ్లతో నొకలింగమును 6 యిండ్లతో నొకలింగమును. అష్టముద్రాత్మక సలింగతోభద్రమున నెఱింగించిన రీతిగనే సప్తమ స్థానమునందు 7 ముద్రలును 8 లింగములును 2 కోణగృహములయందు 3 యిండ్లుగల యొకలింగమును. 6 యిండ్లుగల యొకలింగమును, లిఖింపవలయును ఇయ్యది అష్టోత్తర శతరామలింగతో భద్రమనఁబడును. కాదేని. 6వ స్థానమునందు కోణగృహమున లింగమును లిఖింపకుండవలయు 3వ స్థానమునందు 1 ముద్రయు 2 వాపికలును. 2 లింగములును. వ్రాయవలయు ఇది. శతాత్మక రామలింగతో భద్రమగును. అష్టోత్తర శతరామతోభద్రమునందు వహ్నిగృహమున 6 ముద్రలను మాత్రము వ్రాసి. అంతస్థానమునందు పంచమస్థానమందు 5 ముద్రలును,

5 వాపికలును. లిఖించునది. ఇది శతముద్రాత్మక భద్రాసనము అష్టోత్తర సహస్ర శ్రీరామతో భద్రాసనమునందు 5వ స్థానమునందు 6 వాపికలును. 4 ముద్రలును 1000 రామనామములును లిఖించిన అష్టోత్తరసహస్ర రామతో భద్రమగును. ఈఆసనమందు 4వ స్థానమునందును కోణగేహమునందు. లింగమును వ్రాయకుండునది. ముద్రాస్థానమునందె 2 వాపికలును మాత్రమువ్రాసి మధ్యమున కెచ్చట నేమియువ్రాయకుండ నుండవలయు. పిదప వేయింటనిరామ ముద్రికలనే వ్రాయచినచో నియ్యది సహస్రముద్ర రామతోభద్రాసనం బగును. షోడశరామతో భద్రాసనమునందు మొదటిస్థానమునందు మూఁడుదిక్కులయందును మధ్య ముద్రాస్థలమునందును మూఁడువాపికలును. పెద్దదిగరచించునది, ఇదియె త్రయోదశాత్మకమగు రామతోభద్రమగుచున్నది. కాదేని మొదటిస్థానమునందు మధ్యముద్రలయందును. నాలుగుదిక్కులయందును నాలుగు వాపికలును పరస్థానమునందు మూఁడువాపికలును. మూడుదిక్కులయందు మూఁడువాపికలును. వ్రాసినచో నియ్యది నవముద్రాత్మకమగు రామతోభద్రమగును. ఇది కేవలము మంగళకరమైనదియు, శ్రీరామునకు మిగులప్రీతి కరంబైనదియునై యున్నది. 105 గీతల నడ్డముగ నిలువుగ పూర్వమెఱింగించిన రీతిగనే లిఖించి యందు త్రయోదశాత్మక రామతోభద్రాసనంబు వ్రాసి మధ్యస్థానమునందు మూఁడుముద్రికలును. ఆముద్రలమధ్యమునందు వాపికలు రెండును. అర్కమధ్యమములగు పరిధులు రెండురెండుగా నంతటఁ జేర్పవలయును. ఇయ్యది (25) తత్వముద్రాత్మకంబగు రామతోభద్రాసనము. ఇయ్యది తత్వమును జక్కగ నెఱింగిన వారికి ముఖ్యముగ సంతోషదాయక మయినందున నల్లరచేఁ దెలియఁదగినది, మఱియుఁ గోణగృహములయందు లింగములను వ్రాయుచువచ్చి పశ్చిమమున నైరృతస్థానమునందు (రెండవపఙ్క్తియందు) వాపీస్థానమున 25వ లింగమును లిఖింపవలయును. ఇయ్యది యిరువదియైదు ముద్రలతోఁగూడిన రామతోభద్రమగును.

శ్రీరామాసనభవ దైవతాదివిచారము

ఇఁక శ్రీరామాసనములయందు నావాహనము సేయుదేవతల నెఱింగించుచున్నాఁడను. తొలుత ఆయాదేవతలను సర్వతోభద్రముయొక్క నదుమ నావాహనము సేయవలయును. పిదప బాహ్యలింగములయందు రుద్రుని వాపికలయందు నలుని. నచటనుండు భద్రములయందు సుగ్రీవుని. అడ్డముగానున్న భద్రములయందు గవుని. పచ్చనిసంకెలలయం దన్నిటియందు నంగదుని ధ్యానముసేయవలయును. పచ్చని శృంఖలలు లేనిచో నాలుగిండ్లుగల తిర్యగ్భద్రమునందు ధ్యానించునది. పిదప నల్లని వర్ణముగల సంకెలలయందు విభీషణుని నావాహించి. వల్లుల (తీగెలు) యందు జాంబవంతుని చంద్రకలయందు మైందుని స్మరించవల

యును. ఆవల పరిధిలయందు ద్వివిదుని, ముద్రయందు సీతాసమేతుండగు
రామునిని ముద్రయొక్క పశ్చిమభాగమున లక్ష్మణుని, దక్షిణభాగమున భర
తుని, నుత్తరభాగమున శత్రుఘ్నుని తూర్పుభాగమునందు నంజనేయుని ధ్యా
నింపవలయును. ఇచట పూజ్యపూజకుల మధ్యముననే తూర్పుదిక్కు నేర్పరుచు
కొనునది. అనంతరము. సీమాపరిధులయందు సుషేణునిని, మిగిలియొడ్ల యందం
తట సకల వానరులను ధ్యానముసేయవలయును. వెలుపలనున్న. (బాహ్యములు)
మూఁడుపరిధులయందుమాత్రము గంగానదిని (త్రివేణి) స్మరింపవలయును. వాపి
కలను లింగంబులను నలుగురు దిక్పాలుర యెదుటనుండి సేయవలయును. కాదే
ని, తనకు నెదురుగాని. పద్మముల కెదురుగగాని యుండునట్లొనర్చినను దోషము
లేదు. అయినను దిక్పాలుర కభిముఖంబుగనుంచుటయె సర్వోత్తమంబు. అని
మునీంద్రు లువచించుచున్నారు. ఈ సర్వతోభద్రమునందు మొదట దేవతలను
బూజించి పిదప శ్రీమన్నారాయణుండగు రామునియొక్క యుత్తమంబగు పూజ
నారంభింపవలయు. పద్మముయొక్క కర్ణికయందు సీతాసమేతుండగు శ్రీరాముని
నిలుపవలయును. తదావాహన దేవతల నష్టదళములయందు మాత్ర మావాహ
నము సేయవలయునని పండితులగు వారువచించు చున్నారు. కావున నిపుడు
పద్మము ఓన్నదిగనుక సంకోచ భావమును భావించి మఱియొక విధమును దెలి
యఁజేయుచున్నాఁడను. సర్వతోభద్రకమలముమీఁద ధాన్యరాశినిచేసి. దానిపై
విశాలమై యుదక పూరితమగు రాగి బిందెనుంచి. దానియందు మొగలిపూ
వును. అంచులకుపైన తెలియునట్లువేసి బియ్యమునుబోసి. దానిపైన నూతన
వస్త్రమును గప్పి యచట శ్రీరాముని బూజింపవలయును. మఱియు ప్రతిమలు
శైల (రాతితోఁ జేయఁబడినది.) దారుమయ (కొయ్యచేఁ జేయబడినది) లోహి
(లోహము చేఁ జేయఁబడినది.) లేప్య (గచ్చులెప్పము మున్నగు వానితోఁ జేయఁ
బడినది) సైకతి (ఇసుకతోఁ జేయఁబడినది) మనోమయి (మనస్సునందె ధ్యానిం
పఁబడినది) మణిమయి (రత్నముచేఁ జేయఁబడినది.) యని యెనిమిది విధములు
గ నున్నవి. ఇచటనన్నియు రామతోభద్రము లను సంజ్ఞ కలిగియున్నవి. ఓరామ
దాసా ! లెక్కకుమిక్కుటముగ ననేకంబులగు రామతోభద్రములు గలవు వాని
నన్నింటిఁ బేర్కొనుట కెవ్వనితరము, బుద్ధిమంతులు వాని బుద్ధి జాగ్రత్తకొలఁది
విష్ణుపూజనముకొఱకు కల్పించుకొనవలయును, శ్రీరామునిఁ బూజించుటకు
బంగారు సరిగతో నేసిన వస్త్రము మిగుల శ్రేష్ఠము. అదిలేకున్న వెండిజరితో
నేసిన వస్త్రముగాని పట్టువస్త్రముగాని యాసనముఁ గల్పింపఁవచ్చును అవియుఁగూడ
లేక సర్వాభావమైనచో నొక యాకున ద్రావాయునది. అందు భుజపత్రపు పత్రము
మిక్కిలి సిద్ధిప్రదము. కాదేని చిత్రవర్ణములుగల నూలుచే నేయఁబడిన వస్త్రము
నందైనను లిఖింపవలయును. ఆసనము లేకుండ నొనర్చినపూజ వ్యర్థమగును

గాన ముఖ్యముగా నాసనపరిగ్రహ మొనర్పవలయును, శ్రీరామభద్రాసనము నందొనర్చు పూజ మిక్కిలి ఫలమును గలుగఁజేయును, లోకమున నెవ్వరైనను రాముని గుఱించిచేయు పూజలన్నియు సర్వతోభద్రాసనముమీఁదనే యొనర్పవలయును, రామభద్రాసనములులేని యేకర్మయు నిష్ఫలమగును గావున, రామపూజనంబున నవశ్య మాభద్రాసనంబును రచింపవలయును. ఇఁక నాసనంబులలో నష్టోత్తర సహస్ర రామలింగతోభద్రాసనంబు శ్రీరామునకు మిగుల నానందకరంబగుటచే నత్యంతము శ్రేష్ఠంబు, దానికన్న నష్టోత్తర శతాత్మకంబగు రామతోభద్రమును దానికన్న నష్టోత్తర శతరామలింగతోభద్రంబును, దానికన్న పంచవింశచ్ఛ్రీరామతోభద్రమును, దానికన్న షోడశాత్మక రామతోభద్రంబును, దానికన్న త్రయోదశాత్మక రామతోభద్రంబును, దానికన్న ద్వాదశాత్మకంబును దానికన్న నవాత్మకంబును, దానికన్న నష్టముద్రాత్మకంబును దానికన్నఁ జతుర్ముద్రాత్మకంబును, న్యూనమైయుండును. ఇట్లు రామతోభద్రాసనంబుల నెఱుంగవలయును, శ్రేష్ఠములగు భద్రాసనంబునందుఁ బూజయొనర్చినచో శ్రేష్ఠఫలమునొందును, లఘు భద్రాసనంబుల నొనర్చిన స్వల్పఫలంబునొందును, గావున ప్రతిమనుజుఁడును తనకు సాధ్యమగునంతదనుక, ఫలమునుజక్కఁగ నెఱింగి, యత్నపూర్వకముగ శ్రేష్ఠాసనము నేర్పఱుపఁ దలంపవలయును ప్రతిసంవత్సరమునందును గ్రొత్తక్రొత్త యాసనమును లిఖింపవలయును. వెనుకటి వర్షమున లిఖించినది మఱువర్షమున నుపయోగింపకూడదు. ఓ రామదాసా? నీవడిగిన ప్రకారము రామతోభద్రాసనంబుల నన్నింటి నెఱింగించితి. ఈప్రస్తావమున శ్రీరామచంద్రునియొక్క చిన్నలీలయొకటి తలంపునకు వచ్చినది దానిని

* శ్రీరాముఁడు కోట్లకొలఁది లింగములఁ బూజించుట. *

నీకెఱింగించెద వినుము. పూర్వము శ్రీరామచంద్రుఁడు గురువాక్య ప్రకారము ప్రతిసంవత్సరమును శ్రావణమాసమునందు ఒక్కొకలింగము 40టంకములు (160రూప్యములు) పరిమాణము గలుఁగునటుల లక్షలింగములను బంగారుతోఁ జేయించి ప్రతిదినమును జానకితోఁగూడి పూజయొనర్చుచుండి. అష్టోత్తర సహస్ర లింగములతోఁడ నేర్పఱచు భద్రాసనంబు శివునకు నత్యంతము ప్రీతికరంబగు నుత్తమాసనంబుగాన దానిమధ్యకమలమునందొక లింగమును బ్రతిష్ఠించి షోడశోపచారములచేఁ బూజయొనర్చి దానికి సువర్ణముద్రికను దక్షిణగఁ బెట్టి యొక బ్రాహ్మణునిఁ బూజించి యతని కాయాసనంబుతోఁడ సువర్ణముద్రికను దానముసేసెను. ఇట్లు వెవ్వేరుగా ముప్పదిమూఁడు దినములలో కోటిలింగములను బ్రాహ్మణులకు దానంబొనర్చెను. ఇట్లు శ్రీరామచంద్రుఁడు ప్రతిసంవత్సరంబున శ్రావణమాసమునందు వ్రతము నాచరించుచుండెను. బ్రాహ్మణులెల్లరు శ్రీరామునిచే నొసంగఁబడిన దివ్యవస్త్రాభరణంబులచే మిగుల సంతుష్టులై ప్రకా

శించుచుండిరి. అపుడు శ్రీరాముఁడు బంగారు సరిగెవస్త్రము నాసనముగా గల్పించెను. వ్రతోద్యాపనమును వ్రతహోమమునుగూడ నాచరించెను, అని చెప్పి విష్ణుదాసుండు రామదాసుం గనుంగొని గురుసత్తమా? అష్టోత్తర సహస్ర లింగతో భద్రమని వచించితిరది యెయ్యది దానిభేదంబులెయ్యవి శ్రీరాముఁడు సర్వేశ్వరుండుగాన బంగారుతో లింగముల నొనర్చి బంగరుసరిగెతో నాసనంబు లమర్చి పూజయొనర్చి బ్రాహ్మణులకు దానమొనర్చెను. ఇఁక బీదవారీవ్రతము నెట్లాచరింపఁగలుఁగుదురు. ఈసంశయమునివర్తించునట్లు ఆనతీయ వేయని యడిగిన నాతండు వచింపఁదొడఁగె. విష్ణుదాసా? అట్టిసంశయమువలదు శక్తి గలిఁగియుండిన పట్టువస్త్రమునందుగాని కంబళియందుగాని సామాన్య వస్త్రమునందుగాని నానావర్ణములుగల దారములతోఁ గుట్లువేసి వ్రాయునది. అదిగాని చో వస్త్రము మీఁదరంగుతోనైనను లిఖింపఁదగును, శక్తిలేకపోయినచో వెండితోనైనను రాగితోనైనను పాదరసముతోనైనను స్ఫటికముతోనైనను రాయితోనైనను, చందనముతోనైనను, ఆవుపేడతోనైనను, అదిగూడ లేకున్న చివరకు మట్టితోనైనను లింగముల నొనర్చి పూజసేసి తనశక్తి కనుగుణంబుగ బ్రాహ్మణులఁ బూజించవలయును. ఇఁక నష్టోత్తర సహస్రలింగతో భద్రరచనాక్రమంబుఁ దెల్పెదవినుము, నిలువుగ నడ్డముగ 218 గీతల నెఱ్ఱనిరంగుతో లిఖించి యాజుస్థానములపైని కచ్చని వర్ణముతోఁడ 12 యిండ్లుగల పరిధుల నాటింటి రచించి వానియందు లింగములు మున్నగునవి రచింపవలయు, 4 కోణములందు మూఁడిండ్లుగల 2 చంద్రులును, వానిపై నంతట నయిదిండ్లుగల శృంఖల, 11 యిండ్లుగల తీగయు 30 యిండ్లుగలవాపికయు, 18 యిండ్లుగల లింగమును లిఖింపవలయు నిట్లు క్రమముగ నంతట లిఖించునది. అందు మొదట పరిధియొక్క దక్షిణభాగమునందు 14 లింగములను వానిపై 15 వాపికలును పిదప పంద్రెండేసి యిండ్లుగల భద్రములు రెండును వ్రాయువలయు. ఇఁక రెండవస్థానమునందు నేకత్రింశన్మితమగు వాపికయు, నవనవాత్మకములగు రెండుభద్రంబులును, మూఁడవస్థానమునందు 28 లింగములును నాఱేసి పదములుగల రెండుభద్రములును, నాలవస్థానమునందు 26 లింగములును పంద్రెండేసి యిండ్లుగల భద్రములు రెండును, నయిదవస్థానమునందు 24 లింగములును, తొమ్మిదేసి యిండ్లుగల రెండుభద్రములును, నాఱవస్థానమునందు 12 లింగములును నాఱేసి యిండ్లుగల రెండుభద్రములును, నేడవస్థానమునందు 19 లింగములును పంద్రెండేసి యిండ్లుగల రెండుభద్రములును, నెనిమిదవ స్థానమునందు 17 లింగములును తొమ్మిదేసి యిండ్లుగల రెండుభద్రములును, తొమ్మిదవ స్థానమునందు 14 లింగములును 16 యిండ్లుగల రెండుభద్రములును, పదియవస్థానమునందు 12 లింగములును పంద్రెండేసి యిండ్లుగల రెండుభద్రములును, పదునొకండవ స్థానమునందు 10 లింగము

లును తొమ్మిదేసి యిండ్లుగల రెండు భద్రములును, పండ్రెండవ స్థానమునందు 7 లింగములును 16 యిండ్లుగల రెండుభద్రములును, పదమూడవస్థానమునందు 5 లింగములును పండ్రెండేసి యిండ్లుగల రెండుభద్రములును, పదునాలవ స్థానమునందు మూఁడులింగములును తొమ్మిదేసి యిండ్లుగల రెండుభద్రములును రచింప వలయును. పిదప నంతమునందు సర్వతోభద్రమును రచించునది. కోణమునందు మూఁడిండ్లుగల చంద్ర కలయును నాఱిండ్లుగల సంకెలయు పండ్రెండిండ్లుగల తీఁగయు నిరువదియై దిండ్లుగల నడబావియు పదనాఱేసి యిండ్లుగల రెండుభద్రములును నంతమునందొక పరిధియు రచించి వీని మధ్యమునం దయిదేసి పదములచేఁ బద్మము నొకదానిని చిత్రవర్ణముతో లిఖింప వలయు. తెల్లనిరంగుతోఁ జంద్రుఁడు నల్లని రంగుతో సంకెలయు తెల్లనిరంగుతో నడబావియు నల్లనిరంగుతో లింగమును ఎఱ్ఱనిరంగుతో భద్రమును లిఖింపవలయును. తీఁగయు లింగస్కంధ కోష్ఠమును నల్లనిరంగుతోనైనను చిత్రవర్ణముతోనైనను నిచ్చ వచ్చినచొప్పున లిఖింపవచ్చును. ఇంక మిగిలిన యిండ్లయందెల్లను దన బుద్ధిబలముకొలఁది శృంఖలల లిఖింపఁదగును. అంతమునందు తెలుపు ఎఱుపు నలుపు రంగులతో మూఁడుపరిధుల నిర్మింపవలయును. కాదేని పూర్వపు పచ్చనిపరిధిపైన మూఁడు పరిధుల లిఖించ వలయు. యీపరిధుల కెనిమిదియిండ్లు హెచ్చుగా నుండును. పూర్వసంఖ్యయందీ పరిధుల నుడువ లేదుగాన వీనినెఱింగి యీరీతిగ వృద్ధిసేయ వలయును. పైనఁగూడ నాలుగు పరిధు లెఱింగించిన తరి నిల్లు తెలియందగును. ఇట్టియ్యది యష్టోత్తర దశశతలింగతో భద్రమగుచున్నది. ఇదియొక ప్రకారము. మఱియొకప్రకారము నెఱింగించుచున్నాఁడను. 257 రేఖలనడ్డముగ నిలువుగగీచి యంతట యీఱుపదములమీఁదనే పరిధులఁ బచ్చని వర్ణముతో రచింపవలయును పిదప బుద్ధిజాగ్రత్తతో 12 లింగములను వ్రాసి మొదట 17 యిండ్లుగలది యొకటియు పైన 29 యిండ్లది యొకటియు ఆపైని 27 యిండ్లది మఱియొకటియు ఆవల 25 యిండ్లదియు, పిదప 24 యిండ్లదియు దానిపై 22 యిండ్లదియు, దానిపైని 20 యిండ్లదియు దానిపైన 18 యిండ్లదియు, దానిపై 14 యిండ్లదియు దానిపై 15 యిండ్లదియు, దానిపై 14 యిండ్లదియు, దానిపై 11 యిండ్లదియు, దానిపై 10 యిండ్లదియు, దానిపై 8 యిండ్లదియు, దానిపై 4 యిండ్లదియు, దానిపై 3 యిండ్లదియు, నిట్లు ప్రతి పఙ్క్తియందును లింగమునకన్న నొకటి యధికముగ వాపికల రచింపవలయును. అందు లింగము 24 యిండ్లుగలదిగను వాపిక 78 యిండ్లుగలదిగను రచించునది. క్రమముగా భద్ర సంఖ్యను జెప్పఁబోవురీతిగ నెఱుంగవలయును. మొదటి (పూర్వ) పఙ్క్తియందును 5-9 పంక్తులయందును, 17-13 పంక్తులయందును 20 యిండ్లుగల భద్రమును రచింపవలయును, 2-6-10-12-14, పంక్తులయందు 25 యిండ్లుగల భద్ర

మును, 3-7-11-15 పంక్తులయందు 30 యిండ్లుగల భద్రమును, 4వ పంక్తి యందు 26 యిండ్లుగల భద్రమును లిఖింపవలయును, 8-12-16 పంక్తులయందు మాత్రము, 16 యిండ్లుగల భద్రమును రచించునది, కోణములయం దెల్లెడను 3 యిండ్లుగల చంద్రుఁడును, 5 యిండ్లుగల శృంఖలయు, 11 యిండ్లుగల తీగెయు వ్రాసి, వీనిమధ్యంబున సర్వతోభద్రమును, 24 యిండ్లుగల వాపికయు, 9 యిండ్లుగల భద్రమును రచింపవలయును. ఇటులనె యన్నిపార్శ్వములయందును జక్కఁగ లిఖింపఁదగు. పిదప పరిధులపై నెఱ్ఱనివర్ణముతోనైనను చిత్రవర్ణము తోనైనను తనయిచ్ఛవచ్చినరీతిగ పద్మమును, నల్లనిరంగుతో లింగమును, శృంఖ లయు ఎఱ్ఱనిరంగుతో భద్రమును తెల్లనిరంగుతో వాపికలను చంద్రులను నల్లని రంగుతో లతలను, వ్రాసి మిగిలినయిండ్లయం దెల్లెడ భద్రములను లిఖింపవ చ్చును, అంతమునందు పసుపు తెలుపు నలుపు యెఱుపు, వర్ణములుగల పరి ధులు వ్రాయందగు, ఇయ్యది యష్టోత్తర సహస్రలింగతోభద్ర మనంబడును. ఇట్లు లింగతోభద్రము రెండువిధములుగ జెప్పఁబడినది. ఇంతియకాక మఱియొక యుత్తమమగు ప్రకారము, 19 లింగములుగల లింగతో భద్రమును జెప్పుచు న్నాఁడను, తూర్పు పడమరలయందు నుత్తర దక్షిణములయందును 88 రేఖలు లిఖింపవలయు, లింగముల యయిదుపంక్తులు నెనుబది యేడిండ్లయందె యిముడ్ప వలయును. ఆపంక్తులలో మొదటిపంక్తియొక్క విస్తారము నిరూపించుచున్నాఁ డను, కోణములందు వెవ్వేరుగా తెల్లని వర్ణముతో 3 యిండ్లుగల చంద్రుఁ డును దానికగ్రభాగమున నల్లనివర్ణముతో 5 యిండ్లుగల సంకిలయు, దాని రెండుపార్శ్వములందును బచ్చనివర్ణముతో రెండు తీగెలును వేరుగా 11 యిండ్లుగల తీగెయొకటియు పిదప, రెండుపార్శ్వములందును పచ్చనిరంగుతో 6 యిండ్లుగల శృంఖలలు రెండును, ఎఱ్ఱనిరంగుతో 16 యిండ్లుగల భద్రమును, 10-18, యిండ్లుగల వాపికలు తెల్లనిరంగుతో పదియును, నల్లనిరంగుతో 18 యిండ్లుగల 9 వాపికలును, భద్రముయొక్క శిరోభాగమున నెఱ్ఱనిరంగుతో రెండిండ్లుగల రెండుశృంఖలలును వేరుగా మధ్యభాగమున నెఱ్ఱనిరంగుతో మూఁ డిండ్లుగల శృంఖలయు, వాపికల శిరోభాగమునందు 1 పదమును పచ్చనిదిగను రెండుపదముల నెఱ్ఱనివిగను నొనర్పఁదగు, లింగముయొక్క పైన నుభయపార్శ్వ ములందును తెల్లనిరంగుతో రెండుపదముల నేర్పఱుపవలయు నిట్లు యంతట నెఱుంగనగును, పరిధిని పచ్చనివర్ణముతో 87 పదములచే రచింపవలయును, ఇట్లు ప్రథమపంక్తి యొఱింగింపఁబడినది. ఇఁక ద్వితీయపంక్తి 73 యిండ్లుగలిగి యుండును. చంద్రుఁడును శృంఖలయు రెండుతీగలు రెండుశృంఖలలు భద్రము పూర్వమువలెనే లిఖింపవలయు, 20 యిండ్లచేత 9 వాపికలను 13 యిండ్లచేత 8 లింగములును, రెండుభద్రముల శిరోభాగమునం దెఱ్ఱనిరంగుతో రెండిండ్లుగల

రెండు శృంఖలలును, వానికి నుత్తరమునఁ బచ్చనిది రెండిండ్లుగల శృంఖలయొకటియు, నెఱ్ఱనిది 3 యిండ్లుగల శృంఖలయొకటియు, లిఖించి వాపికల శిరోభాగమున నెఱ్ఱనియింటి నొకదాని నేర్పఱుపవలయును, తక్కినదంతయు మొదటిపంక్తియందువలెనే రచింపవలయు, పరిధిమాత్రము, పచ్చనిరంగుతో 71 యిండ్లు గలుగునట్లు రచింపఁదగును. ఇయ్యది ద్వితీయ పంక్తియగును. ఇఁక తృతీయ పఙ్క్తి 59 యిండ్లతో రచింపఁబడును. 6 యిండ్లుగల భద్రమును, 7 లింగములును, 8 వాపికలును, తక్కినదంతయుఁ బూర్వరీతిగ నొనర్చి పరిధిని 47 యిండ్లు గలుగునట్లొనర్పవలయు నిది తృతీయపఙ్క్తియగును. ఇఁక చతుర్థపంక్తి 45 యిండ్లచే నేర్పడుచున్నది. భద్రమును 12 యిండ్లతో రచించునది. 5 వాపికలును 4 లింగములును, భద్రముయొక్క శిరోభాగమున నెఱ్ఱనిరంగుతో నారిండ్లలో నొకతీగెయు, 33 యిండ్లతో పరిధియు రచించిన నాలవపంక్తి యగును. ఇఁక నయిదవపంక్తి 31 యిండ్లచే నేర్పడుచున్నది. 8 యిండ్లుగల భద్రమును, 3 వాపికలును, 2 లింగములును, భద్రముపై నెఱ్ఱనిరంగుతో మూఁడిండ్లుగల శృంఖలయు, 19 యిండ్లుగల పరిధియు రచించినచో నయిదవపంక్తియగును. పిదప 19 యిండ్లచే చతుష్కోణసమంబగు సర్వతోభద్రంబు రచింపవలయును. దానిక్రమమెట్లన 3 యిండ్లుగల చంద్రుఁడును పిదప నెల్లెడ నయిదుపదములుగల నల్లని శృంఖలలును, పశ్చిమభాగంబున 18 పదములుగల లింగమును ఉభయపార్శ్వములయందు 13 యిండ్లుగల రెండువాపికలును, 4 యిండ్లుగల రెండు భద్రములును, దక్షిణము. తూర్పు. ఉత్తరమునందె మధ్యమున 3 వాపికలును, 8 యిండ్లుగల భద్రమును 10 పదములుగల రెండుతీగెలును, తీగెల యయిదవ స్థానమున నాదియందంతమునందుఁ బచ్చని రెండుపదములును, మధ్యభాగమున తీగెను త్రెంచి 9 యిండ్లుగల భద్రమురచించి దానిపై నెఱ్ఱనిరంగుతో రెండిండ్లుగల శృంఖలయు వాపికలయొక్క శిరోభాగమున నొక యెఱ్ఱనిపదమును, రెండుపార్శ్వములను రెండు తెల్లని పదములును, 5 పదములుగల పరిధియు, మధ్యమున నెఱ్ఱనివర్ణముతో 9 యిండ్లుగల యష్టదళపద్మమురచించి పచ్చని రంగుతో కర్ణికయును, లిఖింపవలయును. బాహ్యపరిధులు క్రమముగా పీత శుక్ల రక్త కృష్ణవర్ణములతో రచింపనగును. ఇయ్యది యెల్లభద్రములకు మకుటప్రాయంబగు సైకవింశశతాత్మక లింగతోభద్ర మనఁబడును. శిష్యుడా! ఇంతియకాక మఱియొకప్రకారము నెఱింగించెద వినుము. అడ్డముగ నిలువుగ 103 రేఖలఁ బ్రస్తరించి, నాలుగుదిక్కులయందు 9-8-6-4-2-1 సంఖ్యలతో 2 కోష్ఠములపై లింగపంక్తుల రచింపవలయును. ఇందుఁ బ్రతిపంక్తియందు లింగసంఖ్యకన్న వాపికయొకటి యధికముగ నుండును. ఆఱింటియందు పరిధులును ఆఱిండ్లపైన వాపికలును, కోణములయందుఁ జంద్రుఁడును, శృంఖలయును, తీగయు,

క్రమముగా 3-5-11 యిండ్లయందు రచింపవలయును. త్ర్యష్టమితంబగు లింగమును, త్రిషష్టితమగు వాపికయు, క్రమముగా 36-20-25-30-36-20. యిండ్లుగల భద్రములును, కొనపంక్తియొక్క యొకపార్శ్వమునందు రెండులింగములును, 6 యిండ్లుగల రెండు భద్రములును, దానిపై సర్వతో భద్రంబును, నచట 24 యిండ్లుగల వాపికయు, భద్రమును, దానిపై పరిధియంతమున నాలుగేసి యిండ్లచేత రక్తవర్ణముతోనైనను చిత్రవర్ణముతోనైనను పద్మమును లిఖింపవలయు. నల్లనిరంగుతో లింగమును శృంఖలయు, పచ్చనిరంగుతోఁ దీగయు, నెఱ్ఱనిరంగుతో భద్రంబును, తెల్లనిరంగుతోఁ బద్మంబును, వాపికయు, వ్రాయవలయును. ఇయ్యది, యేకవింశోత్తరశత (121) లింగతోభద్రమని చెప్పంబడుచున్నది. మఱియు నింకొకప్రకారము గలను చెప్పెదవినుము. అడ్డముగ నిలువుగ సెనుబదియాఱు రేఖలం దీర్చవలయు. నిచట పజ్తులందెల్లెడ 85 యిండ్లుగలిగి యుండును. అచట నయిదేసి యిండ్లపై పచ్చనివర్ణముతో నొక్కొకపరిధి యుండవలయును. ఈరీతిగ క్రమముగ నాలుగుపరిధులను రచించునది. పిదప నాపంక్తి కోష్ఠములయందు బుద్ధిబలముచే లింగములు మున్నగువానిని రచింపవలయు. కోణములందుఁ జంద్రుఁడు మూఁడిండ్లుగలవాఁడై యుండును. దానికి శృంఖలయు, పిదప వల్లియు, భద్రమును, వాపికయు, లింగమును గ్రమముగా రచింపవలయును. అందు మొదటిపంక్తియందు 5 యిండ్లుగల శృంఖలయు 11 యిండ్లుగల తీగయు, 6 యిండ్లుగల శృంఖలయు, 1 యిల్లుగల భద్రమును, త్రిషట్కోష్ఠములచే వాపికయుఁ గల్పించునది. లింగమునుగూడ నాసంఖ్యతోనె రచించునది. ఇట్లు 9 యిండ్లుగల వాపికలు పదియు, భద్రములురెండు నగుచున్నవి. ఇఁక రెండవపంక్తియందు 13 యిండ్లతో వాపికయు, 16 యిండ్లతో భద్రంబును, తక్కినదంతయు పూర్వప్రకారంబుగను లిఖింపఁదగు. ఇచట 8 లింగములు 9 వాపికలు నగుచున్నవి. మూఁడవ పంక్తియందు 4 యిండ్లుగల భద్రము మిగిలినదంతయు ముందెఱింగించిన రీతిగను రచింపవలయు, 8 వాపికలు, 7 లింగములు క్రమముగా లిఖించునది నాలవపంక్తియందు 4 వాపికలును, 3 లింగములును, 13 యిండ్లుగల భద్రంబును, నాలవపరిధిపై నయిదిండ్లమీఁద నొకపరిధియు, నిచట శృంఖలలేనందున నొకయింటియందు తీగయు, రెండిండ్లయందుఁ జంద్రుఁడును, తక్కినదంతయు యథాపూర్వముగను గల్పనీయము. మఱియు నచ్చటచ్చట నాఱేసియిండ్లుగల రెండుభద్రములును, ఇంకను తొమ్మిదేసి యిండ్లుగల రెండుభద్రములును, 13 యిండ్లుగల వాపికయు లిఖించి, రెండుభద్రములపై నాఱేసి యిండ్లుగల రెండుభద్రముల రచింపవలయును. మధ్యమున వదలిన యిండ్లను శృంఖలార్థ ముపయోగింపనగును, దానిపై పరిధిని నయిదిండ్లపైన

రచింపవలయును, రెండింటినడుమ 13 యిండ్లుగల వాపికయును నాలుగేసియిండ్లు గల రెండుభద్రములను రచించి శేషము పూర్వరీతిగ నెఱుంగవలయును. అంతమందయిదేసి యిండ్ల చేఁ బద్మమును చిత్రవర్ణముతోనైనను శ్వేతవర్ణముతోనైనను లిఖింపవలయును. శ్వేతవర్ణముతోఁ జంద్రుఁడును నీలవర్ణముతో శృంఖలను హరితవర్ణముతో వల్లికయు, పీతవర్ణముతో రెండు శృంఖలలును, రక్తవర్ణముతో భద్రంబును, సితవర్ణంబుతో వాపికయు, కృష్ణవర్ణముతో లింగమును, లిఖించి లింగస్కంధగత కోష్ఠంబును శోభాకోష్ఠంబులుగఁ గల్పింపఁ దగును. ఇఁకనచ్చట శేషించిన పదములయందు యథాయోగ్యంబుగ బుద్ధిజాగ్రత్తచేఁ గల్పింపనగును. ఇట్లుగాదేని నాలవపరిధిపైనఁ బదునొకండిండ్ల కావల పరిధియు వీనిమధ్య కోణమునందుఁ బూర్వరీతిగఁ జంద్రుండును పదియిండ్లుగల శృంఖలయు 21 యిండ్లుగల తీగయు 11 యిండ్లుగల మఱియొక శృంఖలయు 30 యిండ్లుగల భద్రంబును, 61 యిండ్లుగల వాపికయు బాగుగఁ గల్పింపన గును. ఇట్లుగాదేని మఱియొక రెండిండ్లనుజేర్చి 78 యిండ్లయందు జాగరూకతచేఁ గ్రమమున 9-8-6-3-1 సంఖ్యగల లింగముల పఙ్క్తుల రచింపవలయు. శేషము పూర్వరీతిగ నెఱుంగునది. విశేషమేమన భద్రము లాఱును 16 యిండ్లుగల లింగమును 20 యిండ్లుగల యొకలింగమును. నితరస్థలములయందు నింకరెండిండ్లధికముగ రచింపఁదగును. సర్వతోభద్రంబును బద్మవర్ణంబులును బూర్వరీతిగను రచింపవలయును. బహిః పరిధులు క్రమముగా పసుపు యెఱుపు నలుపు వర్ణములతో రచింపఁదగు నియ్యది యష్టోత్తర శతలింగతోభద్ర మనఁబడును. ఇదిగాక మఱియొక ప్రకారముగలను దానిఁగూడ వివరించెదవినుము. అడ్డముగ నిలువుగ నెనుబది తొమ్మిది రేఖల నెఱ్ఱని రంగుతోగీచి వానికోష్ఠములయందు 2-4-కోష్ఠములను జక్కగ నెఱింగి రచింపవలయు. పిదప సర్వతోభద్రమును, చుట్టునుపరిధియు, పిదప నాలుగేసియిండ్లపై 4 పరిధులును, అందునాలుగు పార్శ్వ కోణములందును మూఁడుపదములుగల చంద్రుఁడును, 5 యిండ్లుగల శృంఖలయు, 11 యిండ్లుగల తీగయు, 24 యిండ్లుగల లింగంబును, 18 యిండ్లుగల వాపికయు, 5 పఙ్క్తులయందును గ్రమముగ 9-7-5-2 సంఖ్యగల లింగములును, తరువాత వాపికయొకటి యధికముగను 4 లింగములును నడబావులు (వాపికలు) 18 యిండ్లు గలవి రెండును, క్రమముగ 6-5-1-6-6-సంఖ్యగల భద్రములును, సర్వతోభద్రమునందు 22 యిండ్లుగల వాపికయు, 9 కోష్ఠములుగల భద్రంబును, తక్కినది పూర్వరీతిగను రచింపవలయును, పిదప నంతమున పరిధి యొనర్పందగును, నచట పద్మయునుగూడ వేయునది. ఇందుకమలము శ్వేతముగను శృంఖల కృష్ణవర్ణముగను తీగ నీలవర్ణముగను భద్రమరుణ వర్ణముగను వాపిక సితవర్ణముగను లింగము కృష్ణవర్ణముగను అంతిమ పరిధులు క్రమముగా పీత శుక్ల రక్త కృష్ణ

వర్ణములుగను మధ్యమపరిధులు పీతవర్ణములుగను రచింపవలయును ఇయ్యది
యష్టోత్తర శతలింగతో భద్రమనఁబడును. లేక అడ్డముగ నిలువుగ నేబదియైదు
రేఖల నెఱ్ఱనిరంగుతో లిఖించి దానికోష్ఠములయందాఱు పరిధులును నంతము
నందు మూఁడుపరిధులును 24 యిండ్లుగల 123 లింగములును 18 యిండ్లుగల
వాపికయు, 236 అంకములుగల భద్ర పార్శ్వమునందు మఱియొక పచ్చని వర్ణ
ముతో రచింపఁబడిన భద్రమును సమకూర్పవలయును. అందు మొదటి భద్రము
9 యిండ్లుగలదిగను రెండవది యాఱిండ్లుగలదిగ నుండవలయు, వాపిక పార్శ్వం
బున నెఱ్ఱని వర్ణముతో మూఁడు పదములును శృంఖల యొకటి యుండఁదగు
ఈశృంఖల ప్రతిపార్శ్వమునందు నయిదిండ్లుగలది యొక్కొకటి యుండవలయు.
11 యిండ్లుగల తీగయు, 3 యిండ్లుగల చంద్రుఁడును, 22 యిండ్లుగల సుందరమగు
లింగమును 16 యిండ్లుగల భద్రమును28 యిండ్లుగల లింగమును, రచింపవలయు
ను.లింగముయొక్క శిరఃపార్శ్వమునందుండు యిండ్లను పచ్చనివర్ణముతోఁడను,
లింగమును నల్లనివర్ణముతోఁడను,వాపికను దెల్లనివర్ణముతోఁడను,భద్రము నెఱ్ఱ
నివర్ణముతోఁడను, జంద్రునిఁదెల్లనివర్ణముతోఁడను అశ్వంబులను నల్లనివర్ణము
తోఁడను,తీగను పసుపువర్ణముతోఁడను,లిఖింపవలయు, పరిధి పచ్చనిదిగనొనర్చి
యుర్వరితంబులగు నిండ్లనుయథేష్టముగ రచింపవచ్చును. ఇయ్యది పంచవింశా
త్మకలింగతోభద్ర మనంబడును. అయితే బాహ్యపరిధులు క్రమముగా బీత
శుక్ల రక్త కృష్ణవర్ణములపై యుండవలయును, ఇంతియకాక మఱియొకప్రకా
రము నెఱింగించెద వినుము,41 యిండ్లయందు 25 యిండ్లుగల లింగపీఠమును
రచించునది, అంతిమపరిధులును, వానికి లోపల (పశ్చిమముగా) రెండు లింగ
పఙ్క్తులను బాగుగా వ్రాయవలయు. లింగము 18 యిండ్లుగలదిగను, వాపిక
18యిండ్లుగలదిగను, పద్మము, 3 యిండ్లుగలదిగను, శృంఖల 5యిండ్లుగలదిగను,
పఙ్క్తి రెండులింగములు గలదిగ నుండవలయు. మొదటి భద్రము 9 యిండ్ల
యందును, రెండవభద్రమును 6 యిండ్లయందును రచించి పరిధియొక్క యంత
మునందు 30 కోష్ఠములచే లింగము నేర్పఱచునది. మూలస్కంధము 77 యిండ్ల
యందును, శిరస్సు 6 యిండ్లయందును, ఉభయ పార్శ్వములను 55 యిండ్ల
యందును, కటిభాగమును 3 యిండ్లయందును, లింగమున కేర్పఱచి, యాలింగ
ముయొక్క నాలుగు దిక్కులయందును 9 యిండ్లుగల 4 భద్రములను రచింప
వలయును. ఇచట 3 యిండ్లతోఁ జంద్రుని 2 యిండ్లతో శృంఖలను, 5 యిం
డ్లతోఁ దీగను. 3 యిండ్లతో మఱియొక శృంఖలను. రచించి లింగ స్కంధము
లందుండు కోష్ఠములను బచ్చనివర్ణముతోఁ బూరించి మిగిలిన యిండ్లను యథే
ష్టముగ లిఖింపవచ్చును బాహ్యపరిధులు. యథేష్టముగా నాలుగింటినిఁ గల్పింప

వచ్చును. 25 లింగములుగల యీరెండు ప్రకారముల నెఱింగితివి. ఈరెండు భద్రములును శివునకు మిగులఁబ్రీతి దాయకంబులై యున్నవి.

* పరమాత్మ లింగతత్త్వవిచారము *

ఇఁక పరబ్రహ్మంబునకు సంసారతారకంబగు గురుపాద కమలంబునకు నమస్కరించి యధ్యాత్మజ్ఞానముఁ గలిగించు కథను నుడువుచున్నాఁడను. పంచ వింశతి లింగతోభద్రము శివున కిష్టమైనది. ఇయ్యది యొకనిచేఁ గల్పింపఁబడినది. దీని తత్త్వమును జక్కఁగ వక్కాణించెద వినుము. విష్ణుదాసా? లింగతో భద్ర మనునది యర్థవంతమై వెలయుచున్నది. లింగము అనఁ గమకమనియు. జ్ఞానమె జ్ఞాపకమనియు బుధులు చెప్పెదరు. అమృతము యొక్క వాపనము (చిలుకుట) చేవాపియసియు. భద్రములు (మంగళములు) కనఁబడుటచే భద్రమనియు. నామంబుగలిఁగియున్నది. సాధ్యశబ్దములుగూడ సాధనములకు వాచకంబులై యుండుట లోకప్రసిద్ధమైయున్నది. తెలుపు నలుపు మున్నగు వర్ణంబులు గూడ వేదమునందు శాసించుటచే శ్రీరామ బ్రహ్మము నుపాసించుటకు సాధనంబులగుచున్నవి. లింగమనిన పరబ్రహ్మంబు. అది మంగళంబుగావున భద్రవాచకంబై యున్నది. లింగంబు మంగళములకెల్ల మంగళంబనియును శాంతంబనియు. శివంబనియు స్ఫుటముగఁ జెప్పంబడియున్నది. ఎచ్చట సకలభూతంబులును లీనంబులగుచు మఱల దేనినుండి బయలువెడలుచున్నవో యయ్యది లింగమని చెప్పంబడుచు పరాకాశమగు పరబ్రహ్మకు వాచకంబై యొప్పుచున్నది. ఆలింగ స్వరూపంబును విచారించినచో నిష్కలుండగు పరమశివుఁడని యెఱుఁగనగు. సత్త్వరజస్తమోరూపంబగు వర్ణత్రయంబు మాయావేష్టితంబు. చంద్రుఁడే మనస్సు. మహామోహంబే శృంఖలంబనఁబడు. స్నేహపాశంబే వల్లరియగును. వానిచే నీజగత్తత్త్వంబు అంతటఁ బరివేష్టింపఁబడియున్నది, ఎట్లన? మహదాకాశంబు ఘటోపాధియందు భిన్నంబై తోచునట్లు బ్రహ్మతత్త్వంబు ప్రకృతియందు మాయావిద్యోపాధి విశిష్టంబై జగదాకారంబుగా నొప్పుచున్నయది. అహంకారంబు తిర్యగూర్ధ్వంబుగా వస్త్రమునందు తంతువుల బోలె నిటు నటు వ్యాపృతంబై యున్నది, అందుచే ౮౪ లక్షల స్థానంబు లేర్పడినవి. (అనగా నీజగంబున ౮౪ లక్షల జీవరాసులలో నహంకారాత్మకుఁడగు జీవుఁడుగా నాపరబ్రహ్మంబు ప్రాతిభాసికుఁడై వ్యవహరింపఁ బడుచున్నాఁడను నర్థమును ౮౪ లక్షల కోష్ఠంబులుగల రామతోభద్రా ద్యాకృతియం దనుసంధానము సేయవలెననుట) ఎట్లు చిత్రపటం బేర్పడుచున్నదో అట్లు గుణంబులు వానియందు నింపఁ బడుచున్నవి, (గుణములనఁగా తంతువులు, సత్త్వరజస్తమ స్స్వరూప ప్రకృతి స్వభావములు,) ఆదియందొక్కటే తత్త్వంబు కేవలంబై యొప్పుచున్నది, అదియేపరబ్రహ్మతత్త్వంబు, ఆబ్రహ్మతత్త్వమునందు మాయా నియోగమువలన నాదరముతోఁడ

ననిర్వచనీయ లీలాత్మకకామము నానాప్రకారంబులుగా నేర్పడుచు బ్రహ్మాకారంబు లగుచున్నవి. "ఏకస్సన్" అనియు, "స్వయమకురుత" అనియు, "ఇంద్రోమాయాభిః" అనియు, "ఏకధాబహుధా" అనియు, సర్వవిధంబులచేతను సంపాదనీయంబగు నాత్మస్వరూపమును గురించి శ్రుతులు చెప్పినవిగదా? అనిన బ్రహ్మస్వరూపమును విచారించునపుడు ఆత్మయొక్కండె నిత్యుఁడు, స్వయముగా నప్పరమాత్మయే యేకత్వము నానాత్వమునొంది సదసద్విలక్షణుండై కేవలంబుగ నున్నాఁడు, ఎంతవరకు నహంకారభావముగలిగియుండు నోనంతవరకు నీజననమరణ దుఃఖ ప్రవాహరూప సంసారబంధము గల్గియుండును, అహంభావమను ప్రబలమైనముడి వీడినతోడనే ఆమమకారము నాశ్రయించియుండు సంసారము వీడిపోవును, కావుననే "మమేతి బధ్యతే జంతు ర్నమమేతి విముచ్యతే" అనియుపనిషద్ఘోషించుచున్నది, నయ్యర్థమిచ్చటఁ జెప్పంబడినది. నిద్రానుగతమగు స్వప్నము వెలువడినట్లు తేజస్సుగతింపఁగా జలము వెలువడుచున్నది, అనిన నాత్మతత్వము మాయావరకంబై స్ఫురించనపుడు జడంబగు జగత్తు సత్యముగ స్ఫురించుచున్నది. ఇట్టి యధ్యాత్మ తత్వార్థము నెఱుంగుటకై జిజ్ఞాసువగువాఁడు విరక్తుఁడగుచు పరమోత్తమంబగు శ్రేయస్సు నాశ్రయించవలెను. ఎట్లన? సాక్షాద్బ్రహ్మభూతుఁడును నిరామయుఁడునగు సద్గురువు నాశ్రయించి ఆగురువుచే బోధింపఁబడినవాఁడై తత్వవిచార సిద్ధంబును సత్తామాత్రంబుననగు బ్రహ్మమును స్వాత్మయందైక్య భావముతో నందనగును, అట్టి బ్రహ్మభావముచేత నీజత్తు యెల్లప్పుడును జిత్రంబై యుండును. కావున నాసచ్చిదానందాత్మకుఁడగు పరమేశ్వరుండు సర్వభూతంబులయొక్క హృద్దేశంబున నుండువాఁడు. అతఁడు నిర్మలుఁడు, కేవలుఁడు, ప్రజ్ఞాస్వరూపుఁడను మొదలగు లక్షణములు గలవాఁడు, నాశరహితుఁడు, సచ్చిదానందుఁడు, అమరుఁడు, అజరుఁడు, షడ్భావవికార రహితుఁడు, నిరాకారుఁడు, నిరామయుఁడనియుఁ జెప్పఁబడిన పరమాత్మ యలింగుఁడనియు, అరూపుఁడనియు, ఒక్కఁడనియు వ్యవహరించుటకుఁగూడ నలవిగాని వాఁడై యుండు. అట్టి పరాత్పరుఁడు మాయచే లింగరూపియై యుండువానిఁ బోలె నొక్కండుగాఁ బిలువఁబడుచున్నాఁడు. అట్టి లింగాత్మ యగుశివునికిఁ బురుషుఁడనియు, ప్రకృతియనియు, వ్యక్తుఁడనియు, అహంకారమనియు, లక్షకంబులగు నాల్గులింగంబులు జెప్పంబడినవి, ఇట్టి కార్యకారణ భూతంబులగు ఐదులింగంబులను బంచాత్మకంబగు నొక్కలింగమనియే భావింపవలయును. ఈయైదు లింగంబులకును సత్వము, రజస్సు, తమస్సు అనుమూఁడు లింగంబులుచేరిన ఆత్మయొక్క యష్టవసు లింగ స్వరూపం బేర్పడుచున్నది, పంచజ్ఞానేంద్రియంబులు, పంచకర్మేంద్రియంబులు, రెండుమనోబుద్ధులు, ఇవి పండ్రెండును జేరిన పరమేశ్వరునియొక్క ద్వాదశలింగ స్వరూపంబని స్మరింపఁబడును, ఇచ్చటఁ బ్రతిపింపఁబడినది విశే

కంబు. ఇట్లు కారణలింగంబులు నిరూపింపఁబడెను, ఇఁక కార్య లింగంబులను విచారించిన ౧౦౦-౧౦౦౦ - ౧౦౦౦౦ - ౧౦౦౦౦౦ - కోట్ల కొలఁదిగాన పారంబై యున్నవి. ఇవన్నియును బరమాత్మయగు శివునికి జ్ఞాపకంబులైనవి, వాస్త వార్థమును విచారించినఁ బరమాత్మ తత్వంబు సజాతీయ విజాతీయ స్వగత భేదరహితంబైనది. ఎట్లన ? తంత్వాదు లేపటాదులుగాఁవా ? ఇట్లే సర్వంబును శివుఁడుగాను శివుఁడే సర్వంబుగానున్నాఁడుగదా ? బిందు నాద అకార ఉకార మకారంబులను పంచావయవంబులుగా నాత్మయే చెప్పంబడె. ఇట్లు సాక్షాత్క రించిన పరమాత్మయే పరబ్రహ్మయని, ఈశ్వరుఁడని, విష్ణువని, చతుర్ముఖుఁడని. రుద్రుఁడని వ్యవహరింపఁబడుచు సద్యోజాత వాసుదేవాఘో రేశాన తత్పురుష పంచబ్రహ్మ లింగరూపియైయున్నాఁడు, మఱియు నీయైదును శుద్ధుఁడు, సాక్షి, ప్రాజ్ఞుఁడు, తైజసుఁడు, విశ్వుఁడు అనియును, సత్తు చిత్తు సుఖము నామము రూపము అనియు నిట్లు పంచబ్రహ్మాత్మకంబుగా నున్నది. పుట్టునదంతయు నిట్లు పంచాత్మకంబుగ నున్నదిగాని వేరుగలేదు, ఇదియంతయు బ్రహ్మంబని శ్రుతిచెప్పుచున్నది, ప్రధానము, మహత్తు, అహంకారము, పంచతన్మాత్రలైదునుఁ జేరి యష్టప్రకృతులని శాస్త్రంబులయందుఁ జెప్పంబడె, అప్పరమేశ్వరుఁ డష్టమూర్తి స్వరూపుఁడై భవుఁడు, శర్వుఁడు అనునవి మొదలైన నామంబులుగలిఁగి యున్నాఁడు, అష్టవసు స్వరూపముతో మాయచే నంతట వెలుఁగుచున్నాఁడు, ద్వాదశాదిత్యులే పండ్రెండు జ్యోతిర్లింగంబు లనఁబడును, మఱియు నాశివబ్రహ్మము దశేంద్రియంబులు మనస్సు బుద్ధి అనువానిచేఁ బండ్రెండు లింగంబులని సుస్పష్టము, పది ఇంద్రియములు ప్రాణపంచకము భోగ్యపంచకము చేతశ్చతుష్కము ఆత్మయునుఁ జేరి పంచవింశల్లింగాత్మకమని పండితులచే నొప్పఁబడినది. అప్పరమాత్మకె భ్రాంతి చేత గుణకర్మభేదమువలన ౮౪ లక్షల జీవరాసులయందును భోగాయతన విస్తరంబు పరికల్పింపఁబడుచున్నది. జాగ్రత స్వప్నము సుషిప్తియని మూఁడును ఆత్మ యొక్క భోగాయతనంబులు. భోగము భోక్త్రు భోజయిత్రువను సర్వంబును బ్రహ్మంబె, వేఱొండుకాదు, అధ్యాత్మ, అధిదైవ, అధిభూతములను మూఁడును, స్థూలము, సూక్ష్మము. కారణమను సర్వంబును బ్రహ్మంబెకాని వేఱుకాదు, ఈజ్ఞానంబును, ధ్యానంబును, వివేకంబును, వైరాగ్యంబును, జీవుఁడును, ఈశ్వరుఁడును, ఇజ్జగంబంతయును ఆత్మయేకాని వేఱొండుకాదు, కావుననే " సర్వంఖల్విదంబ్రహ్మ " "ఇదగ్ంసర్వం యదయమాత్మా " "బ్రహ్మైవేదం సర్వం" అనునవి మొదలయిన శ్రుతివాక్యంబులు చెప్పుచున్నవిగదా ? సర్వాత్మకంబగు నాత్మయందు దర్శనంబగు స్వాతిరిక్త సత్తాశూన్య వివేకంబనునది యేదిగలదో అవిషయంబు అత్మసిద్ధునిదిగనున్నది, ఇట్టిశాస్త్రజన్య జ్ఞానముగలిఁగి శాంతుఁడును, జితేంద్రియుఁడును' ఓర్పుగలవాఁడు నయిన ఆరురుక్షు వంతటను స్వస్వరూప

విజ్ఞానముచే బ్రహ్మభూతుఁడగును. వ్యావహారిక సత్తాకంబులును ప్రాతిభాసిక సత్తాకంబులు నయిన యీజగద్విషయంబులు,భోగంబులు యేమిచేయుచున్న వనిన వీనికి లోబడి సంసారమగ్నుండగు పురుషుని వశీకృతునిగాఁ గట్టివేయుచున్నవి అనఁగా పారమార్థిక సత్తాస్ఫూర్తి నివ్వక జనన మరణ దుఃఖప్రవాహమునందే పడఁద్రోయు చున్నవి కావుననే నియ్యవి విషయంబులనఁబడినవి. అందువలన మోక్షాపేక్ష గలవాఁడు ఆవిషయంబుల నన్నిటిని విసర్జింపవలయును, కావుననే ‘ వివిక్తసేవీ ’ యనిన. జనసంగమునఁ జిక్కక దారా దీషణ బాధారహిత రహస్యస్థలమున సమాహిత మనస్కుఁడై వర్తించువాఁడును, మితభోజియునగు వాఁడు బ్రహ్మతత్వ విచారపరుఁడగును. బ్రహ్మసాక్షాత్కారము మొదలు నా నుడివిన వచనంబులు భాగవత వచనంబులు. కావున నోయి విష్ణుదాసా ? బహూక్తంబగు విధిచేత నీకనేమి ఫలము ? ఇదివరకు నీకుఁజెప్పిన వేదశాస్త్ర రహస్యార్థ మింతట విరమింపఁబడినది, మఱియు, నాకు గురువుచే నివ్వఁబడిన దొకటి గలదు. అది ఏదియన సర్వచేతనంబును, నిత్యానందంబును, స్వాతిరిక్త సత్తాశూన్యంబును అగు నాత్మవస్తువు, దానిసేవ వలన నిదంతయును తదాత్మకంబు. నేనును నీవును తదాత్మకంబె శీఘ్రముగ తమస్సు నష్టమయ్యె. నిండియుండు వెల్గు త్వరగానుదయించె, అప్పరబ్రహ్మ తేజంబు సూర్యచంద్రాగ్నుల నాక్రమించియున్నది. ఇదియే పారమార్థిక సత్తగుటచే సత్యంబయినది. దురూహంబును నమేయంబును నగుటచే గంభీరంబు. మఱియు నవ్యాకృతంబు, సర్వ ప్రపంచంబును నిశ్శేషంబుగా నాత్మస్వరూపంబై వెల్గుచున్నయది. నలువదినాలుగు రేఖలచే సప్తేందు లింగంబను లింగతోభద్ర శివపూజా పీఠము ప్రకల్పింపఁబడు చున్నది. ఇట్లే లింగతోభద్రము,సర్వతోభద్రము,గౌరీప్రసాదకర లింగతోభద్రము, రామ లింగాత్మక భద్రపీఠంబును రచనాభేదంబులచే నేర్పరచి యారాధించవలయు. శివుని నారాధించునపుడు ఉపాస్యమూర్తిని లింగముగా భావింపవలయును. రామముద్ర ఉపాసికయని తెలియనగు, లింగతో భద్రమునందెట్లు పూజఁ చెదవో నట్లె రామతోభద్రమునందును గూడ నాయాదేవతల నావహింపఁజేసి పూజింపవలయు. రామతోభ్రదంబనునది విష్ణుపరంబై యుండు, “ రమారామా ” యనువర్ణంబులచేఁ జిహ్నితంబగు భద్రపీఠంబును సర్వకర్మలయందును దేవీపరంబని నెఱుంగనగును.

* శ్రీరామస్వామికి ప్రియంబులగు నవపదార్థంబుల నిరూపణము. *

శ్రీరామదాసుఁ డిట్లు చెప్పుచున్నాఁడు, వినుము విష్ణుదాసా ? ఏదేది శ్రీరామచంద్రునికిఁ బ్రియంబై యుండునో దానిఁ జెప్పెదను. శ్రీరామునికి మాసంబులలోఁ జైత్రమాసంబును, పక్షంబులలో శుక్లపక్షంబును, ప్రతిపదాది తిథులలో నవమీతిథియును బ్రియంబైనది, అతఁడు సూర్యవంశమునఁ బుట్టినవాఁడు

గములు వారంబులలో నాదిత్యవార మాతని కిష్టమైనది. నక్షత్రములలో పునర్వసూనక్షత్రము ప్రియమైనది, ఇఁక పుష్పంబులలోఁ జంబకపుష్పము, తులసియును, మఱియు, జాజి, సంపంగి, మందారము, తులసి, అగసి, మాలతి, దవనము, మొగలి, ములక, యను పుష్పనవకంబును బ్రియంబులు, ఇట్లే మోదకములు, లడ్డుకములు, మీగడ, ఫేణీలు, సుగియలు, వడియములు, గారెలు, నేతివంట, మండము, అనునవాన్నంబులును బ్రియంబులు, ఈనవాన్నములు, మఱియొకవిధముగ గూడ నిట్లొనర్పవచ్చును, మోదకము, లడ్డు, మీగడ, వడియము, ఫేణి, అన్నము, వరాన్నము, శాకము, పాయసము, అనునవి చేరి దివ్యాన్ననవకంబనఁబడు, ఇఁక మారీచుని మానముచే నొక నవాన్న పరికల్పనం బిటుల గానంబడియెడి. ఆవుపాలు ౮౧ కుడవములు, బియ్యము ౮౧ కుడవములు, పెసరపప్పు ౨౪ కుడవములు, పంచదార ౯ కుడవములు, తేనె మూఁడుకుడవములు, నెయ్యి ౨ కుడవములు, కుడవములో నెనిమిదవపాలు మిరియములు, మిరియములతో సమానముగ జాజికాయలు, జాపత్రి ౧ కుడవము, ఇట్లు ఈతొమ్మిదింటిచే నవాన్నం బేర్పడును. నియ్యది శ్రీరామునికి మిగులఁ బ్రీతిగనుండును గాన భక్తితో నరులచే నర్పింపనగు, నిరంతర నైవేద్యంబునకై లఘు నవాన్నక్రమం బెట్టిదనిన? ఆవుపాలు ౯ కుడవములు, కుడవములో నాలవభాగము బియ్యము, కుడవములో నెనిమిదవభాగము పెసరపప్పు, అర్ధకుడవము చక్కెర, కుడవములో నెనిమిదవభాగము నెయ్యి, అంతియె తేనె, తేనెకు సమానముగ బిల్వఫలము, ఒకటంకము మిరియములు, జాపత్రి అర్థటంకము, వీనిచేఁ జేయఁబడినది లఘు నవాన్నంబనఁబడు ఇట్టి రామోపాసక సంప్రదాయమునుండి వచ్చిన లఘు నవాన్నంబును శ్రీరాముని కర్పింపనగు, నిరంతరంబును పూజయందు శ్రీరామునికిది ప్రీతికరంబైనది. మామిడిపండు, నేరేడుపండు, వెలగపండు, మాదీఫలము, దానిమ్మపండు, ఖర్జూరము, టెంకాయ, అరటిపండు, పనసపండు, అనునవి తొమ్మిది ఫలంబులును శ్రీరామునికిఁ బూజయం దర్పింపనగు, సీతాఫలము, నిమ్మపండు, కిచ్చిలిపండు, జాతీఫలము, మాతులుంగము, ద్రాక్ష, దోసపండు, ఉసిరిక, మామిడిపండు, అను ఈ ౯ ఫలంబులును శ్రీరామపూజయందు ప్రశస్తంబులు, తమలపాకులు, వక్కలు, సున్నము, చంద్రపొడి, జాజికాయ, జాపత్రి, లవంగము, ఏలకులు, జాతిఫలము, ఇవిచేరినది శ్రీరామునికి నవోపచార తాంబూలం బనఁబడు, ఛత్రము, సింహాసనము, యానము, చామరము, వ్యజనము, పానపాత్ర, తాంబూలపాత్ర, ఉమ్మిగిన్నె, వస్త్రపేటిక, యను ౯ రాజోపచారంబులను రామున కర్పించవలయు. చందనము, పుష్పమాల, పరిమళద్రవ్యము, కర్ణమందునుచుకొను పుష్పము, ఫలము, సుగంధతైలము, తాంబూలము, కస్తూరి, రక్తాక్షతలు అనునీ ౯ భోగ్యవస్తువులను శ్రీరాముని

కల్పించవలెను, ఇఱ్ఱ, మంచము, పరుపు, తలగడ దిండు, బాలీసుదిండు, అద్దము, దీపము, నీటిపాత్ర, విసనకఱ్ఱ, దోమతెర, ఇవి తొమ్మిదియును శ్రీరామునికల్పిం చునట్టి శయ్యోపభోగంబులు, పీతాంబరము, ఉత్తరీయము, కిరీటవస్త్రము, కవచము, కిరీటముపై దివ్యవసనము, నడుముకు కట్టుకొనుదట్టి, మోముఁ దుడుచుకొను కరవస్త్రము, తొడమీఁది మూఁడుమూలల వస్త్రము, పైయంగవస్త్రము, అను నవవస్త్రంబుల నర్పింపవలయు. కుండలములు, కంకణములు, కంఠమాలిక, భుజకీర్తులు, కాలియందెలు, పదకము, మొలత్రాఁడు, బంగరుగొలుసు, ఉంగరము, అను, ౯ అలంకారములను భక్తితో నర్పింపనగు, విష్ణుదాసా ? ఇట్లు శ్రీరామునికిఁ బ్రీతియగు పదార్థంబులను, నవసంఖ్యగల పదార్థంబులను సంగ్రహముగా నుడివితిని. ఇవియునుగాక నింక నుపచారంబులు, వేలకొలఁదిగా వస్తువులుఁగూడ సమర్పణార్హంబులు, ఉచితమగు పూజాద్రవ్యములచే మూఁడు కాలములయందును శ్రీరామునిఁ బూజించుచుండవలయు. ప్రతివారును విత్తానుసారంబుగ నా రాము నర్చించఁదగును, తనకుఁ గల్గినంతకు లోపముగ నెవ్వఁడయిన నొనర్పఁజనదు, పాడ్యమి మొదలు నవమివరకుఁ బ్రత్యహము విశేషముగ శ్రీరామస్వామినిఁ బూజింపవలయు, తొమ్మిది దినములలోను విచిత్రమంటపాదులతోఁడ శ్రీరామునర్చించి తత్సాన్నిధ్యమున నానందరామచరితమును సంతతముఁ బఠించవలయు, నవమినాఁడు శ్రీరామస్వామిని వాహనముమీఁద నెక్కించుకొని ధ్వజఛత్రపతాక మంగళవాద్యంబులతోఁడ రామతీర్థంబునకు వెడలి వేదమంత్రంబులచే నభిషేకమును జేసి చక్కఁగనర్చించి నిజమందిరంబున కేతెంచి తాను హరికీర్తనమును జేయుచు పరులచే నృత్తగీతాదులను జేయింపనగును, పిదప, తానుపవాసమును జేసి భక్తితో విప్రులనుబూజించి గాయకులను సంమానించి నృత్తగీత కథాభివర్ణనంబులతోఁడ రాత్రి జాగరణముఁ జేసి దశమినాఁడు ప్రాతఃకాలమున స్నానమును జేసి శ్రీరామునర్చించి మధ్యాహ్నమున బ్రాహ్మణులయందు శ్రీరామస్వామి నారాధించవలయు.

* శ్రీరామస్వామిని బ్రాహ్మణులయం దారాధించుట. *

తొలుత బ్రాహ్మణదంపతుల నిరువురిని యెనిమిదిమంది బ్రాహ్మణులను రామార్చనకై నిమంత్రించవలయును. గృహమునందంతటను గోమయముచే నలికి రంగులుగల ముగ్గులతోఁ గమలములుదీర్చి, అందు నడుమ దివ్యసింహాసనమును స్థాపించి దానిమీఁద వస్త్రాసనమును గల్పించి దానియందు ౧౦౦౮ రామలింగాత్మకము నైనను ౧౦౮ రామలింగాత్మకము నైనను ౧౦౦౮ రామతోభద్రాత్మకము నైనను, ౧౦౮ రామతోభద్రాత్మకము నైనను శ్రీరామాసనమును రచించి దానిపయిఁ బత్నితోఁడ బ్రాహ్మణునిఁ గూర్చుండబెట్టవలయు, స్త్రీని యెడమప్రక్క నుండునట్లుగ పశ్చిమాభిముఖముగ వారినిఁ గూర్చుండబెట్టి యా

బ్రాహ్మణ దంపతులయందు సీతారాముల నావాహనముసేసి, యాదంపతులకు వెనుకప్రక్కనుండు విప్రునియందు లక్ష్మణుని, కుడిప్రక్కనుండు ద్విజునియందు భరతుని, ఎడమప్రక్కనుండు భూసురునియందు శత్రుఘ్నుని, ఎదుటనుండు బ్రాహ్మణునియందు నాంజనేయుని, వాయువ్యాది దిక్కులయందుండు బ్రాహ్మణులయందు సుగ్రీవాదులను నావాహనము సేయవలయు, అనంతరము పూజన మొనర్పవలయు. నియ్యది నవాయతనపూజనమనఁబడు. అటుగాదేని, నైదుగురియందు నావహించి పూజించవలయు, నయ్యది పంచాయతన పూజనంబనఁబడు, ఈపంచాయతనంబునందు శక్తిహీనుఁడగు విప్రునియందు సీతారాముల నిరువురి నావహించి యారాధింపఁదగు. అదియునుఁగాక శ్రీరామస్థానమున యతిని పూజింపనగును, అట్టుడతనిప్రక్కను సీతాస్థానమున వక్కపండు నుంపఁదగు, పూజానంతరము నొకసువాసినియగు స్త్రీని సీతనుగ భావించి పూజించి భోజనముఁబెట్టి యారాధించవలయు, ఇటు లర్చించునపుడు మొదట సీతారాములను బూజించి పిమ్మట లక్ష్మణాదులను బూజించవలయు నిట్లు షోడశోపచారములచేఁ గ్రమముగ నర్చించవలయు, మొదట విప్రులయందు దేవతల నావాహనముఁజేసి పీఠంబుల నర్పింపనగును పిమ్మట వేరువేరుగా నందఱి పాదములను గడుగవలయు, యతి పాదోదకమునుమాత్రము వేరుగనుంపఁదగు, పిదప నందఱకుఁ వరుసగ చందనాద్యర్ఘ్యము, ఆచమనము, స్నానజలము, వస్త్రంబులు, ఆభరణంబులు, యజ్ఞోపవీతము, దివ్యగంధము, రక్తాక్షతలు పుష్పమాలికలు, మాంగల్యవస్తువులు, ఛత్రచామర వ్యజనంబులు, ధనుర్బాణ తూణీరంబులు, ధూపము, దీపము, నైవేద్యము, విశేషముగ భక్ష్యాదులు, ఫలాదులు, తాంబూలము, దక్షిణ, అద్దము, కర్పూరహారతి, మంత్రపుష్పము, ప్రదక్షిణము నమస్కారము, నృత్త గీత వాద్యభోగంబులు, ఇట్లు వరుసగా బ్రాహ్మణుల కర్పింపఁ బడినపిమ్మట శ్రీరామోపాసకుఁడు శ్రీరామమూర్తియగు బ్రాహ్మణుని పాదములను నిజకర తలంబులచేఁగప్పి, ఇట్లు ప్రార్థింపవలయును, " వామే భూమిసుతా పురశ్చహనుమాన్ పృష్ఠే సుమిత్రాసుత శ్శత్రుఘ్నో భరతశ్చపార్శ్వ దళయో ర్వాయువ్యకోణాదిషు । సుగ్రీవశ్చ విభీషణశ్చయువరా ట్తారాసుతో జాంబవాన్ మధ్యేనీల సరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్॥ రామోహత్వా దశాస్యం ద్విజ వచనగురుత్వేన యాత్రాశ్చ యజ్ఞాన్ కృత్వా భుక్త్వాతిభోగా నవనితల విశంతీం గృహిత్వాథసీతాం। లబ్ధ్వా నానాన్నపాత్రా స్త్వ వనితలగతా న్పార్థివాదీంశ్చ జిత్వా కృత్వా,నానోపదేశా న్గజ పర నిక టే స్వీయలోకం జగామ॥ అని ప్రార్థించి క్షమాపణమును వేడుకొని పూజాఫలంబునుగూడ " శ్రీరామచంద్ర పరబ్రహ్మార్పణం " బని సమర్పింపవలయును, ఓశ్రీరామా ? మాసవ్రతమున నవమియందు నే నేపూజనొనర్చితినో నవరాత్రవ్రతమున పారాయణాది కర్మనేమి చేసి

తినో నదంతయు నీకొఱకర్పింపఁబడినది. ఈతొమ్మిదిమంది బ్రాహ్మణులతో నవాయతన పూజ యేది యొనర్పఁబడెనో నదిగూడ నీకర్పింపఁబడినది గైకొని ప్రసన్నుండవగుము ” అనియిట్లు సర్వమును రామబ్రహ్మార్పణము చేసినపిదప నందఱకు భోజనమును జేయించి మరల తాంబూల దక్షిణలనిచ్చి పంపవలయు, పిదపఁ దాను మొదటవిప్రతీర్థమును అనంతరము యతితీర్థమును పిదప దేవతీర్థమును దీసికొని బంధుమిత్ర పరివారములతోఁడ భుజించి యతికి సమర్పించినట్టి వస్తువుల నన్నింటిని తనగురువగు బ్రాహ్మణుని కర్పింపవలయు. ఇట్లు శ్రీరామ వ్రతమును ప్రతిపక్షంబునను జేయవలయును, అటుగానిచో శుక్లపక్షంబునఁ దప్పక చేయవలయు, ఇట్లు చేయుట మాసవ్రతంబనంబడు, పుణ్యవ్రతములెన్నియో పుడమిఁ గలవుగాని నవి యన్నియు నీవ్రతమునకు సరియయినవికావు నియ్యది భుక్తిముక్తి ప్రదంబైన సర్వోత్తమ వ్రతంబు, కావున రామోపాసకులు తప్పక నీవ్రతము నాచరించుచుండవలయు, ఇట్లువ్రతమును నిరూపించితిననిన గురువగు రామదాసుని విష్ణుదాసుఁ డడుగుచున్నాఁడు.

* శ్రీరామవ్రతో ద్యాపనాదివిచారము *

స్వామీ ? శ్రీరామవ్రతము నెట్లుయుద్యాపనము సేయవలయు నెప్పుడు సేయవలయునని యడుగ రామదాసుఁ డిట్లు నిరూపించుచున్నాఁడు, బాగుగనడిగితివి వినుము, ఈ శ్రీరాముని మాస నవమీ వ్రతమును తొమ్మిది సంవత్సరము లాచరించి చైత్రశుక్ల నవమినాఁ డుద్యాపనముఁ జేయఁదగు నవమినాఁ డుపవాసమును జేసి, గృహమునందుఁగాని బృందావనమునఁగాని ఆవుల దొడ్డియందుఁగాని భూమిని గోమయచందనాద్యులచే నలికి రంగు పొళ్లచే వివిధ పద్మంబుల వ్రాసి యట్టి మంచి ప్రదేశమునఁ బూర్వము చెప్పఁబడిన రామభద్రంబులలో నొకదానిని రచించి దానిపైనఁ జిత్రవర్ణ మంటపమునునిచి దాని చతుర్ద్వారంబులలోను తోరణంబులను, అరటిచెట్లను, అద్దములను, చెరుకుగడలను, గంటలను, గజ్జలను జాలరులను, అలంకరించి చిత్రమగు ధ్వజపతాకములనుగట్టి యాదివ్యమంటప మధ్యమున రామతోభద్రముమీఁద శ్రీరామమూర్తిని సీతాసమేతునిగ జలపూరితంబగు కలశంబున నిట్లు నారాధించవలయు, శ్రీరామమూర్తిని సీతాసమేతునిగాఁ దామ్రకలశమున నారాత్రి మహోత్సవముతోఁ బూజించవలయు. శ్రీరామమూర్తి విగ్రహమును తొమ్మిదిపలముల బంగరుతోను సీతాప్రతిమను తొమ్మిదిపలముల బంగరుతోను లక్ష్మణాది ప్రతిమలను ఐదేసి పలముల వెండితోను జేయించి పూజించఁదగు. ధనహీనులగువారు తగినంత కొంచెము తోనైనను ప్రతిమలఁ జేయించికొని పూజింపఁదగు, పిదప షోడశోపచారముల నారాధించి యారాత్రి యంతయు జాగరణమొనర్చి మరునాఁడుదయమున స్నానముఁ జేసి శ్రీరాముని బూజించి శ్రీరామమంత్రంబుచే, తిలాదులచేగాని, నవాన్న

ములతోఁగాని తొమ్మిదివేల సారులు అగ్నిహోత్రమునందు హోమమును జేసి, తొమ్మిదివేల సారులు క్షీరంబుచే తర్పణంబును జేసి ౯ం మందిచే మార్జనంబును జేయించుకొనియా ౯ం మందిని భోజనాదులచే నారాధించవలయు. వీరికి ప్రత్యేకముగఁ బవిత్రపుటుంగరము, మోహరుంగరము, వస్త్రములు,యజ్ఞోపవీతములు, చిత్రాసనము, ఉత్తరీయము, కిరీటము, వాద్యము, నవాన్నంబులతో నిండినకంచుకంచము, నేతికంచుగిన్నె, పాదుకలు, పుస్తకము, దక్షిణ, తాంబూలంబులను నన్నిటిని యొసగవలయు. అంత నాతని గురువు నారాధించి పూజించిన గోవును దక్షిణ సహితముగా దానమును జేయవలయు, " ఇట్లు ఉద్యాపన విధానముతోఁడ మాస నవమీ వ్రతమును ఆచరించితిని. ఈసంవత్సరముల వ్రతాచరణముచేత శ్రీరాముఁడు తృప్తినొందునుగాక, ఇఁకమీఁదనుగూడ బ్రదుకునంతకాలము ఈవ్రతము నాచరించెదను. శ్రీరామప్రీతికై చేయు నీవ్రతమే సర్వ వ్రతంబులలోను నుత్తమంబు. మీఁదయచే సీతాసమేతుఁడగు శ్రీరాముఁడు నాకుఁ బ్రసన్నుండగుగాక " అనియిట్లు గురువును బ్రార్థించి ప్రణమిల్లి గురువు నంపిన పిదప తాను పుత్రమిత్ర పరివారముతోఁడ భోజనమును జేయవలయు. ఇట్లు ఉద్యాపనవ్రతము నాచరించిన పిదప మఱల వ్రతము నారంభింపవలయును మానవులు ప్రతిమాసంబునందును నీవ్రతము నాచరించు చుండవలెను. ఏకాదశీ వ్రతమును నెట్లు నిత్యముగా నాచరించుదురో అట్లె శ్రీరామవ్రతము నాచరించవలయు. ద్రవ్యములేనివాఁడు ఉద్యాపనవ్రతమును యథాశక్తిగ నాచరించఁదగును. మనుష్యులు పుడమిలో నెప్పుడును నవమినాఁ డుపవాసమును దప్పక చేయవలయు. ఏమూఢుఁడగు మానవుఁడు శుక్లనవమినాఁ డుపవాసమును జేయఁడో వానికి కల్పాంతము వఱకు నరకవాసము పెద్దలచే నిరూపింపఁబడినది. నీవడిగిన శ్రీరామవ్రత విధానమును సమగ్రముగ నిరూపించి చెప్పితిని ఇఁక నేమి వినఁగోరుచున్నావు? అనిన నిట్లు విష్ణుదాసుఁ డడుగుచున్నాఁడు.

* బీదబ్రాహ్మణుఁడు శ్రీరామాదిమూర్తుల నారాధించి ధన్యుఁడగుట. *

మున్నెవరేని ఈవ్రతము నాచరించి యుండిరా? ఎవ్వఁడేని వ్రతము నాచరించి సిద్ధినొందెనా? అశక్తుఁడగువాఁడు ఈవ్రతము నెట్లు చేయఁగలఁడు, అని ప్రశ్నించిన రామదాసుఁ డిట్లనియె. బాగుగనడిగితివి సావధానముగా వినుము. మున్ను కేరళదేశమున శ్రీరామపరాయణుఁడగు బ్రాహ్మణుఁ డొకఁ డుండెను. దరిద్రుఁడగుటచే నాతని కెవ్వరు కన్యనివ్వనందున పెండ్లికాలేదు. ఇల్లును లేదు. తలిదండ్రులును లేరు. కాని, యాతనికి నియమమొక్కటిమాత్రము గలదు. ఏమనిన? కృతమాలానదియందు నిత్యము ప్రాతఃకాలమున స్నానమును జేసి తన నిత్యకర్మానంతరము ధాతుమయంబులగు శ్రీరామాది నవమూర్తులను

ఆనదీతీరమున తొమ్మిది ఇసుకదిబ్బల నేర్పరచి ఆయిసుకదిన్నెలపై శ్రీరామలింగాద్యాసనముల రచించి వానిపై నారామమూర్తిని సీతాసహితునిగ మధ్యను, అష్టదిక్కులను లక్ష్మణాది మూర్తులను బ్రతిష్ఠించి పిదప శ్రీరామునిజూచి కృతాంజలియై పుండరీకాక్షుండవగు శ్రీరామచంద్రా? ఆవశ్యకశౌచాదికర్మల నాచరించుట కేతెంచవలయునని ప్రార్థించి తనవీపుమీద నెక్కించుకొని కొంచెదూరము వెడలి చెట్లనడుమ రహస్యమగుచోట కసవునేలమీఁద స్థాపించి యచ్చట నెదుట జలపాత్రమును మృత్తికను బెట్టి తాను కొంతదూరముగపోయి కొన్నిక్షణములుండి మరల శ్రీరామ సాన్నిధ్యముఁజేరి శ్రీరామునికిఁ గాలుసేతులు గడిగి మృత్తికాశౌచక్రమమును నెరవేర్చి మఱియొకపాత్రమునుండి నీళ్లుపోసి శ్రీరాముని కాచమనముఁ జేయించి దంతకాష్ఠముతో దంతములఁదోమి కొంచెము వెచ్చగనుండు నీటిచే భక్తిపూర్వకముగ గండూష ముఖప్రక్షాళనాదులను జేయించి శుభ్రవస్త్రమునఁ దుడిచి మరల తనవీపునెక్కించుకొని నమ్రుఁడై మెల్లమెల్లగ వచ్చి యిసుకతిన్నెమీఁద మునుపటివలెఁ గూర్చుండఁబెట్టెను. ఈప్రకారమే సీత మొదలుగ నందఱకు శౌచాదిక్రియల నెరవేర్చి పిదప వేడినీటిచే తైలాభ్యంగాదులను నలుగులను వారికందఱకుఁ బ్రత్యేకముగ చేసి వస్త్రములకు బదులుగ భూర్జాదిపత్రములను సమర్పించి యంతట తనకు లభ్యమగు పత్రములు, ఫలములు, పుష్పములు మొదలగువానిచే నర్చించి, యనంతరము పెద్దపైరు వడ్లబియ్యముచే నన్నమును జేసి మాధ్యాహ్నికస్నానాది కృత్యంబుల నాచరించుకొని మరల నాశ్రీరాముఁ బూజించి నైవేద్యము నర్పించి, వైశ్వదేవకర్మ నాచరించి కొంతయన్నము నతిథికి భిక్షనొసగి ఆవులకును మత్స్యములకును పక్షులకును గొంతయన్నము నొసగి, శ్రీరామాజ్ఞనొంది భుజించును. అనంతరము తనమూపుల యందు శ్రీరామాదిమూర్తుల నెక్కించుకొని పేటికయందు పూజాసామగ్రుల నునిచికొని యతఁడు నందనవనంబులకును, ఉద్యానవనంబులకును వెడలి యచ్చట శ్రీరామమూర్తిని జూచి "స్వామీ? రాజీవాక్షుఁడవగు రామచంద్రా? సీతాదేవి తోఁడ నుద్యానవన కౌతుకంబులఁ జూడుము. పక్షులయొక్కయు మృగముల యొక్కయు క్రీడలఁ జూడుము" అని ప్రార్థించుచు నారామవినోదంబులఁ జూపికొని యంతట నూరిలో నంగడివీధుల కేతెంచి యచ్చటివినోదంబులఁ జూపుచు దారికడ్డమగువారినిఁ బడమొత్తుచుండెను. వారును వీనివినోదంబుల నవలోకించువారలై కోపమునొందక వెడలుచుందురు. ఇట్లు శ్రీరామునికి నానావిధ కౌతుకంబుల నవలోకింపఁజేసి యంతట నెవ్వరులేని పూరింటిలో నాశ్రీరామాది మూర్తుల నందఱిని దింపి కొయ్యమంచముమీఁద పరుండఁబెట్టి నిద్రితులఁజేయును. అంత నాబ్రాహ్మణుఁ డంగడివీథికిఁజని యచ్చటివారిని యాచించి బియ్యము నూనె నెయ్యి కూరలు ఫలములు వక్కలాకులు కుంకుమ, డబ్బులు మొదలగు

ధానిని సంపాదించుకొని యిల్లు జేరును. ఆగ్రామమునందు వసించువారలందఱు సీతని శ్రీరామభక్తికి మెచ్చి వారివారి శక్తికొలఁది కోరినదానిని సంతోషముగ నొసగుచుందురు. అంతనావిప్రుఁ డాయింటిలో శ్రీరామమూర్తియెదుట దీపమును వెలిగించి ఆరతులను నెగ్గించి పుష్పగంధ తాంబూలాదులచేఁ బూజించి, చిగురుటాకులచే విసిరి సంతోషముతో పలుమారు సేవించి రామమంత్రము ననేకమారులు జపించి ప్రదక్షిణప్రణామంబుల నొనరించి స్తుతించి మహర్షిప్రణీత శ్లోకంబులచే శ్రీరామసంకీర్తనము జేసి, తాను తెచ్చిన వస్తువులను మూఁడుపాళ్లుగఁ జేసి రెండుపాళ్లను తనసెలవునకై దగ్గఱఁ బెట్టికొని యొకపాలును నవమీవ్రతంబునకై మిత్రునింటఁ దాచి, తానింటివాకిటనడుమఁ బరుండి మరునాఁడు వేకువనే లేచి యాచమనానంతరము కరతాడన మొనర్చి గీతాదులఁ బాడి శ్రీరాముని మేల్కొలిపి మునుపటివలె నదీతీరమునకు వెడలి పూజించుచు నిట్లే నిత్యము నెరవేర్చుచు మిక్కిలి మక్కువతో నవమినాఁడు విశేషముగ శ్రీరామునిఁ బూజించి తానుపవాసవ్రతము నాచరించి తానేకీర్తనము సేయుచు రాత్రియందు జాగరణ మొనరించి మరల రామునిఁ బూజించి నిజకృతనర్తనాదులచే నారాధించి దశమినాఁడు ప్రొద్దున శ్రీరామునిఁ బూజించి పాడ్యమి మొదలు తాను జేయుచువచ్చిన యానందరామాయణ పారాయణమును బూర్తిఁ జేసి తానునిమంత్రించియుండిన తొమ్మిదిమంది బ్రాహ్మణులను బిలిచికొనివచ్చి తాను మిత్రునింటఁ దాచుచు వచ్చిన ద్రవ్యంబులనన్నింటిని సేకరించి నవాన్నాదులను వండి యథావిభవంబుతో వారినందఱి నిసుకతిన్నెలమీఁద నందునడుమ సపత్నీకబ్రాహ్మణుని సీతారామస్వరూపంబుగఁ గూర్చుండఁబెట్టి యెనిమిదికోణంబులలో నెనమండ్రు బ్రాహ్మణుల నుపవిష్టులం జేసి వారిని క్రమముగ భక్తితో షోడశోపచారంబులచే నర్చించి వెడల్పుగల నరటియాకులందు వండినవస్తువులనెల్ల వడ్డించి వారందఱు వీనిభక్తికిమెచ్చి సంతోషముగ భుజించినపిదప దక్షిణతాంబూలాది సత్కారంబులచే నారాధించి పంపి, పిదప తానుభుజించి శ్రీరామబ్రహ్మానందని మగ్నుఁడై యుండెను. ఇట్లు ప్రతిమాసంబునను నవాయతన పూజావిధానంబును జేయుచుండెను. ఇటులనే తొమ్మిదివత్సరంబులు గడచెను.

* బ్రాహ్మణాగ్రహమున మారుతిచే స్త్రీదేశమేర్పడుట *

పిదప నొకప్పుడు శ్రావణమాసమున నాగ్రామమున కొకరాజు నిజసేనలతోఁడివచ్చెను. అప్పుడీ బ్రాహ్మణుఁడు నిజస్థలంబున నిద్రించియుండెను. అంతలో గొప్పవానవచ్చుటచే నాసైనికులు వర్షపీడితులై యాగ్రామమందుఁ గలగృహములనెల్లఁ బ్రవేశించుచుండనట్లు యాబ్రాహ్మణుండు నింద్రించుచుండిన శూన్యగృహంబునుగూడ పదిమందిరాజభటులు ప్రవేశించిరి. గుఱ్ఱపురౌతులు వేలకొలఁదిగ వాకిటనుండిరి. అపుడు ద్వారమధ్యమున నిద్రించు విప్రునిఁజూచి యాభ

టులు "ఓరిబాపఁడా? లెమ్ము? లెమ్ము? త్వరగా లెమ్ము? దారినిమ్ము, మేమీ వెలుపల వానచేఁ బీడింపఁబడి డస్సియున్నారము. ఈశూన్యగృహమున సేవకుల తోఁడను గుఱ్ఱములతోఁడను సుఖముగ నుందుము" అనినను దు కతఁడు సంభ్రమముతో "ఈగృహమునందు శ్రీరామచంద్రమూర్తి సీతాసమేతుఁడై బంధుపరివారముతోఁ సుఖముగ నిద్రించియున్నాఁడు. ఇచ్చట మీకుచోటు దొరకదు ఊరిలో నెన్నియో చోట్లుగలవు పొండు" అని నిరాకరించెను. అంతవారు విప్రుఁడా? అట్లు శ్రీరాముఁడు నిద్రించుచున్నయెడల నతఁడు సీతతోఁడను తమ్ములతోఁడను పరివారము తోఁడను బయటపోనిమ్ము. మాకు స్థలము నివ్వవాపమి? అనియదలించిరి. అంతనాభక్తుఁడు "భటులారా? ఈరాత్రి కాలమందు నిదురించుచుండు రామచంద్రమూర్తిని నేనెట్లు లేపుదును? నేనుపలుమరు మిమ్మునిట్లు ప్రార్థించుచున్నాను. మీరును క్రమప్రకారము నమస్కరించి వేరొకచోటికి పొండనిన" నా రాజసైనికులు వర్షబాధకు నోర్వలేక యావిప్రునిఁ బట్టమొత్తిరి, అంత నాబ్రాహ్మణుఁడు కుయ్యోమొఱ్ఱోయని యూరకేయుండుఁడు, ఓరాజభటులారా శ్రీరాముని బయటికి వెడలించెదనని వారిని సమాధానపఱచి శ్రీరామమూర్తినిఁజూచి "ఓశ్రీరామా? లెమ్ము, వెలుపల దుష్టులగు సైనికులు తురగారూఢులై యున్నారు. వారుండుటకు స్థలమునిమ్ము. ఈరాత్రియందు మనము వెలుపలకుఁ బోవలయు" నని ప్రార్థించి యాశ్రీరామాది మూర్తుల తన మూపుపై నెక్కించుకొని తనవస్త్రపాత్రాదుల మూటను జంకఁ దగిలించుకొని యెడమచేతితో జలకుంభమును కుడిచేతితో దండమునుదాల్చి యత్యంతాగ్రహావిష్టుఁడై నచ్చటినుండి తిన్నగా వెడలెను. ఆదుష్టులగు భటులు ఆ విప్రునిఁ జూచి భ్రాంతుఁడనియెంచిరి. అంత నాబ్రాహ్మణుఁ డతివృష్టి నవలోకించి యింటిముందఱ చూరుక్రింద నిలువంబడియెను. ఆసైనికులు లోఁజొచ్చిరి. అప్పుడాబ్రాహ్మణుఁడు తనమనంబున "పురాణములందు నేనాంజనేయుని పరాక్రమము నపారముగ వినుచుందును. అదంతయు నిప్పుడు దబ్బరయయినది. ఇఁక నిచ్చటనేమిప్రయోజనము?" అని యాలోచించి క్రుద్ధుఁడై వడిగా చేతిలోనుండు జలకుంభమును గ్రిందఁబెట్టియెడమచేతితో హనుమన్మూర్తియొక్క తోఁకనుబట్టి గగనమునకు విసరివైచెను. అప్పుడన్మూర్తి యాకసంబున కెగసి మిక్కిలిభయంకరమగు గర్జనముఁ జేసెను. ఆగర్జనంబునువిని మహావీరులును గ్రామమునం దుండినవారును, వెలుపలనుండినవారును సంభ్రాంతచిత్తులై క్షణమాత్రమునఁబడి మృతులయిరి. ఏనుగులుగుఱ్ఱములు ఎద్దులు మొదలగునవికూడ మృతినొందెను. పురుషులందఱును అప్పుడమిని మృతులయిరి. చివరకు గర్భంబులలోనుండిన పురుషగర్భంబులుగూడ నష్టంబులయ్యె. అప్పుడాబ్రాహ్మణోత్తముఁడొకఁడుమాత్రము పురుషుఁడు బ్రతికియుండెను. శ్రీరామచంద్రునియొక్కయు హనుమంతుని

యొక్కయు కృపచేనీతఁడు బ్రతికియుండెను. అంత నామరుసటిదినమున తెల్లవా
రగ నాయూరి స్త్రీలందఱును తమపురుషులెల్లరు మృతులైయుండుట నెఱింగి
తామాగర్జనంబును విననివారగుటచే నత్యంతాశ్చర్యమునొంది మృతినొందక
బ్రతికియుండిన బ్రాహ్మణునిఁజూచి బురదలోఁబడియుండు హనుమన్మూర్తి నవలోకించి
విస్మయమునొంది, విప్రోత్తమా? ఇదియేమివింత? యని యడిగిరి. అతఁడు వారికి
నాసంగతినంతయుఁ దెల్పెను. అంత వారందఱును నాతనిఁ బ్రార్థించి యుప్పత్త
నమున కధిపుంజేసిరి. అతఁడు శ్రీరామాజ్ఞనొంది యుప్పట్టణమున రాజ్యమే
లుచుండెను. అప్పుడా యూరిలోనుండు నారులకందఱికిని యతఁడే నాథుఁడయ్యెను.
ఆ హనుమంతునియొక్క గర్జన మొకొక్కకాలమునందు మునుపటిబోలెనప్పు
రమునన్నిప్పటికిని పిడుగువలె వినఁబడుచున్నది. అదివినబడిన నచ్చటియంగనలకు
పుత్రగర్భంబులుండిన నల్లె నశించును. స్త్రీలు వేలకొలఁదిగానుందురు. అతఁడొ
క్కఁడె పురుషుఁడుండెను. అందుచే నదిమొదలు దానిని స్త్రీరాజ్యమని
మానవులందురు. పిదప కాలాంతరమున నాబ్రాహ్మణుఁడు మృతుఁడై నిజపుణ్య
ప్రభావముచేత విష్ణులోకము నందెను. పిమ్మట నచ్చటినాతులు నాథుఁడులేక
తామే రాజ్యమేలుచుండెడివారైరి. అనంతరమెవ్వరేని బాటసారులు వచ్చిరేని
వారినే భర్తలనుగా వరించి కాలము గడుపుచుందురు. ఆప్రకారముగ హను
మద్గర్జకాలము సమీపింపఁగనే యా జాడలుగని యాదేశమునంగల పురుషుల
నందఱ భూగృహంబులయందుంచుదురు. ఆశబ్దము పురుషులకు వినిపింపకుండ
నుండుటకు భేరీల మ్రోగించుచు శంఖంబులఁ బూరించుచు నుందురు. ఆహను
మద్ధ్వని నిలిచినవెంటనే తమపురుషులను చచ్చిపుట్టిన వారిగానెంచి యుత్సాహం
దంబున ననేకోత్సవంబులు సలిపి యాదేశపుస్త్రీలు వారలతో రతిసుఖంబుల నను
భవింతురు. కావుననో బ్రాహ్మణోత్తమా; సదా యారాజ్యమును స్త్రీలే పరి
పాలింతురు.

* పుత్రోత్పత్తి విచారము *

అదియునుంగాక యారాజ్యంబునకు జుట్టు ప్రక్కలదేశంబులందుఁ
గూడ స్త్రీ సంతతియేకలుగును గాని పురుషసంతతి కలుగదు. ఒకానొకసమ
యంబునఁ బురుషసంతతి కలిగినను హనుమంతుని శబ్దముతోఁగూడిన వాయువు
సోకఁగనే యాపురుషులు పుంస్త్వములేని వారగుదురు. ఎప్పుడు పౌరుషమునకు
లోపము కలుగునో యప్పుడు వీర్యమునకు లోపమువచ్చును. అందువలన నధి
కముగ స్త్రీ ప్రజయు నరుదుగా పురుషప్రజయును కలుగును. శుక్రశోణితములు
రెండును సమములై యుండునపుడు నపుంసక జననము కలుగును. శిష్యోత్తముఁ
డవైన యోవిష్ణుదాసా! ఆదేశమునందుఁ బురుషులు పుట్టకుండుటకుఁ దగిన
కారణము వేఱొక్కటికలదు. దానిం జెప్పెదను వినుము. ఆదేశమునందలి

స్త్రీలు రాజ్యమదముచేత రతికాలమునందుఁ బురుషులను గ్రిందఁబరుండఁబెట్టి
సురత క్రీడల్ల సలుపుదురు. ఆస్త్రీలు రతికాలమునందు తమపృష్ఠభాగమును
భూమియందు మోపరు. అందువలన రతికాలమునందు శుక్రముక్రిందికి జారి
జారిపోవును. కాఁబట్టి స్త్రీలగర్భస్థానమునందున్న సూక్ష్మరంధ్రములయందు
శుక్రము ప్రవేశింపకుండును. పురుషులకు శిరస్సునందలి రంధ్రముతోఁ గూడఁ
బది రంధ్రములుగలవు. స్త్రీలకు నీపదియునుగాక స్తనములయందును, గర్భ
మార్గమునందును గూడ రంధ్రములుగలవు. ఆఛిద్రములు సూచికాగ్రములయి
యుండును. రతికాలమునందు గర్భమునందలి రంధ్రము పురుషునివీర్యము పోయి
ప్రవేశించుటకుఁ గొంచెముగ వికసించును. కావున నట్టి మార్గమునందు శుక్ర
ము విశేషముగఁ బ్రవేశించినయెడల పుత్రుఁడు పుట్టును. ఆశుక్రము స్వల్పము
గఁ బ్రవేశించినయెడలఁ బురుషుఁడు క్రిందఁబరుండియుండును కనుక శుక్రము
పైకి ప్రసరింపకుండును. ఒకవేళ దైవవశమువలనఁ గొంచెముగ స్త్రీగర్భమార్గ
మునఁ బ్రవేశించెనేని అప్పుడు పురుషుఁడు పుట్టును. అయిన నా పురుషుఁడు
నపుంసకుఁ డగును. కావుననే యాదేశమునందు పెక్కండ్రు స్త్రీలు పుట్టుచుం
దురు. కావునఁ బుత్రార్థియగువాఁడు స్త్రీకి బలము విశేషముగఁ గలుగనీయక
తాను విశేషబలమును గలిగించుకొనవలయును. కావున వైద్యులగు వారు
పురుషుల బలాబలముల గుర్తెఱింగి యౌషధాదుల నిచ్చుచుండవలయును. శరీ
రము లావుకలదై యుండుటమాత్రము చేతనే పురుషుఁడు బలవంతుఁడనియు
తలంపఁగూడదు. వాతాదికముచేతఁ గూడ శరీరము మిగుల లావు కలదై యుం
డును. కావున వైద్యమును వదలిన మఱియొకదానిచేఁ బురుషుని బలాబలములు
తెలియఁబడవు. కావున భక్తిగలవాఁడు వైద్యుని దగ్గఱకుఁబోయి యడుగవల
యును. మంత్రము, తీర్థము, బ్రాహ్మణుఁడు, దేవుఁడు, వైద్యుఁడు, గణకుఁడు,
గురుఁడు, వీరి యందెంత విశేషముగ భక్తి కలిగియుండునో యంతవిశేషముగఁ
గార్యముసిద్ధించును. సర్వకాలములయందును వైద్యుఁడు చెప్పినవిధముగ నడుచు
కొనవలయును. అట్లుచేసినయెడల సుపుత్రులు కలుగుదురు. పదిమంది పుత్రికల
వలనఁ గలిగెడు లాభముకంటె నొక్కపుత్రునివలనఁ గలిగెడు లాభ మధికమై
నది. పుత్రుఁడు కులమును పున్నామక నరకమునుండి కాపాడఁగలఁడు. కన్నియ
దురాచారములుగలదయ్యెనేని పితృకులమును క్షణములోపల నరకమునందుఁ
బడవైచును. అటులనే భర్తృకులమునుగూడ నరకమునందుఁ బడవైచును.
కావునఁ బుత్రులు కలుగుటకొఱకుఁ దగినయత్నమును చేయవలయును. అనేక
మంది కొడుకులు గలిగినయెడల నొక్కఁడైనను గయకుఁ బోవును. అట్లు పోని
చో నశ్వమేధమునైనఁ జేయును. లేకున్నఁ గన్యాదానమునైనఁ జేయును. అట్లు
కాదేని నీలవృషభోత్సర్జనము నైనను జేయును. బ్రదికియున్నంత వఱకును దల్లి

దంద్రుల వాక్యానుసారముగఁ బ్రవర్తించుట, ప్రత్యాబ్దిక శ్రాద్ధమునందును సమృద్ధిగ నన్నదానముచేయుట, గయయందు పిండదానముచేయుట, అను మూటి వలనను పుత్రుఁడు సార్థకమైన వాఁడగును. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! నీవడిగిన విధముగ నశక్తుఁడయినవాఁడు నవమీ వ్రతము నాచరించురీతి నుడివితిని. ఆబ్రాహ్మణుఁ డావిధముగఁ జిరకాలము రాజ్యభోగముల ననుభవించి విష్ణుసాయుజ్యమునుబొందె. రామవ్రతము ఇహ పరలోకసుఖముల నన్నింటినీయ శక్తి కలదై యున్నది. మునులును దేవదానవ గంధర్వాదులును, రామవ్రతము నాచరించి సకల లోకసుఖములను బొందిరి. ఈశ్రీరామవ్రతము స్త్రీపుత్రాది సకల సంపదలను కలుగఁజేయును. స్వర్గమర్త్య పాతాళలోకములయం దనేక వ్రతములు కలవు. అయినను ఆవ్రతములన్నియును శ్రీరామనవమీ వ్రతమునకు సమానములయినవి కావు. కాఁబట్టి యెల్లవారలు శ్రీరామనవమీ వ్రతమును తప్పక యాచరింపవలయును. ఓ శిష్యోత్తమా! నీవడిగిన విషయమును సర్వమును జెప్పితిని. ఇంక నేమయిన వినవలయునని తలంపుగలదేని యడుగు మనియె.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
యాఱవసర్గము ముగిసెను.

—:(౦):—

* శ్రీరామ లక్షనామోద్యాపనాది విధి *

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! శ్రీరామునకుఁ బ్రియము కలుగుటకొఱకు భక్తిగలమానవులు ప్రతిదినమునందును, తొమ్మిదినూఱుల రామనామములనైనను పత్రమునందు వ్రాయవలయును. ఈవిధముగఁ గోటినామములను వ్రాసి పూజింపవలయును. ఇట్లు చేయుటకు శక్తిలేనివాఁడు లక్షనామములనైనను వ్రాసి పూజింపవలయును. అట్లుచేసి యానామముల యందలి పదియవ భాగమునకు సమ సంఖ్యకల హోమమును చేయవలయును. ఆహోమము "ఇదం విష్ణుః" అను మంత్రము నుచ్చరించుచుఁ దిలాజ్యములచేతనైనను, పాయసముచేతనైనను, నవాన్నము చేతనైనను, చేయవలయును. హోమముచేయుటకును, దేవపూజచేయుటకును శక్తిలేనివాఁడు ప్రయత్న పూర్వకముగ భద్రమును స్థాపించి యష్టోత్తర సహస్ర రామలింగములను పూజింపవలయును. అట్లుగాదేని యష్టోత్తర శతమునైనను చేయవలయును. ఈవిధముగ హోమములేఖనాదులను పరమభక్తితో శ్రీరామునకు సమర్పింపవలయుననిన విని విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! నీవు శుభమైనవిషయమును దెలిపితివి. రామనామలేఖనోద్యాపనమునుగూడఁ జెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని శ్రీరామదాసు మఱల నిట్లనియె.

ఓ శిష్యోత్తమా ! ఇఁకమీఁద జరుగఁబోవునదియును మిగుల మనోహరమైనదియును నగు నొక్కకథను జెప్పెదను. దానివలన నీయభీష్టము నెరవేరును. భవిష్యత్కాలమునందు పాండుపుత్రుఁడగు ధర్మరాజు రాజ్యపదభ్రష్టుఁడై భార్యాపుత్ర సోదరాదులతోఁ గూడ నరణ్యమునకుఁ బోవును. అట్టి సమయమున ధర్మరాజును జూచుటకు శ్రీకృష్ణుఁడు అరణ్యమునకుఁ బోవును. అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణుని బూజించి యిట్లని యడుగును. జగన్నాథుఁడవును దేవోత్తముఁడవు నయిన యోకృష్ణా ! నిన్నొక్క విషయము నడుగఁదలఁచి యున్నాఁడను. నీవు నాయందుఁ బ్రియముకలదేని నా యడిగిన ప్రశ్నమునకు సమాధానమును జెప్పుము. లక్ష్మిని కలుగఁజేయునదియును, మిగుల పావనమును, పుత్రపౌత్రాదులను వృద్ధిచేయు నట్టిదియును అయిన వ్రతమును రాజ్యపద భ్రష్టుఁడనైన నాకుఁ జెప్పుమనిన విని శ్రీకృష్ణుఁ డిట్లనియె. ఓ రాజోత్తమా ! పరమరహస్యమైన యీవిషయమును నివు వినఁదలచినయెడల నేను జెప్పెదను. దానిని మిగుల నాదరము గలవాఁడవై వినుము. రామనామముకంటె మోక్షమును కలుగఁజేయునది మఱియొకటిలేదు. రామనామము వ్యక్తమనియు తేజోరూపమనియుఁ జెప్పఁబడును. కావున రామనామములు జపించుచు మానవుండు రామరూపుఁడగును. ఈవిషయమునే శ్రీరాముఁడు హనుమంతున కుపదేశించెననిన విని ధర్మరా జిట్లనియె. ఓకృష్ణుఁడా ! ఎప్పుడు శ్రీరాముఁడు హనుమంతున కుపదేశించెనో తెలుపుము, అనిన శ్రీకృష్ణుఁ డిట్లనియె. తొల్లి శ్రీమహావిష్ణువు రామావతారము నవలంబించినపుడు రాముని భార్యను రావణుఁడెత్తుకొనిపోయె. అప్పుడు రామచంద్రుఁడు హనుమంతునిబిలిచి యిట్లనియె. వాయుసూనుఁడవును, మహావీరుఁడవును, అయిన యో యాంజనేయా ! సీతామహాదేవిని వెదకుటకు దక్షిణదిక్కును సర్వమును వెదకి కార్యసిద్ధిని పొందుమనిన విని హనుమంతుండిట్లనియె. జగన్నాథుఁడవైన యో రఘునాయకా ! దక్షిణదిక్కునందు మహాసముద్రమును, బలవంతులగు రాక్షసులును కలరు. అట్టిచోట సంచరించుటకు నాకెట్లు శక్తికలుగును ? అనిన విని శ్రీరాముం డిట్లనియె. ఓయాంజనేయా ! సర్వదిక్కులయందును జయమును కలుగఁజేయునట్టిదియును, రావణాది రాక్షసులను నివారించునదియును, మిగుల సుగమమును అయిన మంత్రము నిచ్చెద ననిన విని హనుమంతుఁ డిట్లనియె. దీనులఁ గాపాడువాఁడవగునో రామచంద్రా ! ఆమంత్రముయొక్క తత్త్వము నుపదేశింపవలయు ననియె నని చెప్పి యా రామదాసు మఱల నిట్లనియె. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా ! ఇట్లు చెప్పినపిమ్మట శ్రీరాముఁడు హనుమంతుని రహస్యస్థలమునకుఁ బిలిచి యతని దక్షిణ కర్ణమునందు "శ్రీరామ" యని యుపదేశించె. అనంతర మా మంత్రముయొక్క పురశ్చరణాదికమును సర్వము నుపదేశించె

అంతట హనుమంతుఁ డా మంత్రమును లక్షపర్యాయములు జపించి దక్షిణ దిక్కునకుఁ బ్రయాణమయ్యె. అప్పుడా మంత్ర మాహాత్మ్యమువలన నానావిధ జలచరములచేత నాకులమైనదియును, పొంద శక్యముకానిదియును అయిన సముద్రమును దాటి లంకాపట్టణమునందుఁ బ్రవేశించి యాపట్టణమునం దంతటను వెదకి సీతను గానక యక్కడనుండి బయలువెడలి యశోకవనమునం బ్రవేశించె. ప్రవేశించినపిమ్మట నశోకవృక్షముక్రింద నివసించి యున్న సీతా మహాదేవినిజూచె. కాంచి హనుమంతుండు అధికమైన సంతోషముకలవాఁడై దండమువలె భూమియందుఁ బడి సీతా మహాదేవికి నమస్కారముచేసె. అప్పుడు మిగుల సూక్ష్మమైన శరీరము కలవాఁడును, బాలకుని యాకారమువంటి యాకారము కలవాఁడును, భూమియందుఁబడి నమస్కారము చేయుచున్న వాఁడు నయిన యా హనుమంతునితో సీతామహాదేవి యిట్లనియె. ఓబాలుఁడా! నీవెక్కడనుండి యిక్కడకు వచ్చితివి? నీతల్లిదండ్రు లెవరు? అనినవిని యాహనుమంతుఁడు సవినయముగ నిట్లనియె. ఓతల్లీ! నాకు సీతారాములు తల్లిదండ్రులు. నేను శ్రీరాముని దగ్గఱనుండి వచ్చితిని. నేను హనుమంతుఁడనువాఁడను. ఈముద్రికను నీవు గ్రహింపవలయుననియె. అంతట సీతామహాదేవి రామనామాంకితమును, శుద్ధ కాంచన నిర్మితమునయిన యాముద్రిక రామముద్రికయని తెలిసికొని పరమసంతోషమునందె. ఆసమయమునందు హనుమంతుఁ డిట్లనియె. ఓసీతా! నాకు విశేషముగ క్షుద్బాధ కలిగియున్నది. నీవాజ్ఞనొసంగినయెడల నేనీవనమునందలి ఫలముల భక్షించెదననిన విని సీతామహాదేవి యిట్లనియె. ఓబాలుఁడా! ఈవనమునకు రావణుఁ డధిపతియైయున్నాఁడు. నీకు సామర్థ్యముకలదేని భక్షింపఁదగు ననిన హనుమంతుఁడు మఱల నిట్లనియె. ఓతల్లీ! శ్రీరామమంత్ర మనియెడు మహాస్త్రము నాయొద్దఁగలదు. ఆయస్త్రముచేత నేను రాక్షసులనందఱఁ దృణప్రాయములనుగాఁ జేయఁగలనని చెప్పి యాసీతామహాదేవి యనుజ్ఞను గైకొని యావనవృక్షముల నన్నిఁటి నిర్మూలనముచేసె. అంతట రాక్షసులకును హనుమంతునకును మిగుల భయంకరమైన యుద్ధము జరిగెను. అట్టియుద్ధమునందు హనుమంతుఁడు రాక్షసబలంబును సర్వంబును నశింపఁజేసి లంకాపట్టణంబును తగులఁబెట్టి యనంతర మశోకవనమునకేగి సీతామహాదేవికి నమస్కారమును చేసి చూడామణిని గైకొని రామునిదగ్గఱకుఁబోయె. పోయి యాయలంకారమును రామునకు సమర్పించి సీతావృత్తాంతంబును సర్వంబును చెప్పఁగా విని శ్రీరాముఁడు సంతోషమును బొందె. ఓధర్మరాజా! ఇట్లుజరుగుట రామనామప్రభావంబునని యెఱుంగవలయును. ఇట్లు తెలిసికొని నీవు కూడ రామనామ జపమును జేయుమనిన ధర్మరాజిట్లనియె. ఓదేవోత్తమా! రామనామమంత్రమును జపింపఁదగిన విధియెట్లు? ఆమంత్రపురశ్చరణ విధియేది? ఉద్యాపన

మెట్లు? ఈవిషయమును సర్వమును దెలుపుమనిన విని శ్రీకృష్ణుఁ డిట్లనియె. ఓధర్మరాజా! స్నానమునుచేసి పరిశుద్ధుఁడై రామనామమును తులసీమాలిక చేత జపింపవలయును. ఇట్లుగాదేని రామనామమును పుస్తకమునందు వ్రాసి హృదయమునందు స్మరింపవలయును. ఈవిధముగఁ గోటిపర్యాయము లయినను లక్షపర్యాయము లయినను జపింపవలయును. ఓధర్మరాజా! రామమంత్రము లనేకములుకలవు. ఆమంత్రములలో ముఖ్యమైన మంత్రమును జెప్పెద వినుము. "శ్రీరామజయ" అనుమంత్రము అనేకకోట్ల బ్రహ్మహత్యలను గూడఁ బోఁగొట్టును. కావున బుద్ధిమంతుఁడగువాఁ డీమంత్రమును జపింపవలయును. ఈవిధముగ లక్షపర్యాయములు జపించి పిమ్మట నుద్యాపనమును జేయవలయును. రామ నామమును జపించుటకంటె వ్రాయుటవలన నూఱుమడుంగు లధికమగు పుణ్యముకలుగును. ప్రతిలక్షకు నుద్యాపనము చేయవలయును. ఆయుద్యాపనవిధానమును సంక్షేపముగఁ జెప్పెదను వినుము. ఉద్యాపనమును చేయఁదలఁచిన దినమునకు ముందుదినమునం దుపవసించి యానాటిరాత్రియం దారామలింగాత్మకమగు భద్రాసనమునందు ధాన్యరాశిని కల్పించి దానియందు కలశస్థాపనమును చేయవలయును. అంతట నాకలశముయొక్క ముఖమునందు శ్రేష్ఠమగు వస్త్రమును పఱచి సీతాలక్ష్మణ సంయుక్తమగు ప్రతిమను స్థాపింపవలయును. ఆప్రతిమను శక్త్యనుసారముగ సువర్ణముచేతఁ జేయింపవలయును. అట్లుగాదేని తామ్రముచేతనైనను జేయింపవలయును. విత్తశాఠ్యమును జేయఁగూడదు. అంతట సమాహితచిత్తుఁడయి యాసీతారాములకు షోడశోపచార పూజను చేయవలయును. మఱియును రామనామాంకితమైన హేమపత్రముమీఁద మంత్రమునువ్రాసి యాకలశమునకు ముందుంచి పూజింపవలయును. అట్లుచేసి సంసారసాగరమునుండి కాపాడుమని రామునిప్రార్థించి రాత్రియంతయును గీతవాద్య నృత్యాదులను సలుపుచు జాగరణమును చేయవలయును. అంతట మఱునాటి ప్రాతఃకాలమునందు దశాంశ సమముగ హోమమును చేయవలయును. ఆహోమము గవ్యముచేతనైనను క్షీరములచేతనైనను చేయవలయును. దానికి దశాంశ సమముగ బ్రాహ్మణభోజనమును చేయింపవలయును. అంతట నాచార్యునకు సర్వాలంకారములచేత నలంకరింపఁబడినదియును, దూడతోఁ గూడుకొన్నదియును, అగు గోవును దానము చేయవలయును. మఱియు నితరులగు బ్రాహ్మణులనుగూడ సంతోషమును పొందింపవలయును. ఈవిధముగఁ జేసిన యెడల పుత్రార్థియగువాఁడు పుత్రులను, ధనార్థియగువాఁడు ధనమును పొందును. అట్టికాలమునందుఁ జేసిన దానములన్నియును కోటిగుణితము లగును. అభిలాష కలిగియున్నను, అభిలాష లేకపోయినను, ఈవ్రతము నాచరించినవాఁడు సకలసంపదలనందును. రామాయణమును వ్రాసి బ్రాహ్మణునకు దాన

ము చేయవలయును. ఈవిధముగఁ జేసినవాఁడు ఇహపరలోకములయందలి సకల సుఖముల ననుభవించును. రామాయణ శ్లోకముల యందలి సంఖ్యకు దశాంశ సంఖ్య హోమము నాచరింపవలయును. మఱియును తద్దశాంశము బ్రాహ్మణ భోజనమును చేయవలయును. ఇట్లుచేయుటకు శక్తిచాలనివాఁడు శుభకరమైన శ్లోకము నొకదానిని మాత్రము హేమపత్రమునందు వ్రాసి రామమూర్తికెదుట స్థాపించి పూజించి గురువునకు సమర్పింపవలయును. కవితాఫలమును పొందఁ గోరువారు ఈవిధముగ నాచరించినయెడల కవితాఫలమును పొందుదురు. ఈవిధముగ రామనామవ్రతము నాచరించినవాఁ డేయేకోర్కెలను గోరునో యవియన్నియును సఫలము లగుననియెనని శ్రీకృష్ణుఁడు చెప్పెనని చెప్పి యారామదాసు మఱల నిట్లనియె. శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! శ్రీకృష్ణుఁడు చెప్పిన విధముగ ధర్మరాజు రామనామవ్రతము నాచరించి మూఁడుమాసములలోపల మఱలఁ దనరాజ్యమును పొందును. మఱియు నంతకాలమునందు సద్గతిని పొందును. ఈవిధముగ నీకమీఁద జరుగఁబోవు విషయమును నీకుఁ దెలిపితిని. ఓశిష్యోత్తమా। రామనామ మహిమను విను మానవుఁడు పుత్రపౌత్రాది సుఖములను పొందును. ప్రతిదినమును మిగుల భక్తితో నానందరామాయణమునకు వ్యాఖ్యనుచేయువాఁ డిహపరలోకములయందలి సుఖములను పొందును. మఱియును ప్రతిదిన మానందరామాయణమునం దొకసర్గమునైనను, అర్ధసర్గమునైనను, పాదసర్గమునైనను, తొమ్మిదిశ్లోకములనైనను, ఒక్కశ్లోకమునైనను, అర్థశ్లోకమునైనను, పాదశ్లోకమునైనను, పఠించు మానవులు ముక్తిని పొందుదురు. అశ్వత్థమూలము, మునివృక్షమూలము, బృందావనము, పుణ్యస్థలము మస్కర భూసురాగ్రము, శ్రీరామసన్నిధి, సభ, విప్రబృందసన్నిధి, నదీతీరము, మొదలగు పుణ్యస్థలములయందు ఆనందరామాయణమును పఠించు మానవులు ధన్యులగుదురు. ఆనందరామాయణమును సంపూర్ణముగ నైనను, ఒకకాండమునైనను, ఒకసర్గమునైనను, ఒకశ్లోకమునైనను ప్రతిదినము వ్రాసి పూజించి బ్రాహ్మణునకు దానము చేయవలయును. ఈవిధముగ నిత్యమును చేయువాఁడు ప్రతిదినము సువర్ణముద్రికను దానము చేయుటవలనఁ బొందెడు ఫలమును పొందును. ఈవ్రతమువలె శ్రీరామునకు సంతోషమును కలుఁగఁ జేయునట్టి దానము మఱియొకటిలేదు. కావున నవశ్యముగఁ బ్రతిదిన మీదానము చేయవలయును. మఱియునో శిష్యోత్తమా! శ్రీరామునకు సంతోషము కలుగుటకొఱకుఁ దొమ్మిది తాంబూలములను తొమ్మిదిమంది బ్రాహ్మణులకు దానముచేయవలయును. ఇట్లుచేయుటకు శక్తిలేనివాఁ డొక తాంబూలమునైనను శ్రీరామునకు దానముచేయవలయును. తాంబూలము సంపత్కరమైనదనియును, శ్రీరామునకు మిగులఁ బ్రియమైనదనియును, తెలిసికొని యుండుము. సర్వకాల

ములయందును రాముని బూజించుట, రాముని స్మరించుట అను కార్యముల కంటె నెక్కుడగు కార్యమేదియును లేదని యెఱుంగవలయును రామనామము ను జపించువాక్కు, రాముని పూజించు హస్తమును, రామచరితముల విననట్టి చెవులు, రామతీర్థములు రామక్షేత్రములు మొదలగు వానిని గుఱించి నడచు నట్టి పాదములు, శ్రీరాముని జూచునట్టి నేత్రములును గలట్టి పురుషుఁడు ధన్యుఁ డనఁబడును. రామరామరామయని రామనామమును స్మరించువారు మహాపాత కులయినను ముక్తులగుదురు. ఓ శిష్యోత్తమా! రామనామమును, రామనామ మును జపించుటకుఁ దగినట్టి వాక్కును స్వాధీనమై యున్నను మానవులు మిగు ల భయంకరమగు నరకమును పొందుదురు. ఓశిష్యోత్తమా! శ్రీరామనామ మంత్రమని యెడు సంజీవిని మనస్సునందుఁ బ్రవేశించి యున్నయెడల హాలాహల మునందైనను, మృత్యుముఖమునందైనను, ప్రవేశించినప్పటికిని భయము కలు గనేరదని యెఱుంగవలయును. కూర్చుండునపుడును, నిద్రింపఁబోవునపుడును, భుజింపఁబోవునపుడును, క్రీడించునపుడును, ప్రయాణమును చేయునపుడును, మఱి యును సకలకార్యములయందును రామనామమును స్మరింపవలయును. ఓశిష్యో త్తమా! రామనామమే వినఁదగినదనియును, రామనామమే విచారింపఁదగిన దనియును, రామనామమే గానము చేయఁదగినదనియును, తెలియవలయును. స్వర్గవాసులగు దేవతలకు నమృతము కలిగియున్నవిధముగ భూలోకవాసులకు రామనామము కలిగియున్నదని యెఱుంగవలయును. గోపీచందన లిప్తాంగుఁడును, రామ ముద్రాంకితుఁడును, రామనామము నుచ్చరించువాఁడును, తులసీమాలి కను కంఠమునందు ధరించినవాఁడును, శంఖచక్రగదా పద్మములను ధరించిన వాఁడును, రామునియందే యుంచఁబడిన మనస్సుకలవాఁడును, అగుమానవుఁడు పరమధన్యుఁడని యెఱుంగవలయును. మఱియు నిట్టి పురుషుఁడే యీలోకము నందుఁ గొనియాడఁదగిన వాఁడనియు, చూడఁదగినవాఁడనియును, తెలియవల యును ఓశిష్యోత్తమా! శివునియందు భక్తినవలంబించి రాముని నిందించు మానవులు మహాపాపులగుదురు. రాముఁడే శివుఁడనియును, శివుఁడే రాముఁడని యును, శివరాములకు భేదమేమియు లేదనియును, తెలియవలయును. మఱియు ను రాముని హృదయము శంభుఁడనియును, శంభుని హృదయము రాముఁడని యును, తెలియవలయును. కావున శివరాములకుఁ గొంచెమైనను భేదమును గల్పింపఁగూడదు. రామయను రెండక్షరములను రేయింబగళ్లు జపించు మాన వునకు దేనివలనను భయములేదనియును జీవన్ముక్తుఁడగు ననియును, తెలియ వలయును. మఱియునో శిష్యోత్తమా! రామ ముద్రాంకితుఁడగు పురుషుని జూచి యమదూతలు సింహమునుజూచిన యేనుఁగులవలె దశ దిక్కులకును పరుగిడుదురు. లలాటము, హృష్ఠదేశము, కుక్షియొక్కయు భయ పార్శ్వములు,

జఠరము, హృదయము, రెండుభుజములు, మస్తకము, అను తొమ్మిదిస్థానముల యందును రామముద్ర నుంచవలయును. రామముద్ర మహాశ్రేష్ఠమైనదనియును, సర్వదోషముల నశింపఁజేయునట్టి దనియును, కావున గోపీచందనాదుల సర్వకాలములయందును దేహమునందు ధరింపవలసిన దనియును తెలియవలయును. రామముద్ర యెవ్వనిదేహమునందుఁ గలదో వానిని పాపము స్పృశింపదు. సర్వకాలములయందును రాముని స్తోత్రముచేయవలయును. సజ్జను లగువారు రామనామమునే జపించుచు రామనామమునే గానముచేయుచు, గాలము గడపు చుందురు. కవిత్వము వ్యాకరణయుక్తముగ నుండక పోయినను రామనామాంకితమై యుండెనేని పరిశుద్ధమైనదగును. ఓశిష్యోత్తమా! రామనా మాంకితమైన కవిత్వము మిగుల శ్రేష్ఠమైనదని యెఱుంగవలయును. ఓశిష్యోత్తమా! ఇంకొక్క విషయమును దెలిపెదను. సావధానుఁడవై వినుము. అశ్వత్థామ, బలిచక్రవర్తి వ్యాసుఁడు, హనుమంతుఁడు, విభీషణుఁడు, కృపుఁడు, పరశురాముఁడు, అను నేడ్గురును చిరజీవులు. అశ్వత్థామాంశ సంభూతులగు పురుషులు న్యాయార్జిత ద్రవ్యముచేత ధర్మమును దప్పక కలియుగమునందుఁ బ్రభుత్వమును జేయుదురని యెఱుంగవలయును. రామచరిత్రమును కవిత్వమునందుఁ జూపువారు వ్యాసాంశ సంభూతులని యెఱుంగవలయును. ఈ భూలోకమునందలి వీరులందఱును హనుమదంశ సంభూతులగుదురు. అట్టి మానవుల దఱును, చిరంజీవిత్వ సూచకులని యెఱుంగవలయును. శాంతులును, రామభక్తులునగు మానవులు విభీషణాంశ సంభూతులు. ధైర్యవంతులయి యుద్ధముచేయునట్టి మానవులందఱును గృపాచార్యాంశ సంభూతులని తెలియవలయును. క్రోధ సంయుక్తులగు వీరులు పరశురామాంశ సంభూతులని తెలియవలయును. చిరంజీవి యగు వ్యాసుఁడు వీఁడని భూలోకమునం దెట్లు తెలియనగునని యెదవేని చెప్పెదను వినుము. ఈ భూలోకమునందు గీర్వాణభాషతో కవిత్వముచేయు పండితులు వ్యాసాంశ సంభూతులని యెఱుంగవలయును. రామకృష్ణశివులను పూజించువారుకూడ వ్యాసాంశ సంభూతులనఁబడుదురు. రాజును, గణికను రాజసభను స్తోత్రముచేయువారు వ్యాసాంశసంభూతులని యెఱుంగవలయును. శ్రీరాముని చరిత్రములను స్తోత్రముచేయువారు వ్యాసాంశ సంభూతులనఁబడుదురు. ఓశిష్యోత్తమా! సర్వకాలములయందును శ్రీరాముని స్తోత్రముచేయువారు ముక్తిని పొందుదురు.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
యేడవసర్గము ముగిసెను.

—:(o):—

* వేదాదుల ఫలవర్ణనము. *

శిష్యోత్తముఁడవైన యోవిష్ణుదాసా! శిరోవ్యాహృతి సంయుతమగు గాయత్రి నూఱు వేదాక్షరములకుఁ దుల్యమైనదగును. నాలుగు నూఱుల పర్యాయములు గాయత్రి జపించుటవలనఁ గలుగు ఫలము ఆఱునూఱుపర్యాయములు మహాసూక్తమును పఠించినఁ గలుగుఫలముతోఁ దుల్యమగును. మఱియునుఁ గాయత్రీ పారాయణముచేతను నుపనిషత్పారాయణముచేతను నేఫలము కలుగునో యది కలుగును. పుణ్యసూక్తములన్నియును మహాపుణ్యము నిచ్చునవి యని చెప్పఁబడుచున్నవి. సంహితా పఠనమునలనఁ గలుగు ఫలముకంటె పదపాఠము వలనఁ గలుగు ఫలము ద్విగుణితమైనది. క్రమపాఠమువలనఁ ద్రిగుణాధిక్యమగు పుణ్యముకలుగును. జటాపాఠమువలన నంతకుఁ ద్రిగుణాధిక్యమైన ఫలము కలుగును. మహాభారతము వేదతుల్యమైనదని మునివరులచేఁ గీర్తింపఁబడినది. పురాణములను పఠించుటవలన వేదపఠన ఫలంబులో సగము ఫలము కలుగును. స్మృతులం జదివినఁగూడ నాఫలము కలుగును. మహాభారతమునందలి భగవద్గీతలును, నామసహస్రమును గాయత్రీ పారాయణమును పుణ్యము నొసంగుటలో గాని పాపమును నశింపఁజేయుటలో గాని సమానములు. పాఠమాత్రము వలనఁ గలుగు ఫలముకంటె అర్థజ్ఞానమువలనఁ గలుగు పుణ్యము నాలుగు రెట్లధికముగ నుండును లోకములోని సకల దానములలో భూమి దానము మహాదానమని చెప్పఁబడును. విద్యాదాన మాభూదానముకంటె పదిరెట్లధికమై యుండును. అనిన విని విష్ణుదా సిట్లనియె. ఓగురూత్తమా! సువర్ణదానమునకుఁ గాని సువర్ణేతరదానమునకుఁ గాని పాత్రుఁడెవ్వఁడు? బ్రాహ్మణుఁడైనను బ్రాహ్మణేతరుఁడైనను దాన పాత్రుఁ డెట్లగును? అనిన విని రామదాసు మఱల నిట్లనియె. ఓ శిష్యోత్తమా! గురుకులమునందు నివశించి భిక్షాన్నమును భుజించుచు పూర్ణముగ నొక శాఖను పఠించినవాఁడు శాస్త్రోక్తఫలమును సంపూర్ణముగఁ బొందునని యెఱుఁగవలయును. శిష్యునకు సంహితను జెప్పువాఁడు గాయత్రి యందలి ప్రత్యక్షరము నొక్కపర్యాయము పఠించుటవలనఁ గలిగెడు ఫలమును పొందును. పదపాఠమునందు దానిలో సగము ఫలమును, క్రమపాఠమున నందులో సగము ఫలమును పొందును. గాథా పాఠఫలము సంహితా పాఠఫలముకంటె రెండు రెట్లధికమగును. ఉపనిషత్పారాయణమువలన రెండింతలధికమగు ఫలము కలుగును. అధ్యయనము చేయుటవలనఁ గలిగెడు ఫలముకంటె కంఠపాఠమువలనఁ ద్రిగుణాధికఫలము కలుగును. లేఖ్యపాఠమువలన దానిలో సగము ఫలముకలుగును. అధ్యయనమును చేసియును కంఠపాఠము చేయఁజాలనివాఁడు అధ్యయనమాత్ర ఫలమును పొందును. ప్రజ్ఞ కలిగియుండియును అధ్యయనము చేసి మఱచినవాఁడును అనాస్థచే మఱచినవాఁడును, ప్రమాదముచే మఱచినవాఁడును

గార్దభత్వమును పొందును. పఠించి మఱచిన వేదాక్షరము లెన్నికలవో యన్ని వేల సంవత్సరములు నరకము ననుభవించును. అనంతరము తత్పాతకఫలము ననుభవించును. ముందుగ స్వశాఖను పఠించి పిమ్మట నన్యశాఖను పఠించువాఁడు గాయత్రియందలి ప్రత్యక్షరమును పఠించుటవలనఁ గలిగెడు ఫలము ననుభవించును. స్వశాఖను పఠించియును రామోత్కర్షను దెలియనివాఁడు సగము ఫలమును పొందును. రామభక్తియే మాత్రమును లేక వేదమును మాత్రము పఠించిన వాఁడు నాల్గవవంతు ఫలమునుఁ బొందును. షడంగములు, నాలుగు వేదములు, మీమాంసశాస్త్రము, న్యాయశాస్త్రము, పురాణము, ధర్మశాస్త్రము, అను నవి పదునాలుగు విద్యలని యెఱుంగవలయును. ఆయుర్వేదము, ధనుర్వేదము, గాంధర్వము, అర్థశాస్త్రము, అను నాలుగు నుపవిద్యలనియును, ఇవి యన్నియును చేరి పదునెనిమిది విద్యలనియును చెప్పఁబడును. శిక్ష, కల్పము, వ్యాకరణము, నిరుక్తము, ఛందస్సు, జ్యోతిషము, అను నాఱు నంగము లనఁబడును. ఈ యాఱంగములఁ బఠించువాఁడు సంహితాపాఠమువలనఁ గలిగెడు ఫలములో సగమును పొందును. వేదమునకు శిక్షయనునది ఘ్రాణమనియును, కల్పము హస్తములనియును వ్యాకరణము ముఖమనియును, నిరుక్తము శ్రోత్రములనియును, జ్యోతిషము నేత్రమనియును, ఛందస్సు పాదములనియు జెప్పఁబడును. శిక్షాకల్ప నిరుక్త ఛందస్సు లర్థజ్ఞానము కొఱకగు ననియును వానిని పఠించుటవలనఁ జతుర్గుణాధిక ఫలము కలుగుననియును, జ్యోతిశ్శాస్త్రమును బఠించుటవలన నర్థజ్ఞానమువలనఁ గలిగెడు ఫలము కలుగుననియును, గణితజ్ఞుఁడు సంహితాపాఠమువలనఁ గలిగెడు ఫలమును పొందుననియును తెలియవలయును జాతక ప్రశ్నములను మాత్రము తెలిసికొని యుండుటచేత ఫలమేమియు లేదనియును వేదాధ్యయనము చేయక జాతక ప్రశ్నములను మాత్రము తెలిసికొని గణితము నెఱుంగనివాఁడు నక్షత్రసూచకుఁడగును. అట్టి బ్రాహ్మణుఁడు దానమున కర్హుఁడు గాఁడనియును, సర్వకర్మములయందును, బహిష్కృతుఁడనియును తెలిసికొనుము. స్వల్పముగానైనను స్వశాఖను పఠింపక వేదాంగములయందును ఇతర శాస్త్రములయందును జ్ఞానము కలవాఁడుగూడ సకలకర్మముల విగర్హితుఁడగునని యెఱుంగవలయును. కొంచెముగనైనను స్వశాఖను పఠించిన పిమ్మట నుపనిషత్తులను పఠించువాఁడును, ఆయుపనిషద్జ్ఞానముకొఱకు శాస్త్రాంతరములను పఠించువాఁడును, ఎక్కుడు పుణ్యముగలవాఁడగును. జ్ఞానాధికుఁడు బ్రాహ్మణులయందుఁ బూజ్యుఁడనియును, వృద్ధుఁడనియును, చెప్పఁబడును. జ్ఞానాధిక్యముచేత పాత్రాపాత్రులను తెలిసికొనుము. జ్ఞానవంతుఁ డధికముగఁ బూజింపఁ దగినవాఁడగును. ఈలోకమునందు జ్ఞానమువలెఁ బావనమైన వస్తువు

మఱియొక్కటిలేదు. రాముఁడు జ్ఞానికి మిగులఁ బ్రియుఁడై యుండును. రామునకు జ్ఞానవంతుఁడును బ్రియుఁడై యుండును. నూఱుమంది పాఠకులలో వాదమునందు జయించువాఁ డొకానొకఁడేయై యుండును. కావున నట్టివాఁడే శ్రేష్ఠుఁడనఁబడును. వేదాదిసర్వవిద్యల నర్థజ్ఞానముకొఱకు వ్యాకరణశాస్త్రమును జదువువాఁడు వేదపాఠమువలనఁ గలుగుఫలమును పొందును. జ్ఞానాధిక్యముచేత వేదార్థజ్ఞానమువలనఁ బొందఁదగిన ఫలమును పొందును. కర్మబ్రహ్మములను దెలుపునట్టి మీమాంసాశాస్త్రము రెండువిధములుగ నున్నది. కర్మమీమాంసమును జదువువాఁడు వేదార్థజ్ఞానతుల్యమైన ఫలమును పొందును. బ్రహ్మమీమాంసమును జదువువాఁడు గాయత్రీ శతజపముగు ఫలములను పొందును. ఉపనిషదర్థమును దెలిసికొనుటకు న్యాయశాస్త్రమును పఠించువాఁడు వేదార్థజ్ఞానముఖ్యమగు ఫలమును పొందును. హేతువాదరతుఁడై యనఁగా తర్కశాస్త్రమును పఠించి బ్రహ్మజిజ్ఞాసయందుఁ బ్రవర్తింపనివాఁడు సృగాలజన్మమును పొందును. ఎన్నియక్షరములు తర్కశాస్త్రమునందుఁ బఠించునో యన్ని వేల సంవత్సరములు శునకజన్మమెత్తి దుఃఖములను పొందును. వైష్ణవము, మాత్స్యము, కౌర్మము, భాగవతము, ఆదిత్యము, గారుడము, స్కాందము, మార్కండేయము, బ్రహ్మము, బ్రహ్మాండము, లైంగము, బ్రహ్మవైవర్తము, భవిష్యోత్తరము, ఆగ్నేయము, పాద్మము, వామనము, వారాహము, వాయవ్యము, అను పదునెనిమిది పురాణములును మహాపురాణము లనఁబడును. ఈపురాణములు పదునెనిమిదియును రామాయణమువలనఁ గలిగినవి కావుననే రామాయణ మాదికావ్యమని చెప్పఁబడెను. ఓశిష్యోత్తమా! ఈపురాణములను పఠించుటవలన వేదపాఠమువలనఁ గలిగెడుఫలము కలుగును. పురాణములను వినుటవలన వేదపాఠమువలనఁ గలుగుఫలములో సగముఫలమును పొందును. పురాణముల యర్థమును వినుటవలన దశగుణాధిక పుణ్యముకలుగును. వక్తయగువాఁడు ద్విగుణాధిక పుణ్యమును పొందును. వ్యాఖ్యాతకుశతగుణాధికమగు పుణ్యముకలుగును. ఇతరములయిన యుపపురాణములను వివరించెదను. విష్ణుధర్మోత్తరము. బృహన్నారదము, భగవతీపురాణము, లఘునారదము, భవిష్యత్పర్వపష్ఠము, తంత్రము, భాగవతము, నారసింహము, రేణుకాపురాణము, తత్త్వసారము, వాయుప్రోక్తము, నందిప్రోక్తము, పాశుపతపురాణము, యమనారదసంవాదము, హంసపురాణకము, వినాయకపురాయణము, బృహద్బ్రహ్మాండ పురాణము, విష్ణురహస్యము, అను పదునెనిమిదియును ఉపపురాణము లనఁబడును. ఈపదునెనిమిది పురాణముల బఠించిన మహాపురాణమందలి ఫలములో సగముఫలము కలుగును. భారతము వేదతుల్యమైనది. అర్థజ్ఞానసహితముగ భారతమును జదువువాఁడు వేదపారాయణమువలనఁ గలుగు ఫలముకంటె నధికమగుఫలమును పొందును. భారతమునందలి భగవద్గీత

యును, విష్ణుసహస్రనామములును వేదపాఠముకంటె దశగుణాధికములని చెప్ప బడును. భగవద్గీతా విష్ణు సహస్రనామములను వినువాఁడు సగము ఫలమును పొందును. భారతమని యెడు నితిహాసము రామాయణమువలనఁ బుట్టినది. రామాయణ పారాయణమువలన వేదపారాయణమువలనఁ గలిగెడు ఫలము కలుగును. శ్రవణమువలన నందులో సగము ఫలముకలుగును. వ్యాఖ్యాతకు దశగుణాధిక ఫలముకలుగును. వాల్మీకిమునివరుని చేతఁ జెప్పబడినదియును శతఁ కోటి ప్రవిస్తరంబును అయిన రామాయణము మహామంగలదాయకము. వాల్మీకిమునివరుని చేఁ జేయఁబడిన రామాయణమువలననే నానావిధ రామాయణములు నిర్మింపఁబడియె. శేషభూతమగు రామాయణము ఇరువదినాలుగువేల శ్లోకములుగలదై యున్నది. యోగవాసిష్టము అధ్యాత్మము, వాయుపుత్రకృతము, నారదోక్తము, లఘురామాయణము, బృహద్రామాయణము, అగస్త్యోక్తము, సారరామాయణము, దేహరామాయణము, వృత్తరామాయణము, బ్రహ్మరామాయణము, భరద్వాజ రామాయణము, శివరామాయణము, జైమినిరామాయణము, శ్వేతకేతు రామాయణము, జటాయురామాయణము, రవిరామాయణము, పులస్తిరామాయణము, దేవీరామాయణము, గాధిజరామాయణము, సుగ్రీవరామాయణము, విభీషణరామాయణము. అని రామాయణము లనేకవిధములై యుండును. ఇన్నిటిలో ఆనందరామాయణము మిగుల మనోహరమైనది. ఇవ్విధముగ రామాయణము లనేకములుకలవు. ఆరామాయణములసంఖ్య యింతయనిచెప్ప నెవరికిశక్తికలదు ? రామాయణము శత కోటిగ్రంథ పరిమితికలదై యున్నది. సకలరామాయణములలో నానందరామాయణ మనునది శ్రేష్ఠమైయున్నది. ఓశిష్యోత్తమా ! ఈరామాయణమును పఠించుటచేతఁ గలిగెడు పుణ్యమును చెప్పెదను వినుము. శతకోటిపరిమితిగల రామాయణమును వినుటవలన నెంతపుణ్యముకలుగునో యందులో సగముపుణ్యమీయానందరామాయణమును పఠించుటవలనఁ గలుగును. వినుట వలనఁ గలిగెడు పుణ్యముకంటె పాఠమువలనఁ గలిగెడుపుణ్యము ద్విగుణాధికమై యుండును. వ్యాఖ్యానమును చేయుటవలన దశగుణాధికమగు పుణ్యము కలుగును. కావున సర్వకాలములయందు నీయానందరామాయణమును శ్రవణమననములను చేయవలయును. ఈ యానందరామాయణముతో సమానమైనది యొందును లేదు. సకలశాస్త్రములయందును పంచరాత్రాగమము మిగుల శ్రేష్ఠమైనది. పంచరాత్రాగమమును పఠించుటవలన భగవద్గీతా పారాయణమువలనఁ గలిగెడుఫలము కలుగును. భక్తులచేత నిర్మింపఁబడిన భారతీయకథను పఠించువాఁడు దశాంశఫలమును పొందును. ప్రాచీన గ్రంథాభిప్రాయములను విడిచి స్వయముగాఁ గల్పించిన కథచేత కావ్యమును చేయుటవలన సత్ఫలము లేకపోఁగా నష్టికవిగూఁద

దోషముకలవాఁడగును. కావున పురాణభారత రామాయణాది గ్రంథములయందలి కథనుఅనుసరించి కావ్యమునుచేయువాఁడు స్వర్గలోకవాసియగును. అట్టికావ్యమునం దెన్నియక్షరములుండునో యన్నివేలసంవత్సరములు స్వర్గలోకమునందు నివసించును. రామభక్తుఁడై పురాణములనుండి రామునికథను సంగ్రహించి కావ్యమును నిర్మించువాఁడు వ్యాసమూర్తియును, బృహస్పతిలోకమును పొందువాఁడునగును. పోషింపఁబడిన దౌహిత్రుఁడు, శిష్యుఁడు, ఆరామము, జలాశయము, సద్గ్రంథకరణము, అనునవి పుత్రులనఁబడును. అశ్వత్థామాదులీవిధముగ భూలోకమునందు జన్మించిరని యెఱుంగవలయును. రామభక్తులగు వారిచేతఁ జేయఁబడిన కావ్యాదులను భక్తితోఁ బఠింపవలయును. రామభక్తుల చేతఁ జేయఁబడిన కావ్యాదులను పఠించుటవలన భారతపాఠఫలమునందలి శతాంశఫలమును పొందును. రామభక్తులచేతఁ జేయఁబడిన కవిత్వమును నిందించువారు గాడిదలై పుట్టుదురు. అన్యదేశభాషలయందుఁ జేయఁబడిన రామాయణాది గ్రంథములను పఠించుటవలన భారతాది గ్రంథములవలనఁ గలిగెడు ఫలమునందు సహస్రాంశఫలము కలుగును. అట్టికావ్యములను నిర్మించువాఁడు శతాంశఫలమును పొందును. అట్టికావ్యములను వినువారును పఠించువారును సత్ఫలములను పొందుదురు. జీవికకొఱకు నరుని స్తోత్రముచేయువాఁడు ఫలమును పొందనివాఁడగుటయేకాక దోషము కలవాఁడగును. ఉన్మాదముచేత స్త్రీలను వర్ణించువాఁడు కుక్కయైపుట్టును. అట్టికావ్యమునం దెన్నియక్షరములుండునో యన్ని వేల సంవత్సరములు కుక్కయైయుండును. మన్వాదులు వేదార్థము ననుసరించియే స్మృతులను నిర్మించిరి. కావున మన్వాదిస్మృతులు నానాధర్మములను దెలుపుచున్నవి. మానవులలోఁ గొందఱుమాత్రమే వైదికకర్మలయం దధికారము కలవారైరి. పశుసములయిన మానవులుకొంద ఱవైదికములయిన మంత్రములయం దధికారము కలవారైరి. బ్రహ్మచారి, గృహస్థు, వానప్రస్థుఁడు, యతి, అనువారు భిన్నభిన్నములయిన ధర్మముకలవారైరి. ధర్మశాస్త్రము ననుసరించి ఏకర్మము నెప్పు డేవిధముగఁ జేయవలసినదియును తెలిసికొనవలయును. అకాలమునందును, అదేశమునందును చేయఁబడినదియును, అనధికారిచేతఁ జేయఁబడినదియు నగు త్యాగదానాదికము వ్యర్థమగును. ఇంతయగాక యధికమగు ప్రత్యవాయము (దోషము)ను కలిగించును. ఆవశ్యకమైన కార్యమును దప్పక చేయవలయును. స్మృతులయర్థము వేదార్థజ్ఞానమువలన నధికముగఁ దెలియును. ఆయుర్వేదము ఋగ్వేదమున కుపవేదమనియును అయ్యది పరులకుపకారము చేయుటకొఱకును, చదివినవాని కారోగ్యమునుకలిగించుటకొఱకు నుపయుక్తమగుచున్నది. మఱియు నీయథర్వణవేదమును ద్విజాదులు జీవికకొఱకుఁ బఠింపఁదగును. బ్రాహ్మణుఁడు, రోగి, క్షీణితుఁడు, అనువారల నుపచారముచేత జీవింపఁజేయవలయును. అట్లు

చేయువానికి బ్రహ్మహత్యా తుల్యమైనపాపము నశించును. ఉపవిద్యాచతుష్టయమును జీవికకొఱకు పఠించువాఁడు ఈలోకమునందు మాత్రము ఫలమునుపొందునుగాని పరలోకమునందు ఫలమునుపొందఁడు. రోగసముద్రమునందు మునిగినవాని నుద్ధరించు పుణ్యాత్ముఁడు సర్వోత్తముఁడనఁబడును. అట్టివాఁడు సకలజనులచేతను పూజింపఁదగినవాఁడు. దరిద్రుఁడు జ్యోతిష్కులను, ఆయుష్యము లేనివాఁడు వైద్యులను, గతమైనసంపద గతమైనయాయుష్యము అనునవి కలవాఁడు బ్రాహ్మణులను నిందించును. గాంధర్వవిద్య నభ్యసించి రామునకెదుట భక్తియుక్తుఁడై గానమును చేయువాఁడు మిగులశ్రేష్ఠమగు గంధర్వలోకమును పొందును. ధనుర్వేదము, దండనీతిఅనునవి బ్రాహ్మణులకు జీవికను కలుగఁజేయు విద్యలని యెఱుఁగవలయును. ఈవిద్యలు రెండును క్షత్రియులకు వేదార్థజ్ఞానమువలనఁ గలిగెడుఫలమును కలుగఁజేయును. జ్ఞానమును సంపాదించుకొనుటకుఁ దగినప్రయత్నమును చేయవలయును. అన్నమునకు నాకలిగొన్నవాఁడు పాత్రుఁడగును. ద్రవ్యమును దానముచేయునపుడు మాత్రము పాత్రాపాత్ర విచారమును చేయవలయును. తగినపాత్రయందుఁ జేయఁబడిన దానము మిగులఫలమును కలుగఁజేయును. జ్ఞానాధిక్యమువలన నధికమగు పుణ్యముకలుగును. రామభక్తుఁడు పాత్రుఁడనియును, రామునియందు భక్తిలేనివాఁడే యపాత్రుఁడనియును తెలియవలయును. రాముని ద్వేషించువాని దర్శనాలాపనాదికమును విడువవలయును. రామభక్తుల సాంగత్యముకలవాఁడు మిగుల పాత్రుండనఁబడును. శక్తికిఁదగని దానము ఫలమునీయఁజాలదు. విత్తశాఠ్యముచేతఁ జేయఁబడినదానము దానముకానేరదు. యుక్తములగు దేశకాలములయందుఁ జేయఁబడిన దానము ఫలదాయకమగును. జ్ఞానవంతునిచేతఁ జేయఁబడినకర్మము పుణ్యమును కలుగఁజేయును. జ్ఞానవంతునిచేతఁ జేయఁబడినకర్మము అజ్ఞానిచేతఁ జేయఁబడిన కర్మముకంటె నధికమగు ఫలమును కలుగఁజేయును. పాపమును కలుగఁజేయునట్టి కర్మమైనను జ్ఞానిచేతఁ జేయఁబడినపుడు అజ్ఞానిచేతఁ జేయఁబడిన పాపకర్మముకంటెఁ దక్కువయగు ఫలమును కలుగఁజేయును. జ్ఞానమధికమైనకొలఁదిని పాపమునశించును. వృద్ధినిపొందిన యగ్నికట్టెలను గాల్చినవిధమున జ్ఞానము సకలపాపములను నశింపఁజేయును. బంగారమున కగ్నిసంయోగముచేత వర్ణాధిక్యమేర్పడినట్లు మానవునకు జ్ఞానాధికతచేతఁ బుణ్యమధికమగును. పాపకృత్యములచేతఁ బాపమధికమగును. ధర్మాధర్మవిచారము మిగుల సూక్ష్మమైనది. కావున సూక్ష్మబుద్ధిచేత విచారింపవలయును. తగినయధికారము కలిగియుండియును జ్ఞానమునందు ప్రయత్నముచేయనివాఁడు పశువై జన్మించును. బ్రాహ్మణునకు జ్ఞానాధ్యయనములవలన పుణ్యమధికమగును. ఓశిష్యోత్తమా! నీవడిగినవిషయమును స్వల్పముగఁదెలిపితిని. ధర్మములనేకములుకలుగును. పాపశాంతికొఱకు నక్కడక్కడ చెప్పఁబడినవిధముగఁ

ప్రాయశ్చిత్తాదుల నాచరింపవలయును. ఓశిష్యోత్తమా! ఈవిషయము భక్తుఁడగువానికిదప్ప నితరులకు దెలుపఁగూడదు. కావున నీవిషయమును సాధుజనులకుమాత్రము తెలుపవలఁగును.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
యెనిమిదసర్గము ముగిసెను.

——:(o):——

* { రాముని రెండుమాసముల పదునైదు
దినములును పూజింపవలయుననుట. } *

శ్రీగురూత్తమా! రామదాసా! శ్రీరామునకుఁ బూజ యేకాలమునందు విశేషముగఁ జేయఁదగునో యాకాలమును దెలిపి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమని విష్ణుదాసుఁ డడిగిన రామదాసు మఱలనిట్లనియె. ఓశిష్యోత్తమా! మిగులపుణ్యమును గలిగించునట్టి కాలమును జెప్పెదను వినుము. మాఘశుద్ధ పంచమీతిథి పుణ్యతిథియని ముల్లోకములయందును ప్రసిద్ధమైయున్నది. అది మొదలుకొని రెండు మాసముల పదునైదుదినములు మహోత్సవములచేత శ్రీరాముని పూజింపవలయును. మాఘబహుళ చతుర్థి మొదలుకొని చైత్రశుద్ధ నవమివఱకుగల యెనుబది యొక్కదినమును శ్రీరాముని ఫలాహారియై పూజించుచుండవలయును. మఱియు నిప్పుడు చెప్పినంతకాలము సీతారాములను బూజించి వాహనారూఢులనుగాఁ జేసి భేరీదుందుభినిర్ఘోషములును మహావాద్యములును, వారస్త్రీల నృత్యగీతములును, ఛత్రచామర తోరణములును, నానావిధ పుష్పవర్షములును, నానావిధ స్తోత్రపాఠములును, నానావిధ పరిమళద్రవ్యములును, నానావిధ మంగళద్రవ్యములును, మఱియు ననేకములు చెలంగుచుండఁగ నుత్సవములను జేయవలయును. ఇట్లు పరమోత్సవములను జేయుచు సహకారారామములలోనికి సీతారాములను దోడ్కొనిపోయి యందలి సహకారవృక్షము మూలమునందుఁ గట్టఁబడిన యుయ్యెలయందుఁ బ్రవేశపెట్టవలయును. నాగవాహనము, పుష్పకము, శేషవాహనము, గుఱ్ఱపువాహనము, రథము, గరుడవాహనము, సింహాసనవాహనము, శిబిక (పల్లాకి) అను తొమ్మిదివాహనములలో నేవాహనముచేతనైనను సీతారాముల కుత్సవము చేయవలయును. వల్లీపుష్పములచేత నిండిన వృక్షములతోఁ గూడిన సహకారవనమధ్యమునందలి భూమిని చందనాదులతో నలది పుష్పములచేత నాచ్ఛాదనముచేసి యాభూమిని నానావిధములయిన వస్త్రాదులచేత నలంకరింపవలయును. అంతట నక్కడ సువర్ణసింహాసనముపైచి శ్రేష్ఠమైనయుయ్యాల

నుంచవలయును. ఆయుయ్యేలను చూతవృక్షశాఖకుఁగట్టి దానియందు సీతారాములనుంచి పూజింపవలయును. అప్పుడు నానావిధపుష్పములచేత షోడశోపచారపూజలను చేయవలయును. అంతట సుగ్రీవాద్యులనుగూడఁ బూజింపవలయును. మఱియును వేశ్యాంగనలచేత నృత్యమునుచేయింపవలయును. అంతట గాననృత్యనాట్యవాద్య ధూపదీపాదులను శ్రీరామునకు సమర్పింపవలయును. అనంతరము శ్రీసీతారాములను చామరాదులచేత విసరవలయును. ఇట్లు నానావిధములయిన యుత్సవములఁజేసి మఱల సీతారామాదులను పూజించి గృహమునకుఁ దీసికొనిపోవలయును. అట్లు గృహమునకుఁ దీసికొనివచ్చిన వెనుక కుంభదీపార్తికాదులచేత శ్రీరామున కుత్సవము చేయవలయును. ఇట్లు రెండుమాసముల పదునైదు దినములు శ్రీరాముని పూజింపవలయును. సీతారాములను సహకారవనమునకుఁ దీసికొనిపోవునపుడు కస్తూరీతిలకాగులచేత నలంకారములు చేయవలయును. ఓశిష్యోత్తమా! ఈవిధముగ డోలాపూజను దెలిపితిని. ఇంకను జెప్పఁదగిన విశేషములను జెప్పెదను వినుము. వసంతకాలపూజ ప్రారంభమగుటకు ముందుదినమునందు గణనాయకుని పూజింపవలయును. మాఘశుక్ల చతుర్దశియందు నక్తవ్రతమునాచరించి ఢుండియను దేవునకుఁ బూజనుచేయవలయును. అట్లు మాఘశుక్ల చతుర్థియందు విఘ్నరాజునుపూజించి జాగరమును చేయవలయును. కుందచతుర్థియందు కుందపుష్పములచేత శ్రీరాముని పూజింపవలయును. మాఘశుక్ల పంచమి శ్రీపంచమి యనఁబడును. ఆపంచమీతిథియందు రమానాథుఁడగు శ్రీరామచంద్రుని బూజింపవలయును. మాఘశుక్లచతుర్థియందు సంపదకొఱకును మాఘశుక్లపంచమియందు సంపత్సమృద్ధికొఱకును శ్రీరాముని పూజింపవలయును. శ్రీరాముని సహకారవనములోనికిఁ బోయి చూతవృక్షముక్రిందవైచిన యుయ్యేలయందు శ్రీరామునుంచి పూజింపవలయును. అంతట చైత్రమాసము పుట్టఁగానే ప్రతిపత్తిథియందు ముఖ్యములగు కార్యములను నెరవేర్చి యనంతరము పితృదేవతలను సంతర్పింపవలయును. అంతట సర్వదుఃఖోపశాంతికొఱకు శ్రీరాముని యుయ్యేలయున్నభూమికి నమస్కారమును చేయవలయును. పిమ్మట భూదేవినిప్రార్థించి మిగులఁ బుణ్యాకరమైన ప్రతిపద్దినమునందు కాలోచితకృత్యములను నెరవేర్చి స్నానమును చేయవలయును. అట్లుచేసినవానికిఁ గొంచెమైన నాధివ్యాధులు కలుగనేరవు. వసంతకాలము ప్రాప్తమైన ప్రతిపత్తిథియందు చూతపుష్పమును భుజించువాఁడు సుఖవంతుఁడగును. మాఘశుక్ల పంచమియందుఁగూడ చందనసహితమగు చూతపుష్పమును భక్షింపవలయును. చూతకుసుమభక్షణముచేత మానవులు కలకంఠస్వనము కలవారగుదురు. ఇటులనే చైత్రకృష్ణచతుర్దశియందుఁగూడ చందనసహితమైన చూతపుష్పమును భుజింపవలయును. అనంతరమందు సీతారాములను పూజించి మూఁడుదినములు నానావిధములయిన

యుత్సవములు చేయవలయును. మఱియును చైత్రకృష్ణ పంచమియందు నానావిధ మంగలద్రవ్యములచేత చిత్రితములయిన వస్త్రములను ధరించి నానావిధ సుగంధతైలాదులచేత నభ్యంగనమును చేయవలయును. అంతట సీతారాములకుఁగూడ శుభకరములయిన తీర్థోదకాదుల చేతస్నానాద్యుపచారములను చేయించి వస్త్రాద్యాభరణములను సమర్పింపవలయును. అనంతరము నానావిధములయిన దానములనుచేసి సుగంధద్రవ్యముల నెల్లవారికి నుపయోగించి బ్రాహ్మణుల కిష్టాన్నములచేత తృప్తిని కలిగింపవలయును. ఇట్లు వసంతకాలమునందలి ప్రథమపంచమియందు భోజనాదులను జేయవలయును. వసంతపంచమి మిగులఁ బావనమైనదనియును, పుణ్యాకరమైనదనియును చెప్పఁబడును. ఇట్లు ప్రతి సంవత్సరమునందలి మాఘశుక్ల పంచమియందు పూజను ప్రారంభించి వైశాఖ శుక్లపంచమివఱకును జేయవలయును. మఱియును ప్రతిపక్షమునందలి నవమియందును విశేషముగ బూజింపవలయును. చైత్రశుక్లపంచమియందు పూజకుండగువాఁడు ముందుగ నభ్యంగస్నానమునుచేసి యనంతరము సీతారాముల కభ్యంగమును చేయవలయును. ప్రతిసంవత్సరమునందలి వసంతాదిమ పంచమియందు ఈవిధముగఁ జేయనివాఁడు నరకమును పొందును. ఫాల్గునమాస మతిక్రమించి చైత్రమాసము ప్రాప్తించినతోడనే పుణ్యదినమునందు ప్రపాదానమును చేయవలయును. అరణ్యము, నిర్జలప్రదేశము, మార్గము, అను స్థలములయందుఁ జేయఁబడిన ప్రపాదాన మధికముగ పుణ్యమును కలుగఁజేయును. ప్రపాదానమువలన పితృదేవతలు తృప్తిని పొందుదురు. చైత్రమాసము మొదలుకొని నాలుగు మాసములు ముగియువఱకును విడువక జలదానమును చేయవలయును. ఈవిధముగఁ బ్రపాదానమును జేయుటకుఁ దగినసామర్థ్యము లేనివాఁడు ప్రతిదినము తనగృహమునందే బ్రాహ్మణులకు జలకుంభదానమును చేయవలయును. ఇట్లు చేయుటచేత సకలమనోరథములును సిద్ధించును. ఇప్పుడు చెప్పఁబడినరీతిచేత ధర్మకుంభము నెవ్వఁడిచ్చుచున్నాఁడో యట్టివాఁడు ప్రపాదానము చేసినందువలనఁ గలిగెడు పుణ్యమును పొందును. శుక్లపక్షమునందలి తృతీయయందు సీతారాములను పూజింపవలయును. కుంకుమ, అగురు, కర్పూరము, మణులు, వస్త్రములు, సుగంధములు, స్రగ్గంధధూపదీపములు మొదలగువానిచేత విశేషముగ సీతారాములను పూజించి యాందోళికోత్సవములను చేయవలయును. వసంతమాసమునందలి శుక్లతృతీయయందు స్త్రీలతోఁగూడ సౌభాగ్యశయనమును చేయవలయును. మఱియును పుత్రసుఖేచ్ఛచేత స్త్రీలతోఁగూడఁ గ్రీడింపవలయును. ఓశిష్యోత్తమా! మఱియొకవిశేషమును చెప్పెదను వినుము. చైత్రమాసమునందలి శుక్లపక్షతృతీయయందు స్నానమునుచేసి చిత్రవిచిత్రమైన మృన్మయదుర్గమును రచింపవలయును. అనంతర మక్కడ పదునెనిమిది విధములైన

ధాన్యములను జల్లవలయును. మఱియును మిగులశుభకరములయిన పుష్పవృక్షములనుగూడ వేయవలయును. నానావిధములయిన జలయంత్రములను నిర్మింపవలయును. అంతట నాలుగుద్వారములు నిర్మించి మునుపటివలె మంచాదికమును నిర్మింపవలెను. మఱియును మునుపటివలె సీతారామాదులకుఁ బూజలుచేయవలయును. అంతట దుర్గోపరిభాగమునందు ఘటమునుంచి పుష్పగుంభితమునుచేసి యుయ్యెలనుంచి యాయాఘటపృష్ఠమునందు సువర్ణమయమును రజితమయమును నగు సీతారామమూర్తిని స్థాపింపవలయును. ఈవిధముగ డోలికయందుంచి యొక్కమాసము కాలముత్సవములను చేయవలయును. కొందఱీదినములయందు పార్వతీ పరమేశ్వరులనుగూడఁ బూజింపవలయును. రామునిహృదయము శంభువనియును, శంభునిహృదయము రాముండనియును తెలియవలెను. సీతాహృదయము గౌరియనియును గౌరీహృదయము సీతయనియును చెప్పఁబడియె. శివరాములకును, గౌరీసీతలకును భేద మించుకైనను లేదు. కావున వారికి భేదమెంచువాఁడు రౌరవమనియెడు నరకమును పొందును. కావున చైత్రశుద్ధతృతీయయందు సీతారాములను బూజింపవలయును. సువర్ణాదులచేత సీతారామాదుల విగ్రహములను జేయుటకు శక్తిలేనివాఁడు తామ్రముచేతనైనను, దారువుచేతనైనను నిర్మింపవలయును. ఇట్లునుచేయుటకు వీలులేనిచోట పాషాణముచేతఁ జేయవలయును. అంతట ప్రతిదినమును మంగలద్రవ్యములచేత స్త్రీలతోఁగూడుకొనినవాఁడై సీతారాములను బూజింపవలయును. సీతాతీర్థమునందు నెలదినములు స్త్రీలతోఁగూడ స్నానముచేయవలయును. అక్కడనున్న సీతాతీర్థములు మిగులఁ బావనములయినవని తెలియవలయును. చైత్రశుక్లతృతీయ మొదలుకొని వైశాఖశుక్లపక్షమునందలి యక్షతదియవఱకును సీతానిమిత్తముగ స్త్రీలతోఁగూడ స్నానమును చేయవలయును. అంతట నక్షతృతీయయందు స్త్రీలతోడ నభ్యంగనస్నానము చేయవలయునును. ఆదినమునమాత్రము స్త్రీలతో నభ్యంగనస్నానము చేయవచ్చునుగాని యితరదినములయందు స్త్రీలతోఁగూడ నభ్యంగనస్నానము చేయఁగూడదు. ఆనెలదినములును సీతామహాదేవికెదుట నానావిధములయిన యుత్సవాదులను జేయవలయును. మఱియును ప్రతిదినమును సువాసినీపూజయును చేయవలయును. మఱియును సువాసినీ స్త్రీలకు వాయనదానములను చేయవలయును. ఈవిధముగఁ బ్రతిదినమును చేయుటకు శక్తిలేనియెడల నొక్కదినమునందైన నీవిధముగఁ జేయవలయును. ముప్పదిదినములవఱకు సువాసినులకు భోజనముపెట్టవలయును. మఱియును సువాసినీస్త్రీలకు నానావిధములయిన యలంకారములను దానముచేయవలయును. ఇవ్విధముగఁ జేసినయెడల భర్తకాయుష్యము వృద్ధియగును. ఈరీతిని నెలదినములవఱకును శీతలోదకస్నానమునుచేసి యక్షతృతీయయందు విశేషముగ ముప్పదిమంది సువాసినీస్త్రీలకుఁ

బూజను చేయవలయును. అనంతరము మృష్టాన్నదానము చేయవలయును. అంతట గురుభార్యను బూజించి యామెను గృహమునకుఁ బంపవలయును. ఓశిష్యోత్తమా! ఇంకొకవిశేషమును జెప్పెదనువినుము. అశోకపుష్పకలికలచేత చైత్రశుక్లాష్టమీ దినమునందు మహామంగలపూర్వకముగ సీతారాములను పూజించి పునర్వసునక్షత్రమునందు ఎనిమిదశోకకలికలను భక్షింపవలయును. చైత్రమాసమునందలి శుక్లపక్షాష్టమియందు అశోకకలికలను భక్షించునపుడు "చైత్రేమాసిసితాష్టమ్యాం నతేశోకమవాప్నుయుః । త్వామశోకకరాభీష్ట మధుమాససముద్భవం । పిబామిశోకసంతప్తో మా మశోకంసదాకురు" అను మంత్రమును, పఠింపవలయును. ఈవిధముగఁ బ్రాతఃకాలమునందుఁ జేసి నయెడల వాజపేయఫలమును పొందును. పునర్వసూనక్షత్రయుక్తమైన చైత్ర శుక్లనవమియందు గ్రహపంచకము స్వోచ్ఛయందుండఁగా కటకలగ్నమునందు శ్రీరాముఁ డవతరించె. కావున చైత్రశుక్లనవమియందు జాగరములను చేయవల యును. చైత్రశుద్ధనవమియందలి మధ్యాహ్నకాలమునకు పునర్వసూనక్షత్రము కలిగియుండెనేని అట్టితిథి మహాపుణ్యాకరమైనదని యెన్నవలయును. ప్రతినవమి యందు నుపవాసము చేయవలసినదియని యార్యులు చెప్పుదురు. కావున సర్వ విధములచేతను నవమీవ్రతము చేయవలయును. శ్రీరామనవమి కోటిసూర్య గ్రహణములకంటె నధికమైనది. కావున నాదినమునందు పితృదేవతలనుద్దేశించి యుపోషణజాగరణములను చేయవలయును. మఱియును బ్రహ్మజ్ఞానమును పొందఁ దలంచినవారుకూడ శ్రీరామనవమీవ్రతమును చేయవలయును. ఈ శ్రీరామ నవమీవ్రతము సకలజనులకు నాచరింపఁదగినదై యున్నది. మఱియుసిద్ధర్మ మెల్ల వారికిని భుక్తిముక్తులను కలుగఁజేయుటయందుఁ దగినసామర్థ్యముకలదై యున్నది. అపరిశుద్ధుఁడును, దుష్టుఁడును అయినను ఈ శ్రీరామనవమీ వ్రతమును చేయు వాఁడు సకలభూతములకును పూజ్యుఁడగును. లోకములో నేపురుషుఁడుగాని మోహితుఁడై శ్రీరామనవమినాడు భోజనమునుచేసెనేని మిగులభయంకరము లయిన కుంభీపాకనరకములయందుఁబడి దుఃఖమునుపొందును సకలవ్రతములలో నుత్తమమగు శ్రీరామవ్రతమును వదలి తక్కినవ్రతములనుచేయువాఁ డావ్రత ములవలనిఫలమును పొందఁడు. ఓశిష్యోత్తమా! శ్రీరామవ్రతమును చేయు వాఁడు ఆచార్యుని ముందుగఁ బ్రార్థించి యష్టదిక్కులను బూజించి రామతో భద్రమునందు సీతారామవిగ్రహములను స్థాపించి శ్రీరాముని స్మరించుచు సంక ల్పమును చేయవలయును. అంతట నా శ్రీరామనవమియందు రామారాధన తత్పరుఁడై తొమ్మిదియామములయందును ఉపవాసమునుచేసి శాస్త్రోక్తప్రకార ముగఁ బూజించి శ్రీరామప్రీతికొఱకు రామభక్తుఁడగు బ్రాహ్మణునకుఁ బ్రతి మాదానమును చేయవలయును, ఇట్లుచేయువాని కనేకజన్మములయందలి పాప

ములు నశించును. ఓశిష్యోత్తమా! సీతారామమూర్తిని రెండుపలముల బంగారముచేతఁ జేయఁబడిన సింహాసనమునందుంచి దానమునుచేయవలయును. ఇట్లు చేయుటకు శక్తిలేనివాఁడు శక్త్యనుసారముగ సీతారామవిగ్రహాదులను చేయవలయును. విత్తశాఠ్యమును చేయఁగూడదు. ఆరామవిగ్రహమునకుఁ జుట్టును భరతలక్ష్మణాది విగ్రహములనుగూడ నిర్మింపవలయును. అంతట పంచామృతస్నానాదికమును సమర్పింపవలయును. అశోకపుష్పముల నొసంగవలయును. రావణునిజంపుట,ధర్మమును స్థాపించుట, రాక్షసులను సంహరించుట, దైత్యులను నశింపఁజేయుట, సజ్జనులను గాపాడుట, దుర్జనులను శిక్షించుట అనునిమిత్తములను ముందునిడుకొని శ్రీరాముఁడు భూలోకమునం దవతరించె. ఓశిష్యోత్తమా! పగటియందు శాస్త్రోక్తప్రకారముగ సీతారామాదులకుఁ బూజాదులనుచేసి రాత్రియందు జాగరణమును చేయవలయును. అంతట మఱునాటి ప్రాతఃకాలమునందు స్నానసంధ్యాదికమును సమాప్తినిపొందించి శాస్త్రోక్తప్రకారముగ సీతారామాదులను పూజింపవలయును. అనంతరము మూలమంత్రముచేత హోమమును చేయవలయును. ఆహోమమును పూర్వోక్తముగ మండపమునందు లౌకికాగ్నిని సంపాదించి యాజ్యముచేతనైనను పాయసముచేతనైనను హోమము చేయవలయును. అంతట భక్తిచేత నాచార్యునిపూజించి సువర్ణప్రతిమాదానము చేయవలయును. ఈవిధముగఁ జేసినయెడల బ్రహ్మహత్యాది పాపములుపోవును. ఓశిష్యోత్తమా! ఇంకొక్కవిషయమును తెలిపెదను. చైత్రశుక్లపక్షైకాదశియందు శ్రీరాముని నాందోలికయందుఁబెట్టి పూజింపవలయును. మఱియు నయ్యేకాదశియందు వైష్ణవులతోఁగూడ నాందోలికోత్సవమును చేయవలయును. చైత్రశుక్లద్వాదశియందు శ్రీరామునకు దమనోత్సవమును చేయవలయునని బోధాయనాదులు చెప్పిరి. చైత్రశుక్లద్వాదశియందు దమనోత్సవమును చేయనివాఁడు అధోలోకమును పొందును. అనంతరము చైత్రశుక్లపూర్ణిమయందు భక్తిచేత శ్రీరాముని పూజింపవలయును. చైత్రశుద్ధపూర్ణిమ చిత్తానక్షత్రముతోఁగూడుకొని యుండెనేని యయ్యది మిగులఁబుణ్యకరమైన తిథియనఁబడును. అట్టితిథియందు స్నానదానాదులను జేసినయెడల నత్యధికమైన పుణ్యముకలుగును. మఱియు నోశిష్యోత్తమా! మందభానుగురువాసరములతోఁ గూడుకొనిన చిత్తాపూర్ణిమయందుఁ జేయఁబడిన దానాదులవలన నశ్వమేధాది యాగములను చేయుటవలనఁ గలిగెడుపుణ్యము కలుగును. చైత్రస్నానోద్యాపనముఁగూడ చైత్రపూర్ణిమయందే చేయవలసినదని యార్యులు పలుకుదురు. సంవత్సరకాలము ముగియువఱకును చేసినపూజ సఫలమగుటకొఱకు చిత్తాపూర్ణిమయందు సకలదేవతలను దమనముచేతఁ బూజింపవలయును. అంతట వైశాఖకృష్ణపంచమియందు సీతారాముల నాందోలికయందుంచి బంధువులతోఁ గూడుకొనినవాఁడై మహో

త్సవమును చేయవలయును. మఱియు నా వ్రతమున కుద్యాపనమును వైశాఖ మాసమునందే చేయవలయును. ఎట్లనిన:—వైశాఖకృష్ణచతుర్దశియం దుపవాసమును చేసి పరిశుద్ధమగు ప్రదేశమునందు మండపాదికమును నిర్మించి రామలింగాత్మకమగు భద్రపీఠమునందు ధాన్యరాశినిపోసి మిగులశ్రేష్ఠమగు జలకుంభమును స్థాపింపవలయును. అంతట నాకలశమునందు నూతనవస్త్రమునుంచి యాందోళికయందుంచిన సీతారాములను పూజింపవలయును. ఆసీతారామ విగ్రహమును ఒకపలము బంగారముచేత నిర్మింపవలయును. అంతట నారాత్రియందాసీతారాములను నానోపచారములచేతఁ బూజించి జాగరణమును చేయవలయును. మఱియును నృత్తగీతవాద్యాదులను పురాణశ్రవణాదులను చేయవలయును. అంతట మఱునాటిప్రాతఃకాలమునందు సీతారాములను పూజించి తిలాజ్యపయస్సులచేత సహస్రహవనమునుచేసి క్షీరతర్పణమును చేయవలయును. పిమ్మట గురువును వస్త్రాదులచేతఁ బూజించి శ్రీరాముని ప్రార్థించి యాసీతారాముల విగ్రహమును గురునకు సమర్పింపవలయును. అంతట గురునకు భోజనమునుగల్పించి సుహృన్మిత్రాదులతోఁగూడ భుజింపవలయును. ఓశిష్యోత్తమా! ఈవిధముగ రామునకు సంతోషముకలుగుటకొఱకు వసంతపూజను చేయవలయుననినవిని విష్ణుదాసు మఱల నిట్లనియె. ఓగురూత్తమా! వాసంతికపూజను ఏకోర్కెచేత నెవనికిఁ బూజనుసలుపవలయునో యావృత్తాంతమును సర్వమును జెప్పి నన్నుఁ గృతార్థునిజేయుమనిన రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! నీవుచక్కఁగఁ బ్రశ్నమునుచేసితివి. నీవడిగినవిషయమును దెలిపెదను. సావధానమనస్కుఁడవై వినుము. బ్రహ్మవర్చస్కాముఁడు బ్రహ్మను, వీర్యకాముఁడు రుద్రుని, అన్నాదికాముఁడదితిని, స్వర్గకాముఁడు దేవతలను, రాజ్యకాముఁడు విశ్వేదేవతలను, ఆయుష్కాముఁ డశ్వినీదేవతలను, పుష్టికాముఁడు భూదేవిని, ప్రతిష్ఠాకాముఁడు రోదసీలోకమాతలను, రూపకాముఁడు గంధర్వులను, స్త్రీకాముఁడప్సరస్త్రీలగు నూర్వశ్యాదులను, సర్వాధిపత్యకాముఁడు పరమేష్ఠిని, యశస్కాముఁడు యజ్ఞుని, కోశకాముఁడు ప్రచేతసుని, విద్యాకాముఁడు గిరిశుని, సుదాంపత్యకాముఁడు మానతులను, ధర్మార్థి యుత్తమశ్లోకుని, రక్షాకాముఁడు పుణ్యజనులను, ఓజస్కాముఁడు మరుద్గణములను, రాజ్యకాముఁడు మనుదేవతలను, మారణకృత్యకాముఁడు నిరృతిని, కామకాముఁడు సోముని, నిష్కాముఁడు పరమపురుషుని యజింపవలయును? అకాముఁడు మోక్షకాముఁ డనఁబడును. అప్పుడు తీవ్రమగు భక్తియోగముచేత శ్రీరాముని యజింపవలయును. రామునకుఁ దుల్యుఁడగు దేవుఁడు భూతకాలమునం దుండెననియును, భవిష్యత్కాలమునందుఁ గలుగుననియును చెప్పఁదగదు. కావున సర్వవిధములచేతను ప్రయత్నించి శ్రీరాముని పూజింపవలయును. ఓశిష్యోత్తమా! శ్రేష్ఠములగు వస్తువులను

చెప్పెదను వినుము, రుక్మము, రత్నము, రథము, రామలు, రాక్షసుఁడు, రజతము, రజస్సు, రక్ష, రణము, రమ, రక్తము, రజకుఁడు, రాగరామఠములు, రాజ్యము, రోగము, రవి, రాత్రి, రజస్వల మొదలగుపదార్థము లనేకములు శ్రేష్ఠము లయియున్నవి. రుక్మము పీతవర్ణముగలదియును మిక్కిలి వెలకలదియునై యున్నది. రత్నము రమ్యమును, దుర్లభమునై యున్నది. రథము శ్రేష్ఠమైన యానమైయున్నది. ఈలోకమంతయును స్త్రీమయము. రాక్షసుఁడు దేవభయదుఁడు. రజతము మిగుల దుర్లభమైయున్నది. రజస్సు సాక్షాత్పరమాణుస్వరూపమై యున్నది. రక్ష సంరక్షణకారియగును. రణము జయకరమైనదగును. రమ దుర్లభము. రక్తము శ్రేష్ఠమైన రక్తిమకలది. రజకుఁడు నిర్మలకరుఁడు. రాగము ప్రీతియనియును, సుఖప్రదమైనదనియును చెప్పఁబడును. రామఠము అన్నమునకు శుద్ధిని కలుగఁజేయునదియని చెప్పఁబడుచున్నది. రాజ్యము మిగులశ్రేష్ఠమైన సౌఖ్యము నిచ్చునట్టిదై యున్నది. రజస్వల పుత్రునినిచ్చునట్టిదై యున్నది ఈవిధముగ రకారమాదియందుఁ గలవన్నియును, రామాద్యవర్ణము కలవియగుటవలన మిగుల శ్రేష్ఠములయినవి. ఓశిష్యోత్తమా! రామనామమువంటి యితరదేవతా ముద్ర లోకములో నేదియునులేదు. ఓశిష్యోత్తమా! సకలముద్రలయందును రామనామము స్ఫుటాక్షరములచేతఁ జెప్పఁబడియున్నది. ఇతరదేవతానామము లెందును స్ఫుటాక్షరములచేతఁ జెప్పఁబడియుండలేదు. కావున రామనామము ప్రభావమును నీవే తెలిసికొనుము. కాఁబట్టియే కాశీపట్టణమునందు విశ్వేశ్వరుఁడు సర్వకాలములయందును రామనామమును జపించి యందలి సకలజంతువులకును ముక్తికలుగుటకొఱకు రామనామమునే యుపదేశించుచున్నాఁడు. సంసారార్ణవమునందు మునిగినవాని నుద్ధరించునట్టి మూలమంత్రము రామనామమంత్రము కంటె నితరమైనది వేఱొకటిలేదు. ఈరామనామమే తారకమంత్రమని చెప్పఁబడుచున్నది. కావున మృతికాలమునందు మానవుల దక్షిణకర్ణమునందు రామనామ ముపదేశింపఁబడుచున్నది. అంతకాలమునందు రామనామ స్మరణముచేత నెల్లవారును మోక్షమును పొందుచున్నారు. శవవాహకులుగూడ రామనామముకంటె నితరదేవతానామము నుచ్చరించుటలేదు. విచారింపఁగ రామనామమువంటి మంత్రము త్రికాలములయందు లేకయున్నది. పరమశివుఁడుగూడ సర్వకాలములయందును రామనామమునే జపించుచున్నాఁడు. మఱియు నోశిష్యోత్తమా! పార్వతి, నారదుఁడు, హనుమంతుఁడు మొదలగువారందఱును రామనామమును సర్వకాలములయందును జపించుచుందురు. జనులను రమింపఁజేయువాఁడుగాని, సర్వకాలములయందును ఆత్మయందు రమించువాఁడుకాని రాముఁడనఁబడును. రకారము రసాతలమువలనను, ఆకారము భూమివలనను, పుట్టినది. మకారము మహర్లోకమువలనఁ బుట్టినది. కావున రామనామము త్రివర్ణాత్మకమైనదని చెప్పఁ

బడుచున్నది. రకారము రామభక్తుఁడగువానిని సంసారసముద్రమునుండి కాపాడుచున్నది. ఆకారమతిసౌఖ్యము నిచ్చుచున్నది మకారము మనోరథములనొసంగుచున్నది. ఇట్లుకాదేని మకారము భక్తులగువారికి మాటిమాటికిని మరణము కలుగకుండునట్లు చేయుచున్నది. కావున రామనామము మిగులశ్రేష్ఠమైనదనియును, సర్వకాలములయందును జపింపఁదగినదనియును తెలియవలయును.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
తొమ్మిదవసర్గము ముగిసెను.

——:(o):——

* చైత్రమాస మహిమావర్ణనము. *

అంతట మఱల నారామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! ఇదివఱకు నీవేయేప్రశ్నముల నడిగితివో వానికన్నిటికిని తగినసమాధానము చెప్పితిని. ఇప్పుడింకను నీకేదైన వినఁదగినది యుండెనేని దానిం జెప్పుము. నీయభీష్టమును నెరవేర్చెదను. అనిన విని విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! నీ వయోధ్యాపట్టణమునందు చైత్రమాసఫలము మిగుల నధికమైనదని చెప్పితివి. ఇప్పుడా విషయమును సర్వమును విశదముగఁ దెలియఁజేయుము. ఆచైత్రమాస వ్రతముదేని నుద్దేశించి చేయఁదగినది? ఆకాలమునందుఁ జేయఁదగిన దానమేది? దానివలనఁ గలిగెడు ఫలమెద్ది? దానికిఁ దగినవిధి యెయ్యది? అది యెప్పు డారంభింపఁదగినది? ఈవిషయమును సర్వమును విస్తరించి చెప్పుమనిన విని రామదాసిట్లనియె. ప్రాజ్ఞుఁడవైన యోశిష్యోత్తమా! నీవు మిగులఁ జక్కనిప్రశ్నమును చేసితివి. చైత్రమాస మహిమను చెప్పెదను. వినుము. సకలమాసములలో చైత్రమాసము మొదటిదనఁబడును. చైత్రమాసము సకల జపులకును తల్లివలె నెల్లకోర్కెలను దీర్చునట్టిదియై యున్నది. మఱియునో శిష్యోత్తమా! చైత్రమాసము దానయజ్ఞవ్రతములతో సమానమైనదనియును, సకల పాపముల నశింపఁజేయునది యనియును, ధర్మసారమనియును, క్రియాసారమనియును, తపస్సారమనియును, చెప్పఁబడుచున్నది. విద్యలలో వేదవిద్యవలెను, మంత్రములలోపల ప్రణవమువలెను, వృక్షములలో దేవవృక్షమువలెను, ధేనువులలోపల కామధేనువువలెను, సకల సర్పములలోపల నాదిశేషునివలెను, పక్షులలోపల గరుఁడునివలెను దేవతలలోపల విష్ణునివలెను, వర్ణములలోపల బ్రాహ్మణవర్ణమువలెను, ప్రియవస్తువులలోపల ప్రాణమువలెను, స్నేహితులలోపల భార్యవలెను, నదులలోపల గంగవలెను, తేజస్సులలోపల సూర్యునివలెను, ఆయుధములలోపల వజ్రాయుధమువలెను, ధాతువులలోపల కాంచనమువలెను, వైష్ణవులలోపల రుద్రునివలెను, రత్నములలోపల కౌస్తుభమువలెను, పుష్పములలోపల ధర్మమువలెను, సరస్సు

లలోపల మానస సరస్సువలెను, ధర్మహేతువులగు మాసములలోపల చైత్రమాసము మిగుల శ్రేష్ఠమైనది. ఆ చైత్రమాసమునందు నారాయణుఁడు లక్ష్మీసహితుఁడై ప్రియమును చేయును. జంతువు లాహారముచేతఁ దృప్తిని పొందు విధముగ చైత్రస్నానముచేత నారాయణుఁడు తృప్తిని పొందును. చైత్రస్నానముచేయు వారలను గుఱించి సంతోషమును పొందువారు కూడఁ బాపరహితులగుదురు. సూర్యుఁడు మీనమునందుండఁగఁ బ్రాతస్స్నానమును చేసి యాహ్నికమును దీర్చుకొనువాఁడు మహాపాపములచేతఁ గూడ విముక్తుఁడగును. చైత్రమాసమునందు స్నానమును చేయుటకొఱకు నొకపాదము దూరము చలించినవాఁడుగూడ నశ్వమేధ యాగమువలనఁ బొందెడు ఫలమును పొందును. చైత్రస్నానమును చేయుదమని తలఁచినవానికి నూఱుయజ్ఞములవలనఁ గలిగెడు ఫలముకలుగును. మీనమునందు సూర్యుఁడు ప్రవేశింపఁగనే స్నానముచేయుటకుఁ బోవువాఁడు విష్ణుసాయుజ్యమును పొందును. ముల్లోకములయందు బ్రహ్మాండాంతర్గతములయిన తీర్థములెన్ని కలవో యవి యన్నియును మీనమునందు సూర్యుఁడు ప్రవేశించినకాలమున బహిర్జలమునఁ బ్రవేశించి యుండును. ఆతీర్థములన్నియును మానవులకు హితమును చేయుటకొఱకు శ్రీమహావిష్ణువాజ్ఞ నొసంగుటవలన వచ్చి ప్రవేశించుచున్నవి. ఓశిష్యోత్తమా! చైత్రమాసముతో సమమైన మాసము, యుగములలోఁ గృతయుగముతో సమమైన యుగము, మఱియొకటిలేదని యెఱుంగవలయును. జలదానముతో సమమగు దానమును, భార్యతో సమమగు సుఖమును, ముల్లోకములయందును లేదు. తీర్థమువలె పవిత్రమైనదికూడ ముల్లోకములయందును లేదు. కావున నో శిష్యోత్తమా! చైత్రమాసము శ్రీరామునకు మిగులఁ బ్రియమైనదై యున్నది. ఈచైత్రస్నానము నాచరింపనివాఁడు చండాలుఁడై పుట్టును. సర్వలక్షణ సహితమై యున్నను కప్పులేని గృహమును, సర్వోత్తమమైన సౌందర్యమున్నను పతివిహీనయగు నాఁడుదియును, లవణహీనమగు శాకమును, సకలాభరణములున్నను వస్త్రాభావమును ప్రకాశింపని విధముగ సకల మాసములయందును చేసిన ధర్మము చైత్రస్నానము లేక శోభింపదు. కావున నెన్నికష్టములువచ్చిననేదో యొకవిధమైన ప్రయత్నముచేత చైత్రధర్మముల నాచరింపవలయును. రామునికంటె కృష్ణుఁడును, కృష్ణునికంటె రాముఁడును భిన్నుఁడుగాఁడు. అయోధ్యాపట్టణవాసి యగువాఁడు విడువక శాస్త్రోక్తప్రకారముగ శ్రీరాముని పూజింపవలయును. సూర్యుఁడు మీనమునందుఁ బ్రవేశించియున్న కాలమునందు జానకీకాంతుఁడగు రాము నుద్దేశించి స్నానమును చేయనివాఁ డవశ్యముగ నరకమును పొందును. చైత్రమాసమంతయును సీతారాములు దైవతముగాఁ గలదై యున్నది. మానవుఁ డేయేకర్మములఁ జేయునో వాని నన్నింటిని శ్రీరాము నుద్దేశించి చేయవలయును. శ్రీరాము

నాహ్వానముచేసి ప్రాతస్స్నానము చేసెదనని చెప్పి స్నానముకు చేయవలయును. మఱియునో శిష్యోత్తమా! అంతట “చైత్రేఽద్యమీనగే భానౌ ప్రాతస్స్నానపరాయణః। అర్ఘ్యం తేఽహం ప్రదాస్యామి గృహాణ రఘునాయక॥ గంగాద్యాస్సరితస్సర్వతీర్థాని జలదానదాః। ప్రతిగృహ్య మయాదత్త మర్ఘ్యం సమ్యక్ప్రసీదయ॥ బ్రహ్మాద్యాస్సరితస్సర్వా ఋషయో యేచవైష్ణవాః। తే గృహ్ణంతు మయాదత్త మర్ఘ్యం సమ్యక్ప్రసీదయ॥ ఋషభః పాపినాం శాస్తాం యమత్వం సముదర్శనః। గృహాణార్ఘ్యం మయాదత్తం యథోక్తఫలదోభవ” అను మంత్రమును చెప్పుచు ముందుగ శ్రీరామున కర్ఘ్యమును సమర్పించి యనంతరమందు స్నానమును చేయవలయును. అంతట సద్వస్త్రములను ధరించి సకల కర్మములను నెఱవేర్చి జానకీకాంతుఁడగు రామునర్పించి చైత్రమాస ప్రశంసా సూచకమైన రామకథను వినవలయును. ఈవిధముగఁ జేసిన మానవుఁడు కోటిజన్మార్జిత పాపములనుండి తొలఁగినవాఁడగును. చైత్రమాసమున కాంస్యపాత్రమునందు భుజించువాఁడును, రామకథను విననివాఁడును, స్నానదానములు చేయనివాఁడును, నరకములను పొందును. మాఘమాసమునందు ప్రయాగస్నానము, కార్తికమాసమునందుఁ గాశీస్నానము, ద్వారకయందు వైశాఖస్నానము అనునవి కీర్తింపఁబడిన విధముగ అయోధ్యాపట్టణమునందు చైత్రస్నానము కీర్తింపఁబడి యున్నది. ప్రయాగయందు నెలదినములకాలము స్నానముచేయుటవలనఁ గలిగెడు పుణ్యము చైత్రమాసమున నయోధ్యాపట్టణమందలి రామతీర్థమునం దొక్కపర్యాయము స్నానముచేయుటవలనఁ గలుగునని యెఱుంగవలయును. గోమతీజలమునందు పండ్రెండుమాసములకాలము స్నానముచేయుటవలనఁ గలిగెడు ఫలము అయోధ్యాపట్టణమునందలి సరయూనదియందు మూఁడుదినములు స్నానము చేయుటవలనఁ గలుగును. లోకములో పాపాత్ములగు మానవులకు నయోధ్యాపట్టణమును చూచువఱకును పాపము విజృంభించుచుండును. లోకములోని తీర్థములయందు స్నానముచేయవలయునని విధింపఁబడిన విధియయోధ్య లభ్యముకాని సమయమునందని యెఱుంగునది. ఓ శిష్యోత్తమా! చైత్రమాసంబున నయోధ్యాపట్టణంబునఁ దప్ప తక్కిన స్థలములందు స్నానముచేయుటవలన నధిక పుణ్యము కలుగనేరదు కావున రామతీర్థముల యందైనను స్నానముచేయవలయును. మఱియునో శిష్యోత్తమా! చైత్రమాసమునందు తైలాభ్యంగము, దివాస్వాపము, కాంస్యపాత్రమునందు భోజనము, మంచముపైఁ బరుండుట గృహమునందు స్నానముచేయుట, నిషిద్ధ పదార్థములను భుజించుట అనుకార్యములను విడిచిపెట్టవలయును. చైత్రమాసమునందలి మధ్యాహ్నకాలమునందు అలసిన బ్రాహ్మణులకు పాదావనేజనమను వ్రతము నాచరింపవలయును. చైత్రమాసమునందు ద్విభుక్త నక్త భోజనములను విడిచిపెట్టవలయును. చైత్రమాసమునందు మార్గము

నడుచువారికి నుదక(?)దానము చేయువాఁడును, మార్గమునందు నీడను కల్పించువాఁడును స్వర్గలోకమునందు చిరకాలము సుఖముల ననుభవించును. మఱియును చైత్రమాసమునం దుదకమును కోరువాని కుదకమును, నీడను కోరువానికి నీడను, వింజామరమును కోరువానికి వింజామరమును దానముచేయవలయును. మీనమునందు సూర్యుఁడు ప్రవేశించియున్న కాలమునందు జలచ్ఛత్రవ్యజన దానములు మిగుల శ్రేష్ఠములయిన వనఁబడును. చైత్రమాసము సంప్రాప్తమైన వెంటనే కుటుంబవంతుఁడగు బ్రాహ్మణునకు నుదక కుంభమును దానము చేయవలయును. అట్లు చేయనివాఁడు చాతకపు పక్షియై పుట్టును. చైత్రమాసమునందు జలాన్నశయ్యలను తప్పక దానము చేయవలయును. మఱియునోశిష్యోత్తమా! ఆదర్శదాన తాంబూలదాన గుడదానములను గోధూమతుబరీదానములను చేయవలయును. మఱియును దధ్యోదన ఘృతయుక్త కాంస్యపాత్రేక్షురస శ్రీఫలములను దానముచేయవలయును. మఱియునో శిష్యోత్తమా! చూతఫలము, సూక్ష్మవస్త్రమంచకములు, పానపాత్రము, కమండలువు, యతులకు దండము, మఠములయందు తైలము, జీర్ణమఠోద్ధారము, ఘంటలు, మేడలు మొదలగు వానిని దానము చేయవలయును. ఇంతియగాక వాపీకూప తటాకములను నిర్మించి ఛత్రదానమును చేయవలయును. మఱియునో శిష్యోత్తమా! మధ్యాహ్నమున నతిథిపూజను, యతులకు కరపత్రదానమును, గోగ్రాసదానమును చేయవలయును. ఈదానములన్నియును చైత్రమాసమునందుఁ జేయఁదగినవనియును అట్లుచేసినయెడల మహాపుణ్యము కలుగుననియును ఆర్యులు పలుకుదురు. మఱియునో శిష్యోత్తమా! ఫలము, శాకము, మూలము, కందము, పుష్పము, చందనము, ఉశీరము, శీతలద్రవ్యము, కర్పూరము, కస్తూరి, దీపము, ధేనువు, గృహము, గోరసము, బ్రాహ్మణభోజనము అనుదానములు చేయవలయును. ఇంతియకాక సువాసినీపూజ, రామనామప్రలేఖనము, పుస్తకదానము, కుంకుమ, కేసరీ జాతీ ఫలాదులనుచేర్చిన తక్రమును దానముచేయుట, కూశ్మాండదానము, ఆరామకరణము, పాదుకదానము, అను వానిని చైత్రమాసమునందు చేయుటవలన నధిక పుణ్యముకలుగును. ఓశిష్యోత్తమా! చైత్రమాసమునందు విడువఁదగినదానిని జెప్పెదను. వినుము. సకలవిధములయిన మాంసములు, క్షౌద్రము, సౌవీరకము, రాజమాషాదికములను చైత్ర మాసమునందు విడిచిపెట్టవలయును. పరాన్న పరద్రోహ పరదారాగమనములను చేయఁగూడదు. చైత్రస్నాయి యగువాఁడు తీర్థఘ్నములను విడువవలయును. ద్విదలమ్ము, తిలతైలము, శల్యదూషితాన్నము, భావదోషములనువిడువ వలయును. చైత్రమాసమున స్నానముచేయువాఁడు భావదుష్టశబ్దదుష్టములను విడిచిపెట్టవలయును. మఱియునోశిష్యోత్తమా! చైత్రస్నాయియగువాఁడు దేవతలు, వేదములు, ద్విజులు, గురు

వులు, గోవులు, వ్రతములనాచరించువారు, స్త్రీలు, రాజులు, మహాత్ములు, మొదలగువారిని నిందింపరాదు. మఱియు నోశిష్యోత్తమా! వ్రతమునాచరించువాఁడు బ్రహ్మచర్యము, క్రిందఁబఱుండుట, పత్రావలియందు భోజనముచేయుట, చతుర్థకాలమునందు భోజనముచేయుట,అనువాని నాచరింపవలయును. చైత్రశుక్ల పాడ్యమియందు తైలాభ్యంగమును చేయవలయును. తక్కిన చైత్రమాసమంతయును ముగియువఱకును చైత్రస్నాయియగువాఁడు స్నానమును చేయఁగూడదు. చైత్రస్నానమును చేయువాఁడు అలాబువు, వృంతాకము, కూశ్మాండము, బృహతీఫలము, శ్లేష్మాతకము, కలింగము, కపిత్థము, అనువానిని భుజింపఁగూడదు. రజస్వలాస్త్రీలు, అంత్యజులు, పతితులు, దేవబ్రాహ్మణులు, మొదలగువారిని నిందింపఁగూడదు. మఱియు నిటులనే పలాండువు, లశునము, ఛత్రాకము, గృంజనము, నాలికానూలకము, శిగ్రువు అనువానిని విడిచిపెట్టవలయును. సూతకాన్నపర్యుషితాన్నములను భుజింపఁగూడదు. మఱియును తనదుశక్త్యనుసారముగ శ్రీరామునకు ప్రీతికలుగుటకొఱకు వ్రతము నాచరింపవలయును. మఱియు నోశిష్యోత్తమా! చైత్రశుక్ల ప్రతిపత్తుమొదలుకొని దుష్టములగు కూరగాయలను భుజింపఁగూడదు. ఫాల్గునశుద్ధ పూర్ణిమ మొదలుకొని చైత్రశుక్ల పూర్ణిమవఱకును, చైత్రస్నానముల నాచరింపవలయును. అట్లుగాదేని సూర్యుఁడు మీనరాశియందుఁ బ్రవేశించినది మొదలుకొని చైత్రశుక్లదశమివఱకు స్నానముచేయవలయును. ఇట్లునుకాదేని చైత్రశుక్ల తృతీయ మొదలుకొని వైశాఖశుక్ల తృతీయవఱకును ప్రాతస్స్నానమును చేయవలయును. స్త్రీలు సీతాతీర్థమునందు స్నానముచేసి సీతామహాదేవిని పూజింపవలయును. చైత్రశుక్లతృతీయయును, వైశాఖశుక్లతృతీయయును అక్షతదియలనఁబడును. చైత్రమాసమునందలి ముప్పదిదినములును పావనములయిన వనఁబడును. చైత్రబహుళపంచమి, దశమి, ఏకాదశి, ద్వాదశి, చతుర్దశి, అమావాస్య, అనునవి మహాపాతక నాశకతిథులనఁబడును. చైత్రశుక్లప్రతిపత్తుమొదలుకొని దశమివఱకును ప్రతిపత్తునందుఁ జేయఁబడిన స్నానదానాది వ్రతములకంటె ద్విగుణాధికముగఁ జేయవలయును. ఈవిధముగ నవమివఱకును చేయుచుండవలయును. సకలమాసములలోపల చైత్రమాసము మిగుల శ్రేష్ఠమైనదనియు పూజ్యులగువారు చెప్పుదురు. ధర్మసంస్థాపనమును చేయుటకు శ్రీరాముఁ డవతరించిన తిథి సకలపాపములను నశింపఁజేయునట్టిదని యెఱుంగవలయును. కావున నట్టి తిథియందుఁ జేయఁబడిన జపతపదానాదులు అక్షయమగు పుణ్యమును కలుగఁజేయునని యెఱుంగవలయును. ప్రతిపత్తు మొదలుకొని నవమివఱకును ఉపవాసమును చేయుచు నాతొమ్మిది దినములయందును తప్పక శ్రీరాముని పూజించుచుండవలయును. సంవత్సరాది పాడ్యమియందు సౌధోపరిభాగమునందు దివ్యములయిన ధ్వజములను స్థాపింపవలయును. గృహమునందై

నను దేవాలయమునందైనను, గోష్ఠమునందైనను, బృందావనము నందైనను ప్రతిదినమునందును చందనాదులచేత సమ్మార్జనమును చేయవలయును. అనంతరము పాషాణచూర్ణాదికముచేత నానావిధములయిన పద్మాదుల నిర్మింపవలయును. మఱియు నాముగ్గులయందు నీలపీతాదివర్ణములనుగూడఁ జేర్పవలయును. మఱియు నోశిష్యోత్తమా! అక్కడ అష్టోత్తరసహస్రమనియెడు రామతోభద్రమును స్థాపింపవలయును. అట్లుగాదేని సీతాభద్రమునైన లిఖింపవలయును. అనంతరము చిత్రవర్ణముగల మండపమును నిర్మింపవలయును. ఆమండపమునకు నాలుగుప్రక్కలయందు నాల్గుద్వారముల నిర్మింపవలయును. మఱియు నామంటపము నాల్గుద్వారములయందును కదళీస్తంభములనుగట్టి రమ్యములయిన యద్దముల నుంచవలయును. నానావిధములయినవియును, చిత్రములును అయిన వితానముల నిర్మింపవలయును. అంతట నామంటపమునందు రత్నములచేతఁ బ్రకాశించుచున్నదియును, హేమమయమునయిన మంచకము నుంచవలయును. పిమ్మట నామంచకమునందు దివ్యవస్త్రములచేత శయ్యను నిర్మింపవలయును. అంతట నాశయ్యయందు పదునాఱుమాషముల మితిగల బంగారముచేతఁ జేయఁబడిన రామవిగ్రహమును, ఇరువదినాల్గు మాషముల పరిమితిగల వెండిచేతఁ జేయఁబడిన కౌసల్యావిగ్రహమును పరుండఁబెట్టవలయును. అనంతరము ద్రవ్యానుసారముగఁ బూజింపవలయును. ఆసమయంబున భేరీమృదంగాది ధ్వనులను, నానావిధ వంశాదివాద్యములను ప్రయోగించుచు నృత్యగీతాదుల సలుపవలయును. పిమ్మట నానావిధ పక్వాన్నాదులచేత నైవేద్యమును సమర్పించి షోడశోపచారముల సలుపవలయును. ప్రతిపత్తు మొదలుకొని నవమివఱకును రామాయణపారాయణము చేయవలయును. వాల్మీకి మునివిరచితంబైన యానందరామాయణము మిగులఁ బావనమైనదని తెలిసికొనుము. ప్రతిదినమును రామాయణము సమగ్రముగఁ జదువ సామర్థ్యములేనియెడల నొక్కసర్గమునైనఁ బఠింపవలయును. ఇట్లుచేయుటవలన సర్వతీర్థములవలనను, సర్వదానములవలనను గలిగెడు పుణ్యము కలుగును. ఈప్రకారము తొమ్మిదిదినములును కౌసల్యారాములను బూజింపవలయును. మఱియు నాదినములయందు పుత్రవతులగు సువాసినీస్త్రీలకుఁ బూజసేయవలయును. మఱియుఁ బుత్రవంతులగు బ్రాహ్మణులఁ బూజింపవలయును. ఇట్లు తొమ్మిదిదినంబులుజరపి నవమియందు శ్రీరాముని వాహనారూఢుని గావించి యథికముగఁ బూజింపవలయును. మఱియు నాదినమునందు భేరీమృదంగాది మంగళవాద్యంబులను, వారస్త్రీనృత్య గానంబులను, గాయకగానంబులను జరుపవలయును. ఇట్లు నానావిధ మహోత్సవంబుల సలుపుచు శ్రీరామునకు వింజామరముల వేయవలయును. అనంతరము రాముని పుష్పకవిమానమునందుంచి రామతీర్థంబునకుం గొనిపోయి పంచామృతస్నా

నము చేయింపవలయును. అనంతరము నానావిధ మంగళద్రవ్యాదులతోడం గూడిన యుదకంబున నభిషేకంబు కావింపవలయును. ఆస్నానము మంగళస్నానమనంబడును. ఆపంచామృత తీర్థమునందుండి యెల్లవారు స్నానముచేయవలయును. ఇట్టిస్నానము చేయుటంజేసి యవభృథస్నానమునం గలుగుఫలంబునకుం దుల్యంబగు ఫలము కలుగును. మఱియు నోశిష్యోత్తమా! గంగాది మహానదులందును, పుష్కరాదులందును స్నానమొనర్చుటంజేసి కలుగుఫలంబుగూడ కలుగును. ఈప్రకారము సీతాసమేతుండగు రామునకు స్నానముచేయించి పూర్వోక్తమంగళవాద్యంబులతో శ్రీరాముని గృహంబునకుం దీసికొని రావలయును. అంతట మఱల పూజంగావించి రామాయణపారాయణమును పూర్తినొందించి యాగ్రంథమును పూజింపవలయును. అనంతర మాశ్రీరామాది విగ్రహముల గురునకు సమర్పింపవలయును. పిమ్మట మిత్రాదులతోడ భోజనము చేయవలయును. అంతట నారాత్రియందు జాగరమునుచేసి దశమినాడు ప్రాతఃకాలంబున కాలోచితకృత్యంబుల నెరవేర్చి యనేకబ్రాహ్మణులకు సమృద్ధిగ నన్నదానంబు చేయవలయును. ఇట్లు శ్రీరామనవమీవ్రతమును సమాప్తినొందించినయెడల సర్వోత్తమమైన పుణ్యమును పొందును. శ్రీరామనవమితో సమమైనతిథి లేదని యెఱుంగవలయును. చైత్రశుక్లపక్షైకాదశి సకలతిథులలో నత్యుత్తమమైనది. ద్వాదశి దానికంటె సర్వోత్తమమయినది. కావున నాదినమునందు సీతారాములను పూజించి దధ్యోదనము నివేదించి బ్రాహ్మణులకు సమర్పింపవలయును. చైత్రమాసమునందలి యామూఁడుతిథులును సర్వోత్తమమైన వనంబడును. మఱియు నోశిష్యోత్తమా! త్రయోదశి, చతుర్దశి, అమావాస్య అను మూఁడుతిథులుగూడ పుణ్యకరములయినవి. ఇట్టిదినములయందుఁ జేయఁబడిన దానాదులు మిగుల శ్రేష్ఠములగుఫలముల నొసంగును. చైత్రమాసమునందలి యంత్యదినమునందుఁగూడ స్నానమునుచేసినయెడల చైత్రస్నానఫలముకలుగును. ఓశిష్యోత్తమా! చైత్రమాసమునందలి ముఖ్యతిథులలో పూర్ణిమాతిథి మిగుల శ్రేష్ఠమైనది. ఆతిథియం దుద్యాపనము చేయవలయును. చతుర్దశియం దుపవాసమునుచేసి పూర్ణిమయందుఁ బూర్వోక్తప్రకారముగ మండపాదికమును నియమించి ధాన్యరాశియం దుదకపూరితమగు కలశమును స్థాపించి దానియందు మిగుల విశాలమగు హేమపాత్రమును నుంచవలయును. అంతట దానియందు పంచరత్నములనుబెట్టి సువస్త్రముచే నాచ్ఛాదనముచేసి దానియందు బంగారుచేఁ జేయఁబడిన సీతారామవిగ్రహములను స్థాపించి లక్ష్మణాది పరివారకవిగ్రహములను పూర్వోక్తప్రకారముగ స్థాపింపవలయును. అంతట గుర్వాజ్ఞను పొంది దేవదేవేశుఁడగు రాముని బూజింపవలయును. పిమ్మట నారాత్రియందు గీతవాద్యాదులను సలుపుచు జాగరణమును చేయవలయును. అంతట పూర్ణిమ

నాటి ప్రాతఃకాలమునందు ముప్పదిమంది దంపతులనైనను, ఏకసంఖ్యాకదంప తులనైనను, శక్త్యనుసారముగ నిమంత్రణము చేయవలయును. పిమ్మట వారి కందఱికి షడ్రసోపేతముగ నన్నమునుపెట్టి దేవదేవేశుఁడగు రామునకును, దేవ తలకును ప్రీతికరముగ తిలసర్పిస్సులచేత హోమమును చేయవలయును. అనంత రము శక్త్యనుసారముగ నాదంపతులకు దక్షిణాతాంబూలముల నీయవలయును. అనంతరము దేవతలను శ్రీరామునిబూజించి తులసిని పూజింపవలయును. పిమ్మట శాస్త్రోక్తప్రకారముగఁ గపిలధేనువును బూజించి వ్రతోపదేష్టయగు గురుని సభార్యకముగ వస్త్రాలంకారాదులచేతఁ బూజించి గురువును బ్రాహ్మణు లను శ్రీరామానుగ్రహము కలుగునటుల నాశీర్వదింపుఁడని ప్రార్థింపవలయును. ఇట్లు వ్రతమును సమాప్తినొందించువానికి సప్తజన్మకృతపాపము నశించును. అట్టివానిసంతతి యవిచ్ఛిన్నముగనుండును. దేహాంతమందు వైష్ణవస్థానమును పొందును. అట్లాశీర్వాదమును పొందినపిమ్మట నాబ్రాహ్మణులను పంపవల యును. అనంతర మాదేవతావిగ్రహములను గురువునకు సమర్పింపవలయును. అప్పుడు మిత్రాదులతోఁ గూడుకొని భుజింపవలయును. ఓశిష్యోత్తమా! ఈవిధ ముగ చైత్రస్నానవ్రతాదికము చేయఁదగినది. ఇట్లు వ్రతమునాచరించువాఁడు సకలపాపవిముక్తుఁడై విష్ణుసాయుజ్యమును పొందును. శాస్త్రోక్తముగ నీవ్రతము నుచేసిన వానిపుణ్యము కోటిగుణితమగును. వానిపాపములన్నియు క్షణములో నశించును. కావున నవశ్యముగ చైత్రవ్రతము నాచరింపవలయును. ఓశిష్యో త్తమా! ఈచైత్రవ్రత విధానాదికమును భక్తితోఁ బఠించువానికిని వినువానికిని వ్రతాచరణమునం గలుగుఫలము లభించును.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పదియవసర్గము ముగిసెను.

——:(0):——

* చైత్రస్నానము చేయువారికిఁ గలుగుసద్గతిని నిరూపించుట. *

ఓగురూత్తమా! సకలమాసంబులలోపల చైత్రమాసము శ్రేష్ఠమైనదని చెప్పుటకుఁ గారణమేమి? అట్టికారణమునుజెప్పి నన్నుఁ గృతార్థుని జేయుమనిన శ్రీరామదాసిట్లనియె. అత్యధికమైన బుద్ధిగల యోశిష్యోత్తమా! నీవు చక్కని ప్రశ్నమును వేసితివి. తొల్లి బ్రహ్మదేవుఁడు ప్రార్థించుటచేత శ్రీమహావిష్ణువు అయోధ్యాపట్టణాధిపతియగు దశరథమహారాజువలన కౌసల్యాగర్భమునందు జన్మించె. ఆమహావిష్ణువు రామావతారమెత్తిన దినము పునర్వసూనక్షత్రయుక్త మైన చైత్రశుక్లనవమియై యున్నది. ఆసమయమునం దయిదుగ్రహము లుచ్చ యందుండె. ఆనాటి మధ్యాహ్నమునందు శ్రీరాముఁడవతరించె. అప్పుడు సకల

లోకములవారును మిగుల నానందమునందిరి. మఱియు నాసమయమునందు దేవదుంధుభులు మ్రోగె. పుష్పవర్షము గురిసె. దశరథమహారాజు గృహమునందు నానావిధవాద్యములు మ్రోగె. వారస్త్రీలు మిగుల మనోహరముగ గానము చేయుచు నృత్యమును సలిపిరి. ఆసమయమునం దెల్లవారును రాజపుత్రునిం గాంచి సంతసమును బొందిరి. దేవతలందఱు దేవేంద్రునితోడ నానావిధ విమానంబులనెక్కి రాముని దర్శింపవచ్చిరి. మఱియు నాసమయంబున బ్రహ్మరుద్రసూర్యులును వచ్చిరి. వారందఱును నానావిధములయిన యుత్సవములను సల్పిరి. మఱియు నప్పుడు దేవతలందఱు సంతోషముగలవారై స్వర్గమునందుండి శ్రీరామునకు నమస్కరించి నానావిధములయిన స్తోత్రములసల్పి యిట్లనిరి. "ఓదేవోత్తమా! మేము ధన్యులము. ముక్తులము. నీవవతరించుటచేత మాకిప్పుడు సంతోషకాలము. కావున నిదిపుణ్యకాలము. ఓదేవోత్తమా! ఈమాస్తుతుల నంగీకరించి మాకనేకవరములిమ్ము" యనినపిని శ్రీరాముం డాదేవతలకిట్లనియె. ఓదేవోత్తములారా! మీరు ముల్లోకములకును మేలుచేయునట్టి విషయమును తెలిపితిరి. మీరందఱు నాకు మిగుల సంతోషమగుకాలమునందుఁ బ్రార్థించితిరి. నేనిప్పుడు సంతోషముతోఁ బలుకునట్టివాక్యముల వినుఁడు. సకలమాసముల లోపల చైత్రమాసము మిగులశ్రేష్ఠమైనది కాఁగలదు. చైత్రమాసమునందుఁ జేయఁబడిన జపతపహోమదానార్చనాదికము కోటిగుణితమగును. అశ్వమేధగోమేధ సోమపానాదులచేతఁ గలిగెడుఫల మీచైత్రమాసమునందు స్నానదానార్చనాదులు చేయుటవలనఁ గలుగును. మఱియు నోదేవోత్తములారా! సూర్యగ్రహణమునందును, కురుక్షేత్రాదులయందును జేయఁబడు స్నానదానాదికమువలనఁ గలిగెడు ఫలముకూడఁ గలుగును. ఓదేవోత్తములారా! నేను రావణుని వధించి తత్పాపశాంతికొఱకు నీసరయూతీరమునందు శుభమగు క్రతువుఁ జేయుదును. నేను యాగసమాప్తిని పొందించిన ప్రదేశమునకు రామతీర్థమని నామధేయము కలుగును. అట్టితీర్థమునందు చైత్రమాసమున స్నానదానార్చనాదికమును చేయువారు మోక్షమును పొందువారగుదురు. మాఘమాసమునందుఁ బ్రయాగలో స్నానార్చనాదులఁ జేయుటవలనను, కార్తికమాసమునఁ గాశిలో స్నానాదికమును చేయుటవలనను, వైశాఖమాసమున ద్వారకయందు స్నానము మొదలగువానిం జేయుటవలనను గలిగెడుఫలము చైత్రమాసమున నయోధ్యాపట్టణమునందలి రామతీర్థంబున స్నానదానార్చనాదులం జేయుటవలనఁ గలుగును. ఓదేవోత్తములారా! చైత్రమాసము సంప్రాప్తమైనతోడనే దేవేంద్రునితోఁగూడ మీరందఱు నాయాజ్ఞానుసారముగ బహిర్జలమునందుఁగూడఁ బ్రవేశించి యుండుఁడనియె. ఈవిధముగ శ్రీరాముఁ డింద్రాదిదేవతలతోఁ జెప్పిన పిమ్మట దేవతలందఱును తమతమయావాసంబులకుఁ బోయిరి. కావున నోశిష్యా

త్తమా! సకలమాసములలో చైత్రమాసము మిగుల శ్రేష్ఠమైనదయ్యె. ఇంతయు కాక శ్రీరాముని వరమువలన సకలమాసములకును చైత్రమాసము మొదటి దయ్యె. ఓశిష్యోత్తమా! నీవడుగుటంజేసి చైత్రమాస మాదిమమాస మగుటకును, సకలమాసంబులలో మిగుల శ్రేష్ఠమైనదగుటకును దగినకారణంబును దెలిపితినని విని విష్ణుదాసిట్లనియె.

* శ్రీ రామదాసజననము. *

ఓగురూత్తమా! చైత్రస్నానము మిగుల శ్రేష్ఠమైనదని చెప్పితివికదా! ఆవ్రతము నాచరించినవాఁడును, దానివలన సిద్ధిని పొందినవాఁడును నెవ్వఁడైనఁ గలఁడా? ఉండెనేని యా వృత్తాంతమును దెలిపి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! నీవు చక్కనిప్రశ్నమును చేసితివి. తొల్లి నృసింహుఁడను బ్రాహ్మణోత్తముఁడు గలఁడు. అతని కొక్క నియమముకలదు. సర్వకాలములయందు నతిథులను పూజించుటయను నదియే యానియమము. మాతల్లియు నట్టి నియమమున కనుకూలురాలై యుండె. ఆదంపతు లిరువురును సంతానము లేకపోవుటచేత మిగుల విచారముకల వారయి నివాసమనియెడు పట్టణమునకుఁ బోయి స్వేష్టదేవతయగు మోహినికి దినదినము నానావిధములయిన పూజలను సలుపుచుండిరి. అట్లు చిరకాలము గడచినపిమ్మట నాదేవత ప్రసన్నురాలై మాతండ్రియగు నృసింహునితో నిట్లనియె. ఓ బ్రాహ్మణోత్తమా! నీవయోధ్యా పట్టణమునకుఁ బోయి సూర్యుఁడు మీనరాశియందు ప్రవేశించినదిమొదలుకొని మాసముకాలము సరయూనదియందలి రామతీర్థమునందు స్నానార్చనాదులను శ్రీరాము నుద్దేశించి చేయుము. అట్లుచేసినయెడల సకలపాపములు నశించును. అంతట సత్పుత్రుని బడయుదువనియె. అట్లామహాదేవత చెప్పిన వాక్యములనువిని మాతండ్రియగు నృసింహుఁడు పరమానందమునుపొంది యాదేవత ననేకవిధములఁ బ్రార్థించి యక్కడనుండి బయలుదేరి శ్రీరాముని ధ్యానించుచు భార్యాసహితముగ నయోధ్యాపట్టణమునకుఁ బయనమయ్యెను. అయోధ్యాపట్టణమునకుఁ బోవునపుడు గోదావరికిఁబోయి స్నానముచేసి రామమూర్తిని ముందునిడుకొని మిగులభక్తితోఁ బూజించె. అప్పుడు శ్రీరాముఁడు ప్రసన్నుఁడై యిట్లనియె. ఓనృసింహా! బ్రాహ్మణోత్తమా! నీవు మిగులవృద్ధుఁడవు. కావున నావచనము వినుము. ఇక్కడకు మూఁడామడలదూరమున గోదావరినదికి నుత్తరభాగమునందు ప్రతిష్ఠానమను నామధేయముకల క్షేత్రమొక్కటికలదు. నీవక్కడకుఁ బోయి భార్యతోఁగూడ స్నానాదికము నాచరింపుము. సూర్యుఁడు మీనరాశియందున్న చైత్రమాసమున స్నానదానాదికములనుజేసి నన్నుఁ బూజింపుము.

అప్పుడు నీపాపమంతయు నశించును. అందువలన సుపుత్రుండు కలుగును అని చెప్పి శ్రీరాముఁడు అంతర్ధానమును పొందెను. అప్పుడు శ్రీరాముఁడు ప్రసన్నమైన చోటునకు రామహ్రదమను నామధేయము కలిగె. అంతట నాతండ్రి రామవచనానుసారముగ ప్రతిష్ఠాన నగరమునకుఁ బోయి యచ్చట చైత్రమాసమున స్నానముచేసె. ఆకాలమునందు సూర్యోదయమునకు ముందుగ మేల్కాంచి కాలోచితకృత్యంబుల నెరవేర్చి యా రామతీర్థమునందు స్నానము చేసి శ్రీరాముని సువర్ణపర్వతమునందుఁ బూజించె. మఱియు నా సువర్ణ పర్వతంబునకుఁ దొమ్మిది ప్రదక్షిణములు కావించి తొమ్మిది పుష్పములచేతఁ బూజించి తొమ్మిది విధములయిన యన్నాదులచేత నైవేద్యమును పెట్టె. ఈవిధముగ వైశాఖమాసమువఱకు వ్రతము నాచరించె ఈవిధముగ నొక్కమాసము దినములు వ్రతముల నాచరించి యాబ్రాహ్మణుఁడు మిగుల సంతోషమును పొందె. అంతట గొన్ని దినములకు నేనా దంపతులకుఁ బుత్రుఁడనై పుట్టితిని. కావున నో శిష్యోత్తమా! చైత్రవ్రతము మిగుల శ్రేష్ఠమైనదని చెప్పితి ననిన విష్ణుదాసు మఱల నిట్లనియె. ఓ గురూత్తమా! పిశాచరూపమును పొంది యున్న ముగ్గురుముక్తులయిరని చెప్పితివిక దా? ఏట్టిపాపమువలన వారికి పిశాచత్వముకలిగె? ఆ వృత్తాంతమును సర్వమును చెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన రామదా సిట్లనియె.

* పిశాచత్రయోపాఖ్యానము. *

ఓ శిష్యోత్తమా! చెప్పెద వినుము. తొల్లి రంభయను నప్సరస్త్రీ యొక్కతె కలదు. అది చైత్రమాసమున నయోధ్యాపట్టణమునందలి సరయూనదిలోని రామతీర్థమునందు స్నానమునుచేసె. అట్లు స్నానముచేసిన పిమ్మట ఆర్ద్రవస్త్రము కలదియును, సుందరమైన మోము కలదియును, అలంకారములచేత నలంకరింపఁబడినదియు నై కాంచన భాండమునందు సరయూనదీ జలంబును గ్రహించి రామలింగేశ్వరుని జూచుటకు మౌనము నవలంబించి బయలు వెడలెను. అంతట నాకాశమార్గమునఁ బోవుచుఁ బిశాచత్రయము న్నచోటఁ బ్రవేశించె. అప్పుడా రంభయొక్క హస్తచలనమువలన మూఁడు బిందువులు మూఁడు పిశాచములయందును బడెను. అంతట నా పిశాచములు మూఁడును విడువఁబడిన క్రూరస్వభావముకలవై మిగుల నాశ్చర్యమును పొందెను. అంతట నాపిశాచములు పూర్వజన్మ స్మరణముకలవయ్యె. అప్పుడు పిశాచరూపములతో నున్న మువ్వురును మిగుల నాశ్చర్యముకలవారై యప్సరసయగు నారంభతో నిట్లనిరి. మఱియు ననేకవిధములఁ బ్రార్థించిరి. అంత నారంభ యిట్లనియె. ఓ ప్రాణులారా! మీరే హేతువుచే నీ పిశాచరూపములు

పొందినదియును తెలుపుఁడన విని యిట్లనిరి. ఓభామినీ! తొల్లి మాలో నిరువురము పూర్వజన్మమునందు విరజానదీ తీరమునందు నివసించిన హరశర్మయను బ్రాహ్మణునకుఁ బుత్రులమై పుట్టితిమి. అంతటఁ గొన్ని దినములకు మే మిరువురము నధ్యయనము చేయుటకొఱకు నారాయణుఁడను బ్రాహ్మణోత్తమునకు శుశ్రూష నవలంబించితిమి. ఆ బ్రాహ్మణోత్తమునకు మిగుల సౌందర్యాదులు కల పుత్రిక యొక్కతె గలదు. ఆ యంగనతో మే మిరువురమును రహస్యముగ స్నేహమునుచేసి సురతక్రీడల ననుభవించితిమి. అంతట నా బ్రాహ్మణోత్తముఁడా వృత్తాంతమును దెలిసికొని కోపోద్దీపితుఁడై మమ్ముల ముగ్గురను పిశాచత్వము పొందునట్లు శపించె. అప్పుడు మేము ముగ్గురమును మిగుల దీనులమై యాబ్రాహ్మణోత్తము ననేకవిధములఁ బ్రార్థించితిమి. అంతట నా బ్రాహ్మణోత్తముఁడు శాపాంతమును జెప్పఁదలఁచి యిట్లనియె. కొంతకాలమైనపిమ్మట నృసింహుఁడనెడు బ్రాహ్మణుఁడు చైత్రమాసమునందుఁ జేసిన స్నానఫలము నీయఁగలఁడు. అందువలన మీ పిశాచత్వము పోవుననియె. అంతట మేము పిశాచస్వరూపమును పొందితిమి. ఇప్పుడు నీ వస్త్రబిందువులు పడుటచేత మేము ధన్యులమైతిమన విని యారంభ సంతసించి వారిని హస్తముచేత స్పృశించి యూరడించి శీఘ్రముగ నరసింహుఁడను బ్రాహ్మణుఁడు వచ్చునని చెప్పి యథేచ్ఛముగఁ బోయె. అట్లు బయలువెడలిపోయి రామేశ్వరము బ్రవేశించి రామలింగేశుని బూజించె. పిమ్మటఁ గొన్ని దినములకు చైత్రమాసమతిక్రమింపఁగానే యా నృసింహుఁడను బ్రాహ్మణుఁడు భార్యతోఁగూడ వచ్చుచుండఁగఁ బిశాచరూపములతో నున్న యా ముగ్గురను జూచి దూరమునుండి నమస్కరించి తమవృత్తాంతమును సర్వమును దెలిపిరి. ఆ వృత్తాంతమును సర్వమును విని సంతోషముతోఁ గూడుకొనినవాఁడై యిట్లనియె. ఓ పిశాచములారా! శంభుఁడను బ్రాహ్మణునిచేత రాక్షసుఁడు విడిపింపఁబడిన విధముగ మీరును మీ పిశాచరూపములనుండి విడిపింపఁబడుదురు. కావున భయంపడకుఁడనిన విని యాముగ్గురిలో నొక్కపిశాచమిట్లనియె. ఓ బ్రాహ్మణోత్తమా! శంభుఁడను వాఁ డెవ్వఁడు? వాఁ డెప్పుడే విధముగ ముక్తుఁడయ్యె? ఆ రాక్షసుఁ డెవ్వఁడు? ఆవృత్తాంతమును సర్వమును తెలుపుమనిన విని యా బ్రాహ్మణుఁ డిట్లనియె. ఓ పిశాచములారా! ఆవృత్తాంతమును సర్వమును చెప్పెదను. వినుఁడు.

* శంభుశర్మోపాఖ్యానము. *

తొల్లి శివకాంచీపట్టణమునందు పరిశుద్ధుఁడైన బ్రాహ్మణుఁ డొక్కఁడుకలఁడు. అతఁడు శంభువను నామధేయము కలవాఁడై భార్యతోఁడ సద్వ్రతముల నాచరించుచు నుండె. అంతఁ గొన్నిదినంబులు గడచిన పిమ్మట

నా కాంచీపట్టణమునందలి యేకాంబరుని సన్నిధియందు పురాణమును జెప్పుచున్న బ్రాహ్మణునిముఖమున పురాణమును వినుటకుఁ బోయె. పోయి చైత్రస్నానమువలనఁ గైవల్యముకలుగు ననియెడు ఫలవచనమును వినియె. పిమ్మటఁ గొన్నిదినములకా కథను స్మరించుచు భార్యాసహితుఁడై యయోధ్యాపట్టణమునకుఁ బయనమయ్యె. అట్లు పయనమై మిగుల రమ్యమైన జాహ్నవీనదిని దాటిపోవుచుండె. అట్లు పోవుచుండఁగ మార్గమధ్యమునం దొక్కచోట కర్కశుఁడను భిల్లుఁడు ధనుర్బాణములను గ్రహించి యాబ్రాహ్మణుని పట్టుకొనియె. పట్టుకొని క్రిందఁబడవైచి యిటునటు పొర్లించి యొంటివస్త్రముచే బంధించి యతని దగ్గఱనున్న ధనాదికమును సర్వమును గ్రహించెను. అప్పుడా బ్రాహ్మణుఁడా భిల్లు ననేకవిధములఁ బ్రార్థించి యోభిల్లోత్తమా! వస్త్రాదికమును సర్వమును గ్రహించి నాకభీష్టకమగు భక్ష్యమును మాత్రమును నొసంగుమనియె. అంతట నాభిల్లుఁ డందుల కంగీకరించి నీ యొద్దనున్న పదార్థములను జూపుమనియె. అప్పుడా బ్రాహ్మణుఁడు తనమూట విచ్చిచూపఁగా నందుఁ బదియరఁటిపండ్లును మఱికొన్ని పక్వపదార్థములునుండె. వాని నన్నింటినిజూచి యాభిల్లుఁ డిట్లని యోచించె. అయ్యో! పాపము. నాకీఫలములు మొదలగువాని వలన లాభమేమికలుగును? ఈబ్రాహ్మణుఁ డాకలిచేతఁ బీడింపఁబడియున్నాఁడు. కావున నీపదార్థముల నీతనికేయిత్తమని తలంచి యాఫలాదుల నాబ్రాహ్మణునకే యొసంగె. అంతట నాబ్రాహ్మణుఁడు కొన్నియరఁటిపండ్లను భార్యాసమేతుఁడై భుజించి మిగిలినవాని నాభిల్లునకునొసంగె. ఆఫలములను భుజించినతోడనే యాభిల్లునకు సుబుద్ధియుదయించె. అప్పుడాకర్కశుఁడను భిల్లుఁడు సంతోషముకలవాఁడై యోబ్రాహ్మణోత్తమా! నీవెక్కడనుండి వచ్చుచున్నావనిన విని యాబ్రాహ్మణుఁ డిట్లనియె. ఓభిల్లవర్యా! నేను కాంచీపట్టణమునుండి యయోధ్యాపట్టణమునకుఁ బోవుచున్నాఁడను. పోయి చైత్రమాసమునందు సరయూనదిలో స్నానముచేయఁదలఁచి యున్నాఁడననియె. అట్లుచెప్పిన యాబ్రాహ్మణవాక్యములను విని యాకర్కశుఁడు మఱలనిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! ఆసరయూనదియందు స్నానముచేయుటవలనఁ గలిగెడు ఫలమేమి? ఆవిషయమంను సర్వమును సవిస్తరముగఁ జెప్పుము. అనిన నాబ్రాహ్మణుఁడు మఱల నిట్లనియె. ఓభిల్లవర్యా! ఆసరయూనదియందు స్నానముచేయుటవలన శ్రీరాముఁడు సంతసించి కోరినకోర్కెల నెరవేర్చును. కావున నెల్లవారును సరయూనదియందు స్నానముచేసి శ్రీరామానుగ్రహమువలన సకలమనోరథముల నందుదురు. అనంతరము మోక్షమునుగూడఁ బొందుదురుఅనియె. ఈవిధముగ బ్రాహ్మణుఁడుచెప్పిన వాక్యములనువిని యాభిల్లుఁడు మఱలనిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! నాయందు దయకలవాఁడవై మోక్షమన నెట్టిదో తెలియఁజేయుమనిన

విని యాబ్రాహ్మణుఁడు తనభార్యతో "నోయంగనా! చూడుము. మనమిచ్చిన యరఁటిపండ్లను భుజించుటచేత వీనికి మిగులసుబుద్ధి యుదయించినది. వీఁడు భిల్లజాతియందుఁ బుట్టియు నుత్తముఁడుచేయఁదగిన ప్రశ్నములఁ జేయుచున్నాఁడు. మోక్షమనన్నెట్టిదో తెలిసికొనఁదలఁచుచున్నాఁడు. కావున వీనికి జ్ఞానోపదేశము చేయుము" నని చెప్పి యాభిల్లునితో నిట్లనియె. ఓభిల్లుఁడా! నీవు మిగులశ్రేష్ఠమైన ప్రశ్నమును జేసితివి. ఇప్పుడు మోక్షస్వరూపమును జెప్పెదను. సావధానమనస్కుఁడవై వినుము. మోక్షమనఁగా పునర్జన్మము లేకపోవుటయనిన నాకర్కశుఁడు మఱల నిట్లనియె. ఓబ్రాహ్మణోత్తమా! అట్టి మోక్షము నాకెట్లు దొరకునో చెప్పుమనిన విని శంభుఁ డిట్లనియె. ఓ భిల్లజనోత్తమా! నీకు మోక్షము కలుగుటకుఁ దగిన యుపాయమును చెప్పెదను. సావధాన మనస్కుఁడవై వినుము. దారపుత్ర గృహాదులయందుఁ బ్రీతివిడిచి పెట్టి నారాయణుని రేయింబగలు స్మరింపవలయును. దేహమును చలింపఁజేయుటయందుఁ దగినసామర్థ్యము కల యాత్మను నానావిధములయిన పుణ్యములు కలుగునట్లు చేయవలయును. సర్వకాలములయందును నారాయణ స్మరణమును విడువక యుండవలయును. ఇట్లున్నయెడల సర్వోత్తమమగు మోక్షము కలుగుననియె. ఇవ్విధముగా నాబ్రాహ్మణుఁడు చెప్పుచుండఁగానే యాకర్కశుఁడు ధనుర్బాణములను విడిచిపెట్టి శంభునిపాదములను బట్టుకొని యోగురూత్తమా! నన్ను రక్షింపుమని నయవినయంబులు పురిగొన నా బ్రాహ్మణోత్తముని దీనాననుండై యనేకవిధములఁ బ్రార్థించె. మఱియు నన్ను సంసారసాగరమునుండి యుద్ధరింపుమనియె. ఇవ్విధంబుగ భిల్లుండును బ్రాహ్మణుండును మాట్లాడుచుండఁగ నొక్కరాక్షసుఁడు భయంకరముగఁ గూయుచు నచ్చోటున కఱుగుదెంచె అట్లు వచ్చిన యారాక్షసుని జూచి వారు ముగ్వురును భయముచేతఁ బలాయితులయిరి. అంతలోపల నారాక్షసుండు వారిం బట్టుకొనుటకు మిగుల వేగముతోఁ బరుగిడియె. అప్పుడా శంభుండను బ్రాహ్మణుండు శ్రీరాముని స్మరించుచుఁ దనయొద్ద నున్నదియును, జలపూర్ణితమును నగు సొరకాయబుఱ్ఱను వాని ముఖమునఁ బడవైచె. ఆజలము రామమంత్రముచేత మంత్రితమైన దగుటచేత నారాక్షసునకుఁ బూర్వస్మృతిగలిగె. అంతట నారాక్షసుఁడు దూరముగ నిలిచి మిగుల వినయము నవలంబించి యిట్లనియె. ఓ మునిశ్రేష్ఠుఁడా! బ్రాహ్మణోత్తమా! ఈరాక్షస దేహమునుండి నన్నుద్ధరింపుము. నే నిప్పుడు నిన్ను శరణముపొందితిని. నాకు పూర్వస్మృతి కలిగినదనియె. ఆమాటలను విని శంభుఁడను బ్రాహ్మణుఁడు మిగులనాశ్చర్యముగలవాఁడై యిట్లనియె. ఓరీ రాక్షసాధమా! నీకిదేహముకలుగుటకుఁ గారణమేమి? ఆ విషయమును సర్వమును చెప్పుమనిన విని యారాక్షసుఁ డిట్లనియె.

* చైత్రమాస తాంబూల దాన మహిమ *

తొల్లి నేను జనస్థానమునం దొక్క బ్రాహ్మణుఁడనై యుంటిని. మఱియు నాజన్మమునందు కర్మములవిడిచి ప్రతిగ్రహము చేయువాఁడను, పాపాత్ముఁడను, దుర్మార్గవ్యసనము కలవాఁడనైతిని. అప్పుడు నాభార్య పతివ్రతయును, మంగళప్రగురాలునై యుండియు నన్నడుగకయే రామతీర్థమునకు స్నానార్థముపోయెను. అట్లుపోవుచున్న భార్యను మార్గమధ్యమునందుఁ జూచి మిగులఁ గోపముగలవాఁడనై "నన్నడుగకయే నీ వెక్కడకుఁ బోవుచున్నావు?" అని యడుగ నయ్యంగన మిగుల భయమును పొందినదై గద్గదస్వరముతో రామతీర్థమునకు స్నానమునకుఁ బోవుచున్నాననియె. మఱియునో బ్రాహ్మణోత్తమా! "ఇది చైత్రమాసము కనుక సుకృతాభిలాష చేత రామతీర్థమునకు స్నానార్థము బోవుచున్న దాననే కాని మఱే పాపకృత్యములఁ జేయుటకుఁ గాబోవుట లేను" అనియె. అట్లు మిగుల వినయముగఁ జెప్పినను నేను కోపమును విడువక మార్గమునందే తాడనము చేసితిని. మఱియు నక్కడనుండి గృహమునకుఁ దీసికొని వచ్చితిని. అంతటఁ గొన్ని దినములకు నేను మరణమునందితిని. అప్పుడు యమదూతలు వచ్చి నన్ను యమలోకమునకుఁ దోడ్కొనిపోయిరి. ఆసమయమునందుఁ జిత్రగుప్తుఁడు నన్నుఁ జూచి ధిక్కరించె. అట్లు ధిక్కరించి యమధర్మరాజుతో నిట్లనియె. ఓ యమధర్మరాజా ! వీఁడు మిగులఁ బాపాత్ముఁడు చైత్రస్నానమును వారించిన దుష్టాత్ముఁడు. కావున ముందుగ వీఁడు రాక్షసయోనియందుఁ బుట్టి పిమ్మట నరకముల ననుభవింపఁదగిన వాఁడనియె. ఆవచనములను విని యమధర్మరాజు తన యనుచరులతో నిట్లనియె. ఓ భటులారా ! వీనిని గొనిపోయి నిర్జనవనమునందు రాక్షసయోనియందుఁ బుట్టునట్లు చేయుఁడనియె. అంతట యమదూతలు నన్నుఁ గొనివచ్చి రాక్షసయోనిని పొందునట్లు చేసిరి. అదిమొదలుకొని నేను రాక్షసుఁడనై యాకలిచేతను, దప్పిచేతను, పీడింపఁబడుచున్నాఁడను. ఇప్పటికి నేనీ జన్మమును పొంది ముప్పదియైదువేల సంవత్సరములు గడచినవి. నే నేదో పూర్వజన్మమునందుఁ గొంచెము పుణ్యము చేయుటవలన నా కీ జన్మమునందు మీ సాంగత్యముకలిగెను. అందువలన నేను ధన్యుఁడనైతి నని యా రాక్షసుఁడు చెప్పినవిని శంభుఁడను బ్రాహ్మణోత్తముఁడు క్షణముసేపు హృదయమునం దాలోచించి యిట్లనియె. ఓ రాక్షసుఁడా ! నీవు పూర్వజన్మమునందుఁ జేసిన పుణ్యవిశేషమును దెలిపెదను. వినుము. ఇప్పుడు నాతో సాంగత్యము కలుగుటకుగా నాపుణ్యమే కారణమైయున్నది. నీవు పూర్వజన్మమునం దొకప్పుడు చైత్రశుక్లైకాదశియందు శ్రాద్ధభోజనముచేసి దక్షిణాతాంబూలములను గ్రహించి మొలయందు ధరించిన వస్త్రమున దోపితివి. అంతట ద్వాద

శినాటి ప్రాతఃకాలమునందు స్నానముచేయునపుడా దక్షిణా తాంబూలములు గోదావరీ తీరమునందుఁ బడె. నీ నావిషయమునే మఱచితివి. అంతటఁ గొంత సేపటికి దక్షిణాసహితమైన తాంబూలము నొక బ్రాహ్మణుఁడు గ్రహించి యిది యెవరిదని విచారించినను ఎవ్వరును నాదికాదనుటచే దాని నా బ్రాహ్మణుఁడు గ్రహించె. అట్టి తాంబూలదాన మహిమవలన నీకీ యరణ్యమునందు నాతో సాంగత్యము కలిగె. కావుననో రాక్షసుఁడా ! చైత్రమాసమునందుఁ దాంబూల దానము చేయవలయును. అని చెప్పి యారాక్షసునకుఁ జైత్రమాస మాహాత్మ్యమును దెలిపె. అంతట నాభిల్ల రాక్షసు లిరువురును చైత్రమాస మాహాత్మ్యమును వినిరి. అప్పుడా బ్రాహ్మణుఁడు కర్కశుఁడను భిల్లునితో నిట్లనియె. ఓభిల్లుఁడా ! కర్కశుఁడా ! నీ విప్పుడు నాతోఁగూడ నయోధ్యాపట్టణమునకు రమ్ము. వచ్చి చైత్రస్నానమును చేయుము. అట్లు చేయుటవలన నీవు పాప విముక్తుఁడ వగుదువు అనియె. పిమ్మట నారాక్షసునితో నిట్లనియె. ఓరాక్షసుఁడా ! నీ విక్కడనే నివసించియుండుము. రాక్షసుఁ డయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశింపఁ గూడదు. నే నయోధ్యాపట్టణమునందు చైత్రస్నానముచేసి యిక్కడకు వచ్చి నిన్ను కాంచిపట్టణమునకుఁ గొనిపోయి పాపవిముక్తుని జేయుదును. ఈవిషయము నందించుకయును సందేహమును పొందకుము. నేను మఱల నీయొద్దకు రానైతి నేని బ్రాహ్మణ హత్యాదులను జేసిన వాఁడ నగుదునని యారాక్షసునకు సంతోషమును గలిగించె. ఆకర్కశ భిల్లునకు చైత్రవ్రతము నుపదేశించుటవలన నా యరణ్యమునందలి వృక్షములన్నియును ఫలపుష్పాదులతో నిండినవయ్యెను. వాయువు శైత్యమాంద్య సౌరభ్యములు గలదై వీచె. నదులన్నియును పూర్ణ ప్రవాహము కలవయ్యె. నెమళులు నృత్యములుచేసె. అప్పుడు కర్కశుఁడను భిల్లుఁడు ఇదియంతయును చైత్రమాస మాహాత్మ్యమువలనఁ గలిగినదని సంత సించె. అంతట నా బ్రాహ్మణుఁడు భార్యాకర్కశులతోఁ గూడ మెల్లమెల్లగ నయోధ్యాపట్టణమునకుఁ బోవుచుండె. ఆసమయమునందు మార్గమధ్యంబున నొక యేనుఁగు పరుగెత్తుచుండ దానివెన్నటి సింహము పరుగెత్తుచుండె. అట్లు వచ్చుచున్న యారెండుజంతువులు వారి మార్గమున కడ్డగవచ్చె. అప్పుడు శంభుఁడా రెండుజంతువులం జూచి యిట్లనియె. ఓకర్కశుఁడా ! చూడుము. చైత్రస్నానమున కనేక విఘ్నములు సంభవించుచున్నవి. అయినను మనము చైత్రస్నానమును విడువఁగూడదు. కాశియందు వివాహము చేయఁదలఁచినను గీతను పఠించునపుడును, గయకుఁ బోవునపుడును, రామస్మరణయందును, చైత్రస్నానమునకుఁ బోవునపుడును, మహాదానమును చేయఁదలఁచినపుడును, అనేకములగు విఘ్నములు సంభవించుచుండును. అట్లు చెప్పెడు వచనములను విని కలహించుచున్న యారెండుజంతువులును పూర్వస్మృతి కలవియును, మిగుల నాశ్చర్యము

కలవియునై యత్యధికమైన ధ్వనితో నోబ్రాహ్మణోత్తమా! మమ్ము రక్షింపుము రక్షింపుమనియె. ఆవచనములను విని యాబ్రాహ్మణుఁడు మిగుల నాశ్చర్యము కలవాఁడై యో మృగేంద్రములారా! మీకీ జన్మముకలుగుటకుఁ గారణమేమి? మీవృత్తాంతమును సర్వమును జెప్పుఁడనిన విని యారెండుజంతువులలో సింహమిట్లనియె.

* నవమీ భోజనమును, పౌరాణిక నిందనము. *

ఓబ్రాహ్మణోత్తమా! నేను పూర్వజన్మమునందు రామేశ్వరక్షేత్రమునందు నివసించిన బ్రాహ్మణుఁడను. అట్టి పుణ్యక్షేత్రమునందు నివసించు బ్రాహ్మణుఁడ నయ్యు సర్వధర్మముల నిందించువాఁడను, పాషండుల వాక్యములయందు మిగుల నాసక్తికలవాఁడనయితిని. మఱియు నప్పుడొకవత్సరమునందలి చైత్రమాసమున నా రామేశ్వరమునందలి రామతీర్థమునందు స్నానముచేసిన వారందఱు వినునట్లుగ నొక పౌరాణికుఁడు చైత్రమాస మాహాత్మ్యమును చెప్పుచుండె. అది యంతయును విని వారినందఱను దూషించుటయేగాక చైత్రమాస మాహాత్మ్యమును గూడ దూషించితిని. అట్లు సదా నిందించుచుండఁగ నొక మునివరుఁడు మిగులఁ గోపముగలవాఁడై క్రూరమృగంబుగ జనింపుమని శపించె. అంతట మిగుల భీతికలవాఁడనై ప్రార్థింప నమ్మునివరుండు దయకలవాఁడై మహారణ్యమునందుఁ జైత్రమాహాత్మ్యమును వినుటచే నీకు పూర్వస్మృతి కలుగును. శాపవిముక్తుఁడవు నగుదువు. అనియె. అంతటనే నీ రూపమును పొందితిని. ఓ మునికులోత్తమా! నాపూర్వవృత్తాంతమంతయుఁ జెప్పితి. ఇప్పుడు నీవు చైత్రమాస వృత్తాంతమును చెప్పుచుండఁగ విని నేనిప్పుడు పూర్వస్మృతి కలవాఁడనైతిని. కావుననో బ్రాహ్మణోత్తమా! నన్ని దేహమునుండి యుద్ధరింపుము అని యా సింహము చెప్పినపిమ్మట నాబ్రాహ్మణుఁడు ఎదురుగనున్న యేనుఁగుతో నిట్లనియె. ఓ గజేంద్రమా! నీకిట్టి రూపముకలుగుటకుఁ గారణమేదియో తెలుపుమనిన విని యాయేనుఁ గిట్లని తన పూర్వజన్మ వృత్తాంతమును జెప్పఁదొడంగె. ఓ బ్రాహ్మణోత్తమా! నాదు వృత్తాంతమును సర్వమును దెలిపెదను. సావధాన మనస్కుఁడవై వినుము.

నేను తొల్లి కావేరీనదికి నుత్తరతీరమునందలి రామనాథపురమునందు నివసించునట్టి బ్రాహ్మణుఁడను. అట్టి పుణ్యక్షేత్రమునందుండియును పరమ దుర్మార్గవృత్తి గలవాఁడను, సర్వశాస్త్ర పరాఙ్ముఖుఁడను, సంపద్భారము చేత మదాంధుఁడను, పణ్యస్త్రీ భోగము ననుభవించువాఁడను నై యుంటిని. అట్లుండి యొకనాఁ డొక స్నేహితునిచే భోజనముకొఱకు శ్రాద్ధదినమునందు నిమంత్రితుఁడ నైతిని. ఆదినము శ్రీరామ నవమియై యుండె. అట్టి పుణ్యదినమునందు శ్రాద్ధాన్నమును భుజించిన పాపవశమున నేనుఁగు

జాతియందుఁ బుట్టితిని. ఓ బ్రాహ్మణోత్తమా! సాధారణముగఁ బ్రతి నవమి యందును భోజనము నిషేధింపఁబడియుండఁగా శ్రీరామనవమియందు భోజనము చేయఁగూడదని విశేషముగఁ జెప్పనక్కఱలేదు కదా! మఱియునో బ్రాహ్మణోత్తమా! నేనేమి పుణ్యముచేత నీ మహారణ్యమునందు నీ సాంగత్యము కలవాఁడనైతినో నాకుఁ దెలియదు. అని యా యేనుఁగు జెప్పినవిని యా శంభుఁడను బ్రాహ్మణోత్తముఁడు తన దివ్యదృష్టిచే నా యేనుఁగు పూర్వజన్మ వృత్తాంతము నెఱింగి యిట్లనియె. ఓ గజేంద్రమా! నీవు పూర్వజన్మమునందు నా సాంగత్యము గలుగుటకుఁ జేసియున్న పుణ్యంబును తెలియఁ జెప్పెదను, సావధాన చిత్తముతో వినుము. విచారమును పొందకుము. నిన్నుద్ధరించెదను. పూర్వము శ్రీరామనవమి నాఁ డొక్క బ్రాహ్మణుఁడు రామనాథపురమునందు చైత్రమాస మాహాత్మ్యమును జెప్పుచుండఁగ నీవు వింటివి. అందువలన నీకిప్పుడు నాతోఁ సాంగత్యముగలిగె. మఱియును నీవు రామతీర్థమునందు స్నానము చేసి రామలింగేశ్వరుని దర్శించితివి. ఓమతంగమా! నే నయోధ్యాపట్టణము నకుఁ బోయి సరయూనదియందలి రామతీర్థమునందు స్నానముచేసి యీమార్గముననే వచ్చెదను. అట్లు వచ్చి యప్పుడు మి మ్మిరువుర నుద్ధరించెదను. సందేహమును పొందకుఁడు. నేను మిమ్ములఁ దరింపఁజేయక పోతినేని బ్రహ్మస్వాహరణ మాతృనిందలవలనఁ గలిగెడు పాపమును పొందుదును. అని యా సింహగజంబులకు సంతోషమును నమ్మకమును గలుగునటులఁజెప్పె. ఇవ్విధముగఁ జెప్పి యా బ్రాహ్మణుఁడు భార్యాభిక్షులతోఁ గూడుకొని కరిసింహముల నా యరణ్యమునం దయుంచి మెల్లమెల్లఁగఁ బోవుచుండె. ఆసమయమునందు శ్రేష్ఠుఁడగు నొక్క సన్న్యాసి రామలింగేశ్వరమునకు భాగీరథిజలమును గొనిపోవుచుండె. అట్లు పోవుచున్న యా సన్న్యాసికి నమస్కరించి యా బ్రాహ్మణోత్తముఁడు, "ఓ స్వామీ! తా మెచ్చటినుండి దయఁజేయుచున్నారు. అనిన విని యా కార్పటికుఁ డిట్లనియె. ఓ బ్రాహ్మణోత్తమా! నేను ప్రయాగయను క్షేత్రమునుండి వచ్చుచున్నాఁడను. ఇప్పుడు రాఁబోవు చైత్రమాసమునం దయోధ్యాపట్టణము నందలి సరయూనదిలో స్నానము చేయఁదలఁచి పోవుచున్నాఁడను. ఓ బ్రాహ్మణోత్తమా! నీ వెక్కడకుఁ బోవుచున్నదియును, ఎక్కడనుండి వచ్చుచున్నదియును దెలుపు మనిన విని శంభుఁడను నా బ్రాహ్మణుఁ డిట్లనియె. నేను శివకాంచీపురమునుండి వచ్చుచున్నాఁడను. అయోధ్యాపట్టణమునకుఁ జైత్రస్నానార్థినై పోవుచున్నాఁడను. అనిన విని యా కార్పటికుఁ డిట్లనియె. ఓ బ్రాహ్మణోత్తమా! కాంచీనగరమునందు శంభుఁడను బ్రాహ్మణుఁ డొక్కఁడు కలఁడు, అతనిని నీ వెఱుఁగుదువా? అనిన నా బ్రాహ్మణుఁ డిట్లనియె. ఓ కార్పటికోత్తమా! కాంచీ నగరమునందు శంభునామధేయము గల బ్రాహ్మణు లనేకులున్నారు. వారిలో నెవ్వనిగుఱించి

నీవడిగెదవో యనిన విని యాకార్పటికోత్తముఁ డిట్లనియె. ఓ బ్రాహ్మణోత్తమా! భారద్వాజకులోత్పన్నుఁడును, చక్రగోపుఁడను గృహనామముకలవాఁడును మహాదేవుని పుత్రుండును, బ్రహ్మతుల్యుఁడును, అయిన శంభుఁడను బ్రాహ్మణు నడిగెదననియె. ఆవచనములనువిని యాబ్రాహ్మణుఁడు తనవృత్తాంతమేయని తెలిసికొని యిట్లనియె. ఓకార్పటికశ్రేష్ఠుఁడా! నీవాశంభునిక్షేమము నేమినిమిత్తముగ విచారించుచున్నావు? ఆవిషయమును సర్వమును సందేహింపక చెప్పుమనిన విని యాకార్పటికుఁ డిట్లనియె.

* చైత్ర మాసాదాన ప్రభావము. *

ఓబ్రాహ్మణోత్తమా! నే నేమి నిమిత్తముగ శంభునిక్షేమము నడిగినదియును దెలిపెదను వినుము. నేను గంగాసాగరసంగమ స్థలమును చూచుటకొఱకు బయలువెడలి సీతాకుండ సమీపముననున్న కోటక నామకదేశమునందు మిగులభయంకరమైన యొక్కపిశాచమును చూచితిని. అప్పుడా పిశాచము నన్నుఁ జంపుటకువచ్చెను. ఆసమయమునందు నేను భయకంపితుఁడనై దీర్ఘస్వరముతో శ్రీరామకీర్తనము చేసితిని. అట్లు రామనామమును స్మరించినతోడనే యాపిశాచము పలాయనముచేసెను. అట్లుపరుగెత్తి దూరముగఁబోయి నాచేతఁజేయఁబడుచున్న రామకీర్తనమునువిని పూర్వజన్మస్మృతి కలదై "యోకార్పటికోత్తమా! నన్నుఁగాపాడుమని ప్రార్థించె. అంతట నేను నీకీపిశాచరూపము వచ్చుటకుఁ గారణమేమో తెలుపుమనిన విని యాపిశాచమిట్లనియె.

ఓకార్పటికోత్తమా! నేను పూర్వజన్మమునందుఁ గాంచీపురమున నివసించియున్న ఘుండియను బ్రాహ్మణుఁడను. ఆజన్మమునందు నేను గొంచెమైనను అన్నదానమును చేసినవాఁడనుగాను. అందువలన నాకిప్పుడు పిశాచదేహము సంప్రాప్తమైనదనియె. ఆవచనమునువిని నేను "ఓపిశాచమా! నీకీదేహమునుండి విముక్తి యెట్లుకలుగునని యడిగితిని. అట్లడుగఁగా నాపిశాచమిట్లనియె. నాపుత్రుఁడు నన్నుద్దేశించి యన్నదానముచేయును. ఆసమయమునందు నేను పిశాచరూపమునుండి విముక్తుఁడనగుదుననియె. అంతట నేను నీకుమారుఁ డెక్కడనున్నాఁడని యడుగఁగా నాపిశాచము ఇప్పుడు నీతోఁజెప్పినసమాచారమును చెప్పెను. అనంతరము నివెక్కడకుఁ బోవుచున్నాఁడవనియు నన్నడిగెను. అప్పుడు నేను " రామేశ్వరమునకు రామలింగేశ్వరున కభిషేకముచేయుటకొఱకు గంగాజలమును గొనిపోవుచున్నాను. కాంచీపట్టణమునకుఁబోయి నీతనయున కీవృత్తాంతమును దెలిపెదను" అని చెప్పితిని. అట్లుచెప్పిన నావచనమునువిని యాపిశాచము పరమసంతోషమునుపొంది నాకునమస్కరించి యిట్లనియె. ఓకార్పటికో

త్తమా! అవశ్యముగ నావృత్తాంత మాతనికిఁ దెలుపుమనియె. అదియునుంగాక మధుమాసాన్నదానము సర్వోత్తమమైనదని స్వర్గమునందుఁ గొనియాడఁబడు చున్నదనియును తెలుపుము. మఱియు నోకార్పటికోత్తమా! నీవీవిషయమును నాపుత్రునకుఁ జెప్పకపోయినయెడల నీయాత్రయంతయును వ్యర్థమగును అనియె. అందువలన నాపిశాచమునకు నమ్మకముకలుగున ట్లనేకములగు వచనములను జెప్పి యక్కడనుండి బయలువెడలి యయోధ్యాపట్టణమునందు స్నానముచేయుటకుఁ బోవుచున్నాఁడను. నేనయోధ్యాపట్టణమునుండి శివకాంచీపురమునకు పోయినపు డీవిషయము నాతనికిఁ జెప్పఁదలఁచియున్నాను. కావున శంభుఁడను బ్రాహ్మణుని గోత్రాదులను దెలిసికొంటిని. అనియె. అట్లుకార్పటికుఁడు చెప్పిన తనతండ్రివృత్తాంతమును విని మూర్ఛనుపొందె. అప్పుడు భిల్లుఁడాశంభునూరార్చె. అంతఁ గొంతసేపటికిఁ దెలివొంది యాకార్పటికునితో నిట్లనియె. ఓకార్పటికోత్తమా! నాకంటె నధముఁడగువాఁ డెవ్వఁడునులేఁడు. ఇప్పుడు నీవడిగినశంభుఁడను నేను. పుత్రుఁడనగునేను నాతండ్రికి మోక్షమును కల్పింపకపోతిని. ఇదివఱకు నేనుచేసిన యన్నదానాదికమంతయును వ్యర్థమయ్యెను. కావున నేనిప్పుడు రాఁబోవు చైత్రమాసమునందు నాతండ్రినుద్దేశించి యన్నదానమును జేసెదనని శంభుఁడను బ్రాహ్మణుండు కార్పటికునితోఁ జెప్పి కొంతదూరముపోగా నయోధ్యాపట్టణము కనఁబడియె. అట్లు కొంచెముదూరమునఁ గనఁబడుచున్న యయోధ్యాపట్టణమును జూచి నమస్కరించె. అట్లునమస్కరించి కర్కశుఁడను భిల్లునితో నిట్లనియె

* అయోధ్యాపుర వర్ణనము. *

ఓభిల్లుఁడా! సర్వోత్తమమైన యయోధ్యాపట్టణము కనఁబడుచున్నది. చూడుము. ఈపట్టణమునకు స్నానార్థులయి యనేకకోటిజనులు వచ్చుచున్నారు. అదిగో నాలింపుము. జనసముదాయముయొక్క కోలాహలధ్వని వినఁబడుచున్నది. ఇంద్రచాపములవంటి ధ్వజము లనేకములు గనఁబడుచున్నవి. ఆకాశమంతయును శ్రౌతాగ్నిధూమములచేత వ్యాప్తమైయున్నది. మఱియు నోకర్కశుఁడా! భిల్లుఁడా! మేడలన్నియును కైలాసగిరులను బోలియున్నవి. మఱియు నీపట్టణమునందలి మేడలన్నియును మిగులమనోహరములును నానావిధ పతాకములచేత వ్యాప్తములునయి యున్నవి. మఱియు నోభిల్లుఁడా! పట్టణమునందలి కవాటములన్నియును, తెరవఁబడియున్నవి. పతాకములన్నియును వాయువుచేత మిగులమనోహరముగఁ గదల్పఁబడుచున్నవి. మఱియు నాపతాకములన్నియు స్నానార్థులయి వచ్చువారలఁ బిలుచుచున్న ట్లున్నవి. మఱియు నీపట్టణము ప్రాసాదశూలవ్యాజముచేత నమరావతీపట్టణమును జయించుటకు సన్నద్ధమైనదానివలెఁ గనఁబడుచున్నది. పవిత్రమైన యీపట్టణమునందు

బ్రహ్మవిష్ణుమహేశ్వరులు ప్రచ్ఛన్నులయి సంచరించుచున్నారు. ఈపురమునందలి జనులందఱును కుబేరుని జయింపవలయునను తలంపుతో ధనసముదాయమును వెదకుచున్నారు. ప్రతిమానవుఁడు నీపురమునందు మహానందముకలిగి యున్నాఁడు. ఈనగరరాజ్యమునందలి బ్రాహ్మణులందఱును ఇంద్రాదులకు నమస్కరింపఁదగినవారై యున్నారు. ఈపట్టణమునందలి ద్విజులందఱును ఔదార్యమునందు కల్పతరుతుల్యులును, గాంభీర్యమునందు సాగరసమానులును, క్షమచేత భూదేవతాసమానులును, ధైర్యమునాపుటయందు మహాంభోధిసదృశులు నునై యుండిరి. ఈపట్టణములయందలి నాలుగువర్ణములవారును దమతమధర్మములను తప్పక సంచరించుచున్నారు ఈపట్టణమునందుండువారికి మోక్షము మిగుల సులభమైయున్నది. శ్రీరామసౌధము మిగులమనోహరమైనదై వెలుగొందుచున్నది. సీతాసౌధముగూడ నతిరమ్యమై ప్రకాశించుచున్నది. అవిరెండును నానావిధములయిన రాలచేత నతిమనోహరముగఁ గట్టఁబడియున్నవి. మఱియు నోభిల్లుఁడా! సీతారాముల సౌధములు నానావిధములైన రత్నములచేత నలంకరింపఁబడి యున్నవియును, నానావిధ తోరణములచేత భూషింపఁబడినవియును, నై యున్నవి. ఓభిల్లుఁడా! విమలమును, తప్తకాంచననిర్మితమును, విచిత్రములయిన పతాకములచేతను కలశములచేతను బ్రకాశింపఁబడుచున్నదియును, తప్తజాంబూనదకుంభములచేతఁ బ్రకాశించుచున్నదియును, ప్రవాలవైడూర్యములచేత నిబద్ధమైన భూమికలదియును, హేమప్రతోలీరచితమునయి కనఁబడుచున్న సౌధము లక్ష్మణసౌధము. ఆనాల్గవసౌధము భరతునిసౌధము. రత్నభిత్తులచేత నిర్మింపఁబడిన సౌధము శత్రుఘ్నునిది స్ఫాటికమణులచేత నిర్మింపఁబడిన సౌధము హనుమంతుని సౌధము. మఱియు నోభిల్లుఁడా! బంగారముచేత నతిమనోహరముగ నిర్మింపఁబడిన యీసౌధము కుశునిసౌధము. మఱియు నోభిల్లుఁడా! చిత్రవిచిత్రములయిన వస్తువులచే స్త్రీలచూపుల నాకర్షించునదియగు సౌధరాజము లవునిది. ఈపట్టణమునందలి చిత్రవస్తువులు యోగులమనంబులఁ గూడ నపహరించుచున్నవి. ఈవిధముగ నయోధ్యాపట్టణము మిగుల మనోహరమై యున్నది. ఈపట్టణమునందలి మేడలశిఖరము లాకాశము నొరయుచున్నవి. దివ్యప్రవాలఘటితమైన కవాటములుగల ప్రాసాదము అంగదునిసౌధము. పుష్కరునిసౌధము గారుడమణులచేత నిర్మింపఁబడియున్నది. తక్కినసౌధములు తక్షాదులసౌధములు. అవియన్నియును మిగుల మనోహరములయి యున్నవి. ఓ భిల్లుఁడా! ఇట్లు నానావిధములయిన సౌధములతోఁ గూడుకొనిన యీయయోధ్యాపట్టణము రెండవ త్రిపట్టణమువలె నున్నది. ఈపట్టణమునంగల సౌధాగ్రములయందలి రత్నకుంభములు శ్రీరాముని దర్శింపవచ్చిన బాలసూర్యులవలెఁ బ్రకాశించుచున్నవని చెప్పుచు నాశంభుఁడను బ్రాహ్మణోత్తముఁడు భార్యా

భిల్లులతోఁగూడ నయోధ్యాపట్టణమునందుఁ బ్రవేశించె. అట్లు ప్రవేశించిన పిమ్మట రామతీర్థమునకుఁబోయి శాస్త్రోక్తప్రకారముగ క్షౌరాదికమును జేయించుకొనియె. అంతట నాదినమంతయు నుపవసించి మఱుదినమునందు తీర్థశ్రాద్ధము నాచరించె. అంతట చైత్రమాసాంతర్గతామావాస్య వచ్చినపుడు తనదు తండ్రినుద్దేశించి శాస్త్రోక్తప్రకారముగ నన్నదానమునుచేసె. అట్టిపుణ్యదినమునందుఁ జేసిన యన్నదానమహిమవలన నీతనితండ్రి పిశాచదేహమును వదలి స్వర్గలోకమునకుఁ బోయె. అంతట నాశంభుఁడను బ్రాహ్మణుఁడు చైత్రస్నానమునుచేసి శాస్త్రోక్తప్రకారముగ చైత్రవ్రతోద్యాపనమునుచేసె. అప్పుడు కర్కశుఁడనుభిల్లుఁడుకూడ చైత్రస్నానమును సరయూనదియందుఁ జేయుటవలనఁ బాపరహితుఁ డయ్యె. పిమ్మట నయోధ్యానగరమునందు సాధువృత్తికలవాఁడై సంచరించె పిమ్మట దనజీవితము ముగియువఱకును నాపట్టణమునందే రామనామమును స్మరించుచుఁ గాలమునుగడపె. అంతటఁ గొన్నిదినముల కయోధ్యాపట్టణమునందె మరణమునుపొంది విష్ణులోకమునకుఁబోయె. ఆశంభుఁడను బ్రాహ్మణుఁడు చైత్రస్నానానంతరము కాంచీపట్టణమునకుఁ బోఁదలఁచి శ్రీరామునకు నమస్కరించి యయోధ్యాపట్టణమునకు భార్యాకార్పటికులతోఁగూడ ప్రదక్షిణనమస్కారముల ననేకపర్యాయములుచేసి తొల్లిటిమార్గము నవలంబించి గజకేసరులున్న చోటునకువచ్చి చైత్రస్నానఫలములో రెండుదినముల పుణ్యము నారెండుజంతువులకు సమర్పించె. అంతట నారెండుజంతువులును దివ్యరూపములు గలవై దివ్యవిమానము లెక్కి విష్ణులోకమునకుఁ బోవుటను జూచి మిగుల నానందమునుబొందె. అంతట నాబ్రాహ్మణుఁడు భార్యాసమేతముగ నారాక్షసుఁడున్న చోటునకు వచ్చె. అట్లువచ్చినపిమ్మట నాబ్రాహ్మణుఁడు భార్యయగు కాశితోనిట్లనియె. ఓకాశీ! నీవయోధ్యాపట్టణమునందలి సరయూనదియందు స్నానముచేయుటవలనఁ గలిగినపుణ్యములో నొక్కనాటిపుణ్యము నీరాక్షసునకు సమర్పింపుమనియె. పద్మములవంటి నేత్రములుగల యాయంగన భర్తయగు శంభుఁడుచెప్పిన వాక్యమునువిని తనదుపుణ్యము నారాక్షసునకు సమర్పించె. అంతట నారాక్షసుఁడు తనదురాక్షసశరీరమును విడిచిపెట్టి దివ్యవిమానము నెక్కి భార్యాసహితుఁడగు నాశంభునకు నమస్కరించి దివ్యమాలాంబరములను ధరించినవాఁడై విష్ణులోకమునకుఁ బోయెను. అంతట నాబ్రాహ్మణుఁడు భార్యాసమేతుఁడై చైత్రస్నానఫలంబును వర్ణించుచుఁ గాంచీపట్టణంబునకుఁబోయె ఓపిశాచమా! నీవడిగినవిషయమును సర్వమును చెప్పితినని చెప్పనని రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగ నారసింహుఁడను బ్రాహ్మణుఁడు చెప్పి దోసిలియందు నీళ్లనుఁబోసికొని రెండుదినముల పుణ్యమునిచ్చె. అనంతరము భార్యతోఁజెప్పి రెండవపిశాచమునకుఁ గొంతపుణ్యము

నిప్పించె. అంతట నాపిశాచములు పిశాచత్వమునువిడిచి దివ్యరూపములనుధరించి యానరసింహునకును, అతనిభార్యకును నమస్కరించి తమగురువు నాశ్రమము నకుఁ బోయిరి. పిమ్మట గురువుకూడ మిగుల సంతోషముకలవాఁడై తనకుమ రితలలో నొక్కతెను వారిలో జ్యేష్ఠుఁడగువానికి నొసంగె. అంతట నాబ్రాహ్మణు లిరువురును భార్యాసమేతులయి తమతల్లిదండ్రులకడకుఁ బోయిరి. అట్లు భార్యా సమేతులయివచ్చిన పుత్రులనుజూచి మిగులసంతోషము గలవారైరి. అంతట మాతండ్రియగు నరసింహుఁ డబ్జకమునకుఁబోయి చైత్రస్నానమునుచేసె. ఆస్నాన మహిమవలనఁ గొన్నిదినములకు నేనుపుట్టితి. రామప్రసాదమువలనఁ బుట్టుట చేత నాకు తల్లిదండ్రులు రాముఁడనుపేరుపెట్టిరి. పిమ్మటఁ గొన్నిదినములకు నాతల్లిదండ్రులు దేహమును జాలించి స్వర్గమునకుఁబోయిరి. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగఁ జైత్రస్నానమహిమను మానవులు దేవతలు సిద్ధులు గంధర్వులు మొదలగువార నేకు లనుభవించిరి. కావున నవశ్యముగ చైత్రస్నాన మును జేయవలయును. నీవడిగినవిషయమును సర్వమును దెలిపితిని. ఇంకనీకు దేనియందభిలాషకలదో తెలుపుము.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పదునొకండవసర్గము ముగిసెను.

——:(o):——

* రామశివుల కభేదమును చెప్పుట. *

ఓ గురూత్తమా! రామచరితము వినఁగ వినఁగ నాహ్లాదము కలుగఁజేయు చున్నది. కావున వినఁదగిన విషయ మిదియని నేను నిర్ణయింపఁ జాలకున్నాఁడను. కావున నింకను రామచరితమును జెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని రామదాసు మఱల నిట్లనియె. ఓ శిష్యోత్తమా! నీవు వాస్తవమును దెలిపితివి. సావధానమనస్కుఁడవై వినుము. తొల్లి యొకనాఁడు శ్రీరాముఁడు గుఱ్ఱము నెక్కి బంధుమిత్రాదులతోఁ గూడ నరణ్యమునకుఁ బోయె. పోయి యక్కడ నొక మృగమునుజూచి దానిం జంపుటకు బాణమును గ్రహించి దాని వెన్నంటి మిగుల వేగముగఁ బోయె. అట్లు బయలువెడలి యొక వనమునుండి యొకవన మునకుఁబోయె. అవ్విధముగ నొక్కఁడే హయారూఢుఁడై పోవుచు మిగుల భయంకరమైన గహనమునందుఁ బ్రవేశించె. ఆ సమయమున లక్ష్మణాదులంద ఱును దూరముగ వెనుక నుండిరి. అంతటఁ గొంతసేపటికి శ్రీరాముఁడు నిజ బాణముచేత నా మృగమును హరించిన పిమ్మట నిర్జలమైన యా యరణ్యము నందుఁ దృషాక్రాంతుఁడయ్యె. అందువలన శ్రీరాముఁడు శ్రమాన్వితుఁడై క్షణ కాల మొకవృక్షముక్రింద విశ్రమించె. అప్పు డొక్కభిల్ల స్త్రీ శ్రీరామునిజూచి

మిగుల సంతోషముకలదై రాజునుగాఁ దెలిసికొని నమస్కరించి యెదుటఁ నిలిచియుండె. అంతట శ్రీరాముఁ డాభిల్ల స్త్రీతో నిట్లనియె. ఓ స్త్రీ రత్నమా! నాతమ్ములగు లక్ష్మణాదులు దూరముగనున్నారు. నేను క్షుత్తృష్ణలచేతఁ బీడింపఁబడినవాఁడనైతిని. కావున నాయాకలిదప్పుల మాన్పుటకుఁ దగినయత్నమును జేయుము. అనిన విని యాభిల్ల స్త్రీ యిట్లనియె. ఓ రఘూత్తమా! ఇక్కడకు సమీపమున నొక సరస్సుగలదు. దానికి సమీపమున దుర్గాదేవియున్నది. నేఁడు భౌమవారమగుటచేత నక్కడ కనేకమంది స్త్రీలు వచ్చుచున్నారు. నీవక్కడకుఁ నాతోఁగూడ రమ్ము. అట్లయినయెడల నీవక్కడ విచిత్రాన్నములచేతఁ దృప్తిని బొందఁగలవు అనిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓ స్త్రీరత్నమా! నన్ను వెదకుచుఁ గుశలవలక్ష్మణాదులు విచ్చేయుదురు. కావున వారల నిరీక్షించుచు నిక్కడనే యుండెదనని విని యాభిల్లాంగన మిగులఁ ద్వరగాఁ బోయి దుర్గాలయంబుకడ నున్న స్త్రీలం జూచి యిట్లనియె. ఓ యంగనలారా! పద్మపత్రములవంటి నేత్రములుగల శ్రీరామచంద్రుఁడు వేటకొఱకువచ్చి క్షుత్పీడితుఁడై యిక్కడకు సమీపమున నొక్కచెట్టుదాపున విశ్రమించి యున్నాఁడు. మఱియు నన్ను దాహశాంతికొఱకు నేదైనఁ గలదేని తీసికొని రమ్మని పంపుటచేత నేనిక్కడకు వచ్చి యీ వృత్తాంతమును మీకుఁ దెలిపితిని. మఱల నే నక్కడకుఁ బోయెదను. అనిన విని యాస్త్రీ లందఱును మిగులఁ ద్వరగలవారై యాభిల్ల స్త్రీని గారవించి యందలి నూఱుమంది స్త్రీలును తమలోఁ దా మిట్లనిరి. "ఓ యంగనలారా! ఈ దినము మిగుల సుదినమై యున్నది. మన మందఱమును ధన్యురాంద్రమైతిమి. నేటిదినము రామదర్శనము కాఁగలదు. వరాన్నములచేత రామునకు సంతోషమును గల్పింతము. మనమందఱమును ముందుగ దుర్గను బూజించి నివేదించి వెంటనే రాముని బూజించుటకుఁ బోవుదము. పోయి రామునకు మృష్టాన్నముల నొసఁగుదము" అని తలంచి నానావిధాభరణములచేత నలంకరింపఁబడిన యాస్త్రీలందఱు నైవేద్య పాత్రములతోఁగూడ దుర్గాదేవిదగ్గఱకుఁ బోయిరి. అవ్విధముగా నాస్త్రీలందఱును తనయాలయముకు వచ్చునంతలోపల దుర్గాదేవి తనదు తలుపులను బంధింపఁజేసి తాను లోపలఁ బ్రవేశించియుండె. అంతట నాస్త్రీలందఱును దుర్గాలయముదగ్గఱకు వచ్చి ద్వారము బద్ధమైయుండుటను జూచి లోపలఁ బ్రవేశించుటకు మార్గము దొరకకపోవుటచేత మిగుల నాశ్చర్యమును బొందిన మనస్సు కలవారై ద్వారదేశమునందు క్షణకాల మాలోచించుచుండిరి. అంతలోపల దేవాలయమునుండి యుచ్చైస్స్వరముతో నొక కొన్ని వాక్యము లిట్లు వినఁబడెను. "ఓయంగనలారా! నేనే సీతాదేవిని. రాముఁడే మహేశ్వరుఁడు. నాకును సీతకును, పరమశివునకును రామునకును భేదమును జూచువారును, భేదముగఁ బూజించువారును, కోటికల్పములకాలము నరకములయందు దుఃఖమును బొందు

దుదు. కావున నో యంగనలారా! నా నాథుఁడగు శ్రీరాముని ముందుగఁ బూజించి సంతోషమును పొందింపుఁడు. ఆ రాముఁడు భుజింపఁగా మిగిలిన యన్నమును నాకు నివేదింపుఁడు. అట్లు చేసినయెడల నేను సంతోషమును పొందుదును. శీఘ్రముగఁ బొండు. శ్రీరాముఁడు మిగుల నాకలి గొనియున్నాఁడు" అట్లు దుర్గాలయమునుండి వినఁబడిన వాక్యములను విని యా స్త్రీలందఱును మిగుల నాశ్చర్యమును బొందినవారై యాభిల్లస్త్రీని వెంటనంటి యతి శీఘ్రముగఁ బోయిరి. అంతట నాభిల్లస్త్రీ యా యంగనలకు శ్రీరాముని జూపె. అప్పు డా స్త్రీలందఱును పద్మముల వంటి నేత్రములచేత శ్రీరామునిజూచి మిగుల సంతోషము కలవారై నమస్కరించిరి. అంతట దివ్యాన్నాదులను శ్రీరాముని యెదుట నుంచి యనేకవిధములఁ బ్రార్థించి యిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! మే మందఱమును నీచేతఁ దరింపఁబడినవారమైతిమి. శబరస్త్రీని బంపి మమ్ము రప్పించుటచేతఁ మాయందు గల దయను జూపితివి. దుర్గాదేవివలన బంపఁబడిన యీ దివ్యాన్నాదుల భుజింపుమనిరి. అవ్విధముగ నా స్త్రీలు చెప్పిన వాక్యములను విని శ్రీరాముఁడు మిగుల నాశ్చర్యము కలవాఁడై యిట్లనియె. ఓ యంగనలారా! దేవి యెవ్వతె? ఆదేవి మీ కేమని చెప్పె? ఆవిషయమును సర్వమును దెల్పుఁడనిన విని యా స్త్రీ లిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! దుర్గనగు నేనే సీతయనియును, శ్రీరాముఁడే మహేశ్వరుఁడనియును, దుర్గాసీతలకును, శివరాములకును భేదమును జూచువారు నరకమును పొందుదురనియును, కావున ముందుగ శ్రీరామునకు నివేదింపుఁడనియును బలికె. మఱియు నో రామచంద్రా! నీ యుచ్ఛిష్టమును దాను భుజించెదననియె. కాఁబట్టి యో రఘుకులోత్తమా! ముందుగ నీ వీయన్నమును భుజింపుము. అట్లుచేసి మమ్ములఁ దరింపఁజేయుమనిన విని శ్రీరాముఁ డిట్లనియె. ఓ యంగనలారా! మీ దేవి యగు దుర్గ చెప్పిన మాటలు సత్యమైనయెడల మీలో నొకతె పోయి యాదుర్గను దోడ్కొనిరావలయు ననియె. అంతట నా స్త్రీలలో నొకతె బయలువెడలిపోయి శ్రీరాముని వాక్యమును దుర్గాదేవికి విన్నవించె. అప్పుడు దుర్గాదేవి యావచనమును విని యిదిగో వచ్చుచున్నానని చెప్పి కవాటమును భేదించుకొని సీతా రూపముతో బయలువెడలె. అట్లు బయలువెడలునపుడు కవాటమును మఱల బంధించి యుదక పాత్రమును చేతియందుఁ బెట్టుకొని నవ్వుచున్న మోముకలదై శ్రీరాముని దగ్గరకువచ్చి నమస్కరించి యారామునకుఁ బార్శ్వభాగమునందు నిలిచె. ఆ సమయమునం దా స్త్రీలందఱును మిగుల నాశ్చర్యము కలవారైరి. అంతట శ్రీరాముఁడు బ్రాహ్మణ క్షత్రియస్త్రీలు తెచ్చిన పక్వాన్నములు భుజించుటకు స్నానము చేయఁదలఁచినవాఁడై ధనుస్సున సంధించి బాణమును బ్రయోగించి భూమినిభేదించి పాతాళోదకమును రప్పించె. పిమ్మట నయ్యుదకమునందు స్నానముచేసి మాధ్యా

హ్నిక కృత్యములను నెరవేర్చి భుజించుటకుఁ బ్రయత్నించు లోపల నక్కడకు కుశాదులు సర్వసైన్యములతోఁ గూడ వచ్చేసిరి. వచ్చి సీతా మహాదేవినిజూచి వారందఱును మిగుల నాశ్చర్యమును పొందిరి. పిమ్మట భిల్లస్త్రీవలన జరిగిన వృత్తాంతమును సర్వమును దెలిసికొనిరి. అంతట వారందఱును రామచంద్రుని చంద్రశేఖరునిగాఁ దెలిసికొనిరి అప్పుడు శ్రీరాముఁడు సీతాసమేతుఁడై కుశాదులతోఁ గూడ సుఖముగ భుజించి యాస్త్రీలతో నిట్లనియె ఓ యంగనామణులారా! మీకుఁ గావలసినవరములను గోరుఁడు. మీ యభీష్టము నెరవేర్చెద ననిన విని యాస్త్రీలందఱు నిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! మాకు దేనిచేత శాశ్వతమైన కీర్తికలుగునో యట్టివరమును దయచేయుమనిరి. ఆవచనము విని శ్రీరాముఁడు మిగుల నధికముగ సంతోషించిన మనస్సుగలవాఁడై యిట్లనియె. ఓ యంగనలారా! ఇది మొదలుకొని మీకు రామ యను నామధేయము కలిగి యుండును. మీకు నాయందు మిగుల భక్తి కలిగి యుండును. మఱియునో యంగనలారా! మీరు సర్వకాలములయందును దేవునియందున, బ్రాహ్మణులయందును, పుణ్యకథలయందును, ధర్మమునందును, భక్తికలిగి యుందురు. మఱియునో యంగనలారా! మీరు సర్వకాలములందును పావనలును, సాధువులునై యుందురు గాక. మాంగల్యమునందును, శకునమునందును, సర్వకర్మములయందును మీరు పావనలును, శుభకరులునై యుందురు. ఓ యంగనలారా! మీరందఱును త్రివేణీస్మృత మస్తకులగుదురు గదా! నా బాణముచేతఁ జేయఁబడిన యీ తీర్థము నాపేరుతో మిగులఁ బ్రసిద్ధమై యుండుననియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పినవాక్యములను విని యాస్త్రీలందఱును మిగుల సంతోషము కలవారై యిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! మాకు మఱొకజన్మమునందుఁ గూడ నీ దర్శనమగునట్టుల ననుగ్రహింపుమనిరి. ఆ వచనములను విని శ్రీరాముఁడిట్లనియె. ఓ యంగనలారా! నేను ద్వాపరయుగమునందు కృష్ణరూపముతో నవతరింతును. అప్పుడు మీరందఱును నన్ను దర్శింపఁగలరు ఆయుగమునందుఁ గూడ నేను అరణ్యములో యజ్ఞమునందలి యన్నమును యాచించెదను. అప్పుడు మీరందఱును బ్రాహ్మణ భార్యలయి యుండఁగలరు ఈ భిల్ల స్త్రీ గూడ బ్రాహ్మణ భార్యయై పుట్టఁగలదు. ఓ యంగనలారా! ఈ భిల్ల స్త్రీ నన్నుఁ జూడఁదలచినపుడు దీని భర్త దీనిని స్తంభమునకంటఁ గట్టికొట్టును. అంతట నీ యంగన నాయందుంచఁబడిన మనస్సుకలదియై యరణ్యమునకుఁ బోయి భిన్న దేహముతో నన్నుఁ బొందెడు కౌతుకమును పొందును. ఆసమయమునందు మీరందఱు నావేడుకను చూడఁగలరు. మీ రందఱు నాయందుంచఁబడిన మనస్సుకలవారై సర్వకాలములయందును నన్ను ధ్యానముచేయుఁడు. ఈవిధముగఁ జేసినయెడల నాలోకమును పొందుదురు. తారక మంత్రముగు నానామ

మును సర్వకాలములయందును స్మరించుటచేత సర్వోత్తమ మైన గతి లభించునని యా స్త్రీలకు వరముల నిచ్చి తనయెదుటనున్న సీతతో నిట్లనియె. ఓసీతా ! నీ వెక్కడనుండి వచ్చితివో యక్కడకు మఱలఁ బొమ్మనియె. అంతట నాసీతాదేవి శ్రీరామునకు నమస్కరించి మఱల దేవాలయమునకుఁ బోయె. అట్లు దేవాలయమునకుఁ బోయి మఱల దుర్గారూపమును ధరించి యుండె. అప్పు డా స్త్రీ లందఱును మిగుల నాశ్చర్యమును బొందిరి. పిమ్మట నా స్త్రీ లందఱును దుర్గాదేవి వాసస్థలమునకుఁ బోయిరి. అంతట శ్రీరాముఁడు బానుమిత్రాదులతోఁ గూడుకొని స్వనగరమునకుఁ బోయె. అట్లు గృహమునకుఁ బోయినపిమ్మట కుశుఁడు తల్లియగు సీతను వనమందలి వృత్తాంతము నడిగె. అప్పుడు సీతా మహాదేవి యావిషయమును సర్వమును దాను చూచినదానివలెఁ జెప్పెను. అంతట లక్ష్మణాదులు శ్రీరాముని పరమేశ్వరునిగాఁ దెలిసికొనిరి. సీతామహాదేవిని దుర్గాదేవినిగాఁ దెలిసికొనిరి. ఓ శిష్యోత్తమా ! ఈవిధముగ శ్రీరాముఁడు లోకులకుఁ గలిగిన ద్వైతబుద్ధిని బోఁగొట్టె. అట్లు శ్రీరాముఁడు వరమునిచ్చుటచేత స్త్రీలు రామలని పిలువఁబడుచున్నారు.

* శ్రీరామమంత్ర సముద్రావస్త్ర ధారణమహిమ. *

ఓ శిష్యోత్తమా ! స్త్రీ శూద్రాదులకుఁ గూడ రామనామమువంటి మంత్రము మఱియొక్కటి యేదియును లేదు. సకల బాధల యందును రామ మంత్రమును పఠించినయెడల నాబాధలన్నియు నివర్తించిపోవును. తొలుత మహాపాపమును జేసి పిమ్మట పశ్చాత్తాపము కలవాఁడై రామనామమును జేసిన యెడల నప్పాపమునుండి విముక్తుఁడగును. నాలుగువర్ణములవారును, నాలుగాశ్రమములవారును గమనభోజనశయన క్రీడనాదులయం దెల్లపుడును రామనామమును స్మరింపవలయును. కాలరూపుఁడయిన రాముని మంత్రమును జపించుటకుఁ గొంచెమైనను గాలనియమము లేదు. కావున సర్వకాలములయందును రామమంత్రమును జపింపవలయును. రామమంత్రము ముఖమునందుఁగలవాఁడును, దేహమునందు రామముద్రకలవాఁడును, రామముద్రాంకితమైన వస్త్రము కలవాఁడును, అగు మానవునిజూచి యముఁడు తొలఁగిపోవును. రామముద్రాంకితమైన వస్త్రము "సముద్రావస్త్రము" అని చెప్పఁబడుచున్నది. సకలవస్త్రముల లోపల రామముద్రాంకితమైన వస్త్రము సర్వోత్తమమైనది. సముద్రావస్త్రమును దేహమునందు ధరించుకొను మానవోత్తముని పాపమేదియు నంటఁజాలదు. సముద్రావస్త్రధారియగు మానవోత్తమునిజూచి యమదూతలు పలాయనమును బొందుదురు. తొల్లి మునులందఱును శ్రీరామునిబిలిచి యిట్లనిరి. ఓరామా ! కలియందలి మానవులందఱును వ్యగ్రచిత్తులును, మందబుద్ధికలవారు నగుదురు.

ఇంతయగాక తమపొట్ట నిండించుకొనుటకొఱకు నింటింటను దిరుగుచుందురు. కావున నట్టివారికి మేలుచేయుటకొఱకు నిన్ను యాచించుచున్నారము. కాఁబట్టి యట్టివారు తరించుటకుఁ దగినయుపాయమును చెప్పుమనిన విని శ్రీరాముఁడు మిగుల సంతోషముకలవాఁడై యిట్లనియె. ఓమునికులోత్తములారా! మీరు చక్కని ప్రశ్నమును చేసితిరి. కలియుగమునందలి వారు నాముద్రచేత నంకితమైన వస్త్రమును ధరింపవలయును. నాముద్రాంకితమైన వస్త్రమును ధరించుచున్న మానవోత్తముని పాపము లేశియు నంటఁజాలవు. మానవులు మిగులభక్తితో శంఖచక్రగదాముద్రాంకితమైన వస్త్రమును ధరింపవలయును. శంఖము మొదలుగాఁగల నైదువిధములయిన చిహ్నములతోఁగూడిన వస్త్రము నాకు మిగులఁ బ్రియమైనది. నాముద్రచేత నంకితమైన వస్త్రముకూడ నాకు మిగులఁ బ్రియమైనది. నాముద్రాంకితమైన వస్త్రము జపకాలమునందు ముఖ్యముగ ధరింపవలయును. భోజనవిహారకాలములయందుఁ గూడ ధరింపవలయును. మలమూత్రములను విడిచెడుకాలమునందును, శయనక్రీడాకాలములయందును, అశుచిక్షయవృద్ధులుగల కాలమునందును, హట్టమునందును, రాజసభలయందును, మార్గమునందును, దుర్జనసంసర్గగల కాలమునందును, ముద్రాంకిత వస్త్రమును ధరింపఁగూడదు. మఱియు నిటులనే భోజనకాల విహారకాలములయందుఁగూడ ముద్రా వస్త్రమును ధరించుట యుచితము కాదు. స్నానకాలమునందును, వ్రతమునందును, తీర్థమునందును, పూజయందును, పితృకర్మమునందును, హోమమునందును, దానజపములనుచేయు కాలమునందును, చాంద్రాయణ వ్రతాదులయందును, నిత్యకర్మములయందును, కామ్యకర్మములయందును, తపస్సును చేయుకాలమునందును, ముద్రావస్త్రమును ధరింపవలయును. నాముద్రాంకితమైన వస్త్రమును ధరించువాన్ని నేను మోక్షమునిత్తుననియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పిన వాక్యములనువిని యా మునులందఱును మిగుల సంతోషముకలవారైరి. కావున నోశిష్యోత్తమా! సర్వకాలములయందును రామముద్రాంకితమైన వస్త్రమును ధరింపవలయును. సర్వకాలములయందును "రామ" యనియెడు రెండక్షరముల మంత్రమును జపింపవలయును. మఱియు నోశిష్యోత్తమా! గోపీచందనాదుల చేత శుభకరమైన రామముద్రను ధరింపవలయును. శ్రీరామునకు సంతోషము కలుగుటకొఱకు శ్రీరాముని సర్వకాలములయందును పూజింపవలయును. సర్వకాలములయందును రామతీర్థమునందు స్నానమును జేయవలయును. ఇంత యగాక యీయానంద రామాయణమును మానవులు పారాయణము చేయువలయును. ఈ యానందరామాయణమును సర్వకాలములయందును పారాయణము చేయుటచేత జననమరణములు కలుగనేరవు. శ్రీరాముని సర్వకాలములయందును శ్రవణమనన ధ్యానములు చేయవలయును. రాముని వదలి చేయఁదగిన

కార్య మేదియును లేదు. ముందుగ హనుమత్కవచమును పఠించి పిమ్మట శ్రీరామకవచమును పఠింపవలయును. హనుమత్కవచమును వదలి రామకవచమును పఠింపఁగూడదు. హనుమత్కవచమును వదలి రామకవచమును పఠించుట యరణ్యరోదనము చేయుటవంటిది. రామస్తోత్రము సర్వభయముల నివారించునట్టిది. శ్రీరామకవచము సర్వకాలములయందును పఠింపఁదగినదనిన విని విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! హనుమత్కవచమును వినవలయునని నాకభిలాష కలిగియున్నది. రామకవచమును గూడ వినవలయునని యభిలాషయున్నది. కావున నాయందు దయయుంచి హనుమత్కవచంబును, రామకవచంబును జెప్పుమనిన విని రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా! నీయిష్టానుసారముగ రామకవచ హనుమత్కవచములను చెప్పెదను. సావధానమనస్కుఁడవై వినుము.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పండ్రెండవసర్గము ముగిసెను.

---:(o):---

* శ్రీరామ కవచ హనుమత్కవచములు. *

తొల్లి యొకపర్యాయము సుఖముగఁ గూర్చున్నవాఁడును, సకలలోకములకు సుఖమును కలుగఁజేయువాఁడును, కర్పూరమువలెఁ దెల్లనివాఁడును అయిన పరమేశ్వరునితోఁ బార్వతియిట్లనియె. ఓభగవంతుఁడా! దేవదేవేశుఁడా! లోకనాథుఁడా! లోకప్రభుఁడా! దుఃఖముచేతఁ బీడింపఁబడుచున్న లోకములకు దేనిచేత సంరక్షణము కలుగును? యుద్ధము, ఘోరమైనసంకటము, భూతప్రేతాదిభయము, కలిగినపుడు భయము దేనిచేత నివారణమగునో యట్టిదానిని తెలియఁజేయుమనినవిని శ్రీమహాదేవుఁ డిట్లనియె. ఓదేవీ! లోకములకు హితమును చేయవలయుననియెడు తలంపుతో నడిగిన నీప్రశ్నమును జెప్పెదను. వినుము. శ్రీరాముఁడు తొల్లి విభీషణునియందలి ప్రేమచేత రామకవచమును చెప్పె. మఱియును ధీమంతుఁడగు హనుమంతుని కవచమునుగూడఁ జెప్పెను. కాఁబట్టి యారహస్యములను నీకుఁ జెప్పెదను. సావధానచిత్తవై వినుము.

* హనుమత్ప్రార్థనము. *

"శ్లో॥ ఉదయాదిత్య సంకాశ ముదార భుజవిక్రమమ్ । కందర్పకోటి లావణ్యం సర్వవిద్యావిశారదమ్ । శ్రీరామహృదయానందం భక్తకల్పమహీరుహమ్ । అభయంవరదందోర్భ్యాం కలయే మారుతాత్మజమ్ । హనూమా నంజనీసూను ర్వాయుపుత్రో మహాబలః । రామేష్టః ఫాల్గునసఖా పింగాక్షో ఽమిత విక్రమః । ఉదధిక్రమణశ్చైవ సీతాశోకవినాశనః । లక్ష్మణప్రాణదాతాచ దశగ్రీవస్యదర్పహా॥ ఏవం ద్వాదశనామాని కపీంద్రస్య మహాత్మనః । స్వాపకాలే

ప్రబోధేచ యాత్రాకాలేచ యఃపఠేత్ ।తస్య సర్వభయం నాస్తిరణేచ విజయీభవేత్ । రాజద్వారేగహ్వరేచ భయంనాస్తి కదాచన॥ ఉల్లంఘ్య సింధోస్సలిలం సలీలం యశ్శోకవహ్నిం జనకాత్మజాయాః। ఆదాయ తేనైవ దదాహ లంకాం నమామి తం ప్రాంజలి రాంజనేయమ్॥ ”

* హనుమన్మంత్ర విధానసహిత హనుమత్కవచము. *

ఓన్నమో హనుమతే సర్వగ్రహాన్ భూతభవిష్యద్వర్తమానా న్సమీపస్థాన్ సర్వకాలదుష్టబుద్ధీన్ ఉచ్చాటయోచ్చాటయ పరబలాన్ క్షోభయక్షోభయ మమ సర్వకార్యాణి సాధయసాధయ ఓం హ్రాం హ్రీం హ్రూం ఫట్॥ ఘేఘేఘే ఓం శివసిద్ధిం ఓం హ్రాం ఓం హ్రీం ఓం హ్రూం ఓం హ్రైం ఓం హ్రౌం ఓం హ్రః స్వాహా॥ పరకృత యంత్ర మంత్ర పరహంకార భూత ప్రేత పిశాచదృష్టి సర్వవిఘ్నదుర్జనచేష్టా కువిద్యాసర్వోగ్రభయాని నివారయ నివారయ బంధబంధ లుంఠలుంఠ విలుంపవిలుంప కిలికిలికిలి సర్వకుయంత్రాణి దుష్టవాచం ఓం ఫట్స్వాహా॥ ఓ మస్య శ్రీహనుమత్కవచస్తోత్రమంత్రస్య శ్రీరామచంద్ర ఋషిః, శ్రీహనూమాన్పరమాత్మా దేవతా, అనుష్టుప్ఛందః, మారుతాత్మజ ఇతిబీజం అంజనీసూనురితిశక్తిః, లక్ష్మణప్రాణదాతేతి కీలకమ్ । రామదూతాయేత్యస్త్రం, హనూమాన్దేవతా ఇతికవచమ్. పింగాక్షోఽమితవిక్రమ ఇతిమంత్రః । శ్రీరామచంద్ర ప్రేరణయా శ్రీరామచంద్ర ప్రీత్యర్థం మమ సకలకామనాసిద్ధ్యర్థం జపేవినియోగః॥ అథాంగన్యాసః॥ ఓం హ్రాం అంజనీసుతాయ అంగుష్ఠాభ్యాంనమః । ఓం హ్రీం రుద్రమూర్తయే తర్జనీభ్యాంనమః । ఓం హ్రూం రామదూతాయ మధ్యమాభ్యాం నమః । ఓం హ్రైం వాయుపుత్రాయ అనామికాభ్యాం నమః । ఓం హ్రౌం అగ్నిగర్భాయ కనిష్ఠికాభ్యాం నమః । ఓం హ్రః బ్రహ్మాస్త్రనివారణాయ కరతలకరపృష్ఠాభ్యాం నమః॥ (ఏవం హృదయాద్యంగన్యాసంకృత్వాఅథధ్యానమ్)॥ ధ్యాయేద్బాల దివాకరద్యుతినిభం దేవారిదర్పాపహం దేవేంద్రప్రముఖం ప్రశస్తయశసం దేదీప్యమానంరుచా । సుగ్రీవాదిసమస్తవానరయుతం సువ్యక్తతత్త్వప్రియం । సంరక్తారుణలోచనం పవనజంపీతాంబరాలంకృతమ్॥ఉద్యన్మార్తాండకోటి ప్రకటరుచియుతం చారువీరాసనస్థం మౌంజీయజ్ఞోపవీతాభరణరుచిశిఖం శోభితం కుండలాంకం । భక్తానామిష్టదం తం ప్రణతమునిజనం వేదనాదప్రమోదమ్ । ధ్యాయాదేవం విధేయం ప్లవగకులపతిం గోష్పదీభూతవార్ధిమ్॥ వజ్రాంగం పింగకేశాఢ్యం స్వర్ణకుండలమండితమ్ । నిగూఢ ముపసంగమ్యపారావారపరాక్రమమ్॥ స్ఫటికాభం స్వర్ణకాంతిం ద్విభుజంచ కృతాంజలిమ్ । కుండలద్వయసంశోభిముఖాంభోజం హరింభజే॥ సవ్యహస్తేగదాయుక్తం వామహస్తేకమండలుం । ఊర్మ్యాదక్షిణదోర్దండం హను

మంత్రం విచిన్తయేత్॥ అథమనుః॥ ఓంనమో భగవతే శోభితాననాయ యశో లంకృతాయ అంజనాగర్భసంభూతాయ రామలక్ష్మణానందకాయ కపిసైన్య ప్రకాశన పర్వతోత్పాటనాయ సుగ్రీవసాహ్యకరణ పరోచ్చాటనకుమార బ్రహ్మచర్య గంభీరశబ్దోదయాయ ఓం హ్రీం సర్వదుష్టగ్రహనివారణాయ స్వాహా॥ ఓం నమోహనుమతే ఏహి ఏహి ఏహి సర్వగ్రహభూతానాం శాకినీ ఢాకినీనాం విశమ దుష్టానాం సర్వేషా మాకర్షయాకర్షయ మర్దయమర్దయ భేదయభేదయ మర్త్యాన్మారయ మారయ శోషయ శోషయ ప్రజ్వల ప్రజ్వల భూతమండల పిశాచమండల నిరసనాయ భూతజ్వర ప్రేతజ్వర చాతుర్థికజ్వర బ్రహ్మరాక్షస పిశాచచ్ఛేదనక్రియా విష్ణుజ్వర మహేశజ్వర ఛింధిఛింధి భింధిభింధి అక్షిశూలే శిరోభ్యంతరయక్షిశూలే గుల్మశూలే పిత్తశూలే బ్రహ్మరాక్షసకుల ప్రబల నాగకులవిషనిర్విష ఝుడితి ఝుడితి। ఓం హ్రీం ఫట్ ఘేఘే స్వాహా॥ ఓం నమో హనుమతే పవనపుత్ర వైశ్వానరముఖ పాపదృష్టి శోధాదృష్టి హనుమతే శో ఆజ్ఞాస్ఫురేస్వాహా॥ స్వగృహేద్వారే పట్టకే తిష్ఠతిష్ఠేతి తత్రరోగ భయం రాజకులభయం నాస్తి తస్యోచ్చారణమాత్రేణ సర్వే జ్వరా నశ్యంతి॥ ఓం హ్రాం హ్రీం హ్రూం ఫట్ ఘేఘే స్వాహా॥

శ్రీరామచంద్ర ఉవాచ॥ హనూమాన్పూర్వతః పాతు దక్షిణే పవనాత్మజః। పాతుప్రతీచ్యాం రక్షోఘ్నః పాతు సాగరపారగః॥ ఉదీచ్యా మూర్ధ్వతః పాతు కేసరీప్రియనందనః। అధస్తు విష్ణుభక్తస్తు పాతుమధ్యంచ పావనః॥ లంకావిదాహకః పాతు సర్వాపద్భ్యో నిరంతరం। సుగ్రీవసచివః పాతు మస్తకం వాయునందనః॥ ఫాలంపాతు మహావీరో భ్రువోర్మధ్యే నిరంతరం। నేత్రేఛాయాపహారీచ పాతునః ప్లవగేశ్వరః॥ కపోలేకర్ణమూలేచపాతు శ్రీరామకింకరః। నాసాగ్ర మంజనాసూనుః పాతువక్త్రం హరీశ్వరః॥ వాచంరుద్రప్రియః పాతు జిహ్వాం పింగళలోచనః। పాతుకంఠంచ దైత్యారిః స్కంధౌపాతు సురార్చితః॥ భుజౌపాతు మహాతేజాః కరౌతు చరణాయుధః। లంకానిభంజనః పాతు పృష్ఠదేశేనిరంతరం॥ నాభించ రామదూతస్తు కటిం పాత్వనిలాత్మజః। గుహ్యంపాతు మహాప్రాజ్ఞో లింగంపాతు శివప్రియః॥ ఊరూచ జానునీపాతు లంకాప్రాసాద భంజనః। జంఘేపాతుకపిశ్రేష్ఠో గుల్ఫౌపాతుమహాబలః॥ అచలోద్ధారకః పాతు పాదౌ భాస్కరసన్నిభః। అంగాన్యమితసత్వాఢ్యః పాతుపాదాంగులీస్తథా॥ సర్వాంగాని మహాశూరః పాతు రోమాణిచాత్మవిత్। హనుమత్కవచంయస్తు పఠేద్విద్వా న్విచక్షణః। సఏవపురుషశ్రేష్ఠో భుక్తిం ముక్తిం చ విందతి॥ త్రికాల మేకకాలం వాపఠేన్మాసత్రయం నరః। సర్వాన్రిపూన్ క్షణాజ్జిత్వా సపుమాం ఛ్ఛ్రియ మాప్నుయాత్॥ మధ్యరాత్రే జలేస్థిత్వా సప్తవారం పఠేద్యది। క్షయా పస్మార కుష్ఠాది తాపత్రయనివారణం॥ అశ్వత్థమూలే ఽర్కవారే స్థిత్వా పఠతి

యశఃపుమాన్ । అచలాం శ్రియమాప్నోతి సంగ్రామే విజయంతథా ॥ బుద్ధిర్బలం యశోధైర్యం నిర్భయత్వ మరోగతా । సుదార్ఢ్యం వాక్స్ఫుటత్వంచ హనూమ త్స్మరణాద్భవేత్ ॥ మారణం వైరిణాంసద్య శ్శరణం సర్వసంపదాం । శోకస్య హరణేదక్షం వందే తం రణదారుణం॥ లిఖిత్వా పూజయేద్యస్తు సర్వత్ర విజయీ భవేత్ । యః కరే ధారయేన్నిత్యం స పుమాంచ్ఛ్రియ మాప్నుయాత్ ॥స్థిత్వాతు బంధనేయస్తు జపం కారయతి ద్విజైః । తత్క్షణాన్ముక్తి మాప్నోతి నిగడాత్తుతథైవచ॥ ఈశ్వరఉవాచ॥ ధ్యాన్వందూ చరణారవిందయుగలం కౌపీన మౌంజీధరం । కాంచీశ్రేణిధరం దుకూలవసనం యజ్ఞోపవీతాజినం । హస్తాభ్యాం ధృతపుస్తకంచ విలసద్ధారావళిం కుండలం । యశ్చాలం విశిఖం ప్రసన్నవదనం శ్రీ వాయుపుత్రం భజేత్ ॥ యో వారాంనిధి మల్పపల్వల మివోల్లంఘ్య ప్రతాపాన్వితో వైదేహీఘనశోకతాపహరణో వైకుంఠభక్తప్రియః । అక్షాద్యూర్జితరాక్షసేశ్వరమహాదర్పాపహారీ రణే సోఽయం వానరపుంగవోఽవతుసదా యోఽస్మా న్సమీరాత్మజః॥ వజ్రాంగం పింగనేత్రం కనకమయ లసత్కుండలా క్రాంతగండం । దంభోళి స్తంభసారప్రహరణ సువశీభూత రక్షోధినాథం । ఉద్యల్లాంగూల సప్తప్రచల చలధరం భీమమూర్తిం కపీంద్రం । ధ్యాయేత్తం రామచంద్రం భ్రమరదృఢకరం సత్త్వసారం ప్రసన్నమ్॥ వామేకరేవైరిభిదం వహంతం శైలం పరం శృంఖలహారకంఠం।దధానమాచ్ఛాద్య సువర్ణవర్ణం భజే జ్వలత్కుండల మాంజనేయమ్॥ పద్మరాగమణికుండలత్విషా పాటలీకృత కపోలమండలమ్ । దివ్యదేహకదళీవనాంతరే భావయామి పవమాననందనమ్॥ యత్రయత్ర రఘునాథకీర్తనం తత్రతత్ర కృతమస్తకాంజలిమ్ । బాష్పవారిపరిపూర్ణలోచనం మారుతిం నమత రాక్షసాంతకమ్॥ మనోజవం మారుతతుల్యవేగం జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ । వాతాత్మజం వానరయూధముఖ్యం శ్రీరామదూతం శిరసా నమామి॥ వివాదే దివ్యకాలేచద్యూతే రాజకులేరణే । దశవారం పఠేద్రాత్రౌ మితాహారో జితేంద్రియః॥ విజయం లభతేలోకే మానవేషునరేషుచ । భూతేప్రేతేమహాదుర్గే ఽరణ్యే సాగరసంప్లవే॥ సింహవ్యాఘ్రభయేచోగ్రే శరశస్త్రాస్త్రపాతనే । శృంఖలాబంధనేచైవ కారాగారాదియంత్రణే॥ కోపస్తంభే వహ్నిచక్రే క్షేత్రేఘోరే సుదారుణే । శోకే మహారణేచైవ బ్రహ్మగ్రహనివారణే । సర్వదాతుపఠేన్నిత్యం జయమాప్నోతి నిశ్చితమ్ । భూర్జేవావసనేరక్తే క్షౌమేవా తాలపత్రకే॥ త్రిగంధినా వా మష్యా వా విలేఖ్య ధారయన్నరః । పంచసప్తత్రిలోహైర్వా గోపితస్సర్వతశ్శుభమ్ ॥ కరే కట్యాం బాహుమూలే కంఠే శిరసి ధారితమ్ । సర్వాన్కామా నవాప్నోతి సత్యం శ్రీరామభాషితమ్॥ అపరాజిత నమస్తేఽస్తు నమస్తే రాజపూజిత। ప్రస్థానంచ కరిష్యామి సిద్ధి ర్భవతు మే సదా॥ ఇత్యుక్త్వా యో వ్రజేద్గ్రామం దేశం తీర్థాంతరం రణమ్।

ఆగమిష్యతి సశీఘ్రం క్షేమరూపో గృహంపునః॥ ఇతివదతి విశేషా ద్రాఘవే రాక్షసేంద్రః ప్రముదితవరచిత్తో రావణస్యానుజోహి । రఘువర పదపద్మం వందయామాస భూయః కులసహితకృతార్థశ్శర్మదం మన్యమానః॥ తంవేద శాస్త్రపరినిష్ఠిత శుద్ధబుద్ధిం శర్మావరం సురమునీంద్రసుతం కపీంద్రం । కృష్ణ త్వచం కనకపింగజటాకలాపం వ్యాసం నమామి శిరసా తిలకం మునీనామ్॥ య ఇదం ప్రాతరుత్థాయ పఠతే కవచం సదా । ఆయురారోగ్య సంతానై స్తస్య స్తస్యా స్తవోభవేత్॥ ఏవంగిరీంద్రజే శ్రీమద్ధనుమత్కవచం శుభమ్ । త్వయా పృష్టం మయా ప్రీత్యా విస్తరాద్ధి నివేదితమ్॥" ఓశిష్యోత్తమా! పార్వతీదేవి యీవిధముగా శివుఁడుచెప్పిన హనుమత్కవచమును విని యేకాగ్రచిత్తయై యా హనుమత్కవచమును పఠించెను. నీవడిగిన హనుమత్కవచ మిదియే. ఈ హను మత్కవచమును మిగులభక్తితో పఠింపవలయును. శ్రీరామ కవచమును వదలి హనుమత్కవచమును పఠించుట నిష్ప్రయోజనమగును. కావున సర్వకాలముల యందును రామకవచ హనుమత్కవచములను రెంటిని పఠింపవలయును.

* శ్రీరామకవచము. *

ఓ శిష్యోత్తమా! ఇఁకనిప్పుడు రామకవచమును చెప్పెదను వినుము. శ్రీరామకవచము మిగుల రహస్యమును, పావనమునై యున్నది. సుతీక్ష్ణుఁ డనువాఁ డొకప్పుడు రహస్యస్థలమునందున్న యగస్త్యమహామునితో నిట్లనియె. భగవంతుఁడవును, పరమానంద రూపుఁడవును, తత్త్వజ్ఞుఁడవును, కరుణాసము ద్రుఁడవును, గురుండవునయిన యో యగస్త్యమునివరుఁడా! మిగుల పావన మయిన శ్రీరాముని స్తోత్రమును జెప్పుమనిన విని యగస్త్యమునివరుఁడు సుతీ క్ష్ణున కిట్లనియె.

"శ్లో॥ ఆజానుబాహు మరవింద దళాయతాక్ష మాజన్మశుద్ధ రసహాస ముఖం ప్రసన్నం । శ్యామం గృహీతశరచాప ముదారరూపం రామం సరామ మభిరామ మనుస్మరామి ॥ శ్రుణువక్ష్యామ్యహం సర్వం సుతీక్ష్ణమునిసత్తమ । శ్రీరామకవచం పుణ్యం సర్వకామ ప్రదాయకం ॥ అద్వైతానందచైతన్య శుద్ధసత్త్వైకలక్షణః । బహిరంత స్సుతీక్ష్ణాత్ర రామచంద్రః ప్రకాశతే ॥ తత్త్వ విద్యార్థినో నిత్యం పరమంచే త్సుఖాత్మసి । ఇతిరామ పదేనాసౌ పరబ్రహ్మోభిధీ యతే ॥ జయరామేతి యన్నామకీర్తయన్నాభివర్ణయేత్ । సర్వపాపై ర్విము క్తోఽసౌ యాతి విష్ణోః పరంపదమ్ ॥ శ్రీరామేతి పరంమంత్రం తదేవ పరమం పదమ్ । తదేవ తారకం విద్ధి జన్మమృత్యుభయాపహమ్॥ శ్రీరామేతి వదన్బ్రహ్మ భావ మాప్నోత్యసంశయః॥ఓమస్య శ్రీరామకవచస్య అగస్త్య ఋషిః । అను ష్టుప్ఛందః । సీతాలక్ష్మణోపేత శ్రీరామచంద్రో దేవతా । శ్రీరామచంద్ర

ప్రసాదసిద్ధ్యర్థే జపే వినియోగః । అథధ్యానం ప్రవక్ష్యామి సర్వాభీష్ట ఫల
ప్రదమ్ । నీలజీమూత సంకాశం విద్యుత్పీతాంబరా వృతమ్ ॥ కోమలాంగం
విశాలాక్షం యువాన మతిసుందరమ్ । సీతా సౌమిత్రి సహితం జటాముకుట
ధారిణం ॥ సాసితూణ ధనుర్బాణపాణిం దానవమర్దనమ్ । యదా చోరభయే
రాజభయే శత్రుభయే తథా ॥ ధ్యాత్వా రఘుపతిం క్రుద్ధం కాలానలసమప్రభం।
చీరకృష్ణాజినధరం భస్మోద్ధూళిత విగ్రహమ్ ॥ ఆకర్ణా కృష్టసశరకోదండ భుజ
మండితమ్। రణేరిపూన్రావణాదీన్ తీక్ష్ణమార్గణవృష్టిభిః ॥ సంహరంతం మహావీర
ముగ్ర మైంద్రరథస్థితమ్ । లక్ష్మణాద్యైర్మహావీరై ర్వృతం హనుమదాదిభిః ॥
సుగ్రీవాద్యైర్మహా వీరైశ్శైలవృక్ష కరోద్యతైః । వేగాత్కరాలహుంకారై
ర్భుభుక్కార మహారవైః ॥ నదద్భిః పరివాదద్భి స్సమరే రావణం ప్రతి ।
"శ్రీరామ శత్రు సంఘాన్మే హన మర్దయ ఖాదయ ॥ భూతప్రేత పిశాచాదీన్
శ్రీరామాశు వినాశయ "। ఏవంధ్యాత్వా జపేద్రామకవచం సిద్ధి దాయకమ్।
సుతీక్ష్ణ వజ్ర కవచం శృణువక్ష్యామ్యనుత్తమమ్ ॥ శ్రీరామః పాతుమేమూర్ధ్ని
పూర్వేచ రఘువంశజః । దక్షిణే మే రఘువరః పశ్చిమే పాతు పావనః । ఉత్తరే
మే రఘుపతిః ఫాలం దశరథాత్మజః ॥ భ్రువోర్దూర్వాదల శ్యామ స్తయోర్మధ్యే
జనార్దనః । శ్రోత్రం మే పాతు రాజేంద్రో దృశౌ రాజీవలోచనః॥ ఘ్రాణం మే పాతు
రాజర్షిర్గండం మే జానకీపతిః కర్ణమూలే ఖరధ్వంసీ ఫాలం మే రఘువల్లభః ॥
జిహ్వాం మే వాక్పతిః పాతుదంత పంక్త్యో రఘూత్తమః । ఓష్ఠౌ శ్రీరామచంద్రో
మే ముఖం పాతుపరాత్పరః ॥ కంఠం పాతు జగద్వంద్య స్స్కంధౌ మే రావణాం
తకః । ధనుర్బాణధరః పాతు భుజౌ మే వాలి మర్దనః ॥ సర్వాణ్యంగుళిపర్వాణి
హస్తౌ మే రాక్షసాంతకః । వక్షో మే పాతుకాకుత్స్థః పాతు మే హృదయం హరిః ॥
స్తనౌ సీతాపతిః పాతు పార్శ్వం మే జగదీశ్వరః ॥ మధ్యం మే పాతు లక్ష్మీశో నాభిం
మే రఘునాయకః॥ కౌసల్యేయః కటీపాతు పృష్ఠం దుర్గతినాశనః । గుహ్యం పాతు
హృషీకేశ స్సక్థినీ సత్య విక్రమః ॥ ఊరూ శార్ఙ్గధరః పాతు జానునీ హనుమత్ప్రి
యః । జంఘే పాతు జగద్వ్యాపీ పాదౌ మే తాటకాంతకః ॥ సర్వాంగం పాతు మే
విష్ణు స్సర్వ సంధీ ననామయః। జ్ఞానేంద్రియాణి ప్రాణాదీన్పాతు మే మధుసూదనః॥
పాతు శ్రీరామభద్రో మే శబ్దాదీన్విషయానపి । ద్విపదాదీని భూతాని మత్సం
బంధీని యానిచ ॥ రోమాంకురాణ్యశేషాణి పాతు సుగ్రీవ రాజ్యదః । వాఙ్మనో
బుద్ధ్యహంకారై ర్జ్ఞానాజ్ఞానకృతానిచ ॥ జన్మాంతర కృతానీహ పాపాని వివిధా
నిచ । తాని సర్వాణి దగ్ధ్వాశు హరకోదండఖండనః । పాతు మాం సర్వతో
రామ శ్శార్ఙ్గ బాణధరస్సదా । ఇతి శ్రీరామచంద్రస్య కవచం వజ్రసమ్మితమ్॥

గుహ్యాద్గుహ్యతమం దివ్యం సుతీక్ష్ణమునిసత్తమ । యః పఠేచ్ఛృణుయా ద్వాపి శ్రావయేద్వా సమాహితః ॥ స యాతి పరమం స్థానం రామచంద్ర ప్రసాదతః । మహాపాతకయుక్తో వా గోఘ్నో వా భ్రూణహా తథా ॥ శ్రీరామచంద్ర కవచపఠనా చ్ఛుద్ధి మాప్నుయాత్ । బ్రహ్మహత్యాదిభిః పాపై ర్ముచ్యతే నాత్ర సంశయః ॥ భో స్సుతీక్ష్ణ యథాపృష్టం త్వయా మమ పురా శుభమ్ । తథా శ్రీరామకవచం మయా తే వినివేదితమ్ ॥" అని యగస్త్య మహాముని సుతీక్ష్ణునకుఁ జెప్పినవిధమును శిష్యోత్తముఁడ వైనయో విష్ణుదాసా! నీకుఁ దెలిపితిని. ఈ హనుమత్కవచ రామ కవచముల రెంటిని సీతాకవచమును పఠింపక ముందు పఠించుటవలన నించుకైనను ప్రయోజనముండదు. ముందుగ హనుమత్కవచమును పఠించి పిమ్మట సౌఖ్యకరమైన సీతాకవచమును పఠింపవలయును. అనంతరము రామకవచమును పఠింపవలయును. ఇటులనే మంత్రములను గూడ జపింపవలయును. అనిన విని విష్ణుదా సిట్లనియె. ఓగురూత్తమా! సీతా కవచము నెఱుంగను. అదియును వినవలయు నని నాకుఁ గుతూహలంబుగ నున్నది. కావున సీతా కవచంబును జెప్పి నన్నుఁ గృతార్థుని జేయు మనిన విని రామదా సిట్లనియె.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పదుమూఁడవసర్గము ముగిసెను.

——:(౦):——

* శ్రీ సీతా కవచము. *

ఓ శిష్యోత్తమా! సీతా కవచమును జెప్పెదను. సావధానచిత్తుఁడవై వినుము. తొల్లి యీసీతా కవచమును అగస్త్య మహాముని సుతీక్ష్ణునకుఁ జెప్పెను. తొల్లి యొకనాఁడు సుతీక్ష్ణుఁడు ఏకాంతమునం దున్నవాఁడును, గురుఁడునయిన యగస్త్యమహామునితో నిట్లనియె. ఓ గురూత్తమా! సీతాకవచము వినవలయు నని యపేక్షగ నున్నది. నాయందుఁ గృపయుంచి యెఱింగింపుము. ఆమాటలను విని యగస్త్యమహాముని, "ఓవత్సా! సుతీక్ష్ణా! మంచిప్రశ్నము నడిగితివి. చెప్పెదను వినుము" అని యిట్లు చెప్పం దొడంగె

"యాసీతాఽవని సంభవాఽథ మిథిలాపాలేన సంవర్ధితా పద్మాక్షావనిపతే స్సుతాఽనలగతా యా మాతులుంగోద్భవా । యారత్నేలయమాగతా జలనిధౌ యా వేదపారంగతా।లంకాం సామృగలోచనా శశిముఖీ మాంపాతు రామప్రియా॥ ఓం అస్య శ్రీసీతా కవచస్తోత్ర మంత్రస్య అగస్తిఋషిః । శ్రీసీతా దేవతా । అనుష్టుప్ఛందః । రమేతిబీజం । జనకజాయా ఇతిశక్తిః । అవనిజేతి కీలకమ్ । పద్మాక్షసుతేత్యస్త్రం । మాతులుంగీతి కవచమ్ । మూలకాసుర ఘాతినీతి మంత్రః ।

శ్రీసీతారామచంద్ర ప్రీత్యర్థం సకల కామనా సిద్ధ్యర్థం జపే వినియోగః॥అథాంగులిన్యాసః । ఓం హ్రాం సీతాయై అంగుష్ఠాభ్యాం నమః । ఓం హ్రీం రమాయై తర్జనీభ్యాం నమః । ఓం హ్రూం జనకజాయై మధ్యమాభ్యాం నమః । ఓం హ్రైం అవనిజాయై అనామికాభ్యాం నమః । ఓం హ్రౌం పద్మాక్షసుతాయై కనిష్ఠికాభ్యాం నమః । ఓం హ్రః మాతులుంగ్యై కరతల కరపృష్ఠాభ్యాం నమః । ఏవం హృదయాదిన్యాసః ॥ అథధ్యానమ్ ॥ సీతాం కమలపత్రాక్షీం విద్యుత్పుంజ సమప్రభాం । ద్విభుజాం సుకుమారాంగీం పీతకౌశేయ వాసినీం ॥ సింహాసనే రామచంద్రవామభాగస్థితాం వరామ్ । నానాలంకారసంయుక్తాం కుండలద్వయధారిణీమ్ ॥ చూడాకంకణకేయూర రశనానూపురాన్వితామ్ । సీమంతే రామచంద్రాభ్యాం నిటలే తిలకేనచ ॥ మయూరాభరణేనాపి ఘ్రాణే శోభితాం శుభామ్ । హారిద్రాం కజ్జలం దివ్యం కుంకుమాని శుభానిచ ॥ బిభ్రంతీం సురభిద్రవ్యం సుగంధస్నేహముత్తమం ॥ స్మితాననాం గౌరవర్ణాం మందారకుసుమం కరే ॥ బిభ్రంతీ మపరే హస్తే మాతులుంగ మనుత్తమమ్ । రమ్యహాసాంచ బింబోష్ఠీం చంద్రవాహన లోచనామ్ ॥ కలానాథసమానాస్యాం కలకంఠ మనోరమామ్ । మాతు లుంగోద్భవాం దేవీం పద్మాక్షదుహితాం శుభామ్ ॥ మైథిలీం రామదయితాం దాసీభిః పరివీజితామ్ । ఏవంధ్యాత్వా జనకజాం హేమకుంభపయోధరామ్ ॥ సీతాయాః కవచం దివ్యం పఠనీయం శుభావహమ్ ॥

శ్రీసీతా పూర్వతః పాతు దక్షిణేఽవతు జానకీ॥ప్రతీచ్యాం పాతు వైదేహీ పాతూదీచ్యాంచ మైథిలీ । అధః పాతు మాతులుంగీ ఊర్ధ్వం పద్మాక్షజావతు ॥ మధ్యేఽవనిసుతా పాతు సర్వతః పాతుమాం రమా । స్మితాననా శిరః పాతు పాతు ఫాలం నృపాత్మజా ॥ పద్మాఽవతు భ్రువోర్మధ్యే మృగాక్షీ నయనేఽవతు । కపోలే కర్ణమూలేచ పాతు శ్రీరామ వల్లభా ॥ నాసాగ్రం సాత్వికీపాతు పాతువక్త్రంతు రాజసీ । తామసీ పాతు మద్వాణీం పాతు జిహ్వాం పతివ్రతా ॥ దంతాన్పాతు మహామాయా చుబుకం కనకప్రభా । పాతు కంఠం సౌమ్యరూపా స్కంధౌపాతు సురార్చితా ॥ భుజౌపాతు వరారోహా కరౌ కంకణమండితా । నఖాన్ రక్తనఖా పాతు కుక్షౌపాతు లఘూదరా॥వక్షఃపాతు రామపత్నీ పార్శ్వే రావణమోహినీ । పృష్ఠదేశే వహ్నిగుప్తాఽవతుమాం సర్వదైవహి ॥ దివ్యప్రదా పాతు నాభిం కటిం రాక్షసమోహినీ । గుహ్యం పాతు రక్తగుప్తాలింగం పాతు హరిప్రియా ॥ ఊరూ రక్షతురంభోరూ జానునీ ప్రియభాషిణీ । జంఘేపాతు సదా సుభ్రూర్గుల్ఫౌ చామరవీజితా ॥ పాదౌ లవసుతా పాతు పాత్వంగాని కుశాంబికా । పాదాంగులీస్సదా పాతు మమ నూపుర నిస్వనా ॥ రోమాణ్యవతు మే నిత్యం పీతకౌశేయవాసినీ । రాత్రౌ పాతుకాలరూపా దినే దీనైకకల్పతా ॥ సర్వకాలేషుమాం పాతు మూలకాసురఘాతినీ । ఏవం సుతీక్ష్ణ సీతా

యాః కవచంతే మయేరితమ్ ॥ ఏవం ప్రాతస్సముత్థాయస్నాత్వా నిత్యం పఠేత్తు యః । జానకీం పూజ యిత్వా స సర్వాన్కామా నవాప్నుయాత్ ॥ ధనార్థీ ప్రాప్నుయాద్ద్రవ్యం పుత్రార్థీ పుత్రమాప్నుయాత్ । స్త్రీకామార్థీ శుభాం నారీం సుఖార్థీ సౌఖ్యమాప్నుయాత్ ॥ అష్టవారం జపనీయం సీతాయాః కవచం సదా । అష్టభూసుర సీతాయై నరైః ప్రీత్యార్పయేత్సదా ॥ ఫలపుష్పాదికాదీని యానితాని పృథక్పృథక్ । సీతాయాః కవచం చేదం పుణ్యం పాతకనాశనం ॥

ఓ శిష్యోత్తమా! ఈసీతాకవచమును భక్తితోఁ బఠించు మానవులు మిగుల ధన్యులగుదురు. సీతాకవచమును పఠింపక రామకవచమును పఠించుటవలన ప్రయోజనము లేనివిధముగ లక్ష్మణకవచమును వదలి సీతాకవచమును పఠించుటవలనఁ గూడఁ బ్రయోజనములేదని యెఱుంగవలయును. కావున లక్ష్మణ కవచమునుగూడఁ బఠింపవలయును. ముందుగ హనుమత్కవచమును, అనంతరము లక్ష్మణకవచమును పిమ్మట సీతాకవచమును, తఱువాత శ్రీరామకవచమును పఠింపవలయును. ఈవిధముగ నీనాలుగు కవచములను పఠింపవలయునని యగస్త్యమహాముని సుతీక్ష్ణునకుఁ జెప్పె. అట్లుచెప్పి సీతాష్టోత్తర శతనామములను, అష్టోత్తర సహస్రనామములను కూడ పఠింపవలయును. అనియును, అట్లు పఠించుటచేత మహాపుణ్యము కలుగుననియు నెఱుంగవలయు ననియె. అనంతరము సీతా నామాష్టోత్తరశతమును జెప్పె. ఆ నామమంత్రాదికమును చెప్పెదను. సావధానముగ వినుము.

* శ్రీ సీతాష్టోత్తర శతనామస్తోత్రము.

ఓం అస్య శ్రీ సీతానామాష్టోత్తర శతమంత్రస్య । అగస్తిఋషిః । అనుష్టుప్ఛందః । రమేతిబీజం । మాతులుంగీతిశక్తిః । పద్మాక్షజేతికీలకమ్ । అవనిజేత్యస్త్రం జనకజేతి కవచమ్ । మూలకాసురమర్దినీతిమంత్రః । శ్రీ సీతారామచంద్ర ప్రీత్యర్థే సకలకామనాసిద్ధ్యర్థే జపేవినియోగః । అథాంగుళిన్యాసః । ఓం సీతాయై అంగుష్టాభ్యాంనమః । ఓం రమాయై తర్జనీభ్యాంనమః । ఓం మాతులింగ్యై మధ్యమాభ్యాం నమః । ఓం పద్మాక్షజాయై అనామికాభ్యాం నమః । ఓం అవనిజాయై కనిష్ఠికాభ్యాం నమః । ఓం జనకజాయై కరతలకరపృష్ఠాభ్యాం నమః । ఏవం హృదయాదిన్యాసః ॥ మూలేనదిగ్బంధః॥ వామాంగే రఘునాయకస్య రుచిరే యా సంస్థితా శోభనా యా విప్రాధిప యానరమ్యనయనా యా విప్రపాలాననా । విద్యుత్పుంజ విరాజమాన వదనా భక్తార్తిసంఖండనా శ్రీమద్రాఘవ పాదపద్మయుగళన్యస్తేక్షణా సాఽవతు ॥ శ్రీ సీతా జానకీదేవీ వైదేహీ రాఘవప్రియా । రమాఽవనిసుతా రామా రాక్షసాంత ప్రకారిణీ॥ రత్నగుప్తా మాతులింగీ మైథిలీ భక్తతోషదా । పద్మాక్షజా కంజనేత్రాస్మితా

స్థా నూపురస్వనా । వైకుంఠనిలయా మా శ్రీర్ముక్తిదా కామపూరిణీ । నృపా
త్మజా హేమవర్ణా మృదులాంగీ సుభాషిణీ॥ కుశాంబికా దివ్యదాచ లవమాతా
మనోహరా । హనుమద్వందితపదా ముగ్ధకేయూరధారిణీ ॥ అశోకవనమధ్య
స్థా రావణాదికమోహినీ । విమానసంస్థితా సుభ్రూ స్సుకేశీ రశనాన్వితా॥ రజో
రూపా సత్వరూపా తామసీ వహ్నివాసినీ । హేమమృగాసక్తచిత్తా వాల్మీకా
శ్రమవాసినీ॥ పతివ్రతా మహామాయా పీతకౌశేయవాసినీ । మృగనేత్రా చ
బింబోష్ఠీ ధనుర్విద్యావిశారదా॥ సౌమ్యరూపా దశరథస్నుషా చామరవీజితా ।
సుమేధాదుహితా దివ్యరూపా త్రైలోక్యపాలినీ॥ అన్నపూర్ణామహాలక్ష్మీ ర్ధీర
జ్జాచసరస్వతీ । శాంతిః పుష్టిః క్షమా గౌరీ ప్రభాఽయోధ్యానివాసినీ ॥
వసంతసీతలాగౌరి స్నానసంతుష్టమానసా । రమానామా భద్రసంస్థా
హేమకుంభపయోధరా । సురార్చితా ధృతిః కాంతి స్స్మృతి ర్మేధా విభా
వరీ । లఘూదరా వరారోహా హేమకంకణ మండితా ॥ ద్విజపత్న్యర్పిత నిజ
భూషా రాఘవతోషిణీ । శ్రీరామసేవనరతా రత్నతాటంకధారిణీ ॥ రామ
వామాంక సంస్థాచ రామచంద్రైకరంజనీ । సరయూజలసంక్రీడాకామిసీ రామ
మోహినీ ॥ సువర్ణతులితా పుణ్యా పుణ్యకీర్తిః కలావతీ । కలకంఠా కంబుకంఠా
రంభోరూ ర్గజగామినీ॥ రామార్పితమనా రామవందితా రామవల్లభా। శ్రీరామ
పదచిహ్నాంకా రామరామేతి భాషిణీ॥ రామ పర్యంకశయనా రామాంఘ్రిక్షాళి
నాతురా । కామధేన్వన్నసంతుష్టా మాతులింగఫలోత్కరా॥ దివ్యచందన సంస్థా
శ్రీమూలకాసురమర్దినీ । ఏవ మష్టోత్తరశతం సీతానామ్నాం సుపుణ్యదమ్ ॥
యేపఠంతి నరా భూమ్యాం తే ధన్యా స్స్వర్గగామినః । అష్టోత్తర శతం నామ్నాం
సీతాయాస్స్తోత్రముత్తమమ్ ॥ జపనీయం ప్రయత్నేన సర్వదాభక్తి పూర్వకమ్॥

ఓ శిష్యోత్తమా! లోకములో పుణ్యము నిచ్చునట్టివియును, మిగుల
గొప్పవియును అయిన స్తోత్రపాఠములు అనేకములు కలవు. అవి యన్నియును
ఈ సీతా స్తోత్రముతో సమానములయినవి కావు. కావున నీ సీతా స్తోత్రము
భుక్తి ముక్తులును కలుగఁజేయునదై యున్నది. ఓ సుతీక్ష్ణా! నీవడిగిన విధముగ
సీతాస్తోత్రమును జెప్పితిని. ఈసీతా స్తోత్రముయొక్క శ్రవణ పఠనములవలన
సకల శుభములును కలుగును. మానవులు ప్రాతఃకాలమునకు ముందుగ లేచి
ప్రయత్నపూర్వకముగ నీ సీతా స్తోత్రమును పఠింపవలయును. స్త్రీలుకూడ నీ
సీతా స్తోత్రమును పఠింపవలయును. తీర్థములయందు వసంత సీతలాగౌరీ స్నాన
మును చేయవలయును. అట్టి తీర్థముల దగ్గఱకుఁ బోయినపిమ్మట వానియందు
స్నానమును చేయని స్త్రీలు ఏడుజన్మములవఱకును విధవ లగుదురనిన విని
సుతీక్ష్ణుఁ డిట్లనియె. ఓ గురూత్తమా! అగస్త్యమునివర్యా! సీతలా గౌరీస్నాన
మునకు స్త్రీలెట్లుద్యాపనమును చేయవలయునో యా విషయమును దెలియఁ

జేయుమనిన విని యగస్త్య మహామునివరుఁ డిట్లనియె. ఓ శిష్యోత్తమా! సుతీక్ష్ణా! నీవు చక్కని ప్రశ్నము చేసితివి. కావున నీయిష్టములు దీర్చెదను. చైత్రశుక్ల తృతీయ మొదలుకొని ముప్పదిదినములవఱకును శీతలాగౌరీస్నానమును చేయవలయును. అంతట వైశాఖ శుక్ల తృతీయ యందుపవాసమును చేసి యా రాత్రియందు జాగరణమును జేసి మునుపటివలె శ్రేష్ఠమైన మండపాదికమును చేయవలయును. పిమ్మట నా మండపము మధ్య రమానామ భద్రాష్టోత్తరసహస్రమునైనను, అష్టోత్తర శతమునైనను స్థాపింపవలయును. అనంతరము పూర్ణకలశమును ధాన్యరాశియందు స్థాపింపవలయును. ఆ కలశముఖమునందు మిగుల విస్తారమగు పత్రమును పఱుపవలయును. అంతట పట్టువస్త్రముచే నా కలశమును కప్పవలయును. పిమ్మట నా వస్త్రమునందు సీతారాముల వస్త్రముల మూర్తులను స్థాపించి షోడశోపచారములచేతఁ బూజింపవలయును. శ్రీరామ విగ్రహము నవమాషాత్మకమును, సీతా విగ్రహము అష్టమాషాత్మకమునై యుండవలయును. ఇట్లు చేయుటకు శక్తి లేక పోయెనేని తన శక్త్యనుసారముగ సీతా రామ విగ్రహములను జేయింపవలయును. మఱియునో శిష్యోత్తమా! గంధపుష్ప ధూపదీప నైవేద్య వసనాదికమును సీతా మహాదేవికి భిన్నముగఁ జేయవలయును. అనంతరము వస్త్రాలంకార వస్తువులచేత స్త్రీలకు వాయనము లియ్యవలయును. మఱియును పక్వాన్నాదులచేత పూరితములయిన కాంస్య పాత్రముల ముప్పదిమూఁడింటినైనను, ఎనిమిదింటినైనను, ఈయవలయును. పిమ్మట ముప్పది నలుగురు దంపతులకైన నన్నదానము చేయవలయును. అంతట నా రాత్రియందు గీత వాద్యాది మంగళధ్వనులతో జాగరణమును చేయవలయును. పిమ్మట తృతీయా తిథియందు స్నానముచేసి సీతా మహాదేవినిపూజించి ముద్గహీనమగు నవాన్నముచేత సీతా మహాదేవికి సంతోషమును గల్పింపవలయును. అంతట సుహృన్మిత్ర బాంధుజనులతోఁ గూడ భోజనము చేయవలయునని యగస్త్యమునివరుఁడు చెప్పెనని చెప్పి శ్రీరామదాసు మఱల నిట్లనియె. ఓ శిష్యోత్తమా! అగస్త్యమునివరుఁడు సుతీక్ష్ణునకుఁ జెప్పినట్లుగ సర్వమును నీకుఁ దెలియఁజేసితి ననిన విని విష్ణుదాసిట్లనియె.

* రమానామ భద్రప్రకారము. *

ఓ గురూత్తమా! స్త్రీలు పూజించునపుడు రమానామ భద్రము చేయఁదగినదని చెప్పితివి. ఆ విషయమును సర్వము నెట్లు చేయవలయునో తెలియఁజేయుమనిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా! రామతో భద్రము వలెనే రమానామ భద్రమునుగూడఁ జేయవలయును. అయినను దానికిని దీనికిని కొంచెము భేదముకలదు. చెప్పెదను వినుము. లింగస్థలములయందు మునుపటివలె వాపికల రచింపవలయును. మఱియునో శిష్యోత్తమా! సముద్రమునందుఁ

గూడ విశేషము కలదు. నాకారమును మకారమును పూర్వమువలెనే క్రింద రచింపవలయును. పూర్వమువలె నూర్ధ్వభాగమునందు రమాయనునక్షరద్వయమును రచింపవలయును. ఈ విధముగఁ జేసినపిమ్మట శ్వేతవర్ణము కల రమానామములను జూడవలయును. స్త్రీదేవతా పూజలయందును, నానావిధములయిన సకల కర్మములయందును ప్రయత్న పూర్వకముగ నీరమానామ భద్రకమును వ్రాయవలయును. రమాభద్రమును వదలి రామ భద్రమును రచించి చేసిన పూజలన్నియును నిష్ఫలములగునని యెఱుంగవలయును. రమానామ భద్రమును రచించి పూజను చేయుటచేత దేవతలకు సంతోషము కలుగును. ఆముద్రయందు జానకీదేవి నాహ్వానము చేయవలయును. ఓ శిష్యోత్తమా! ఇంకొక్క విశేషమును దెలియఁజేసెదను. వినుము. రమానామ భద్రము రామ భద్రముకంటె శ్రేష్ఠమైనది. సకల దేవతలును రమానామోపాసనములని యెఱుంగవలయును. ఓ శిష్యోత్తమా! ఇంతవఱకు నీవడిగిన విషయముల నన్నిఁటిని దెలిపితిని, ఇంక నీకు దేనిని వినవలయునని యభిలాష యున్నదో చెప్పుము. అనిన విని విష్ణుదాసిట్లనియె. ఓగురూత్తమా! తొల్లి నీవు లక్ష్మణ కవచము పఠింపఁదగినదని చెప్పితివి. ఇంతియగాక భరత శత్రుఘ్నకవచములు గూడ కలవని చెప్పితివి. వానినిఁ గూడఁ జెప్పి నన్నుఁ గృతార్థుని చేయవలయు ననిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా! సుతీక్ష్ణుండుగూడ నగస్త్య మహామునిని తొల్లి యీవిధముగనే యడిగెను. అంతట నమ్ముని వరుఁడతని యభీష్టమును కొనసాగించెను. ఆ విషయమును సర్వమును నీకుఁ దెలియఁ జెప్పెదను. సావధాన చిత్తుండవై వినుము.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పదునాల్గవసర్గము ముగిసెను.

——:(ం):——

* శ్రీలక్ష్మణ కవచము. *

శ్లో॥ సౌమిత్రిం రఘునాయకస్య చరణ ద్వంద్వేక్షణం శ్యామలం। బిభ్రంతం స్వకరేణ రామశిరసి చ్ఛత్రం విచిత్రం వరమ్ । బిభ్రంతం రఘునాయకస్య సుమహాకోదండబాణాసనే । తం వందే కమలేక్షణం జనకజావాక్యే సదా తత్పరమ్ ॥ ఓం అస్య శ్రీలక్ష్మణకవచమంత్రస్య । అగస్త్యఋషిః । అనుష్టుప్ఛందః । శ్రీలక్ష్మణో దేవతా । శేష ఇతి బీజమ్ । సుమిత్రానందన ఇతి శక్తిః । రామానుజ ఇతి కీలకమ్ । రామదాస ఇత్యస్త్రమ్ । రఘువంశజ ఇతి కవచమ్ । సౌమిత్రి రితి మంత్రః । శ్రీలక్ష్మణ ప్రీత్యర్థం సకల మనోభిలషిత సిద్ధ్యర్థం జపే వినియోగః ॥ అథాంగుళిన్యాసః ॥ ఓం లక్ష్మణాయ అంగుష్ఠాభ్యాం నమః । ఓం

శేషాయ తర్జనీభ్యాం నమః । ఓం సుమిత్రానందనాయ మధ్యమాభ్యాం నమః । ఓం రామానుజాయ అనామికాభ్యాం నమః । ఓం రామదాసాయ కనిష్ఠికాభ్యాం నమః । ఓం రఘువంశజాయ కరతల కరపృష్ఠాభ్యాం నమః ॥ ఏవం హృదయాదిన్యాసః ॥ ఓం లక్ష్మణాయ హృదయాయనమః । ఓం శేషాయ శిరసే స్వాహా । ఓం సుమిత్రానందనాయ శిఖాయైవషట్ । ఓం రామానుజాయ కవచాయహుం । ఓం రామదాసాయనేత్రత్రయాయ వౌషట్ । ఓం రఘువంశజాయ అస్త్రాయఫట్ । ఓం సౌమిత్రాయనమ ఇతి దిగ్బంధః ॥ అథధ్యానమ్ ॥ రామపృష్ఠస్థితం రమ్యం రత్నకుండల ధారిణమ్ । నీలోత్పలదళశ్యామం రత్నకంకణ మండితమ్ ॥ రామస్య మస్తకే దివ్యం బిభ్రంతం ఛత్రముత్తమమ్ । వర పీతాంబర ధరం ముకుటే నాతిశోభితమ్ ॥ తూణీర కార్ముకే చాపి బిభ్రంతంచ స్మితాననమ్ । రత్నమాలాధరం దివ్యపుష్పమాలా విరాజితమ్ ॥ ఏవం ధ్యాత్వా లక్ష్మణంచ రాఘవన్యస్త లోచనమ్ । కవచం జపనీయం హి తతో భక్త్యాఽత్ర మానవైః॥ ఓం లక్ష్మణః పాతు పూర్వే దక్షిణే రాఘవానుజః । ప్రతీచ్యాం పాతు సౌమిత్రిః పాతూదీచ్యాం రఘూత్తమః॥ అధః పాతు మహావీర శ్చోర్ధ్వం పాతు నృపాత్మజః ॥ మధ్యే పాతు రామదాస స్సర్వత స్సత్యపాలకః ॥ స్మితానన శ్శిరః పాతు ఫాలం పాతూర్మిలాధవః । భ్రువోర్మధ్యే ధనుర్ధారీ సుమిత్రానందనోఽక్షిణీ ॥ కపోలే రామచంద్రీచ సర్వదా పాతు వైమమ। కర్ణమూలే సదా పాతు కబంధభుజఖండనః । నాసాగ్రం మే సదాపాతు సుమిత్రానందవర్ధనః । రామస్య స్తేక్షణః పాతు సదామేఽత్ర ముఖం భువి ॥ సీతావాక్యకరః పాతు మమవాణీం సదాత్రహి । సౌమ్యరూపః పాతు జిహ్వా మనంతః పాతు మేద్విజాన్ ॥ చుబుకం పాతు రక్షోఘ్నః కంఠం పాత్వసురార్దనః । స్కంధౌ పాతు జితారాతి ర్భుజౌ పంకజలోచనః ॥ కరౌ కంకణధారీచ నఖాన్ రక్తనఖోఽవతు। కుక్షీ పాతు వినిద్రోమే వక్షః పాతు జితేంద్రియః ॥ పార్శ్వే రాఘవపృష్ఠస్థః పృష్ఠదేశం మనోరమః । నాభిం గంభీరనాభిస్తు కటీచ రుక్మమేఖలః ॥ గుహ్యం పాతు సహస్రాస్యః పాతులింగం హరిప్రియః । ఊరూపాతు విష్ణుతుల్య స్సుముఖోఽవతు జానునీ ॥ నాగేంద్రః పాతుమేజంఘా గుల్ఫౌనూపురవాన్మమ । పాదావంగదత్రాతోఽవ్యాత్సా త్వంగాని సులోచనః॥ చిత్రకేతుపితా పాతు మమ పాదాంగులీస్సదా । రోమాణిమే సదా పాతు రవివంశసముద్భవః ॥ దశరథస్య సుతః పాతు నిశాయాం మాంతు సాదరమ్ । భూగోళధారీ మాం పాతు దివసే దివసే సదా ॥ సర్వకాలేషు మాం మింద్రజిద్ధంతాఽవతు సర్వదా । ఏవం లక్ష్మణకవచం సుతీక్ష్ణ కథితం మయా॥ ” అని యగస్త్యమునివరుండు చెప్పె. ఓ శిష్యోత్తమా ! విష్ణుదాసా! ఈ లక్ష్మణకవచమును ప్రాతఃకాలమునందు పఠించు మానవులు మిగుల ధన్యులగుదురు. మఱియును వారిజన్మము సఫలమగుచు. పుత్రార్థియగువాఁడు

పుత్రులను, ధనార్థియగువాఁడు ధనమును, భార్యాకాముఁడు భార్యను, గోధనార్థి యగువాఁడు గోధనంబును, ధనరాజ్యార్థులగు వారు ధన రాజ్యంబులను పొందుదురు. లక్ష్మణ కవచమును వదలి రామకవచమును పఠించుటచేత శ్రీరాముఁడు సంతోషమును పొందఁడు. ఓ శిష్యోత్తమా ! ఇంక భరతకవచమును చెప్పెదను. వినుము. ఈ భరతకవచము సర్వపాపములను పోఁగొట్టును.

* శ్రీ భరతకవచము. *

"శ్లో॥ కైకేయీతనయం సదా రఘువరన్యస్తేక్షణం శ్యామలం సప్తద్వీపపతేర్విదేహతనయాకాంతస్య వాక్యేరతమ్ । శ్రీ సీతాధవసవ్యపార్శ్వనికటే స్థిత్వా వరం చామరం ధృత్వాదక్షిణసత్కరేణ భరతం తం వీజయంతం భజే॥ అస్యశ్రీ భరతకవచమంత్రస్య । అగస్త్యఋషిః । శ్రీభరతో దేవతా । అనుష్టుప్ఛందః । శంఖఇతిబీజమ్ । కైకేయీనందన ఇతిశక్తిః । భరతఖండేశ్వర ఇతి కీలకమ్ । రామానుజ ఇత్యస్త్రమ్ । సప్తద్వీపేశ్వరదాస ఇతికవచమ్ । రామాంశజ ఇతిమంత్రః । శ్రీభరతప్రీత్యర్థం సకలకామనాసిద్ధ్యర్థం జపేవినియోగః ॥ అథాంగుళిన్యాసః॥ ఓం భరతాయ అంగుష్ఠాభ్యాంనమః । ఓం శంఖాయతర్జనీభ్యాంనమః । ఓం కైకేయీనందనాయ మధ్యమాభ్యాం నమః । ఓం భరతఖండేశ్వరాయ అనామికాభ్యాంనమః । ఓం రామానుజాయ కనిష్ఠికాభ్యాంనమః । ఓం సప్తద్వీపేశ్వరదాసాయ కరతలకరపృష్ఠాభ్యాంనమః॥ ఏవం హృదయాద్యంగన్యాసః॥ ఓం భరతాయ హృదయాయనమః । ఓం శంఖాయశిరసేస్వాహా । ఓం కైకేయీనందనాయ శిఖాయైవషట్ । ఓం భరతఖండేశ్వరాయ కవచాయహుమ్ । ఓం రామానుజాయ నేత్రత్రయాయవౌషట్ । ఓం సప్తద్వీపేశ్వరదాసాయ అస్త్రాయఫట్ । ఓం రామాంశజాయేతి దిగ్బంధః॥ అథధ్యానమ్॥ రామచంద్ర సవ్యపార్శ్వే స్థితం కేకయజాసుతమ్ । రామాయ చామరేణైవ వీజయంతం మనోరమమ్॥ రత్నకుండలకేయూర కంకణాది సుభూషితం । పీతాంబరపరీధానం వనమాలా విరాజితమ్॥ మాండవీక్షాళితచరణం రశనానూపురాన్వితమ్ । నీలోత్పలదళశ్యామం ద్విజరాజసమాననమ్॥ ఆజానుబాహుం భరతఖండస్య ప్రీతిపాలకమ్ । రామానుజం స్మితాస్యంచ శత్రుఘ్నపరివందితమ్ ॥ రామన్యస్తేక్షణం సౌమ్యం విద్యుత్పుంజసమప్రభమ్ । రామభక్తం మహావీరం వందేతం భరతంశుభమ్॥ ఏవంధ్యాత్వాతు భరతం రామపాదేక్షణంహృది । కవచంపఠనీయంహి భరతస్యేద ముత్తమమ్॥ ఓం॥ పూర్వతో భరతః పాతుదక్షిణే కేకయీసుతః । నృపాత్మజః ప్రతీచ్యాంహి పాతూదీచ్యాం రఘూత్తమః॥ అధః పాతుశ్యామలాంగ శ్చోర్ధ్వం దశరథాత్మజః । మధ్యే భరతవర్షేశః సర్వతస్సూర్యవంశజః॥ శిరస్తక్షపితా పాతు ఫాలంపాతు హరిప్రియః । భ్రువోర్మధ్యం

జనకజావాక్యైకతత్పరోఽవతు॥ పాతుజనకజామాతా మమనేత్రే సదాత్రిహా। కపోలే మాండవీకాంతః కర్ణమూలే స్మితాననః॥ నాసాగ్రంమే సదాపాతు కైకేయీతోషవర్ధనః। ఉదారాంగో ముఖేపాతు వాణీంపాతు జటాధరః॥ పాతుపుష్కరతాతో మే జిహ్వాం దంతాన్ప్రభామయః। చుబుకం వల్కలధరః కంఠేపాతువరాననః॥ స్కంధౌపాతు జితారాతి ర్భుజౌశత్రుఘ్నవందితః। కరౌక వచధారీచ నఖాన్ఖడ్గధరోఽవతు॥ కుక్షీ రామానుజః పాతు వక్షః శ్రీరామ వల్లభః। పార్శ్వే రాఘవపార్శ్వస్థః పాతుపృష్ఠం సుభాషణః॥ జఠరంచధను ర్ధారీ నాభిం శరకరోఽవతు। కటిం పద్మేక్షణఃపాతు గుహ్యం రామైకమానసః॥ రామమిత్రః పాతు లింగ మూరూం శ్రీరామసేవకః। నందిగ్రామస్థితఃపాతు జానునీ మమ సర్వదా॥శ్రీరామపాదుకాధారీ పాతుజంఘే సదామమ। గుల్ఫౌ శ్రీరామ బంధుశ్చ పాదౌపాతు సురార్చితః॥ రామాజ్ఞాపాలకః పాతు మమాంగాన్యత్ర సర్వదా। మమపాదాంగుళీః పాతు రఘువంశసుభూషణః॥ రోమాణి పాతుమే రమ్యః పాతురాత్రౌ సుధర్మమ। తూణీరధారీ దివసే దిక్పాతు మమసర్వదా॥ సర్వకాలేషుమాంపాతు పాంచజన్య స్సదాభువి। ఏవం శ్రీభరతస్యేదం సుతీక్ష్ణ కవచంశుభమ్॥" అని యగస్త్యమహాముని చెప్పె. ఈ భరతకవచము సర్వో త్తమములయిన మంగళములను కలుగఁజేయునదియై యున్నది. ఓశిష్యోత్తమా! సకల స్తోత్రములలో నీభరతస్తోత్రము సర్వోత్తమమైనదై యున్నది. కావున శ్రీరామునకు సంతోషమును కలుగఁజేయునట్టి యీస్తోత్రమును తప్పక పఠింప వలయును. ఈ భరతకవచమును పఠించుటవలన శ్రీరామున కెట్టిసంతోషము కలుగునో యట్టిసంతోషము మఱియొకదానివలనఁ గలుగదు. కావున సర్వకాల ములయందు నీ భరతకవచమును పఠింపవలయును. ఈ భరతకవచమును పఠిం చుటవలన సకలవిధములయిన కోర్కెలును సఫలములగును. విద్యాకాముఁడు విద్యలను, పుత్రకాముఁడు పుత్రులను, భార్యాకాముఁడు భార్యను, ధనకాముఁడు ధనమును, పొందును. కావున రామోపాసకులగువారు తప్పక భరతకవచమును పఠింపవలయును. ఓశిష్యోత్తమా! విష్ణుదాసా! ఇట్లు భరతకవచమును చెప్పిన పిమ్మట నగస్త్యమునివరుఁడు శత్రుఘ్నకవచమును చెప్పఁదలఁచి యిట్లనియె. ఓ సుతీక్ష్ణా! శ్రీరామభక్తిని వృద్ధిచేయునదియును, సకలాభీష్టముల నిచ్చునది యును, మనోహరమునగు శత్రుఘ్నకవచమును చెప్పెదను. సావధానచిత్తుఁడవై వినుము.

* శ్రీ శత్రుఘ్నకవచము. *

"శ్లో॥ శత్రుఘ్నం ధృతకార్ముకం ధృతమహాతూణీర బాణోత్తమం పార్శ్వే శ్రీరఘునందనస్య వినయా ద్వామేస్థితం సుందరమ్। రామం స్వీయ కరేణ తాలదలజం ధృత్వాతిచిత్రం వరం సూర్యాభం వ్యజనం సభాస్థిత

మహాంతం విజయంతంభజే॥ అస్యశ్రీ శత్రుఘ్న కవచమంత్రస్య । అగస్త్యఋషిః । శ్రీ శత్రుఘ్నో దేవతా । అనుష్టుప్ఛందః । సుదర్శన ఇతిబీజమ్ । కైకేయీనందన ఇతిశక్తిః । శ్రీభరతానుజ ఇతికీలకమ్ । భరతమంత్రీత్యస్త్రమ్ । శ్రీరామదాస ఇతికవచమ్ । లక్ష్మణాంశజ ఇతిమంత్రః । శ్రీ శత్రుఘ్న ప్రీత్యర్థం సకలమనఃకామనాసిద్ధ్యర్థం జపేవినియోగః॥ అథాంగుళిన్యాసః॥ ఓం శత్రుఘ్నాయ అంగుష్టాభ్యాంనమః। ఓం సుదర్శనాయ తర్జనీభ్యాం నమః । ఓం కైకేయీనందనాయ మధ్యమాభ్యాంనమః । ఓం భరతానుజాయ అనామికాభ్యాంనమః । ఓం భరతమంత్రిణే కనిష్ఠికాభ్యాం నమః । ఓం శ్రీరామదాసాయ కరతలకర పృష్ఠాభ్యాం నమః । ఏవం హృదయాదిన్యాసః॥ ఓం శత్రుఘ్నాయ హృదయాయ నమః । ఓం సుదర్శనాయ శిరసేస్వాహా । ఓం కైకేయీనందనాయ శిఖాయైవషట్ । ఓం భరతానుజాయ కవచాయహుం । ఓం భరతమంత్రిణే నేత్రత్రయాయవౌషట్। ఓం శ్రీరామదాసాయ అస్త్రాయఫట్॥ ఓం లక్ష్మణాంశజ ఇతి దిగ్బంధః॥అథధ్యానమ్॥ రామస్య సంస్థితంవామే పార్శ్వే వినయపూర్వకమ్ । కైకేయీనందనం సౌమ్యం ముకుటేనాతిరంజితం ॥ రత్నకంకణకేయూరవనమాలావిరాజితమ్ । రశనాకుండలధరం రత్నహారసునూపురమ్ ॥ వీజయంతం వ్యజనేన జానకీకాంతమాదరాత్ । రామన్యస్తేక్షణంవీరం కైకేయీతోషవర్ధనమ్ ॥ ద్విభుజం కంజనయనం దివ్యలీలాంబరాన్వితమ్ ॥ సుభుజం సుందరం మేఘశ్యామలం సుందరాననమ్॥ రామవాక్యే దత్తకర్ణం రక్షోఘ్నం ఖడ్గధారిణమ్ ॥ ధనుర్బాణధరం శ్రేష్ఠం ధృతతూణీర ముత్తమమ్॥ సభాయాం సంస్థితం రమ్యం కస్తూరీతిలకాంకితమ్ । ముకుటస్థావతంసేన శోభితం చ స్మితాననం। రవివంశోద్భవం దివ్యరూపం దశరథాత్మజం । మధురావాసినందేవం లవణాసురమర్దనమ్ ॥ ఏవం ధ్యాత్వాతు శత్రుఘ్నం రామపాదేక్షణంహృది । పఠనీయం వరంచేదం కవచం తస్యపావనమ్॥ పూర్వేత్వవతు శత్రుఘ్నః పాతు యామ్యే సుదర్శనః । సుమిత్రా నందనః పాతుప్రతీచ్యాం సర్వదా మమ॥ పాతూదీచ్యాం రామబంధుః పాత్వధోభరతానుజః । రవివంశోద్భవశ్చోర్ధ్వం మధ్యే దశరథాత్మజః ॥ సర్వతః పాతుమామంత్రీ కైకేయీ తోషవర్ధనః । శ్యామలాంగశ్శిరః పాతు ఫాలం శ్రీలక్ష్మణాంశజః॥ భ్రువోర్మధ్యే సదాపాతు సుముఖో ఽత్రావనీతలే। శ్రుతకీర్తి పతి ర్నేత్రే కపోలే పాతురాఘవః ॥ కర్ణౌ కుండలకర్ణో ఽవ్యా న్నాసాగ్రం నృపవంశజః । ముఖంమమ యువాపాతుపాతువాణీం స్ఫుటాక్షరః ॥ జిహ్వాం సుబాహుతాతో ఽవ్యా ద్యూపకేతు పితాద్విజాన్ । చుబుకం రమ్యచుబుకః కంఠం పాతు సుభాషణః॥ స్కంధౌపాతు మహాతేజా భుజౌ రాఘువ వాక్యకృత్ । కరౌ మే కంకణధరః పాతు ఖడ్గీ నఖాన్మమ॥ కుక్షీరామ ప్రియఃపాతు పాతువక్షో రఘూత్తమః। పార్శ్వే సురార్చితః పాతుపాతు పృష్ఠం వరాననః॥ జఠరంపాతు రక్షోఘ్నః

పాతు నాభిం సులోచనః । కటీభరతమంత్రీ మే గుహ్యం శ్రీరామసేవకః ॥ రామాశ్రితమనాః పాతు లింగ మూరూ స్మితాననః । జానునీహ్యాత్రమే పాతు లవణాసురఘాతకః ॥ రామమిత్రః పాతుజంఘే గుల్ఫౌపాతు సునూపురః । పాదౌ నృపతిపూజ్యో ఽవ్యాచ్ఛ్రీమాన్పాదాం గుళీర్మమ॥ పాత్వంగాని సమస్తాని హ్యుదారాంగ స్సదామమ । రోమాణి రమణీయోఽవ్యాద్రాత్రౌ పాతు సుధార్మికః ॥ దివసే సత్యసంధోఽవ్యాద్భోజనేశరసత్కరః । గమనే కలకంఠోఽవ్యాత్సర్వదా లవణాంతకః ॥ ఏవం శత్రుఘ్నకవచం మయా తే సముదీరితమ్॥ " ఓశిష్యోత్తమా! ఈకవచమును భక్తితోఁ బఠించు మానవులు సకల సౌఖ్యములను పొందినవారగుదురు. ఈ శత్రుఘ్నుని కవచము సర్వోత్తమములయిన మంగళముల నొసగును. మఱియు నో శిష్యోత్తమా! ఈ శత్రుఘ్నకవచమును పఠించుటచేత పుత్రపౌత్రాద్యభివృద్ధి కలుగును. విశేషముగఁ జెప్పనేల? ఈ స్తోత్రపఠముచేతఁ గోరిన కోర్కెలన్నియును గలుగును. ఓశిష్యోత్తమా! ముందుగ హనుమత్కవచమును పిమ్మటఁ గ్రమముగ శత్రుఘ్న భరతలక్ష్మణ సీతారామ కవచములను బఠింపవలయును. ఈవిధముగ సర్వకాలములయందు నీ యాఱుకవచములను బఠింపవలయును. ఈ యాఱుకవచములును ముక్తిని కలుగఁజేయుటకుఁ బరమసాధనము లగుచున్నవి. ఒకవేళ నీయాఱింటిని బఠించుటకు శక్తిలేనివాఁడు హనుమత్సీతాలక్ష్మణ రామకవచముల నైనను పఠింపవలయును. ఈనాల్గింటిని గూడఁ బఠించుటకు శక్తిలేనియెడల హనుమత్సీతారామ కవచములనైనఁ బఠింపవలయును. దానికిని శక్తిలేనియెడల హనుమద్రామ కవచముల రెంటినైనను బఠింపవలయును. అందుకును శక్తిలేనియెడల హనుమత్సీతారామ కవచంబుల మూటిలో నొక్కదానినైనను బఠింపవలయును. అవకాశముగల సమయములయం దాఱుకవచములను బఠింపవలయును. అని చెప్పి యారామదాసిట్లనియె.

ఓశిష్యోత్తమా! నీవడిగిన విషయముల నన్నిటిని దెలిపితిని. అయిన నింకొక్కవిశేషమును దెలిపెదను. సావధానచిత్తుఁడవై వినుము. రామగీతలను పాడుచు గానాదులను చేయవలయును. ఆగీత మెద్దియనఁగా "దశరథనందన మేఘశ్యామ రవికులమండన రాజారామ" అనునదియై యున్నది. ఈ గీతామంత్రమును సకలకార్యములయందును పఠింపవలయును. మఱియు నో శిష్యోత్తమా! "రామజయ రామజయ రామజయరామ" అనుమంత్రమును వీణాదిస్వరములచేతఁ బాడవలయును. ఇట్టి మంత్రములను పఠించుటచేత సకల పాపములును భస్మములయి పోవును. ఇటులనే యనేకములగు గీతామంత్రములు కలవు. వానింగూడఁ దప్పక సుస్వరాదులచేత పఠించుచుండవలయును. ఓశిష్యోత్తమా! నానావిధములయిన రామ మంత్రములను నానావిధములయిన భావలచేత రచింపవలయును. రామ మంత్రములను రచించుటచేత (శ్రీ)రాముఁడు

సంతోషమును పొందును మంత్రములు, ప్రబంధములు, కావ్యములు, స్తోత్రములు, కీర్తనములు, మొదలగువానిచేత శ్రీరాముని స్తోత్రము చేయువలయును. అగ్నిచేత మందిరములు భస్మములయి పోవువిధముగ రామమంత్రముచేత సకల పాపములును నశించిపోవును. దంభము, అతిభక్తి, నిష్కామము, కామము అనువానితోఁ గూడుకొని రామమంత్రమును పఠించినను పాపము నశించును. రాముని నిందించుటచేత నవశ్యముగ నరకము కలుగును. రామమంత్రమును జపింపనివాఁడు సకల వేదశాస్త్రములను పఠించినను ప్రయోజనములేదు. రామమంత్రముల నేభాషయందుఁ బఠించినను నిస్సందేహముగ శ్రీరాముఁడు సంతోషమును పొందును. శ్రీరాముఁడుగానము చేయఁదగిన వాఁడును, చింతింపఁదగిన వాఁడును, స్తోత్రము చేయఁదగినవాఁడును, సేవింపఁ దగినవాఁడును, ధ్యానింపఁ దగినవాఁడును, నమస్కరింపఁ దగినవాఁడును, అయి యున్నాఁడు.

ఇట్లని యానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పదునాఱవసర్గము ముగిసెను.

—:(o):—

* శ్రీరామ గరుడసంవాదము. *

అంతట రామదాసు మఱల నిట్లనియె. ఓ శిష్యోత్తమా! నీవు గోరినవాని నన్నింటిని జెప్పితిని. ఇంక నేదేని నీకు వినవలయునని యుండెనేని చెప్పుమనినవిని విష్ణుదాసిట్లనియె ఓ గురూత్తమా! రామాయణమును పఠించినపిమ్మట మానవులు చేయఁదగిన కార్యమేదియో దానిని దెలుపుమనిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా! రామాయణమును పారాయణము చేసినపిమ్మట బుద్ధిమంతుఁడగువాఁడు నాలుగు గుఱ్ఱములుగలదియును, పట్టువస్త్రములతోఁ జేయఁబడిన పతాకములతోఁ గూడినదియును, కింకిణీధ్వనులు గలదియును, అయిన రథమును బ్రాహ్మణునకు దానము చేయవలయును. మఱియు దూడతోఁ గూడుకొనినదియును, పాలనిచ్చునట్టిదియు నగు, నావును దానము చేయవలయును. అనంతరము బ్రాహ్మణ సమారాధనము చేయవలయును. ఈవిధముగఁ జేసినయెడల నది యత్యధికమైన ఫలమును కలుగఁజేయును. రాముని చరిత్రము గలకావ్యము రామాయణ మనఁబడుననిన విని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా! హనుమచ్చరితమును గుఱించి నాకుఁ జెప్పవలయుననిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా! శ్రీరాముఁడు త్రికూటాచలమునందు నాగపాశములచేఁ బీడితుఁడయి యున్నపుడు నారదవచనమును విని గరుత్మంతుని స్మరించె. అప్పుడు గరుత్మంతుఁడు మిగుల వేగముగవచ్చి యత్యధికమైన పరాక్రమముగల శ్రీరామునకు నమస్కారమునుచేసె. పిమ్మట నాగాస్త్రమును నివారించి శ్రీరాముని ననేకవిధ

ములఁ బ్రార్థించి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నీవు నన్ను స్మరించుట మిగుల నాశ్చర్యమును గలిగించుచున్నది. మహారుద్రుఁడును మహావీరుఁడునునగు హనుమంతుఁడును, సుగ్రీవ నల నీల సుషేణ జాంబవ దంగదాదులు నుండఁగా నావలనఁ బ్రయోజనమేమనఁగా శ్రీరాముఁడిట్లనియె. ఓ గరుత్మంతుఁడా! నీవు వచ్చుటంజేసి భయమునంది నాగులందఱును పరుగిడిరి. వీరందఱును నాగులచేతఁ బీడింపఁబడిరనిన విని గరుత్మంతుఁ డిట్లనియె.

* వానరుల పూర్వవృత్తాంతము. *

ఓ రఘుకులోత్తమా! దేవదేవోత్తమా! వానరుల చరిత్రమును జెప్పెదను. వినుము. నీవు సాక్షాన్నారాయణుఁడవు. సీతామహాదేవి మహాలక్ష్మి. లక్ష్మణుఁ డాదిశేషువు. వానరులు రుద్రులు. సుగ్రీవుఁడు వీరభద్రుఁడు. నలుఁడు శివుఁడు. ఈవిధముగఁ బదునొకండుమంది రుద్రులును వానర రూపములను ధరించిరి. అట్లగుటకుఁ గారణమును జెప్పెదను. వినుము. తొల్లి దేవదానవులందఱును ఏకీభవించి సముద్రమును మథించిరి. ఆసమయమునందు పీడాకరములయిన వ్యాధు లనేకములు గలిగెను. అట్టివ్యాధులచేత జగతీతలమంతయుఁ బీడింపఁబడియె. అంతట ఋషులు రాజులు మొదలగు వారందఱును బ్రహ్మయొద్దకుఁ బోయి ఇట్లు మొఱలిడిరి. ఓ దేవోత్తమా! ఈ జగతీతలమంతయును నానావిధములయిన వ్యాధులచేతఁ బీడింపఁబడుచున్నది. త్రిదోషజన్యములయిన జ్వరములు మిగుల నధికముగ విజృంభించి యున్నవి. కావున మేము నానావిధములయిన కష్టముల ననుభవించుచున్నారము. మంత్ర తంత్రములును ఓషధులును, ఈ వ్యాధులను పోఁగొట్టఁజాలకున్నవి. ఓ దేవోత్తమా! మమ్మీ మహారోగములనుండి కాపాడుమని యనేకవిధముల బ్రార్థింపఁగా బ్రహ్మదేవుఁడు రుద్రులను బ్రార్థించె. అంతట నారుద్రులు బ్రహ్మవాక్యమునువిని వీరభద్రాదులతోఁ గూడుకొని సుగ్రీవాదులై పుట్టిరి. అంతట నావానరులు పర్వతాగ్రములు వనములు మండలములు మొదలగువానియందు సంచరించుచు మిగుల దారుణములయిన భుక్కారములను చేసి యావ్యాధులను నశింపఁజేసిరి. పిమ్మట నావానరులందఱిచేతను భూలోకమంతయు వ్యాప్తమగుటను జూచి బ్రహ్మదేవుఁడు సంతోషమును పొందె. అట్లు బ్రహ్మదేవుఁడు సంతోషమునుపొంది యనేకవిధములయిన వరముల నీయఁదలఁచి యిట్లనియె. ఓ రుద్రులారా! మీముద్ర మృతసంజీవినియగుఁ గాత. మీయాజ్ఞ సర్వలోకములయందును జెల్లుచుండును. మీకు మనోవేగమువంటి వేగము కలిగియుండును. లోకములో నేమానవులు నానావిధములయిన పతాకముల నిర్మించుకొని చిత్రములయిన తోరణముల నేర్పఱచి భక్ష్యభోజ్య ఖాద్య లేహ్య పేయపాయసాదులను మిమ్మునుద్దేశించి హోమమును చేయుదురో వారుఁ బరమపదమును పొందుట

యేగాక నీరోగులుగూడ నగుదురు. ఓ రఘుకులోత్తమా! ఈవిధముగ రుద్రగాథను జెప్పితిని. "మానస్తోక" యనుమంత్రము నైనను "మనోజ్యోతి" యనుమంత్రము నైనను, గాయత్రీ మంత్రమునైనను, జపించుచుఁ బైనఁజెప్పఁబడిన పదార్థముల చేత హోమమును చేయవలయును. ఈవిధముగఁ జేసినయెడల నీరోగులును సుఖవంతులునై మోక్షమును పొందుదురని బ్రహ్మదేవుఁ డానతిచ్చె. ఓ రఘుకులోత్తమా! వానరులయొక్క పూర్వవృత్తాంతమును దెలిపితిని. ఈ రుద్రులందఱిలోపల హనుమంతుఁడు భద్రుఁడను నామధేయము కలవాఁడు. కావున హనుమన్విగ్రహమును గోపురాదులయందు నిర్మించి పూజానైవేద్యాదుల నాచరింపవలయుననిన విని శ్రీరాముఁడిట్లనియె.

* హనుమద్వ్రతపతాకలను వర్ణించుట. *

ఓ గరుత్మంతుఁడా! కపిపూజను చేయఁదగిన విధమెట్టిది? వానరపతాకము లెట్టివి? ఆపతాకముల నెన్నింటిని నిర్మింపవలయును? హోమమెన్నిపర్యాయములు చేయవలయును? ఆ హోమమునకుఁ దగిన ద్రవ్యమేది? జపము నేవిధముగాఁ జేయవలయును? ఏయేపదార్థములను దానము చేయవలయును? ఆవిషయమును సర్వమును దెలుపుమనిన విని గరుత్మంతుఁ డిట్లనియె. ఓ రఘుకులోత్తమా! అనేకుల నేక కాలమునందుఁ జంపునట్టి మారియను దేవత గ్రామమునందైనను, పత్తనమునందైనను ప్రవేశించి నపుడు మహామంత్రౌషధముల కంటె నితరమగు ప్రతిక్రియ యేదియును లేదు. కావున నట్టిసమయములందు బ్రాహ్మణుఁ డగువాఁడు ప్రాతఃకాలమునకు ముందుగ మేల్కాంచి కాలోచిత కృత్యములను నెఱవేర్చుకొని పుణ్యాకరమగు గంగాజలమునందు స్నానముచేసి యుపవాసమున్న పదునొకండ్రు బ్రాహ్మణులను నిమంత్రణము చేయవలయును. అనంతర మారాత్రియంతయు జాగరణము చేయవలయును. మఱునాటి ప్రాతఃకాలమునందు సర్వాలంకార శోభితమగు మంటపమును నిర్మింపవలయును. పిమ్మట రుద్రులకు పంచామృత స్నానము చేయింపవలయును. అనంతరము శతపత్రాది పుష్పములచేతఁ బూజను చేయవలయును. పిమ్మట చందనకర్పూర కుంకుమాదులచేత రుద్రులకు లేపనము చేయవలయును. అనంతరము దశాంగధూపమునిచ్చి దీపమును బెట్టవలయును. నైవేద్యమును సమర్పించి తాంబూలాదుల నొసంగి పదునొకండు పతాకములను పట్టణమునందు గల్పింపవలయును. మఱియు నో రఘుకులోత్తమా! ఏయేరుద్రున కేయే విధముగఁ జెప్పఁబడినదో యాయా రుద్రున కాయా పతాకములను నిర్మించి ప్రాతఃకాలమునందు మఱల గంగాస్నానముచేసి సమాహితచిత్తుఁడై హోమమును జేయవలయును. ఆ హోమమును సాజ్యపాయసము, తిలసర్పిస్సులు మొదలగు వానిచేత వేయిపర్యాయములు చేయవలయును. హనుమదాలయ

ద్వారమునందు పతాకమును నిర్మింపవలయును. రాజద్వారమునందు సుగ్రీవ పతాకమును నిర్మింపవలయును. నల నీల పతాకములను శివద్వారము నందును, స్మరతరశ మైందాంగదుల పతాకములను గ్రామమునకు వెలుపల నాలుగు దిక్కులయందును, జాంబవ ద్దధివక్త్రుల పతాకములను జలస్థానమునందును, మహావాద్యములతోఁగూడ స్థాపింపవలయును. అంతట ప్రతిదినమును బ్రాహ్మణసంతర్పణమును జేయవలయును. ఋత్విజుల కలంకారములతోఁ గూడుకొనిన వస్త్రములను దానము చేయవలయును. మఱియు నో శిష్యోత్తమా ! బ్రాహ్మణులకు నాచార్యునకును ఛత్ర కరపత్ర పాదుక ధేన్వాదులను దానము చేయవలయును. అనంతరము వస్త్రాలంకారాదులచేత నలంకరింపఁబడిన మహిషిని బ్రాహ్మణునకు దానము చేయవలయును. మఱియు నితరులగు బ్రాహ్మణులకు సప్తధాన్యములను దానము చేయవలయును. అదియునుంగాక గుడమిశ్రలవణమును, తైలమును దానము చేయవలయును. మఱియు నో రఘుకులోత్తమా ! శయ్యాది నానాదానంబులను జేయవలయును. ఈవిధముగఁ జేసిన రాజు క్షేమమును పొందును. "మానస్తోక" అను మంత్రముచేత హవనాదులను జేయవలయును.

ఇట్లని శ్రీమదానంద రామాయణాంతర్గత మనోహరకాండమునందు
హనుమత్పతాకారోపణ వర్ణనమనియెడు
పదునాఱవ సర్గము ముగిసెను.

——:(o):——

* శ్రీ సార రామాయణవర్ణనము. *

అంతట రామదాసిట్లనియె. ఓ విష్ణుదాసా ! నీవడిగిన ప్రశ్నముల కన్నింటికిని సమాధానము చెప్పితిని. తొల్లి రామపూజను చేసినపిమ్మట శ్రీరాముఁడు సంతోషమును పొంది యీ యానందరామాయణమును నీనిమిత్తముగ నా కిచ్చి నీకుఁ జెప్పుమనియె. మఱియు నో శిష్యోత్తమా ! నూటతొమ్మిది శ్లోకములుగల సారరామాయణము నుపదేశించె. అట్లు శ్రీరామునిచేత నుపదేశింపఁ బడినదియును, మంగళప్రదము నయిన యీ సారరామాయణమును విస్తరించి చెప్పితిని. వాల్మీకి మునివరుఁడు శతకోటిరామాయణమును రచించె. దానియందలి సారమైన యీ యానందరామాయణము నీకు వినిపించితి ననిన విని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా ! పాపనాశకమును శతకోటి పరిమితము నయిన రామాయణమునందు కాండములెన్ని ? సర్గములెన్ని ? అనిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా ! శతకోటి పరిమితిగల రామాయణము తొమ్మిదిలక్షల కాండములు కలదియును, తొంబదిలక్షల సర్గములు కలదియునై యున్నది. నూఱుకోట్ల శ్లోకములు కలవు. అనిన విని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా ! శ్రీరాముఁడు

నీ కుపదేశించిన రామాయణమును వినవలయునని తలఁచుచున్నాఁడ ననిన విని యా రామదా సిట్లనియె. ఓ శిష్యోత్తమా ! నీవు చక్కఁగా బ్రశ్నమును చేసితివి. నేను శ్రీరాముని బూజించినపిమ్మట శ్రీరాముండు సోదరులతోడఁ బ్రత్యక్షమునంది ప్రసన్నుండై యిట్లనియె. ఓ రామదాసా ! నేను సారమగు విషయమును బోధించెదను. సావధాన మనస్కుండవై వినుము. ఈవిషయమును సర్వమును గ్రహించి విష్ణుదాసను పేరుగల నీశిష్యునకుఁ దెలుపుము. నాతల్లిదండ్రులను రావణుఁడు లంకాపట్టణమునకుఁ గొనిపోవుట, దశరథుఁడు పెండ్లి చేసికొనుట అనునవి మొదలుకొని ఇంతవఱకును నీకుఁ జెప్పిన విషయముల నన్నింటిని దెలుపుమనియె. కావున నానంద రామాయణమును సర్వమును నీకుఁ దెలిపితిని. ఈ యానందరామాయణముయొక్క శ్రవణ మనననాదులచేతఁ గలుగునట్టి ఫలము లిన్నియని చెప్పుటకు నాకు శక్తి చాలదు. ఏయే యభిలాషలు లోకమునందుఁ గలవో యవి యన్నియు నీ యానందరామాయణముయొక్క శ్రవణమనన నాదుల చేతఁ గలుగును. కావున నీ యానందరామాయణమువలెఁ బుణ్యమును గలుగఁ జేయునట్టిది మఱియేదియును లేదు.

ఇట్లని శ్రీమదానందరామాయణాంతర్గత మనోహరకాండమునందలి
పదునేడవసర్గము ముగిసెను.

—:(O):—

* హనుమదర్జునుల శపథము. *

అంతట విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా ! అర్జునుఁడు కపిధ్వజుఁడయ్యె నని పూర్వము వినియుంటిని. అర్జునునకట్టి నామధేయము వచ్చుటకుఁ దగినకారణమును చెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని రామదాసిట్లనియె. ఓ శిష్యోత్తమా ! నీవు చక్కని ప్రశ్నము చేసితివి. నీవడిగినవిషయము రాఁబోవు ద్వాపర యుగాంతమున జరుగఁగలదు. అర్జునుఁ డొక్కనాఁడు కృష్ణరహితుఁడై రథారూఢుఁడయ్యె. అనంతరము పురము వెడలిపోయి యరణ్యమునందు సంచరించి యనేకమృగంబులను జంపి మధ్యాహ్నమునందు స్నానముచేయుట కుద్యమించె. అట్లు ప్రయత్నించి రామేశ్వరమునకుఁ బోయి ధనుష్కోటియందు స్నానముచేసి మాధ్యాహ్నిక కృత్యంబులం దీర్చుకొని రథారూఢుఁడై గర్వముతో సముద్రతీరమునందు సంచరించుచుండె. అట్లు సంచరించుచు నక్కడనున్న యొకపర్వతమునందు నివసించిన హనుమంతునిజూచి సామాన్య వానరునిగాఁ దలఁచె. ఆసమయమునందు హనుమంతుఁడు "రామ రామ" యని రామమంత్రమును పఠించుచుండెను. అట్లు రామమంత్రమును బఠించుచున్న హనుమంతునిజూచి యోవానరా ! నీపేరేమనిన విని యా హనుమంతుఁ డిట్లనియె. ఓ

రాజోత్తమా! శ్రీరాముఁ డెవ్వని ప్రతాపమువలన శిలలతో నూఱామడల సముద్రమును బంధించెనో యా హనుమంతుఁడను. అట్లు గర్వముతోఁ బలికిన హనుమంతుని వాక్యమునువిని యర్జునుఁడు నవ్వి యిట్లనియె. ఓ యాంజనేయా! శ్రీరాముఁడు వ్యర్థముగ మిగులఁ బ్రయాసమునుజెందె? శరసేతువును నిర్మించి వానరసైన్యమును నడిపింపలేక పోయెనా? అనినవిని హనుమంతుఁ డిట్లనియె. ఓ యర్జునుఁడా! శరసేతువుమీఁద నావంటివానరు లెక్కినయెడల నది విరిగిపోవును. కావున శ్రీరాముఁడు శరసేతువును బంధింపక యూరకుండెను. అనినవిని యర్జునుఁడు మఱల నిట్లనియె. ఓ వానరోత్తమా! వానరభారమును సహింపఁదగిన శరసేతువును గట్టఁజాలనివాని ధనుర్విద్య మిగుల సమర్థమైనది కాదు. ఇప్పుడు నేను శరసేతువును బంధించెదను. దానిమీఁద నీ వెక్కి నృత్యముచేసి చూడుమనిన విని నవ్వుచు హనుమంతుఁ డిట్లనియె. ఓ యర్జునుఁడా! నీవు శరములచేత నిర్మించినసేతువు నాకాలి యంగుష్ఠముయొక్క భారమునకుఁగూడ సహింపక విరిగి సముద్రమునందుఁ బడిపోవును. అనినవిని యర్జునుఁడు మఱల నిట్లనియె. ఓ యాంజనేయా! నాచేతఁ జేయఁబడిన శరసేతువు నీ యంగుష్ఠభారమునకే విరిగిపోయినయెడల నే నగ్నిప్రవేశించెదను. అట్లు విరిగిపోనియెడల నీ వేమి పందెము పెట్టెదవనిన విని యాంజనేయుఁ డిట్లనియె. ఓ యర్జునుఁడా! నా యంగుష్ఠభారముచేత నీచేఁగట్టఁబడిన శరసేతువు విరిగిపోనియెడల నీధ్వజమునందుండి నీకు సాహాయ్యమును చేసెదననియె. అందుల కర్జునుఁ డంగీకరించి ధనుష్టంకారమును గావించి శరసముదాయముచేత మిగుల దృఢమైనదియును గొప్పదియు నగు సేతువును నిర్మించె. ఆసేతువు సముద్రముమీఁద నూఱామడల వఱకును వ్యాపించియుండె. అంతట హనుమంతుఁ డర్జునుఁడు చూచుచుండఁగనే తన యంగుష్ఠము నాసేతువుమీఁద మోపెనో లేదో యాసేతువు పెళపెళయని విరిగి సముద్రమునఁ గూలెను. అప్పుడు దేవతలు, గంధర్వులు, కిన్నరులు, ఉరగులు, రాక్షసులు, విద్యాధరులు, అప్సరస్త్రీలు, సిద్ధులు మొదలగువారందఱు నాకసమునందుండి యాంజనేయార్జునుల మధ్య పుష్పవర్షంబును వర్షించిరి.

* అర్జును గర్వభంగము. *

అంతట నర్జునుఁడు సముద్రతీరంబున చితినిపేర్చి హనుమంతుఁడు వలదని యెంత చెప్పినను వినక యగ్నిప్రవేశము చేయ సమకట్టె. అట్టియెడ శ్రీకృష్ణుండు బ్రహ్మచారి వేషంబుతోడ నచ్చోటికివచ్చి యర్జునునివలన సమస్తవృత్తాంతమునువిని యిట్లనియె. ఓ యాంజనేయార్జునులారా! ఇదివఱకు మీరు చేసిన కార్యమునందు సాక్షి యెవఁడును లేఁడు. కావున నా పందెము జరుగఁదగినది కాదు. కాఁబట్టి మీ రిరువురు నీకార్యమును మఱలఁ జేయవలయును. అట్లుచేసినయెడల నందలి సత్యమును నేను జెప్పెదను అనియె. ఆవచనముల నాలకించి యాంజనేయార్జును

లంకుల కంగీకరించిరి. అంతట నర్జునుఁడు మునుపటివలె శరసేతువును నిర్మించెను. ఆసమయమునందు శ్రీకృష్ణుఁడు తనచక్రమును శరసేతువునకు మధ్య నిమిడ్చెను. అంతట హనుమంతుఁడు తన యంగుష్ఠభారముచేత నాసేతువును పీడించెను. అట్లుపీడించిన నయ్యది దృఢముగనుండుటని తెలిసికొని పాదజానుకరాదులచేత తనదుబలమును సర్వమును జూపుచు నాసేతువును విరుచుటకు యత్నించె. అంతట హనుమంతుఁ డాసేతువు దృఢమైయుండుటను దెలిసికొని యేమియును చేయునది నేరక తనమనస్సునం దిట్లని యాలోచించె. "పూర్వము నాయంగుష్ఠముయొక్క భారముచేతనే శరసేతువు సముద్రమునందు విరిగిపడెను. అట్టిశరసేతు విప్పుడు హస్తపాదాదులచేతఁగూడ విరుగకపోయె. కావున విచారింపఁగఁ దీనికి బ్రహ్మచారియే కారణమని తోఁచుచున్నది. వీఁడు సాధారణ బ్రహ్మచారి కాఁడు. నారాయణుఁడు బ్రహ్మచారివేషమును దాల్చి యిక్కడకు వచ్చియున్నాఁడు. రామావతారమునందుఁ జెప్పినవిధముగ నారాయణుఁడు కృష్ణావతారము నవలంబించి నన్నవమానింప సాక్షాన్నారాయణుఁడగు కృష్ణుని ముందర నా పరాక్రమ ముపయోగించునా? ఉపయోగింపదు" అని మనస్సునందు నిశ్చయించి యర్జునునితో నిట్లనియె. ఓ యర్జునుఁడా! ఈ బ్రహ్మచారియొక్క సాహాయ్యమువలన నీవు నన్నుజయించితివి. ఇతఁడు బ్రహ్మచారికాఁడు. సాక్షాన్నారాయణుఁడగు కృష్ణుఁడు. ఈకృష్ణుఁడు నీచేతనిర్మింపఁబడిన శరసేతువునందు చక్రమును సంధించె. ఈ శ్రీకృష్ణుఁడు నీనిమిత్తముగ నిక్కడకువచ్చె. త్రేతాయుగమునందుఁ గృష్ణరూపమున ద్వాపరాంతమునందు నాకు దర్శనమిచ్చెదనని శ్రీరాముఁడు పలికె. ఆవచనము నిప్పుడు సత్యముగఁ జేసెనని హనుమంతుఁడు చెప్పుచుండఁగానే యా బ్రహ్మచారి సాక్షాత్కృష్ణుఁడయ్యె. అట్టి కృష్ణునిజూచి యర్జునుఁడు మహాసంతోషముకలవాఁడై సాష్టాంగ దండప్రణామంబు లొనర్చెను. అంతట కృష్ణుడు హనుమంతుని కౌగిలించుకొనెను. పిమ్మట హనుమంతుఁడు ధన్యుఁడనైతినని సంతోషమునందెను. అంతట చక్రము శ్రీకృష్ణుని యాజ్ఞచే యథాస్థానమునందెను. అనంతరము సముద్రుఁడు తనదుతరంగములచేత నా శరసేతువును తనలోని కీడ్చుకొనియె. అప్పుడర్జునుఁడు గర్వహీనుఁడై శ్రీకృష్ణునిచేత జీవించితినని తలఁచె. ఆసమయమునందు శ్రీకృష్ణుఁ డర్జునునితో నిట్లనియె. ఓ యర్జునుఁడా! నీవు శ్రీరామునితో స్పర్ధనువహించితివి. హనుమంతుఁడు నీధనుర్విద్యను సర్వమును వ్యర్థమైనదానినిగాఁ జేసె. హనుమంతునితో నీవు విరోధించుటచేత రామునితో విరోధించినట్లయ్యె. కావున నికమీఁద నీవు గర్వరహితుఁడవై సర్వకాలములయందును నన్ను భజింపుమని చెప్పి యచ్చటనున్న హనుమంతునిజూచి యిట్లనియె. ఓ యాంజనేయా! నీవుచేసిన ప్రతిజ్ఞను మఱవకుండుమని చెప్పి యర్జునునితోఁగూడ స్వస్థానమునకుఁ బోయె.

అంతట నది మొదలుకొని యర్జునునకుఁ గపిధ్వజుఁడను నామధేయము కలిగె. ఓ శిష్యోత్తమా! నీవడిగిన విధముగ భవిష్యత్కాలీన కథను దెలిపితిని. ఇంకను నీకు దేనిని వినవలయునని కోర్కె కలిగియున్నదో యావిషయమును దెలుపుమనిన విని విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా! నేనిప్పుడు శ్రీరాముఁడు వైకుంఠమునకుఁబోవు నుత్సవవృత్తాంతమును వినవలయునని కోర్కె యున్నది. కావున నావిషయమును సర్వమును దెలుపుమనిన విని రామదాసిట్లనియె.

ఓ శిష్యోత్తమా! నీకుఁ బూర్ణకాండమును సర్వమును జెప్పెదను. వినుము. ఆకాండమునందు శ్రీరాముఁడు వైకుంఠమునకుఁబోవుట మొదలుగాఁగల వృత్తాంతము లిమిడియున్నవి. ఇప్పుడింతవఱకును నీకు మనోహరకాండ విషయమును దెలిపితిని. ఈ మనోహరకాండమును శ్రద్ధాభక్తులతో వినువారికి శ్రీరామునియందు భక్తి విశేషముగఁ గలిగియుండును. మఱియు నో శిష్యోత్తమా! ఈ మనోహరకాండమును వినువారికి సకలకామ్యంబులును సిద్ధించును. ఆనందరామాయణాంతర్గతమైన యీ మనోహరకాండము మిగులఁ బావనమైయున్నది.

ఇట్లని శ్రీమదానందరామాయణాంతర్గత మనోహరకాండము

సంపూర్ణము.

—:(o):—

శ్రీ

శ్రీరస్తు.

శ్రీపార్వతీ పరమేశ్వర సంవాదరూపంబును
శ్రీమద్వాల్మీకి మహర్షి ప్రణీతంబునయిన

శ్రీమదానందరామాయణము.

పూర్వకాండము - ప్రారంభము.

* శ్రీ వాల్మీకిమునివరుఁడు సోమవంశమును విస్తరించి చెప్పుట. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! సీతామనోహరుఁడగు శ్రీరాముఁడు రాజ్యమును పాలించుచుండ హస్తినాపురము నేలు సుషేణుఁడను రాజేంద్రుని దగ్గఱనుండి శ్రీరామునొద్దకు దూతయొకఁడు వచ్చి నమస్కరించి యిట్లనియె. పద్మపత్రము వంటి నేత్రములుగలయో రామచంద్రా! సోమ వంశోద్భవులును, చిరంజీవులునగు నలాదిరాజులు వచ్చి హస్తినాపురమును ముట్టడించి రనిన విని శ్రీరాముఁడు మిగుల నాశ్చర్యమును పొంది వసిష్ఠమహామునితో నిట్లనియె. ఓ గురూత్తమా! ఇదివఱకీ లోకములోని రాజు లెవ్వరుగాని నాతో యుద్ధముచేయుటకు వచ్చినవారు గారు. ఇప్పుడు సోమవంశమునందుఁ బుట్టినరాజులు కొందఱు యుద్ధమునకు సన్నద్ధులయి వచ్చినట్లు వింటిని. ఇట్లు వచ్చుటకుఁ దగిన కారణమేదియో విచారించి చెప్పు మనిన విని వసిష్ఠమహాముని యా శ్రీరామునితో నిట్లనియె. ఓ శ్రీరామచంద్రా! నీ చరిత్రములు సర్వమును రచించిన వాల్మీకి మునివరుని

విషయము నడిగినయెడల విస్పష్టముగఁ దెలియుననిన విని శ్రీరాముఁడు మిగుల శీఘ్రముగ లక్ష్మణునిబంపి వాల్మీకి మునివరుని రప్పించె. అప్పుడు శ్రీరాముఁడు సీతా సమేతుఁడై యా వాల్మీకి మునివరుని బూజించి తగిన యాసనమునందుఁ గూర్చుండ నియమించి జరిగిన వృత్తాంతము సర్వమును విన్నవించె. అప్పుడు వాల్మీకి మునివరుఁడు కొంచెముగ నవ్వి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నీకుఁ దెలియనిదేదియును లేదు. నీవు వినోదార్థముగ నన్నడుగు చున్నాఁడవు. అయినను నేను జెప్పెదను. నీవును నీవారును వినఁదగినది మని యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! పదునొకండువేల పదునొకండు సంవత్సరములును, పదునొకండుమాసములును, పదునొకండుదినములును, పదునొకండుగడియలును, పదునొకండు పరగడియలును, నీవు రాజ్యము చేయునట్లు రామాయణమునందు వ్రాయఁబడియున్నది. శతకోటి పరిమితమైన రామాయణమును నీ యవతారమునకు ముందే నిర్ణయింపఁబడి యున్నది. అందులో సంతయును గడచినది. ఇంకఁ బదునెనిమిది దినంబులు తక్కువగ నొకసంవత్సరకాల మీ భూలోకమునందు నీ యవతారముండును. ఈ యుద్ధముతో నీ యవతార కృత్యములన్నియును పరిసమాప్తిని పొందఁగలవు. నీ యవతారకాలము ముగింపు కావచ్చినది. ఓ రఘుకులోత్తమా! నీవు గంగానదికిఁబోయి బ్రహ్మాదులచేత స్తోత్రము చేయఁబడి వైకుంఠమునకుఁ బోదువు. అనిన విని శ్రీరాముఁడు మఱల నిట్లనియె. ఓ మునికులోత్తమా! ఇంతవఱకును లవాదు లెక్కడ నివసించిరి? ఇప్పుడెక్కడనుండి వచ్చిరి? ఆ విషయమును సర్వమును దెలుపుమనిన వాల్మీకి యిట్లనియె. అధికమైన భుజ బలముగల యోరామచంద్రా! సర్వము నెఱింగించెదను. సావధాన చిత్తుఁడవై యాకర్ణింపుము. అత్రిమహాముని పూర్వము అనఁగా కృతయుగమునందలి వైశాఖ పూర్ణిమయందు స్త్రీలముఖముతోఁ బోల్పఁదగిన చంద్రునిజూచి కామోద్దీపితుఁడై తన వీర్యమును భూమియందు విడిచె. ఆ సమయమునందా వీర్యమువలన నొక్కపుత్రుఁ డుదయించె. ఆపుత్రుఁడు సోమముఖ దర్శనమువలనఁ బుట్టుటచేత సోముఁడను నామధేయము కలవాఁడయ్యె. అంతట నా సోముఁడు భాగీరథీతీరమునకుఁ బోయి ఘోరమైన తపసును జేసెను. ఆసమయము నందచ్చోటున నొక్క యేనుఁగు వచ్చె. ఆయేనుఁగు ననేకములైన పశువులొక్కటిగాఁ జేరి సంహరించె. ఆ విషయమును సర్వమును జూచి యా సోముఁడు కొంత సేపాలోచించి యిది యీభూమియొక్క ప్రభావమని తలఁచె. అంతట నందొక్కపురమును నిర్మించె. ఏనుఁగు నశించుచోట నిర్మించుటచేత నా పట్టణమునకు హస్తినాపురమను నామధేయము కలిగె. పిమ్మట నందలి జనులందఱు నా సోముని రాజునుగాఁ జేసికొనిరి. అంతటఁ గొన్నిదినముల కతనికి బుధుఁడను పుత్రుఁ డుదయించెను. పిమ్మట వా రిరువురును భూలోకమును సర్వమును స్వాధీ

సముగఁ జేసికొని దేవలోకమునకుఁ బోయిరి. అట్లు దేవలోకమునకుఁ బోయి యుద్ధరంగమున దేవతల నందఱ నోడించి యందలి దివ్యాంగనలను గ్రహించి సంతోషముతో స్వర్గమునందు వసించిరి. అప్పుడు బ్రహ్మవారలం గని యిట్లనియె. పుత్త్రులారా! మీరు నా వంశమునం దుద్భవించితిరి. కావున దేవతలతోఁ గూడ నన్ను వధింపక విడిచితిరి. అని సంతోషపూర్వకముగ ననేక వరముల నిచ్చి మఱియు నిట్లనియె. ఓ పురుషోత్తములారా! మీచేత దేవతా సముదాయము విడువఁబడెను. అయినను నేను మీకు వరములిచ్చెదను. మీ వంశమునందు రాజులు కొందఱు మువ్వురి కవ్వల నెవ్వరిచేతను పరాజితులు కాకుందురు. ఆవిధముగ నేన్గురు పురుషు లుందురు. అని యా బ్రహ్మదేవుఁడు వరములనిచ్చి తన నివాసమునకుఁ బోయె. అనంతరము తనదు మనుమరాలయిన పద్మావతి యను నామెను సోమునకిచ్చి వివాహముచేసెను. పిమ్మటఁ గొన్ని దినముల వఱకును సోమబుధులు దేవేంద్రునితోడ వైరము నవలంబించి యుండిరి. అంతటఁ గొన్ని దినములకు బుధునకుఁ బురూరవుఁడను కుమారుఁడు జన్మించె. ఆపురూరవుఁడు హస్తినాపట్టణమునందు చిరకాలము ధర్మయుతముగ రాజ్యమును పాలించె. ఆ పురూరవునకుఁ గశ్యపుఁడు వానికల్పుఁడు నల్పునకు శ్రీమంతుఁడగు నలుఁడును పుట్టిరి ఆనలుఁడు దిక్పాలురను జయించుట కుద్యమించె. అంతట నలుఁడు పూర్వజులగు పురూరవాదులను మువ్వురిని రాజ్యమునందు స్థాపించి సప్తద్వీపాధిపతులతోఁ గూడుకొనినవాఁడై మిగుల నున్నతమగు మేరుపర్వతము దగ్గరకుఁ బోయె. పోయి క్రమముగ నగ్నియమనిర్‌ృతి వరుణులను జయించె. ఆయుద్ధమునందు రావణాదుల సహాయమును పొందె. ఇంతలోపల రావణుఁడు సేనాసమేతముగ స్వర్గమునకుఁ బోయె. అంతట యుద్ధమును జేసి యింద్రాదులను జయించి వారల లంకాపట్టణమునకుం దీసికొనిపోయె. అప్పుడు సోముఁడు పుత్రుఁడగు బుధుఁడు మొదలగువారలతోఁ గూడుకొనినవాఁడై యింద్రాదులను విడిపించుట కొఱకు యుద్ధసన్నద్ధుండై పోయె. ఆసమయమునందు బ్రహ్మదేవుఁడు మిగులఁ ద్వరగలవాఁడై సోముని నివారించి యిట్లనియె. ఓ పుత్రోత్తమా! విష్ణుదేవుఁడు మానవవేషమునుధరించి రావణుని వధింపఁగలఁడు. కావున నీవిప్పుడు రావణునిదగ్గఱకుఁ బోకుమనియె. ఆవచనమునువిని యాసోముఁ డమరావతీ పట్టణమునకుఁ బోయె. అంతట నలుఁడు వరుణ వాయువులను జయించి కుబేరేశానులను జయింపఁబడినవారినిగాఁ దలఁచె. అనంతర మానలుఁడు ఇంద్రత్వమును పొందుట కుద్యుక్తుఁడయ్యె. ఇట్లు యోచించుచుండఁగా నాకృతయుగము గతించిపోయె. ఈవిధముగ నతఁడు తిరుగుచు నింద్రాదులందఱును రావణునిచే లంకాపట్టణమునకుఁ గొనిపోఁబడిన వృత్తాంతమును దెలిసికొని యేమియునుదోఁచక తనపట్టణమునకుఁ బోయె. ఇంతలోపల నోరాను

చంద్రా! నీవు భూలోకంబున జన్మించి యా రావణాసురుని జయించి యింద్రాదులను స్వర్గమునకుఁ బంపితివి. పిమ్మట సప్తద్వీపాంతరవాసులగు రాజులను జయించి స్వాధీనులనుగాఁ జేసికొంటివి. మఱియు నో రఘుకులోత్తమా! పురూరవాదులను ముప్వరను వెడలఁగొట్టి యా హస్తినాపట్టణమునందు సుషేణుని స్థాపించితివి. పురూరవాదులు కాలధర్మమును జెందిరి. ఇప్పుడు బ్రహ్మదత్తవరానుసారముగ సోమవంశోద్భవులగు నలాదు లేడ్వురును సప్తద్వీపాధిపతులతోఁ గూడుకొని హస్తినాపట్టణమునకు వచ్చిరి. ఆరాజుల సంఖ్య యపరిమితమై యున్నది. వారందఱును మహాబలులు. ఇప్పుడునీకు వారితోఁగూడ మిగుల ఘోరమైన యుద్ధము జరుగును. ఆయుద్ధమునందు బ్రహ్మదేవుఁడు సకల దేవతలతోడ నీయొద్దకువచ్చి నలాదులచేత నీ పాదపద్మములకు నమస్కారమును చేయించును. ఓ రఘుకులోత్తమా! నీవడిగినవిధముగ నలాదుల వృత్తాంతమును సర్వమును నీకుఁ దెలిపితిననియె. ఆవృత్తాంతమును సర్వమును చెప్పి కుశలవులకు వివాహకాండాది నాలుగు కాండములను జెప్పె. ఆ నాలుగు కాండములను విని శ్రీరాముఁడు మిగుల సంతోషమును పొందె. ఆసమయమునందు సభలోని వారందఱును శ్రీరాముని వైకుంఠారోహణ వృత్తాంతమును దెలిసికొని యానందమును పొందిరి.

ఇట్లని శ్రీమదానంద రామాయణమునందలి పూర్ణకాండమునందు
మొదటిసర్గము ముగిసెను.

—:(o):—

* శ్రీరాముఁడు హస్తినాపురంబునకుఁ బయనమగుట. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట శ్రీరాముఁడు వాల్మీకిమునివరుని గూడ హస్తినాపురంబునకు రమ్మనియె. అప్పుడు వాల్మీకిమునివరుం డందుల కంగీకరించి భక్తవత్సలుండగు శ్రీరాముని సంతోషింపఁజేసె. అంతట శ్రీరాముఁడు లక్ష్మణునితో నిట్లనియె. ఓతమ్ముఁడా! లక్ష్మణా! నానాదేశములయందున్న పుత్రులకందఱకును పత్రికలను బంపుము. వారివారి రాజ్యములయందు మంత్రులను బనియందుంచి తమతమ సైన్యములతోఁగూడ రమ్మని చెప్పుము. ఈవిధముగఁ బత్రికలువ్రాసి జంబూద్వీపమునందుఁ గల రాజులనందఱను రమ్మనుము. మఱియు నితులనే ద్వీపపతులనుగూడ రప్పింపుమనిన విని లక్ష్మణుఁడు భవదభీష్టానుసారముగ నే చేయుటకు సిద్ధముగనున్నాఁడననియె. అంతట శ్రీమంతుఁడగు రాముఁడు వాల్మీకిమునివరుఁ డుండఁగానే యా సభలోనివారందఱును వినుచుండఁగ లక్ష్మణునితో నిట్లనియె. ఓలక్ష్మణా! ఇప్పుడు శ్రేష్ఠమైన ముహూర్తము సిద్ధపడియున్నది. కావున పటమందిరములతోఁగూడ చతురంగబలముల

కును శయనమును గల్పింపుము. జీర్ణములయిన యంత్రాయుధాదులను జక్కఁగఁ జేయించి సర్వాయుధములను బయలునకుఁ బంపుము. అంతఃపురములనుగూడ బయలునకు రప్పింపుము. అగ్నిహోత్రములను ముందునిడుకొని సీతా మహాదేవికూడ బయలు వెడలునట్లు చేయుము. కోశాగారములయందలి ధనమును వెలికిఁ దీసికొని రావలయును. గజతురగాది సైన్యములను బయలునకు రప్పింపుమనియె. ఈ విధముగ శ్రీరాముఁ డాజ్ఞాపించి మంత్రి వసిష్ఠాదులతో నిట్లనియె. ఓగురూత్తమా! ఓమంత్రివర్యులారా! సప్తద్వీప పతిస్థానమునందు భరతున కభిషేకమును జేయుదురె? లక్ష్మణుఁడు నేను లేనికాలమునందు భూలోకమున వసింపఁదగినవాఁడు గాఁడనియె. ఈవిధముగ శ్రీరాముఁడు పలుకునపుడు పురజనులందఱును భయవిహ్వలులై తెగఁగొట్టఁబడిన వ్రేళ్లుగల వృక్షములవలె మిగుల దుఃఖమును పొంది మూర్ఛనందినవారైరి. ఆరాముని వచనమును విని భరతుఁడు మూర్ఛనందె. అంతటఁ గొంతసేపటికి మూర్ఛనుండి తేఱి రాజ్యమును నిందించి మిగుల దుఃఖము కలవాఁడై యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! నేను సత్యముగ నిన్ను వదలి భూలోకమునందు వసింపను. కుశుని సప్తద్వీప పతిస్థానమునందు అభిషిక్తునిగాఁ జేయుము. ఉత్తర కురుద్వీపములయందు జంబూద్వీపపతినిగాఁ జేసి లవున కభిషేకము చేయుము అనియె. ఇట్లు భరతుఁడు చెప్పిన వాక్యములను విని ప్రజలందఱును మిగుల భయముకలవారై మూర్ఛనొంది క్రిందఁబడిరి. ఆసమయమునందు వసిష్ఠమహాముని శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! రాఁబోవు నీ వియోగదుఃఖమును సహింపలేక ప్రజాసముదాయమంతయును క్రిందఁబడి మూర్ఛనందె. కావున వీరిమనస్సులకుఁ దగినవిధముగ ననుగ్రహమును జూపుము అనినవిని శ్రీరాముఁ డామానవులనందఱను లేపి యో మానవోత్తములారా! మీకు నేను జేయఁదగిన ప్రియ మేదియో దానిని దెలుపుఁడనిన విని యాజనులందఱును చేతులను ముకుళించుకొని సవినయముగ శ్రీరామునితో నిట్లనిరి. ఓ రఘుకులోత్తమా! నీవు వైకుంఠమునకుఁ బోఁదలఁచియున్నావు. గనుక మమ్ములనుగూడ వైకుంఠమునకుఁ దీసికొనిపొమ్ము. మేమందఱమును మీతో రావలయునని తలంచుచున్నారము. మాయభీష్టమును నెరవేర్పుమనిన విని శ్రీరాముఁ డందుల కంగీకారమును పొందె. ఈవిధముగ నెల్లవారితోఁ గూడ వైకుంఠమునకుఁబోవ నిశ్చయించి లక్ష్మణునిబిలిచి కుశుని పట్టాభిషిక్తునిగాఁ జేయుటకు నిశ్చయించె. అప్పుడు లక్ష్మణుఁడు అయోధ్యాపట్టణమును సర్వమును నలంకరింపఁజేసె. పిమ్మట శ్రీరామాదులు కుశునకుఁ బట్టాభిషేకమును జేసిరి. ఆదినమం దాపట్టణమునం దంతటను మహోత్సవములు జరిగెను. శ్రీరాముని యంతఃపురమునందుఁగూడ మహోత్సాహము కలిగె. అప్పుడాపట్టణమునందలి వారందఱును, సింహాసనారూఢుఁడును, ఛత్రచామరములచేతఁ బ్రకాశించుచు

న్నవాఁడును, అయినకుశునకు నమస్కారమును జేసిరి. అప్పుడు కుశుఁడు బ్రాహ్మణులకు నానావిధములయిన ధనముల నొసంగె. పురజనులందఱును వస్త్రాలంకారాదులచేతఁ గుశుని బూజించిరి. అప్పుడు కుశుఁడు వారలనందఱ నానావిధములగు ధనాదులచేతఁ బూజించె. పిమ్మట ననేకకోట్ల సంఖ్యకలుగు బ్రాహ్మణులకు మృష్టాన్నము నొసంగె. అంతట శ్రీరాము ననుమతమునుపొంది లక్ష్మణుఁడు సీతామహాదేవి మొదలుగాఁగల యంతఃపురస్త్రీలను నగరమునుండి పయనముచేయించె. అప్పుడు శ్రీరాముఁడుకూడ బంధుమిత్రాది సమేతముగఁ బయలువెడలెను. ఆసమయమునందు మునులు మొదలగువారు కూడ బయలువెడలిరి. అప్పుడు సూతమాగధాదులు రాముని ననేకవిధముల స్తోత్రమును జేసిరి. అంతట శ్రీరాముఁడు మెల్లఁగఁ జామరాదులచేత వీవఁబడెను. అప్పుడు పటమందిరములను బయలునకు రప్పించె. ఆసమయమునందు వారస్త్రీలు నృత్యమును చేసిరి. అప్పుడు పట్టణములోని వారందఱును బయలువెడలుటచేత పట్టణములో నొక్కఁడును లేకపోయెను. మఱియు నాసమయమున నయోధ్యాపట్టణము గజభుక్తకపిత్థమువలె రిక్తమైపోయె. ఇంతలోపల ద్వీపాంతరవాసులగు రాజులందఱును ద్వీపాంతరములందున్న తమతమ సైన్యములతో బయలువెడలి యచ్చోటునకు వచ్చి యా శ్రీరామునకు నమస్కరించిరి. పిమ్మట నానావిధములయిన కానుకలను సమర్పించిరి. అంతట నక్కడకు అంగదుఁడు, చిత్రకేతువు, తక్షుఁడు పుష్కరుఁడు, సుబాహువు, యూపకేతువు, మొదలగువారు కూడఁ దమతమ సేనలతోఁగూడ వచ్చిరి. వచ్చి సీతారాములకు నమస్కరించిరి. అప్పుడు శ్రీరాముఁడా బాలకుల నందఱఁ గ్రమముగ నాలింగనము చేసికొనియె. పిమ్మట శ్రీరాముఁడు తన సమీపమునకు వచ్చిన రాజుల కందఱకును పిలిపించుటకుఁ దగిన కారణమును దెలిపె. అట్లు దెలిపి మఱల వారితో నిట్లనియె. ఓ రాజోత్తములారా! మీ పూర్వజులందఱును, హస్తినాపట్టణమునకు వచ్చియున్నారు. వారితోఁ గూడ యుద్ధమును జేయుటకు మీ కిష్టము కలదేని నాతోడ హస్తినాపట్టణమునకు రావలయును. అట్లు చేయుటకు మీకిష్టము లేనియెడల మీ మీరాజ్యములకుఁ బొండు అనియె. అట్లు రాముఁడు చెప్పినవాక్యములను విని యారాజులందఱును శ్రీరామునితో నిట్లనిరి. మహాపరాక్రమముగలయో రాముఁడా! మే మందఱము నిన్ను సేవించియుండువారము. మే మందఱమును నీ యన్నమును తిని జీవించుచున్నారము. ఓ రఘుకులోత్తమా! నీ యాజ్ఞను పొంది మే మందఱమును మాపితృపితామహులతో యుద్ధముచేయుటకు నిశ్చయించియున్నారము. ఓ రామచంద్రా! మేము స్వామికార్యమునందు పరాఙ్ముఖత్వము పొందువారము గామనిరి. ఆవచనములను విని శ్రీరాముఁడు సంతోషమును పొంది వారలఁ గౌగిలించుకొని నానావిధాభరణములచేతఁ బూజించి యా

రాత్రి యంతయును సీతాసమేతుఁడై సుఖముగ నిద్రించె. అంతట మఱునాటి ప్రాతఃకాలమునందు రాముఁడు నిద్రనుండి మేల్కాంచి స్నానము నిమిత్తము సరయూనదికిఁబోయి సీతా సమేతుఁడై స్నానపానాదుల నాచరించి యా సరయూనదికి నమస్కరించి నేను పోయి వచ్చెదననియె. ఆవచనమును విని సరయూనది శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తరమా! ఇంతవఱకును నిన్ను జూడవలయు ననెడు తలంపుతో నివసించియుంటిని. ఇప్పుడు నీతోఁగూడ వైకుంఠలోకమునకు రావలయునని తలఁచుచున్నాననియె. ఆవచనమును విని శ్రీరాముఁడిట్లనియె. ఓ సరయూనదీ! నాకథ యీ భూలోకమునం దెంతవఱకుండునో యంతవఱకును పాపనాశనము చేయునట్టి దానవై యీలోకమునందు నివసించి యుండుమనియె. అంతట సరయూనది శ్రీరాముని వచనముల కంగీకారమును పొంది తన యంశమును భూలోకము నందుంచెను. పిమ్మట శ్రీరాముఁడు సరయూనదితోఁగూడ నయోధ్యాపట్టణమునకుఁ బ్రదక్షిణ నమస్కారము లాచరించి యోపురరాజమా! పోయి వచ్చెదను. ఓతల్లీ! యయోధ్యా! నీకు నమస్కారముచేసెదను. ఇంతవఱకు నిక్కడ నీచేత రక్షింపఁబడితిని. నాకాజ్ఞ నొసంగుము. నేను స్వస్థలమునకుఁ బోయెదను, నా యపరాధములను సహింపుము. మఱల నిన్ను దర్శించెదననియె. ఇవ్విధముగ శ్రీరాముఁడు చెప్పిన వాక్యములను విని యయోధ్యాపట్టణము శ్రీరామునితో నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! ఇంతవఱకును నిన్నుఁ జూడవలయు ననియెడు నిచ్ఛతో నిక్కడ నివసించి యుంటిని. నిన్ను వదలి నేనిక్కడ నుండఁజాలను. కావున నేనుగూడ నీతోడ వచ్చెదననిన విని యా యయోధ్యాపట్టణమునకు మఱల శ్రీరాముఁ డిట్లనియె. ఓతల్లీ! అయోధ్యానగరరాజమా! నాకథ యీ భూలోకమునం దెంతవఱకుండునో యంతవఱకును నీవు నీయంశముతోడ నిక్కడ మృణ్మయవై నివసించి యుండుమనియె. అంతట నయోధ్యానగర మందులకు సమ్మతించి యీలోకమున మృణ్మయాంశముతో నివసించియుండె. పిమ్మట తనదివ్యరూపముతో శ్రీరాముని వెంటనంటి పోయె. అంతట శ్రీరాముఁ డయోధ్యా సరయూనదులతోఁగూడ సేనాస్థలమునకుఁ బోయె. అయోధ్యా సరయూనదుల ప్రభావము మాత్రము పోయినదికాదు. అంతట సీతామహాదేవి సఖీజనముతోఁగూడ మహానాగి నధిష్ఠించె. పిమ్మట నూర్మిళాదులు కూడ వేఱువేఱుగ యానముల నధిష్ఠించిరి. అప్పుడు శ్రీరాముఁడుకూడ గజశ్రేష్ఠము నెక్కె. అట్లు శ్రీరాముఁ డేనుఁగునెక్కి లక్ష్మణునితో నిట్లనియె. తమ్ముఁడా! లక్ష్మణా! సకలజనులను విమానముపై నెక్కింపుము. సుతాదులను గజశ్రేష్ఠములమీఁద నెక్కింపుము. అంతట నీవును గజశ్రేష్ఠము నెక్కి నావెంటరమ్ము. అనియె. అప్పుడు లక్ష్మణుఁడు శ్రీరామ వాక్యానుసారముగ సర్వమును నెఱవేర్చె. అంతట సకలరాజులును తమతమ వాహనము

లనెక్కి శ్రీరామునకుఁ బార్శ్వభాగముల ననుసరించిరి. ఆసమయమునం దందఱ కంటె ముందుగ రజ్జుదండధారులును, వారికివెనుక ధృతతాలవృంతకులును, వారిననుసరించి కుఠారటంకిపాణులును, నడుచుచుండిరి. అంతట పతాకధ్వజములచేతఁ బ్రకాశించుచున్న మహాగజసముదాయము బయలువెడలెను. ఆగజబృందముల వెంటనంటి యంత్రహస్తులగువారు తమతమ వాహనముల నధిష్ఠించి పోయిరి అనంతరము శతఘ్నులచేత నిండింపఁబడిన శకటములు బయలువెడలె. పిమ్మట నానావిధవాద్యములను బ్రయోగించుచు తురగారూఢులు బయలువెడలిరి. అంతట వేత్రపాణులగువారు హయారూఢులై బయలువెడలిరి. అనంతరము వందిమాగధాదులు నడుచుచుండిరి. వారివెంట నటచారణాదులు నానావిధాభరణములచే నలంకరింపఁబడిన వారును యానారూఢులునై బయలువెడలిరి. అనంతరము కాష్ఠమంచకముల నధిష్ఠించి వారాంగనలు బయలుదేరిరి. అంతట నానావిధాభరణములచేత నలంకరింపఁబడి శ్రీరాముని గుఱ్ఱములు నడుచుచుండె. అనంతరము పురుషవేషధారిణులగు స్త్రీలు బయలువెడలిరి. ఆస్త్రీలందఱును నానావిధాయుధములను ధరించి యుండిరి. వారిననుసరించి దండహస్తులగు దాసీపుత్రాదులు బయలువెడలిరి. వారికివెనుక రాముఁడును, ఆరామునకు వెనుక క్రమముగ లక్ష్మణశత్రుఘ్నులును, బయలువెడలిరి. వారికివెనుక కుశలవాంగద చిత్రకేతు పుష్కరతక్ష సుబాహు యూపకేతువులు బయలువెడలిరి. వారిని వెంబడించి సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి, మొదలగువారు బయలువెడలిరి. అంతట మంత్రులందఱును బయలుదేరిరి. వారికివెనుక ననేకకోట్ల వానరులు బయలువెడలిరి. ఆవానరులకు వెనుక సకలరాజులును గజారూఢులై బయలుదేరిరి. ఆరాజుల ననుసరించి వారివారి చతురంగబలములును బయలువెడలెను. ఈవిధముగ శ్రీరాముఁడు చామరాదులచేత వీవఁబడినవాఁడై మెల్లమెల్లఁగఁ బోవుచుండె. అప్పుడు సీతామహాదేవి జాలరంధ్రముల మార్గమునుండి శ్రీరాముని జూచి సంతోషమును బొందుచుండె. ఆసమయమునందు శ్రీరాముఁడు వందిమాగధుల స్తోత్రపాఠములను, వారస్త్రీల నృత్యగానాదులను, మఱియు, నానావిధములయిన కౌతుకములను జూచుచుఁ బోవుచుండె. ఇట్లు పోవుచు యాత్రాకాండమునందుఁ జెప్పఁబడిన స్థలములయందే నివాసములను జేయించె.

ఇట్లని శ్రీమదానంద రామాయణమునందలి పూర్ణకాండమునందు
రెండవసర్గము ముగిసెను.

——:(o):——

* సూర్య సోమవంశజుల యుద్ధము. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! ఆవిధముగ శ్రీరాముఁడు పయనమై యనేకదేశముల నతిక్రమించి పదునొకండవ దినమునకు హస్తినాపట్టణమునకుఁ బోయెను. అప్పుడు సుషేణుఁడు రామాగమన వృత్తాంతమును దెలిసికొని మిగుల శీఘ్రముగ నిరువదిలక్షల వానరులతోఁగూడ శ్రీరామున కెదురుగ వచ్చె నట్లువచ్చి సీతారాములకు నమస్కరించి జరిగినవృత్తాంతమును సర్వమును దెలిపి యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! ఇప్పటికి పదుమూఁడుదినములుగ నేను యుద్ధము చేయుచున్నాఁడను. నేటికి నీ విచ్చోటునకు వచ్చితివి. నీవు యుద్ధమునకు వచ్చుటవలన నీక నీరాజులందఱును జయింపఁబడుదురనిన విని శ్రీరాముఁడు గంగానది యుత్తరతీరమున సేనానివేశమును జేయించి శత్రుసైన్యమునుజూచె. అంతట నా రాత్రియంతయును గడపి రెండవదినమునందు వానరులను యుద్ధముకొఱకు ప్రోత్సాహపఱచె. అంతట వానరులందఱును గంగానదియందు స్నానముచేసి సీతారాములకు నమస్కరించి యుద్ధమునకు బయలువెడలిరి. అట్లు యుద్ధమునకుఁ బోయిన వానరులందఱును సింహనాదమును చేసిరి. నానావిధములయిన వాద్యములను ప్రయోగించిరి. పిమ్మట శత్రుసైన్యము మీఁదికిఁ బరుగిడిరి. ఆసమయమునందు నలాది రాజులందఱును శ్రీరామ సైన్యమును జూచి మిగుల నాశ్చర్యము కలవారును, భయభీతులును, కంపముకలవారు నయ్యును మిగులవేగముగ యుద్ధమునకుఁ బోయిరి. అప్పుడు వానరులందఱును గంగానదిని దాటి శత్రుసైన్యమునందుఁ బ్రవేశించి పర్వతములు, వృక్షములు శిలలు మొదలగువానిని వర్షింపఁజేసిరి. అట్టివర్షముచేత శత్రువీరులను సంహరించి శ్రీరాముని స్తోత్రము చేయుచుండిరి. ఆసమయమునందు నలవీరాదులు మిగులఁ దీక్ష్ణములయిన శస్త్రములచేత వానరులను గొట్టిరి. అంతట నాయిరుతెగలవారికిని మిగుల భయంకరమైన యుద్ధము జరిగెను. ఆ యుద్ధమునందు వానరులు ఉప్పు వృక్షాదులచేత నలసైన్యమంతయును గొట్టఁబడి పలాయనమయ్యెను. అంతట జంబూద్వీపాది సకల ద్వీపములయందును నివసించునట్టి సకల రాజులును చతురంగబల సమేతులయి యుద్ధమునకు బయలువెడలిపోయిరి. ఆసమయమునందు సుగ్రీవుఁడు, అంగదుఁడు, హనుమంతుఁడు, విభీషణుఁడు, జాంబవంతుఁడు, సుషేణుఁడు, సంపాతి, మకరధ్వజుఁడు, గూహకుఁడు, భూరికీర్తి, కంబుకంఠుఁడు మొదలగు వానరోత్తములును, జనకాది రాజోత్తములును, యుద్ధసన్నద్ధులయిరి. అంతట నా యుభయసైనికులకును పోరు ఘోరంబయ్యెను. ఆ రెండుసేనలయందును నానావిధములయిన నూతన వాద్యములు ప్రయోగుచుండె. ఆసమయమునందు బ్రహ్మాది దేవతలందఱును శివునితోఁ గూడుకొని బుధసోమ

దేవేంద్రులను వెంటఁబెట్టుకొని వచ్చి యాయుద్ధమును చూచిరి. అంతట చంద్రాదులును దేవతలును, పరస్పరము నాలోచించి యిట్లనిరి. ఆహా! ఇప్పుడు మహాభయము కలుగుచున్నది. ప్రళయమగునట్లు తోఁచుచున్నది. ఈ సోమవంశోద్భవులగు రాజులకు బ్రహ్మవరము కలదు. ఇప్పుడు యుద్ధమునకు వచ్చిన శ్రీరాముఁడు సాక్షాన్నారాయణుఁడు. కావున జయపరాజయములు నిర్ణయింప శక్యము కాదు. ఈ మహాయుద్ధ మెట్లు నివారింపఁబడును? దీనికిఁ దగిన యుపాయమేదియో తెలియదయ్యె. అని యాలోచించుచుండఁగ బ్రహ్మదేవుఁ డాదేవలతో నిట్లనియె. ఓ దేవోత్తములారా! కొంతసేపీయుద్ధకౌతుకమును జూచి పిమ్మట నివారింతము. చూడుఁడనియె. అంతట నెల్లవారును యుద్ధమును జూచుచుండిరి. అప్పుడా యిరుతెగలవారికిని మిగుల భయంకరమైన యుద్ధము జరిగె. ఆయుద్ధమునందు యంత్రములవలనఁ బుట్టిన యగ్నిజ్వాలలు దశదిక్కుల యందును వ్యాపించె. మఱియు నాయంత్రములనుండి బయలువెడలిన నానావిధములయిన గుండ్లచేత నుభయసైన్యములును పలుతెఱంగులుగఁ గొట్టఁబడెను. కొందఱు భటులు ఖడ్గబాణ పరశువులచేతఁ గొట్టుకొనిరి. మఱియును పరస్పరమును తోమర భిందివాల పరిఘచక్ర బాణాదులచేతఁ గొట్టుకొనిరి. మఱియు నాయిరుతెగల వారును తమతమ కులప్రభావములను జెప్పుకొని కొట్టుకొనుచుండిరి. మఱియు నాయుద్ధమునందు తాతను మనుమఁడును మనుమని తాతయును కొట్టుచుండిరి, ఇవ్విధముగ బంధువులే పరస్పరమును దిట్టుకొని మిగుల నాశ్చర్యముగఁ గొట్టుకొనుచుండిరి. అట్టి యుద్ధమునందు మృతినొందిన రామసైన్యమంతయును మఱల జీవించె. నలాదుల సైన్యమున హతులయిన వారలు మఱల జీవింపరైరి. ఆసమయమునందు రక్తము ప్రవాహరూపముగ బయలు వెడలె. మఱియు నాయుద్ధమునందు పంద్రెండు పద్మముల సంఖ్యగల నలసైన్యము హతమయ్యెను. ఈవిధముగ నా యిరుతెగలవారును నాలుమాసముల కాలము యుద్ధముచేసిరి. అంతట సోమవంశోద్భవులగు నలాదులు కొంచెపాటి సైన్యముగల వారగుటచేత మిగుల దుఃఖముకలవారును, ఉత్సాహ రహితులునైరి. అట్లు విచారము కలవారయ్యును, మఱల యుద్ధమున కుద్యమించిరి. అప్పుడు వారితో యుద్ధము చేయుటకుఁ గుశాదులు బయలు దేరిరి. అట్లు బయలు వెడలినపిమ్మట కుశుఁడు నలునితోడను లవుఁడు నద్యకునితోడను, అంగదుఁడు జాతికరునితోడను, చిత్రకేతువు వసుదునితోడను, పుష్కరుఁడు లఘుశ్రుతుఁడను రాజుతోడను, తక్షకుఁడు సురధునితోడను, సుబాహు వజ్రమేఘునితోడను, యూపకేతువు బలునితోడను, మార్కొని యొకరిమీఁద నొకరత్యధికముగ బాణ వర్షమును గురిపించిరి. ఆ సమయమునందు లవుఁడు వాయవ్యాస్త్రమును ప్రయోగించి తన శత్రుసైన్యమును సర్వమును లవణ సముద్రమునందు బడనైచె. అంతట నలాదివీర

పదు లేఁగురును శ్రీరాముని బాలకులతోఁ గూడ మిగుల భయంకరమైన యుద్ధమును చేసిరి. ఆయుద్ధమునందుఁ గుశుఁడు మిగులఁ దీక్ష్ణములగు బాణములచేత నలునిఁగొట్టె. అప్పుడు నలుఁడు కోపోద్దీపితుఁడై యాకుశుని శరీరము బ్రద్దలు వారునట్లు గొట్టె. అంతట కుశుఁడు నిజబాణములచే నలుని యశ్వధనుస్సులను తుత్తునియలు సేసె. పిమ్మట ఛత్రసారథులను ద్రుంచివైచె. మఱియొకచోట సుతీక్ష్ణములగు బాణములచేత లవునిగొట్టె. పిమ్మట లవుఁడు కోపోద్దీపితుఁడై నద్యూకుని విరథునిగాఁ జేసె. ఈ విధముగనే అంగదుఁడు నిజబాణ సముదాయముచేత జాతీకరుని గొట్టె. అంతట నా జాతీకరుఁడు పరిఘయను నాయుధముచేత నంగదుని ప్రహరించె. అప్పు డంగదుఁడు గోపోద్దీపితుఁడై తీక్ష్ణములగు బాణములను ప్రయోగించి యాజాతీకరుని భూమియందుఁ బడవైచె. ఇంకొకచోట చిత్రకేతువును నిజబాణములచేత వసుదుఁడను రాజు క్రోశమాత్ర దూరమున బడవైచె. అట్లు చేయుట కెల్లవారును మిగుల నాశ్చర్యమును పొందిరి. అప్పుడు లఘుశ్రుతుఁడు పుష్కరుఁడను వానిని గాఢముగఁ బ్రహరించె. అంతట నాపుష్కరుఁడు మిగులఁ గోపముకలవాఁడై యా లఘుశ్రుతుని రథమునందుఁ జిత్రప్రతిమ తుల్యునిగఁ జేసి దుందుభియను వాద్యమును ప్రయోగించె. ఆ సమయమునందు సురఘుఁడను వానిమీఁద బాణవర్షమును గురిపించె. అంతట నా తక్షుఁడును నిజబాణ సముదాయముచేత సురఘుని నాకాశమునందు రథసహితముగఁ ద్రిప్పె. అట్లు రథమును శుష్కపర్ణమును ద్రిప్పినవిధమునఁ ద్రిప్పుటవలన నెల్లవారును మిగుల నాశ్చర్యమును పొందిరి. ఆసమయమునం దజమీఢుఁడను వాఁడు తన పూర్వజులగు వారందఱును వ్యాకులతను పొంది యుండుటను జూచి రాముని బాలురమీఁద బాణవర్షమును గురిపించె. అంతట సుబాహువనువాఁడు కోపోద్దీపితుఁడై యా యజమీఢుని విరథునిగాఁ జేసె. అంతట నజమీఢుఁడు వేఱొకరథము నధిష్ఠించి కుశాదులమీఁద వాయవ్యాస్త్రమును ప్రయోగించె. ఆయస్త్రమును జూచి యూపకేతువు పన్నగాస్త్రమును ప్రయోగించె. ఆయస్త్రమువలన ననేకకోట్ల సర్పములుపుట్టి యావాయువును పానముచేసె. అంతలోపల నలుఁడు రథారూఢుఁడై గారుడాస్త్రమును ప్రయోగించె. ఆగారుడాస్త్రమును వారించుటకు కుశుఁడు రాక్షసాస్త్రమును బ్రయోగించె. ఇంతలోపల నద్యూకుఁ డాగ్నేయాస్త్రమును ప్రయోగించె. అప్పుడు లవుఁడు కోపోద్దీపితుఁడై మేఘాస్త్రమును ప్రయోగించె. ఆ సమయమునం దామేఘాస్త్రమును వారించుటకు వాయవ్యాస్త్రమును ప్రయోగించె. అంతట హనుమంతుఁడు తన నోరు తెఱచి యా వాయువును పానముచేసెను. ఈ విధముగ నా యిరుతెగలవారికి మిగుల భయంకరమైన యుద్ధముజరిగె. అప్పుడు సీతారామాదులు మిగుల సంతోషముతో నా యుద్ధమును జూచుచుండిరి. ఈ విధముగ నైదుమాసముల పదు

నొకండుదినములా యుద్ధము జరిగె. ఇట్లు పదునొకండు మాసములును పదునొకండుదినములు గతించుటచేత నప్పటికి త్రేతాయుగము పరిసమాప్తమయ్యె. అప్పటికిని యుద్ధము ముగియకుండుటచేత కుశుఁడు కోపోద్దీపితుఁడై బ్రహ్మాస్త్రమును సంధించె.

ఇట్లని శ్రీమదానందరామాయణాంతర్గత పూర్ణకాండమునందలి
మూఁడవసర్గము ముగిసెను.

—:(o):—

* సోమసూర్య వంశజులకు మైత్రికలుగుట. *

అట్లు బ్రహ్మాస్త్రమును సంధించిన కుశునిజూచి బ్రహ్మదేవుఁడు దేవతలతోడను సోమబుధులతోడను బయలువెడలి భూలోకమునకువచ్చి విమానములనుండి దిగి బ్రహ్మాస్త్రమును వారింపుమని కుశుని ప్రార్థించె. మఱియు నోకుశుఁడా! నావాక్యమును కాపాడుమని యిట్లనియె. ఓ రఘుకులోత్తమా! తొల్లి నేను స్వర్గలోకమునందు నివశించియున్న సోమునకు ద్వాపరాంతమునఱకును, నీవంశస్థులగు నలాదులు జయముకలవారై యుందురని వరమునిచ్చితి. కావున నోకుశుఁడా! ఈ బ్రహ్మాస్త్రమును నలాదులమీఁదఁ బ్రయోగింపకుము అనిన విని కుశుఁడిట్లనియె. ఓ దేవోత్తమా! నేనిప్పుడు క్షణములోపల నెల్లవారిని దగ్ధులనుగఁ జేయుదును. అట్లుచేయుట నీకిష్టముకానియెడల రామునకుం జెప్పుము. రామాజ్ఞ యయ్యెనేని నేనూఱకుందును. నీవు వరమునిచ్చునపు డేల యోచింపకపోతివి? శ్రీరాముని సామర్థ్యమును నీవెఱుఁగవా? నీవిప్పుడు వ్యర్థముగ నిట్లు ప్రార్థించుచున్నావు. నీకు బలముకలదేని నాతోఁడ యుద్ధమును చేయుము. సీతామహాదేవి పుష్పకారూఢయై జాలరంధ్రములనుండి మనయుద్ధమును జూచుననియె. ఇట్లుచెప్పిన కుశునివాక్యములను విని బ్రహ్మదేవుఁడు లజ్జతోఁగూడుకొనినవాఁడై సోమబుధ నలులతో నిట్లనియె. "ఓ మూఢులారా! నావాక్యములను వినుఁడు. మీకాయుష్యము పరిసమాప్తమైనట్లు తోఁచుచున్నది. మీరు సాక్షాన్నారాయణునితో యుద్ధముచేయుట కుద్యమించితిరి. మిమ్ములనందఱఁ జంపుటకు మీకీబుద్ధిని జెప్పువాఁడెవ్వఁడు? మీరు పోయి శ్రీరాముని శరణుపొందుఁడు. అట్లుకాదేని మరణమును పొందుదురు. ఈ రాముఁడు నాకు జనకుఁడగు సాక్షాన్నారాయణుఁడు" అని సోమబుధ నలాదులను ధిక్కరించి యాకుశునితో మఱల నిట్లనియె. ఓకుశుఁడా! బాలకా! మేము రామునిదగ్గఱకుఁబోయి మఱల వచ్చువఱకు నీవు బ్రహ్మాస్త్రమును ప్రయోగించినయెడల నన్ను జంపినట్లగునని చెప్పి యానలాదులను వెంటఁబెట్టుకొని దేవతలతోఁగూడ పరమశివుని ముందునిడుకొని శ్రీరామునిదగ్గఱకుఁ బోయె. పోయిన

పిమ్మట శ్రీరాముఁడు శివాదులు వచ్చిన వృత్తాంతమును దెలిసికొని పుష్పకవిమానమునుండి దిగి ముందుగ శివునకును, పిమ్మట బ్రహ్మకును నమస్కారము చేసి యా శివాదులను బూజించె. అంతట బ్రహ్మసభాసీనుండై నలాదులచేత శ్రీరామునకు నమస్కారము చేయించెను. అప్పుడు సోమబుధులుగూడ రామునకు నమస్కరించిరి. అంతట రామచంద్రుఁడు వారలఁ దనహస్తముతో లేవఁదీసి బ్రహ్మదేవునివలన వేర్వేరుగ వారివారి నామంబులఁ దెలిసికొని బ్రహ్మతో నిట్లనియె. ఓ దేవోత్తమా! వీరి నేందులకుగాఁ దీసికొనివచ్చితివి? వచ్చినదానికిఁ గారణంబును శీఘ్రంబుగ నాకుఁజెప్పుము" అనిన రామునివాక్యంబుల విని బ్రహ్మ రామునకిట్లనియె. బాహుబల సంపన్నుఁడవైన యో రామచంద్రా! నావచనము గాపాడుము. ఈరాజులు ద్వాపరాంతమువఱకు నజేయులయి యుందురని తొల్లి నేను వీరికి వరములిచ్చితిని. నీకుమారుఁడు నాయస్త్రమును బ్రయోగించుటకు సంధించెననిన విని శ్రీరాముఁడు నవ్వుచు నిట్లనియె. ఓ బ్రహ్మదేవుఁడా! నీవు సోమవంశపు రాజులజేయులగుదురని వరములిచ్చితివిగదా? ఇప్పుడావర మేమైనది? అనినవిని బ్రహ్మ మఱలనిట్లనియె. ఓరఘుకులోత్తమా! నావరము నీదగ్గఱతప్పఁ దక్కినవారిదగ్గఱ ననుకూలించును. నీవునాకు జనకుండవు. కావున నిన్నుఁ బ్రార్థించెదననియె. ఆవచనమునువిని శ్రీరాముఁడు నవ్వి బ్రహ్మతో నిట్లనియె. ఓ దేవోత్తమా! నాకుమారుఁడు వయోవంతుఁడై యున్నాఁడు, కావున నావచనమును వినఁడు. లోకములో తరుచుగ బాలురు వృద్ధులవాక్యములను తోలుతవినరు. పుత్రుల కైదువత్సరములు వచ్చువఱకును దేవునివలెఁ గాపాడఁదగినవారనియును, పదునాఱుసంవత్సరము లయినపిమ్మట పుత్రులను మిత్రులనుగాఁ జూచుచుండవలయు ననియును, శాస్త్రములయందుఁ జెప్పఁబడియుండుటను నీ వెఱుఁగుదువుకదా? కావున నాపుత్రులు నావచనమును వినరు. నీవేపోయి ప్రార్థింపుమనిన విని బ్రహ్మదేవుఁడు మఱల నిట్లనియె. ఓరఘుకులోత్తమా! ఇప్పుడు నీకుమారుఁడు కోపోద్దీపితుఁడై యున్నవాఁడు. కావున నాప్రార్థన నంగీకరింపఁడు. నాకు సరియగు బదులుమాటనుగూడఁ జెప్పఁడనిన విని శ్రీరాముఁడు మఱల వినోదార్థ మిట్లనియె. ఓచతురాననా! నీవు వాల్మీకిమునివరుని దగ్గఱకుఁ బొమ్ము. ఆమునివరుఁడు నీకుఁ దగినయుక్తి జెప్పఁగలఁడనియె. ఆవచనమును విని బ్రహ్మ పుష్పకవిమానమునందున్న వాల్మీకిమునిదగ్గఱకు నలాదులతోడఁ బోయి యావృత్తాంతమును సర్వము నెఱింగించె. అప్పుడు వాల్మీకిముని శ్రీరాముని యభిప్రాయమును దెలిసికొని యానలాదులు స్త్రీలబ్ధజీవితులయి సుఖమును బొందుట యుక్తమని తలంచి యిట్లనియె. ఓ చతురాననా! ఈనలాదుల భార్యలు సీతామహాదేవియొద్దకుఁ బోయి యామెను బ్రార్థించినయెడల నమ్మహాదేవి కుమారునకుఁ జెప్పును. ఆసీతామహాదేవి వాక్య

మును కుశుఁడు వినుననియె. అంతట నలాదులు వేగముగఁబోవు దూతలనుబంపి తమభార్యలను రప్పించిరి. పిమ్మట నాస్త్రీలు భర్తృవచనములను విని కానుకలనుగొని సీతాదేవి దర్శనమునకుఁ బోయిరి. పోయి చెలికత్తియలచేతఁ బరివేష్టింపఁబడియున్నదియును, కోడండ్రచేత నుపచరింపఁ బడుచున్నదియునగు సీతామహాదేవిని జూచిరి. అప్పుడాసీతాదేవి యాస్త్రీలువచ్చుటకుఁ గారణమును దెలిసికొని మంచకమునుండి దిగి మంచమునానుకొని క్రిందఁగూర్చుండి యాస్త్రీలను రప్పించె. అంతట నాస్త్రీలందఱును లోనికివచ్చి తమ సీమంతరత్నములు పాదములయందు సోక సీతామహాదేవికి నమస్కరించి కానుకల సమర్పించిరి. అప్పుడు సీతామహాదేవి వారలఁ గౌఁగిలించుకొని తగిన యాసనములయందుఁ గూర్చుండఁబెట్టి "మీరందఱు నేకకాలమునం దిచ్చటికి వచ్చుటకుఁ గారణమేమి? భయమునందక చెప్పుఁడు. మీయభీష్టమును నెరవేర్చెదను" అనియె. అంతట నాస్త్రీలందఱును సకలవృత్తాంతమును జెప్పి కంకణదానము చేయుమనియును, కుశుని యుద్ధమునుండి మరలింపుమనియును బ్రార్థించిరి. ఆవచనముల కంగీకారమును పొంది సీతామహాదేవి శ్రీరాముని మనోగతాభిప్రాయమును దెలిసికొని యానలాదులందఱును స్త్రీల మూలకముగ జీవింపఁదగినవారని తలఁచి యాస్త్రీలతోఁగూడ శిబికారూఢయై కుశునిదగ్గఱకుఁ బోయి యో పుత్రోత్తమా! కోపమును విడిచిపెట్టుమనియె. మఱియు నోపుత్రోత్తమా! యుద్ధము నింతటితోఁ జాలించి నావాక్యమును వినుమనియె. ఆవాక్యములనువిని కుశుఁడు బ్రహ్మాస్త్రమునుపసంహరించి తల్లి మొదలగు బంధువులతోఁ గూడుకొనినవాఁడై నిజసైన్యముతోఁగూడ మఱలె. అంతట నెల్లవారును సభాసీనుఁడై యున్న రామునిదగ్గఱకుఁ బోయిరి. అప్పుడు బ్రహ్మ వాల్మీకి దేవతలు నలుఁడు మొదలగువారందఱును శ్రీరామునిదగ్గఱకు వచ్చిరి. అంతట శ్రీరాముఁడు బ్రహ్మదేవునితో నిట్లనియె. ఓ చతురాననా! నాబాలకులను యుద్ధమునుండి మఱలునట్లు చేసితిని. ఇంకమీఁదటి నీయభిప్రాయమును దెలుపుము నారాజ్యమునందు రెండవచక్రవతి లేఁడు. ఇప్పుడునీవు నలాదులకుఁ జేయఁదలఁచిన మేలును జెప్పుమనిన విని బ్రహ్మదేవుఁడు మిగుల శీఘ్రముగ సింహాసనమునుండి దిగి రామునకెదురుగ నిలిచి చేతులు ముకుళించుకొని సవినయముగ నిట్లనియె. ఓ రఘుకులోత్తమా! చిరకాలము నీవు భూలోకమును పాలించితివి. కావున నిఁక భూలోకమునువదలి వైకుంఠమును పాలింపుము. నావాక్యమును వినుము. హస్తినాపురమును నలాదులకు నొసంగుము. కుశుఁ డయోధ్యాపట్టణమును పాలించునట్లు చేయుమనిన విని శ్రీరాముఁ డందుల కంగీకారమును పొంది యిట్లనియె. ఓచతురాననా! సీత, బంధువులు మొదలగు వారితోఁగూడ రేపటిదిన మయోధ్యాపట్టణమునకు వచ్చెదను. ఈయుగమునందు పదివేలసంవత్సరములే జీవితకాలమని నీవు నిర్ణ

యుంచితివి. నీవాక్యమును మృషావాక్యమునుగాఁ జేయఁదలంచి నేను పదునొకం డువేల సంవత్సరము లిక్కడ నివసించితిని. ఇంతియగాక పదునొకండు మాసము లును పదునొకండు దినములును గతించె. ఇఁక నాజీవితకాలము కించిన్మాత్ర ముగ మిగిలియున్నది. అయ్యది రేపటితోఁ బూర్తియగును. కావున రేపటి దినము వైకుంఠమునకు వచ్చెదనని యె. అంతట కుశుఁడు బ్రహ్మదేవునితో నిట్లనియె. ఓ చతురాననా! నలాదులు నాకు పన్ను చెల్లించునెడల హస్తినాపురం బునం దుండుటకు నే నంగీకరించెదను. సర్వకాలములయందును నాయాజ్ఞ నతి క్రమింపక సుఖముగ జీవించునట్లు చేయుము. మఱియు నీనలాదులు ఛత్రహీను లయి హస్తినాపురమునందు నివసించునట్లు చేయుమనియె. ఆవాక్యమును విని బ్రహ్మ కుశునితో నిట్లనియె. ఓ రామనందనా! నీవాక్యానుసారముగ పన్ను చెల్లించునట్లుగఁ జేసెదను. ఛత్రమును ధరించునట్లుమాత్ర మాజ్ఞనొసంగుము. నావాక్యమును పాలింపుమనినవిని కుశుఁడు నవ్వుచు నందులకంగీకరించె. అప్పుడు సోమవంశస్థులగు రాజులందఱును బ్రహ్మదేవునితో నిట్లనిరి. ఓ దేవోత్తమా! మేమందఱమును స్త్రీలతోఁగూడ మీవెంటనంటి స్వర్గమునకు వచ్చెదము. ఇప్పుడు హస్తినాపట్టణమున కజమీఢుఁడనువానిని రాజుగాఁ జేయుమనియె. అంతట బ్రహ్మదేవుఁ డందుల కంగీకారమునుపొంది రామాజ్ఞచేత నజమీఢుని హస్తినాపట్టణమునకు రాజునుగాఁ జేసెను.

ఇట్లని శ్రీమదానంద రామాయణాంతర్గత పూర్ణకాండమునందు
నాల్గవసర్గము ముగిసెను.

—:(౦):—

* శ్రీరాముఁడు కుశాదులను వీడుచుట. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! సుషేణుఁడు, సుగ్రీవుఁడు, విభీషణుఁడు మొదలగు వారందఱును, "మేముకూడ వైకుంఠమునకు వచ్చెదము" అని శ్రీరాముని ప్రార్థించిరి. మఱియునో రాముఁడా! నిన్ను వదలి మేమీ భూలోక మునందు జీవింపఁజాల మనిరి. అప్పుడు శ్రీరాముఁ డిట్లనియె. ఓ విభీషణా! నావాక్యానుసారముగ నీవు లంకాపట్టణమునందు నివసింపవలయును. నాచరిత్ర ము భూలోకమునందుండు నంతవఱకును నీవు లంకానగరమునందు వసింపఁదగిన వాఁడవు. కావున నీవు లంకాపురమునకుఁ బొమ్మనిన విభీషణుఁ డందులకు సమ్మ తించెను. పిమ్మట నా విభీషణుఁడు శ్రీరామునకు నమస్కరించి రామునిచేత సన్మానింపఁబడి లంకాపట్టణమునకుఁ బోయె. అట్లు విభీషణుఁడు పోయినపిమ్మట శ్రీరాముఁడు జాంబవంతునితో నిట్లనియె. ఓ జాంబవంతుఁడా! ఈ భూలోకము నందు నాచరిత్ర మెంతవఱకుండునో యంతవఱకును నీవీ భూలోకమునందు వసిం

చుము. ద్వాపరాంతమునందు మఱల నాదర్శన మగును. నీవు లంకాపట్టణము నందును, అరణ్యమునందు నుపకారము చేసినందులకు బదులుగా నాకు మామవై ఖ్యాతిసెందఁ గలవనియె. అంతట జాంబవంతుఁ డందుల కంగీకరించి సీతారాములకు నమస్కరించి శ్రీరామునిచేతఁ బూజింపఁబడి యథేచ్ఛముగ బయలు వెడలిపోయెను. పిమ్మట శ్రీరాముఁడు హనుమంతునితో నిట్లనియె. ఓయాంజనేయా ! నీవు భూలోకమునందు నాచరిత్ర ముండునంత వఱకుండుము. ద్వాపరయుగమునం దర్జునుని మూలముగ నాదర్శనమగు ననియె. ఆవచనమును విని హనుమంతుఁడు సీతారామ లక్ష్మణులకు నమస్కరించి యథేచ్ఛముగఁ బోవుటకు యత్నించె. అప్పుడు శ్రీరాముఁడు తన కంఠమునందుఁ బ్రకాశించు చున్నదియును, నవరత్నములచేత నొప్పియున్నదియు నగు హారమునిచ్చె. ఆవిధముగనే సీతామహాదేవియును హారమునిచ్చె. అంతట హనుమంతుఁడు కన్నీరుగార్చుచు సీతారామలక్ష్మణులకు నమస్కరించి హిమవత్పర్వతమునకుఁ బోయె. పిమ్మట శ్రీరాముఁ డంగదుని బూజించె. అప్పుఁ డంగదుఁడు సీతారాములకు నమస్కరించి కిష్కింధాపట్టణమునకుఁ బోయె. అంతట శ్రీరాముఁడు గుహుని శృంగిబేరమునకును, మకరధ్వజుని పాతాలమునకును బంపె. పిమ్మట నెల్లవారిని వారివారి దేశములకనిపె. అంతట శ్రీరాముఁడు యూపకేతువును బిలిచి వస్త్రాదులచేత సంతోషింపఁజేసి విదిశానగరమునకుఁ బంపె. అప్పుడా యూపకేతువు సైన్యముతోఁ గూడ సీతారామాదులకు నమస్కరించి పుత్ర మిత్రాదులతోడ విదిశానగరమునకుఁ బోయె. ఇటులనే శ్రీరాముఁడు సుబాహువును మధురానగరమునకుఁ బంపె. పుష్కరుని గూడ నిటులనే తక్షశిలా నగరమునకుఁ బంపె. అంగదుని గజాశ్వనగరమునకుఁ బంపె. అంతట సీతారాములు లవునిబిలిచి వస్త్రాలంకారాదులచేత సంతోషపఱచి యుత్తరకురు భూములకుఁబంపె. ఆలవుఁడు పయనమై పోవునపుడు సీతా మహాదేవి కామధేనువును సమర్పించె. అంతట సీతారాములు కుశుని పిలిచిరి. అప్పుడు శ్రీరాముఁడు తన యస్త్రములను మహాజ్వాలకోదండమును, నానావిధములయిన యానవస్త్రములను, చింతామణిని సమర్పించె. ఇట్లు సర్వమును సమర్పించి భార్యాసమేతుఁడగు కుశుని సంతోషపఱచి శ్రీరాముఁ డిట్లనియె. ఓవత్సా ! నీవు సుఖముగఁ బోయి ధర్మమును దప్పక రాజ్యమును బాలింపుము. మఱియునో కుశుఁడా ! జంబూద్వీపగతులగు రాజులను, ద్వీపాంతరములయందలి రాజులను నీ పుత్రులను గాపాడిన విధమునఁ గాపాడుమనియె. అంతట సకలరాజులతో నిట్లనియె. ఓరాజేంద్రులారా ! ఈ కుశుండు నా స్థానమునందుఁ బ్రవేశ పెట్టఁబడెను. కనుక మీ కందఱకును మాననీయుఁడనియె. అంతట నారాజు లందఱునో రఘుకులోత్తమా ! ఈ కుశుఁడు నీ తేజస్సుచేతఁ బుట్టిన వాఁడగుటచేత నీకంటె నూఱు రెట్లధికముగ మాకుఁ బూజింపఁ

దగినవాఁడు, కావున నీ విషయమునందు సందేహమును పొందకుము. నీచేత మేము పాలింపఁబడిన విధముగ నీ కుశునిచేతఁ గూడఁ గాపాడఁ బడుదుము, అని చెప్పి శ్రీరామునకు నమస్కరించిరి. అప్పుడు శ్రీరాముఁడు వారల నందఱ వస్త్రాలంకారాదులచేతఁ బూజించె. పిమ్మట నా రాజు లందఱును కుశుని ముందునిడుకొని తమతమ సైన్యములతోడఁ దమతమ దేశములకుఁ బోయిరి. అంతట కుశుఁడుకూడ సీతారాములకు నమస్కరించి వసిష్ఠునితోఁ గూడ రథారూఢుఁడై యయోధ్యా పట్టణమునకుఁ బయనమయ్యె. ఆ సమయమునందు శ్రీరాముఁడు రజక మంథరలను గూడ నయోధ్యాపట్టణమునకుఁ బంపె. ఆరజకుఁడే కృష్ణావతారమునందు రజకుఁడయ్యె. మంథర పూతన యయ్యె. అంతట కుశుఁడు సార్ద్రనేత్రుఁడై సీతారాములకుఁ బ్రదక్షిణ నమస్కారము లొనర్చి యయోధ్యాపట్టణమునకుఁ బోయె. అట్లు కుశుఁ డయోధ్యాపట్టణమునకుఁ బోయి శూన్యమై యున్న యా యయోధ్యా పట్టణమునందలి సింహాసనము నధిష్ఠించె. ఆసమయమునందు సకల రాజులును కుశునకు నమస్కారములు చేసి తమతమ దేశముల కేగిరి. మఱియు నెల్ల రాజులును కుశాజ్ఞానుసారముగ పన్ను చెల్లించుచుండిరి. అయోధ్యాపట్టణమునందు మరణమును పొందినవారికి పునర్జన్మము లేకపోవుటచేతను, రజక మంథరలయోధ్యయందే యుంచఁబడినయెడల రామ వాక్యానుసారముగఁ బునర్జన్మము కలుగుటకు వీలు లేదు కనుకను వారిద్దఱును పురమునకు వెలుపల నుంచఁబడిరి. అంతట శ్రీరాముఁడు సకల వానరులతో నిట్లనియె, ఓ వానరోత్తములారా! మీరందఱును నా నిమిత్తముగ జాహ్నవీ తటము మొదలగు ప్రదేశములయందుఁ దిరిగితిరి. మీరందఱును ద్వాపరయుగమున గోకుల బృందావనమున గోపకులయి పుట్టుఁడు. అప్పుడు మీతోఁగూడ మిగులఁ బ్రియముతో నేను విందారగించెద ననియె. అనంతరమా శ్రీరాముఁడు తన యెదుటనున్న లక్ష్మణునితో నిట్లనియె. తమ్ముఁడా! లక్ష్మణా! నీవు దండకారణ్యమునందు మిగుల నధికమైన శ్రమమును పొందితివి. కావున నీవు ద్వాపరయుగమునందు నాకు జ్యేష్ఠుఁడవై పుట్టుదువు. అప్పుడు నీకు నేను శుశ్రూషను జేసెదననియె. పిమ్మట శ్రీరాముఁడు మిగుల దయకలవాఁడై యక్కడ నున్న వానరులు మొదలగువారిని నాతోఁగూడ రండనియె. పిమ్మట కల్పవృక్ష పారిజాతములను దేవేంద్రునకిచ్చె. పుష్పకమును కుబేరుని దగ్గఱకుఁ బొమ్మనియె. అంతట నా పుష్పకము శ్రీరామునకు నమస్కరించి సీతా మహాదేవియొక్క యనుమతమును బొంది కుబేరునిదగ్గఱకుఁ బోయె. అంతట శ్రీరాముఁడు ఊర్మిలా మాండవీ శ్రుతకీర్తులను రప్పించి వాల్మీకిమునివరుఁడు వినునట్లు "రేపటిదినము మీ భర్తృశరీరములతోఁ గూడ మీ శరీరముల నగ్నిప్రవేశము చేసి స్వర్గలోకమునకుఁ బొండనియె. అప్పుడాయూర్మిలాదులు శ్రీరామాదులకు నమస్కరించి తమతమ నివాసమందిరములకుఁ

బోయిరి. అంతట శ్రీరాముఁ డారాత్రియంతయును సీతామహాదేవితోఁ గూడ సువర్ణమంచకమునందు శయనించె. లక్ష్మణాదులును తమతమ భార్యలతోఁ గూడ సువర్ణమంచకములయందు శయనించిరి. బ్రహ్మరుద్రాదులు మునీశ్వరులు మొదలగువారితోఁగూడ తమతమ నివాసములకుఁ బోయిరి.

ఇట్లని శ్రీమదానంద రామాయణమునందలి పూర్ణకాండమునందు
నయిదవసర్గము ముగిసెను.

——:(o):——

* గంగయందు శ్రీరాముఁడు వైకుంఠము నారోహించుట. *

ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! అంతట శ్రీరాముఁడు ప్రాతఃకాలమునందు సీతామహాదేవితోఁగూడ మేల్కాంచి యజామీఘునిబిలిచి మృదుమధుర వచనములతో నిట్లనియె. ఓ యజామీఘుఁడా! ఇప్పుడు నేను సీత బంధువులు మొదలగువారితోడ వైకుంఠమునకుఁ బోయెదను. ఈ వానరాదులుకూడ నాతోడవత్తురు. ఇక్కడ నొక్కపురుగుకూడ నివసింపదు. కావున నిక్కడనుండు పటమందిరములు మొదలుగాఁగల సకలపదార్థములను కుశునకుఁబంపి నీవుపోయి యీవృత్తాంతమును సర్వమును దెలియఁజేయుము, కుశుఁడ మా యనంతర కార్యములనన్నిఁటిని జేయఁగలఁడు. ఒకవేళ కుశుఁడు ఖేదమునుపొందినయెడల నీవాతని దుఃఖమును నివారింపుమనియె. ఈవిధముగ శ్రీరాముఁడు చెప్పిన వాక్యములనువిని యాయజామీఘుఁడు కన్నుల నీరుగార్చుచు భవదభీష్టానుసారముగఁ జేసెదననియె. అంతట శ్రీరాముఁడు మెల్లఁగ పురజనాదులతోఁగూడ స్నానము చేసి భాగీరథీ జలమునందు నిత్యవిధులను నెఱవేర్చి యగ్నిహోత్రమును వ్రేల్చి గంగానదియందలి యిసుకతిన్నెయందుఁ గూర్చుండి యనేకములయిన దానములను చేసె. పిమ్మట నా శ్రీరాముఁడు ప్రాస్థానికకర్మమును సర్వమును నెఱవేర్చి యగ్నిని వైకుంఠమునకుఁ బంపె. మఱియును శాంతి, క్షమ, మేధ, ధృతి, తేజస్సు, బలము, యశస్సు మొదలగునవి యన్నియును స్వర్గమునకుఁబోయె. అంతట వానరులు పౌరులు మొదలగువారందఱును గంగయందుదిగి స్నానము చేసి వాయువుల నిరోధించి నిజదేహములను విడిచిపెట్టిరి. పిమ్మట శ్రీరాముఁడు సంతోషముతో గంగానదినిస్పృశించి దర్భాసనముమీఁదఁ జేత దర్భలనుధరించి యుత్తరాభిముఖుఁడై భార్యాసమేతుఁడై కూర్చుండె. అప్పుడారాముని దేవతలందఱును నాలుగుభుజములు గలవాఁడును, నల్లనికాంతి గలవాఁడును, పచ్చని పట్టువస్త్రమును ధరించినవాఁడును కౌస్తుభముచేత చిహ్నితమైన హృదయము కలవాఁడును, శ్రీవత్సాంకముచేతఁ బ్రకాశించుచున్నవాఁడును, అయిన శ్రీమహావిష్ణువునుగాఁ జూచిరి. సీతామహాదేవి విష్ణువామాంగసంస్థితమైన మహా

లక్ష్మియయ్యె. లక్ష్మణుఁడు వేయిశిరస్సులుగల యాదిశేషుఁడయ్యె. భరతుఁడు శంఖమై విష్ణుదేవుని యపసవ్యహస్తమునందు నిలిచె. శత్రుఘ్నుఁడు సుదర్శనమై దక్షిణహస్తమునందుఁ బ్రవేశించె. సకలవానరులును దేవతలయందుఁ బ్రవేశించిరి. అయోధ్యాపట్టణమునందలి చండాల క్రిమికీటాంతములగు సకల జంతువులును దివ్యదేహములను ధరించెను. ఆసమయమునందు దేవతలయొక్క గృహాంగణములయందు నానావిధములయిన వాద్యములు మ్రోగె. దేవాంగనలు పుష్పవర్షమును గురిపించిరి. అప్సరస్త్రీలు నృత్యములు సలిపిరి. గంధర్వులు పాడిరి. సూర్యునివలెఁ బ్రకాశించుచున్న శ్రీ మహావిష్ణువునకు నెల్లరు నమస్కరించిరి. అంతట సోమాదులు తమభార్యలతోఁగూడ దేహములను విడిచిరి. పిమ్మట నెల్లవారును ఆశరీరములను అగ్నియందు దహనముచేసిరి. అంతట దేవాంగనలందఱును రత్నదీపములచేత శ్రీమహావిష్ణువునకు నీరాజనము చేసిరి. అప్పుడు శ్రీమహావిష్ణువు మృదుమధుర వచనములతో బ్రహ్మ కిట్లనియె. ఓచతురాననా! అయోధ్యా పట్టణమునందలి సకల జంతువులును నాతోడ నిక్కడకు వచ్చి యున్నారు. కావున వీరికందఱకును దగినచోటును జూపుము. అనియె. ఆవచనమును విని బ్రహ్మదేవుఁ డిట్లనియె. నాలోకముకంటె నుపరిభాగమునందు సాంతానికములను లోకములుగలవు. ఈజను లాలోకములయందు నివసించునట్లు చేయుమనియె. పిమ్మట నా యయోధ్యాపట్టణమునందలి వారందఱును దివ్యదేహములను ధరించి దివ్యాలంకార సంయుక్తులయి దివ్యవిమానముల నెక్కి యప్సరస్త్రీలచేత సేవింపఁబడినవా రగుచు నానా సుగంధగంధాదుల నలదుకొని ప్రకాశించుచుండిరి. అంతట బ్రహ్మ మొదలగు దేవతలందఱును విష్ణుదేవునకు నమస్కరించిరి. మఱియు నానావిధములయిన స్తోత్రపాఠములచేత స్తోత్రములఁ జేసిరి అప్పుడు త్రైలోక్యపావకుఁడగు విష్ణువును స్తోత్రముచేసి యిట్లనియె

* ఈశ్వర కృత విష్ణుస్తోత్రము. *

"శ్లో॥ రాఘవం కరుణాకరం భవనాశనం దురితాపహం। మాధవం ఖగగామినం జలరూపిణం పరమేశ్వరమ్। పాలకం జనతారకం భవహారకం రిపుమారకం। త్వాంభజే జగదీశ్వరం నరరూపిణం రఘునందనమ్॥ ౧॥

భూధవం వనమాలినం ఘనరూపిణం ధరణీధరం। శ్రీహరిం త్రిగుణాత్మకం తులసీధవం రఘునందనమ్। శ్రీకరం శరణప్రదం మధుమారకం మధురస్వరం। త్వాంభజే॥ ౨॥

విఠ్ఠలం మధురాస్థితం రజకాంతకం గజమారకం। మున్నతం బకమారకం వృకఘాతకంతురగార్దనమ్। నందజం వసుదేవజం బలియజ్ఞగం సురపాలకం। త్వాంభజే॥ 3॥

కేశవం కపివేష్టితం కపిమారకం మృగమర్దినం । సుందరం ద్విజపాలకం దితిజార్దనం దనుజార్దనమ్ । బాలకం ఖరమర్దినం ఋషిపూజితం మునిచింతితం । త్వాం భజే ॥ ౪ ॥

శంకరం జలశాయినం కుశబాలకం రథవాహనం । శరయూతనం ప్రియపుష్పకం ప్రియభూసురం లవబాలకమ్ । శ్రీధరం మధుసూదనం భరతాగ్రజం గరుడధ్వజం ॥ త్వాంభజే ॥ ౫ ॥

గోప్రియం గురుపుత్రదం వదతాంవరం కరుణానిధిం । భక్తపం జనతోషదం సురపూజితం శ్రుతిభిస్స్తుతమ్ । భక్తిదం జనముక్తిదం జనరంజనం నృపనందనం । త్వాంభజే ॥ ౬ ॥

చిద్ఘనం చిరజీవినం మణిమాలినం వరదోన్ముఖం । శ్రీధరం ధృతిదాయకం బలవర్ధనం గతిదాయకమ్ । శాంతిదం జనతారకం శరధారిణం గజగామినం । త్వాంభజే ॥ ౭ ॥

శార్ఙ్గిణంకమలాననం కమాదృశం పదపంకజం । శ్యామలం రవిభాసురం శశిసౌఖ్యదం కరుణార్ణవం । సత్పతిం నృపపాలకం నృపవందితం నృపతిప్రియం । త్వాంభజే ॥ ౮ ॥

నిర్గుణం సుగుణాత్మకం నృపమండనం మతివర్ధనం । అచ్యుతం పురుషోత్తమం పరమేష్ఠినం స్మితభాషిణం । ఈశ్వరం హనుమన్నతం కమలాధిపం జనసాక్షిణం । త్వాంభజే ॥ ౯ ॥

ఈశ్వరోక్తమిద మేతదుత్తమ మాదరా చ్ఛతనామకం । యః పఠేద్భువి మానవస్తవ భక్తిమాం స్తపనోదయే । త్వత్పదం నిజబంధుదారసుతై ర్యుతశ్చిర మేత్య నోసోఽస్తుతే పదసేవనే బహుతత్పరో మమవాక్యతః ॥ ”

అని పార్వతీపతియగు పరమశివుఁ డీవిధముగ భగవంతుఁడగు రాముని ప్రార్థించి యోరమానాథా! శీఘ్రముగ గరుఁడుని నారోహింపు మనియె. మఱియు నిది వైకుంఠమునకు వచ్చుటకుఁ దగినకాల మనియె. నీనవతరించి యిప్పటికి పదునొకండువేల సంవత్సరములును, పదునొకండు మాసములును, పదునొకండు దినములును, పదునొకండు గడియలును, గతించినవి. ఈదినము వసంతపంచమి యను పుణ్యదినమైయున్నది. ఈ పుణ్యదినమందు నీ స్వస్థానమగు వైకుంఠమునకుఁ బోవుటకు త్వరపడుమనియె. ఇవ్విధముగ శ్రీమహాదేవుఁడు చెప్పిన వాక్యములను విని నవ్వుచు వాల్మీకి మునివరుని గౌగలించుకొని తక్కిన మునివరుల యనుమతిఁ బును పొంది గరుడవాహనారూఢుఁ డయ్యె. ఆసమయమునందు దేవవాద్యములు మ్రోగుచుండె. నారదాది మునివరులు స్తోత్రములను జేయుచుండిరి. దేవతలు పుష్పవర్షమును గురిపించిరి. అప్సరస్త్రీలున్నను త్యము

జేసిరి. అంతట నా శ్రీమహావిష్ణువు నానావిధములయిన విమానములచేతఁ బరివేష్టింపఁబడినవాఁడై సకల లోకములను జూచుచు మెల్ల మెల్లఁగ వైకుంఠము నకుఁ బోయెను. అట్లు పోయినపిమ్మట నిజస్థానమునందుఁ బ్రవేశించి శివాదులను వారివారి లోకములకుఁ బంపె. అంతట నా శ్రీమహావిష్ణువు ఆనందమయుండును, పరిపూర్ణములయిన మనోరథములు గలవాఁడును, గరుత్మంతునిచేత సేవింపఁ బడిన పాదపద్మములు గలవాఁడును, శేషతల్పముచే నలంకరింపఁబడిన వాఁడునై వైకుంఠమునందు నివసించియుండెను. అయోధ్యావాసులగు వారందఱును సాంతానికమను పుణ్యలోకమునకుఁ బోయిరి. అంతట మునివరులందఱును తమతమ లోకములకుఁ బోయిరి. అంత నక్కడ నజమీఢుఁడు కుశుని నూరార్చి శ్రీరాముఁడు వైకుంఠమునకుఁ బోయిన వృత్తాంతమును సర్వమును జెప్పి యాకుశుని చేత గౌరవింపఁబడి హస్తినాపట్టణమునకుఁ బోయెను. అంతట కుశుఁడు కుముద్వతి యనెడు కన్యను బెండ్లియాడి దానియందుఁ బుత్రులంబడసె. ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! ఈవిధముగు శ్రీరామ వైకుంఠారోహణ వృత్తాంతమును భక్తిశ్రద్ధలతో వినువారు స్వర్గమును పొందుచున్నారు. ప్రతిదినమును భక్తిశ్రద్ధలతో శ్రీరామ వైకుంఠాధ్యాయమును పఠించువారు శ్రీరామానుగ్రహమువలన మరణానంతరము వైకుంఠమును పొందుదురు.

ఇట్లని శ్రీమదానంద రామాయణమునందలి పూర్ణకాండమునందు
వైకుంఠారోహణమను నాఱవసర్గము ముగిసెను.

——:(o):——

* సూర్యవంశోద్భవ రాజుల వర్ణనము. *

ఓ శిష్యోత్తమా! నీ వేయేవిషయముల నడిగితివో యావిషయముల నన్నింటిని దెలిపితిని. ఇంకను నీ కేమి వినవలయునని కుతూహలమున్నదో యావిషయమును దెలుపుమనిన యావిష్ణుదాసు రామదాసున కిట్లనియె. ఓగురూత్తమా! సూర్యవంశపురాజులను కుశునివఱకుఁ జెప్పితివి. కుశునిపిమ్మటి వారి వృత్తాంతమును వినవలయునని కుతూహలము గలిగియున్నది. నాయభీష్టమును దీర్పుమనిన రామదా సిట్లనియె. ఓ శిష్యోత్తమా! విష్ణువు మొదలుకొని సూర్యవంశమునందుఁ బుట్టినరాజుల నఱువదొక్కరిని జెప్పితిని. కుశునకుఁ బిమ్మట కూడ నఱువదొక్కండ్రు రాజులు కలరు. వారిం జెప్పెదను. సావధాన చిత్తుఁడవై వినుము. శ్రీరామునకు కుశుఁడును, కుశునకు నతిథియును, అతిథికి నిషధుఁడును, నిషధునకు నభుఁడును, నభునకుఁ బుండరీకుఁడును, పుండరీకునకు క్షేమధన్వుఁడును, క్షేమధన్వునకు దేవానీకుఁడును, దేవానీకునకు నహీనుఁడును, అహీనునకు పారియాత్రుఁడును, పారియాత్రునకు బలుఁడును, బలునకు స్థలుఁడును,

స్థలునకు వజ్రనాభుఁడును, వజ్రనాభునకు ఖగణుఁడును, ఖగణునకు విధృతి యును, విధృతికి శుభుఁడును, శుభునకు హిరణ్యనాభుఁడును, హిరణ్యనాభునకుఁ బుష్పుఁడును, పుష్పునకు ధృవసంధియును, ధృవసంధికి సుదర్శనుఁడును, సుదర్శనున కగ్నివర్ణుఁడును, అగ్నివర్ణునకు శీఘ్రుఁడును, శీఘ్రునకు మరువును, మరువునకుఁ బ్రసుశ్రుతుఁడును, ప్రసుశ్రుతునకు సంధియును, సంధికి మర్షణుఁడును, మర్షణునకు సహస్వంతుఁడును, సహస్వంతునకు విశ్వవాహుఁడును, విశ్వవాహునకు ప్రసేనజిత్తును, ప్రసేనజిత్తునకుఁ దక్షకుఁడును, తక్షకునకు బృహద్బలుఁడును, బృహద్బలునకు బృహద్రణుఁడును, బృహద్రణునకు దారుక్రియుఁడును, దారుక్రియునకు వత్సవృద్ధుఁడును, వత్సవృద్ధునకు వ్యోముఁడును, వ్యోమునకు భానుఁడును, భానునకు దివాకరుఁడును, దివాకరునకు సహదేవుఁడును, సహదేవునకు వీరుఁడును, వీరునకు శుభుఁడును, శుభునకు బృహదశ్వుఁడును, బృహదశ్వునకు భానుమంతుఁడును, భానుమంతునకుఁ బ్రతీకాశుఁడును, ప్రతీకాశునకు సుప్రతీకుఁడును, సుప్రతీకునకు మరుదేవుఁడును, మరుదేవునకు సునక్షత్రుఁడును, సునక్షత్రునకు పుష్కరుఁడును, పుష్కరునకు అంతరిక్షుఁడును, అంతరిక్షునకు సుతపుఁడును, సుతపునకు మిత్రుఁడును, మిత్రునకు మిత్రజిత్తును, మిత్రజిత్తునకు బృహద్రాజును, బృహద్రాజునకు బర్హియును, బర్హికి కృతంజయుఁడును, కృతంజయునకు రణంజయుఁడును, రణంజయునకు సంజయుఁడును, సంజయునకు శాక్యుఁడును, శాక్యునకు శుద్ధోదుఁడును, శుద్ధోదనునకు లాంగలుఁడును, లాంగలునకుఁ బ్రసేనజిత్తును, ప్రసేనజిత్తునకు క్షుద్రకుఁడును, క్షుద్రకునకు రణకుఁడును, రణకునకు సురథుఁడును, సురథునకు తనయుఁడును, తనయునకు సుమిత్రుఁడు నను వారలు పుట్టిరి. అంతట నావంశము పూర్ణమయ్యె. ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! ఇప్పుడు చెప్పఁబడిన సూర్యవంశపు రాజులలో మరువనువాఁడు హిమవత్పర్వత సమీపమునందలి కలాపగ్రామము నాశ్రయించి బదరికాశ్రమమునందు ఘోరముగఁ దపస్సు చేయుచున్నాఁడు. ఆ మహానుభావుని వలన మఱల కృతయుగమువచ్చునపుడు సూర్యవంశము వృద్ధిని పొందును. ఓ శిష్యోత్తమా! ఇట్లు సూర్యవంశమునందుఁ బుట్టిన రాజులవృత్తాంతమును సర్వమును జెప్పితిని. విష్ణువు మొదలుకొని శ్రీరామునివఱకును, శ్రీరాముఁడు మొదలుకొని కడపటివఱకును నలువదియొక్కమంది రాజులు గలుగుటచేత శ్రీరాముఁడు వారి కందఱకును నడుమ నాయకమణివలెఁ బ్రకాశించె. ఓ శిష్యోత్తమా! విష్ణుదాసా! నీవడిగిన విషయమును సర్వమును దెలిపితిని. ఇప్పుడు నేను జెప్పిన విషయములన్నియును పుణ్యమును వృద్ధిని పొందించునవియై యున్నవి. ఇంకను నీకు వినఁదగిన విషయము లున్నయెడలఁ నడుగుమనిన విష్ణుదాసిట్లనియె. ఓ గురూత్తమా! తొల్లి నేనొక మునివరునివలన రామాయణము నొకదానిని

వింటిని. దానికిని దీనికిని మహత్తయినయంతరము కలదు. కావున నీ రెంటికిని గల తారతమ్యమును చెప్పి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన రామదాసు మఱి యిట్లనియె. ఓ శిష్యోత్తమా ! ఇదివఱ కనేక కల్పములు గతించినవి. ప్రతి కల్ప మునందు శ్రీమహావిష్ణువు రామరూపముతో నవతరించె. కావున ననేక కోటి రామావతారములు గలవు. ఆ యవతారములలో నొక్కొక్కదానికి భేదము కలదు. వాల్మీకి మునివరుఁడే యనేకములయిన రామాయణములను జేసె, వానికిని పరస్పర భేదములుకలవు. కావున నీవు కొంచెమైనను సందేహము నొందకుము. ఇప్పుడు నీకు నే నుపదేశించిన రామాయణము తథ్యమై యున్నది. ఓ శిష్యోత్తమా ! భరత ఖండమునందున్న రామాయణమును బట్టి వ్యాసుఁడు నారదాది పురాణములను రచించె. ఆ పురాణములయం దిప్పుడు నాచేతఁ జెప్పఁబడిన రామాయణమునందలి విషయములే వివరించి చెప్పఁబడియె. ఓ శిష్యోత్తమా ! ఈ రామాయణమునందలి కథలకును, ఇతర రామాయణముల యందలి కథలకును, భేదమున్నట్లు తోఁచినపుడు నారదాది పురాణములను జూచి యా సందేహములను బోఁగొట్టు కొనవలయును. మఱియు నోశిష్యోత్తమా ! ఇప్పుడు నాచేతఁ జెప్పఁబడిన రామాయణమునందుఁ గలిగెడు సందేహ ములఁగూడ నారదాది పురాణములవలననే తెలియవలయును.

ఇట్లని శ్రీమదానంద రామాయణాంతర్గత పూర్ణకాండమునందు
సూర్యవంశ వర్ణన మనియెడు నేఁడవసర్గము ముగిసెను.

—:(౦):—

* ఆనందరామాయణానుక్రమణిక. *

ఓగురూత్తమా ! రామదాసా ! ఇప్పుడు నీచేతఁ జెప్పఁబడిన యానంద రామాయణముయొక్క సర్గానుక్రమణికను, ఆనందరామాయణము పఠించుట వలనఁ గలిగెడు ఫలమును దెలియఁజేయుము. మఱియు నో గురూత్తమా ! కాండసంఖ్యను, సర్గసంఖ్యను, శ్లోకసంఖ్యనుగూడఁ జెప్పుము. ఇంతయుకాక యుద్యాపన గ్రంథదానముల ఫలమునుగూడఁ దెలిపి నన్నుఁ గృతార్థునిగాఁ జేయుమనిన విని రామదాసిట్లనియె. ఓశిష్యోత్తమా ! నేను ముందుగ నను క్రమణికను దెలిపెదను. మఱియు నీయనుక్రమణికను పఠించుటవలనఁ గలిగెడు ఫలముసుగూడఁ దెలిపెదను. వినుము. మొదటిసర్గమునందు కౌసల్యా స్వయం వరము, రెండవదానియందు రామాదుల జననము, మూఁడవ సర్గమునందు సీతాస్వయంవరము నాల్గవసర్గమునందు ముద్గలుఁడు బృందాశాపాదికమును చెప్పుట, అయిదవ సర్గమునందు కైకేయీ వచనములు, ఆఱవసర్గమునందు శ్రీరాముని వనప్రయాణము, సప్తమ సర్గమునందు విరాధ ఖగమారీచ వధా

ధికము, ఎనిమిదవ సర్గమునందు కిష్కింధాపట్టణమునందు వాలిని జంపుట, తొమ్మిదవ సర్గమునందు సీతను జూచుటయు, హనుమంతుఁడు లంకను గాల్చుటయు, పదియవ సర్గమునందు సేతు మాహాత్మ్యమును, కాశీవిశ్వేరుఁడు వచ్చుటయును, పదునొకండవ సర్గమునందు రావణాదులను వధించుట, పండ్రెండవ సర్గమునందు సీతాదేవి నయోధ్యానగరమునకుఁ దీసికొనిపోయి శ్రీరాముఁడు పట్టాభిషిక్తుఁడగుట, పదుమూఁడవ సర్గమునందు హనుమద్విక్రమమును జెప్పఁబడినవి. ఈ పదుమూఁడు సర్గములతో సారకాండము ముగిసెను. అంతట రెండవదియగు యాత్రాకాండము ప్రారంభమయ్యె. ఆకాండమునందలి మొదటిసర్గమునందు వాల్మీకిమునివరునివలన శ్లోకము పుట్టుట, రెండవసర్గమునందు రామాయణ విభాగము, మూఁడవసర్గమునందు సీతామహాదేవి యాత్రకొఱకు శ్రీరాముని బ్రార్థించుట, నాల్గవసర్గమునందు రామచంద్రుఁడు గంగానదిని గూర్చి ప్రస్థానము చేయుట, అయిదవ సర్గమునందు మునివాక్యానుసారముగ యాత్రను గుఱించిపోవ నిశ్చయించుట, ఆఱవసర్గమునందు శ్రీరాముఁడు తూర్పుదేశమునకుఁ బోవుట, సప్తమసర్గమునందు దక్షిణ తీర్థములను సేవించుట, అష్టమసర్గమునందుఁ బశ్చిమదేశమునందలి తీర్థములను సేవించుట, తొమ్మిదవ సర్గమునందుత్తరదేశమునందలి తీర్థములను సేవించుటయును జెప్పఁబడినవి. ఇంతటితో యాత్రాకాండము ముగిసెను. ఓ శిష్యోత్తమా! ఇఁక యాగకాండమునందలి సర్గములను నందలి విషయమును దెలిపెదను సావధానచిత్తుఁడవై వినుము. మొదటిసర్గమునందు యజ్ఞోపకరణములను జెప్పుట, రెండవసర్గమునందు శ్రీరాముఁడు యాగము నారంభించుట, మూఁడవ సర్గమునందు యాగాశ్వముయొక్క భూప్రదక్షిణమును గుఱించి చెప్పుట, నాల్గవసర్గమునందు కుంభోదర రాముల సంభాషణము, అయిదవ సర్గమునందు రామనామస్తోత్ర శతమును, ఆఱవ సర్గమునందు అశ్వమేధ యాగమునందలి యాహ్నికమును దెలుపుట, సప్తమ సర్గమునందు ధ్వజారోపణ విధానము, ఎనిమిదవసర్గమునందు శ్రీరాముఁడవభృథస్నానము చేయుట, తొమ్మిదవ సర్గమునం దశ్వమేధయాగ పరిసమాప్తియును జెప్పఁబడియె. ఇంతటితో యాగకాండము ముగిసెను. ఓ శిష్యోత్తమా! ఇంక నాల్గవదియగు విలాసకాండమునందలి సర్గములను నందలి విషయములను దెలిపెదను. సావధానచిత్తుఁడవై వినుము. విలాసకాండము నందలి మొదటిసర్గమునందు శ్రీరామస్తవరాజము, రెండవసర్గమునందు సీతామహాదేవియొక్క రతిశాలావర్ణనము. మూఁడవసర్గమునందు శ్రీరాముఁడు దేహరామాయణమును చెప్పుట, నాల్గవసర్గమునందు సీతారాముల దినచర్య, అయిదవసర్గమునందు జలయంత్రగతక్రీడయును, ఆఱవసర్గమునందు బ్రాహ్మణ భార్యకు ప్రాసాదమునందలంకారములనొసంగుట, సప్తమసర్గమునందు దేవతాస్త్రీలకు మూర్తి దానవరదాన

ములుచేయుట, ఎనిమిదవసర్గమునందు గుణవతియగు పింగలయను దానికి శ్రీరాముఁడు వరమునిచ్చుట, తొమ్మిదవ సర్గమునందు కురుక్షేత్రమున జానకీ విజయమును చెప్పఁబడెను. ఇంతటితో విలాసకాండము పరిసమాప్తినిపొందె. ఓ శిష్యోత్తమా ! ఇఁక జన్మకాండమునందలి సర్గములను నందలి విషయమును దెలిపెదను. సావధానచిత్తుఁడవై వినుము. అందు మొదటిసర్గమునందు ఆరామమునదోహదక్రీడయును, రెండవసర్గమునందు నానావిధములయిన క్రీడలతోఁ గూడ సీమంతోన్నయనోత్సవము, మూఁడవసర్గమునందు రజకుని వచనానుసారముగ సీతను పరిత్యజించుట, నాల్గవసర్గమునందు కుశలవులయొక్క జననము, అయిదవ సర్గమునందు సుఖకరమగు రామరక్ష, ఆఱవసర్గమునందు లవుఁడు కమలములను హరించి జయమును పొందుట, సప్తమ సర్గమునందు కుశలవులయుద్ధము. ఎనిమిదవ సర్గమునందు సీతా మహాదేవియొక్క దివ్యప్రమాణము, సీతా లాభమును, తొమ్మిదవ సర్గమునందు జన్మోప నయనాదులును, జెప్పఁబడియె. ఇప్పటికి జన్మకాండము ముగిసెను. ఓ శిష్యోత్తమా ! ఇఁక వివాహకాండమునందలి సర్గములు నందలి విషయమును దెలిపెదను. వినుము. మొదటిసర్గమునందు శ్రీరాముఁడు స్వయంవరార్థముగఁ బ్రయాణము చేయుట, రెండవసర్గమునందు చండికా స్వయంవరము, మూఁడవ సర్గమునందు సుమతీ స్వయంవరము, నాల్గవ సర్గమునందు కుశలవుల వివాహము, అయిదవ సర్గమునందు గంధర్వ నాగర కన్యలను విడిపించుట, ఆఱవ సర్గమునందు గంధర్వ నాగకన్యకలకు వివాహమును నిశ్చయించుట, సప్తమ సర్గమునందు పండ్రెండు వివాహములు, ఎనిమిదవ సర్గమునందు యూపకేతువుయొక్క పరాక్రమమును వర్ణించుట, తొమ్మిదవ సర్గమునందు మదనసుందరీ వివాహమును చెప్పఁబడినవి. ఇంతటితో వివాహకాండము పరిసమాప్తిని పొందె. ఓ శిష్యోత్తమా ! ఇఁకను రాజ్యకాండమునందలి విషయమును జెప్పెదను వినుము. మొదటిసర్గమునందు రామనామ సహస్రము, రెండవసర్గమునందు, శ్రీరాముఁడు సురపాదపములను దీసికొనివచ్చుట, మూఁడవ సర్గమునందు రామకృష్ణోపాసకుల సంవాదము, నాల్గవ సర్గమునందు శ్రీరాముఁడు నూఱుమందిస్త్రీలకు వరదానముచేయుట, అయిదవసర్గమునందు రామవిశ్లేష విరహము, ఆఱవ సర్గమునందు, మూలకాసురఘాతము, సప్తమసర్గమునందు భరతఖండమునందలి నానాదేశములను వేరువేరుగ జయించుట, ఎనిమిదవ సర్గమునందు జంబూద్వీపమును జయించుట, తొమ్మిదవ సర్గమునందు శ్రీరాముఁడు సకలద్వీపములను జయించుట, పదియవ సర్గమునందు యతిశూద్ర గృధ్రములను శ్రీరాముఁడు శిక్షించుట, పదునొకండవ సర్గమునందు శ్రీరాముఁడు నలుగురుస్త్రీలకు వరములనిచ్చుట. పండ్రెండవ సర్గమునందు పదునాఱువేలమంది స్త్రీలకు వరమునిచ్చుట, పదుమూఁడవ సర్గము

నందు అశ్వత్థహాస్యము శ్రీరామాజ్ఞను వదలుట, పదునాల్గవ సర్గమునందు వాల్మీకి శ్రీరామునితో నిజ జన్మచరిత్రయమును జెప్పుట, పదునైదవ సర్గమునందు రామరాజ్య విస్తారమును వివరించుట, పదునాఱవసర్గమునందు రాజనీతిని వర్ణించుట, పదునేడవ సర్గమునందు కుశకన్యా స్వయంవరము. పదునెనిమిదవ సర్గమునందు శ్రీరాముఁడు బ్రాహ్మణులకు రామనాథపురమును దానముచేయుట, పందొమ్మిదవ సర్గమునందు శ్రీరాముని దినచర్య, ఇరువదియవ సర్గమునందు సకలావతారంబులలో శ్రీరామావతారము శ్రేష్ఠమైనదనుట. ఇరువదొక్కటవ సర్గమునందు శ్రీరాముఁడు దాసికి వరమునిచ్చుట, ఇరువది రెండవసర్గమునందు సీతాదేవి తులసీపత్రమును సంధానముచేయుట, ఇరువదిమూఁడవ సర్గమునందు ఆనందరామాయణ ఫలశ్రుతి, ఇరువదినాల్గవ సర్గమునందు భూతలమునందు శ్రీరాముఁడు ధర్మశిక్షను చేయుటయును జెప్పఁబడియె. ఇంతటితో రాజ్యకాండము పరిసమాప్తమయ్యెను. ఓ శిష్యోత్తమా ! ఇంక మనోహరకాండమునందలి విషయములను జెప్పెదను. సావధాన చిత్తుఁడవై వినుము. మొదటి సర్గమునందు లఘురామాయణ కథనము, రెండవ సర్గమునందు నాగరులకును తల్లులకును శ్రీరాముఁడు వేదాంతశాస్త్రము నుపదేశించుట, మూఁడవ సర్గమునందు రామపూజోపాస నాదికమును, నాల్గవ సర్గమునందు రామతో భద్ర విస్తారమును, అయిదవ సర్గమునందు రామలింగతో భద్ర విస్తారమును, ఆఱవ సర్గమునందు నవమీవ్రత విస్తారమును, సప్తమ సర్గమునందు శ్రీరామనామ లక్షయు నుద్యాపనముచేయు విధియును, ఎనిమిదవ సర్గమునందు వేదాదుల ఫలమును, తొమ్మిదవసర్గమునందు సార్థమాస ద్వయ పూజావిధానమును, పదియవ సర్గమునందు చైత్రమాస మహిమయును, పదునొకండవ సర్గమునందు చైత్ర స్నానము చేసినవారికి సద్గతి గలుగు ననుటయును, పండ్రెండవ సర్గమునందు స్త్రీలకు శ్రీరాముఁడద్వైతమును బోధించుటయును, పదుమూఁడవ సర్గమునందు హనుమద్రామ కవచములును, పదునాల్గవ సర్గమునందు సీతా కవచాదులును, పదునైదవ సర్గమునందు లక్ష్మణాదుల కవచములును, పదునాఱవ సర్గమునందు హనుమద్వ్రతమును, పదునేడవ సర్గమునందు సారరామాయణము శ్రేష్ఠమైన దనుటయును, పదునెనిమిదవ సర్గమునందు సేతుఖండనమును చెప్పఁబడియె. ఇంతటితో మనోహరకాండము ముగిసెను. ఓ శిష్యోత్తమా ! ఇంకఁ బూర్ణకాండమునందలి సర్గములను నందలి విషయమును దెలిపెదను. సావధాన చిత్తుఁడవై వినుము. మొదటి సర్గమునందు సోమవంశ విస్తారవర్ణనము, రెండవ సర్గమునందు శ్రీరాముఁడు హస్తినాపురమునకుఁ బ్రయాణమగుట, మూఁడవ సర్గమునందు సూర్యచంద్ర వంశపురాజుల యుద్ధమును, నాల్గవ సర్గమునందు సూర్యచంద్ర వంశపురాజులకు మైత్రి కలుగుటయును, అయిదవ సర్గమునందు

శ్రీరాముఁడు కుశాదులను విడుచుటయును, ఆఱవ సర్గమునందు శ్రీరాముఁడు గంగయందు వైకుంఠారోహణము చేయుటయును, సప్తమ సర్గమునందు సూర్యవంశపు రాజులవంశ విస్తారమును, ఎనిమిదవ సర్గమునం దానంద రామాయణాను క్రమణికయును, తొమ్మిదవ సర్గమునందు గ్రంథశ్రుతి ఫలాదులును జెప్పఁబడియె. ఇంతటితోఁ బూర్ణ కాండము సమాప్తమయ్యె. ఓ శిష్యోత్తమా! ఇప్పుడు నాచేతఁ జెప్పఁబడిన రామాయణాను క్రమణికాదికమును వినుటచేత రామాయణమును సర్వమును వినుటవలనఁ గలిగెడు ఫలముకలుగును. ప్రతిదినమును రామాయణ పుస్తకముయొక్క పూజ చేయువలయును. ఓ శిష్యోత్తమా! ఇంకఁ బూజావిశేషమును జెప్పెదను వినుము. రామస్థానమునందు సారకాండమును, లక్ష్మణస్థానమునందు రెండవకాండమును నుంచవలయును. ఇదే విధముగ నవాయతన పద్ధతి ననుసరించి నవకాండములను పెట్టవలయును. ఇట్లు కాదేని రాజ్యకాండమునందలి పూర్వార్ధమును రామస్థానమునందుఁ బెట్టవలయును. రాజ్యకాండమునందలి యుత్తరభాగమును సీతాస్థానమునందుఁ బెట్టవలయును. లక్ష్మణస్థానమునందు సారకాండమును పెట్టవలయును. మిగిలిన కాండములను మిగిలిన వారి స్థానములయం దుంచవలయును. ఈవిధముగ నవకాండములను స్థాపించి పూజింపవలయును. ఇట్లు చేసినయెడల ఇదివఱకుఁ జెప్పఁబడిన నవాయతన పూజవలనఁ గలిగెడు ఫలము కలుగునని యెఱుంగవలయును.

ఇట్లని శ్రీమదానంద రామాయణమునందలి పూర్ణ కాండమునందు సర్గాను క్రమణికయును నెనిమిదవ సర్గము ముగిసెను.

—:(౦):—

—* గ్రంథ శ్రవణఫలాది వర్ణనము. *—

ఓ శిష్యోత్తమా! ఈ యానంద రామాయణమునందు సారకాండము, యాత్రాకాండము, యాగకాండము, విలాసకాండము, జన్మకాండము, వివాహకాండము, రాజ్యకాండము, మనోహరకాండము, పూర్ణ కాండము అను తొమ్మిది కాండములు విలసిల్లుచున్నవి. సారకాండమునందు పదుమూఁడు సర్గములును, యాత్రాకాండమునందు తొమ్మిదిసర్గములును, యాగకాండమునందు తొమ్మిది సర్గములును, విలాసకాండమునందు తొమ్మిదిసర్గములును, జన్మకాండమునందు తొమ్మిదిసర్గములును, వివాహకాండమునందు తొమ్మిది సర్గములును, రాజ్యకాండమునందు ఇరువదినాలుగు సర్గములును, మనోహర కాండమునందుఁ బదునెనిమిది సర్గములును, పూర్ణ కాండమునందు తొమ్మిదిసర్గములును వాల్మీకి మునివరునిచేఁ జెప్పఁబడినవి. ఈ విధముగ. నీ యానంద రామాయణమునందు నూటతొమ్మిదిసర్గములు జెప్పఁబడియె. ఈ నూట తొమ్మిది సర్గములును మిగుల శుభకరములై యున్నవి. సారకాండమునం దైదునూఱులు శ్లోకము లున్నవి.

యాత్రాకాండమునందు ఏడునూఱుల ముప్పదియైదు శ్లోకము లున్నవి. యాగకాండమునందు ఆఱునూఱుల యిఱువదియైదు శ్లోకములున్నవి. విలాసకాండమునందు ఆఱునూఱుల డెబ్బదియెనిమిది శ్లోకములున్నవి. జన్మకాండమునందు ఎనమన్నూట రెండు శ్లోకములున్నవి. వివాహ కాండమునందు ఏనూట యెనుబదిమూఁడు శ్లోకములున్నవి. రాజ్యకాండమునందు రెండువేల యాఱునూట యిఱువదిరెండు శ్లోకములున్నవి. మనోహరకాండమునందు మూఁడువేల యిన్నూఱు శ్లోకములున్నవి. పూర్ణకాండమునందు ఏనూట డెబ్బదేడు శ్లోకములున్నవి. మొత్తమీఁ యానందరామాయణమునందలి శ్లోకములు పంద్రెండువేల యిన్నూట యేఁబదిరెండు.

ఓ శిష్యోత్తమా! ఈ యానంద రామాయణము వినుటవలన సకల పాపములు నశించును. పూర్ణకాండమును వినుటవలన పుణ్యము వృద్ధి పొందును. సారకాండమును వినుటవలన సంసారమునుండి ముక్తుఁడగును. యాత్రాకాండమును వినుటచేత యాత్రఫలము కలుగును. యాగకాండము వినుటచేత యజ్ఞఫలము కలుగును. విలాసకాండ శ్రవణమువలన సప్పరస్త్రీ సంయోగమును పొందుదురు. జన్మకాండ శ్రవణముచేత పుత్రాది సంతతిని పొందుదురు. వివాహకాండ శ్రవణమువలన మనోహరమైన భార్య లభించును. మనోహరకాండమును వినుటచేత మనోభీష్టములను పొందుదురు. పూర్ణకాండ శ్రవణముచేత విష్ణుదేవుని పూర్ణపదము లభ్యమగును. ఆనంద రామాయణము సర్వము వినుటచేత సచ్చిదానంద రూపమునందు లీనమగుదురు. ఈ యానంద రామాయణమును విని యుద్యాపనమును చేయవలయును. ఈ యానంద రామాయణమును వినిన పిమ్మట నాలుగు గుఱ్ఱములు కలదియును సువర్ణమయమునగు రథమును దానము చేయవలయును. అనంతరము పాలనిచ్చునట్టి గోవులు దానము చేయవలయును. పిమ్మట నూట యెనిమిదిమంది బ్రాహ్మణుల కన్న దానము చేయవలయును. ఈ విధముగఁ జేసినయెడల నానంద రామాయణ మహాకావ్య శ్రవణాదికము సఫలమగును. ఉత్తముఁడగు మానవుఁడు ప్రాతఃకాలమునకు ముందుగ నిద్రనుండి మేల్కాంచి నిత్యకృత్యములను నెరవేర్చి యానంద రామాయణమును పఠించవలయును అట్టి వాఁడిహ పరలోకముల యందలి సకల కోర్కెలను పొందును. చైత్ర శుక్ల నవమియందు నూఱుమినుపగింజల ప్రమాణముగల బంగారముచేత వాయుపుత్రుఁడగు హనుమంతుని విగ్రహమును చేయవలయును. ఇట్లు కాదేని యిరువదొక్కమాష ప్రమాణము గల బంగారముచేతనైనను హనుమద్విగ్రహమును చేయవలయును. మఱియు నో శిష్యోత్తమా! ఈ యానంద రామాయణమును గ్రవాసి యైనను వ్రాయించి యైనను, చిత్రరంగాదులచేత నలంకరించి పట్టుకూఱాదులను జుట్టి హనుమద్వి

గ్రహముయొక్క స్కంధమునందుఁ బెట్టి సకల శాస్త్రవేత్తయగు బ్రాహ్మణుని బూజించి యా హనుమంతునితోఁ గూడ నానందరామాయణమును దానము చేయవలయును. ఇట్లు చేసినయెడల నీ యానందరామాయణమునం దెన్ని యక్షరములు కలవో యన్నివేల దివ్య సంవత్సరంబులు వైకుంఠమునందు సుఖముల ననుభవించును. మఱియు ననంతర మేడు జన్మములవఱకును వేదవేదాంగ పారగుఁడగు బ్రాహ్మణుఁడై పుట్టును. ఈ యానంద రామాయణము మిగుల రమ్యమును మనోహరమును పుణ్యమునువృద్ధిచేయునదియునై యున్నది. మిగులఁ బావనమైన యీ యానంద రామాయణమును వినువారు పుత్రమిత్ర కళత్రాదుల వియోగము నెన్నటికిని పొందరు. ఈ యానందరామాయణమును వినిన స్త్రీలు భర్తృ వియోగములేని వారగుదురు. స్వజనము ప్రవాసము పోయినపుడు ఆనంద రామాయణమును పఠించినయెడల శీఘ్రముగ దేశాంతరాదులనుండి వచ్చి చేరుదురు. ఈ యానంద రామాయణమును పఠించుటచేత భావి కార్యము లన్నియును సఫలములగును.

ఓ శిష్యోత్తమా! ఆనంద రామాయణమును పఠించుక్రమమును దెలిపెదను. సావధానచిత్తుఁడవై వినుము. మొదటిదినమునం దొకకాండమును మాత్రము పఠింపవలయును. రెండవ దినమునందుఁ బ్రథమ ద్వితీయకాండములను రెంటిని పఠింపవలయును. ఈవిధముగ నేకోత్తర వృద్ధిగ నవకాండములను పఠింపవలయును. ఇట్లు పదునేడుదినములనుష్ఠానమును చేయవలయును. ఇట్లు కాదేని మొదటిదినమునందు ప్రథమకాండమును, రెండవ దినమునందు రెండవకాండమును, మూఁడవదినమునందు మూఁడవకాండమును పఠింపవలయును. ఈ విధముగ తొమ్మిది కాండములను పఠింపవలయును. ఇట్లు చేయుటకు శక్తిలేనియెడల నొక్కొక సర్గమును పఠించుచుండవలయును. ఇట్లు ఏడుమాసముల కాల మనుష్ఠానము చేయవలయును. అనుష్ఠానానంతరము శాస్త్రోక్తప్రకారముగ హోమమును చేయవలయును. ప్రథమ శ్లోకము నుచ్చరించి స్వాహాకారమును చెప్పుచు పాయస ఫలాదులతో హోమము చేయవలయును. మఱియు నో శిష్యోత్తమా! నవవిధములయిన యన్నములతో హోమము చేయవలయును. అనంతరము బ్రాహ్మణులకన్న దానమును జేయవలయును. ఆనందరామాయణమును ప్రాతఃకాలమునందు భక్తితో పఠించువాఁడు సకల సుఖములను పొందును. ప్రతిదిన మీ యానంద రామాయణమునందలి యొక కాండమునైనను, సర్గమునైనను పఠింపవలయును. ఈ యానంద రామాయణమును పఠింపనివారి జన్మము నిరర్థకమగును. పుత్రాభిలాషియగువాఁడు రతికాలయందు భార్యతోఁగూడ దీనిని పఠింపనైనఁ బఠింపవలయును. విననైన వినవలయును. మఱియును రాత్రియందు పత్నీసహితుఁడై శయనించ

వలయును. అట్టివానికి పుత్రులు పుట్టుదురు. ఓ శిష్యోత్తమా! ఇంతవఱకు నీ వడిగిన విషయముల నన్నిటిని దెలిపితిని. ఈ యానంద రామాయణమునందలి యొక శ్లోకమునైనను భక్తితోఁ బఠించువాఁడు రాముని సాలోక్యమును పొందును. శతకోటి పరిమితమగు రామాయణమును రచించి వాల్మీకి మునివరుఁడు ధన్యుఁడయ్యె. వాల్మీకి మునివరునిచేతఁ జేయఁబడిన శతకోటి రామాయణము నందలి సారమగు నానంద రామాయణమును ప్రతిదినమును వినువాఁడు, పఠించువాఁడును, వ్రాయువాఁడును సీతారాముల సాన్నిధ్యమును పొందుదురు. మఱియు నో శిష్యోత్తమా! ఈ యానంద రామాయణము గంగవలెను, కామధేనువు వలెను సర్వపాపములను పోఁగొట్టుననియును, సకల కామముల నొసంగుననియును తెలిసికొన వలయుననియె నని చెప్పి పరమశివుఁడు పార్వతితో నిట్లనియె.

ఓ పార్వతీ! ఆ విష్ణుదాసనువాఁడు ఈ యానంద రామాయణమును గురుముఖమున విని మాటిమాటికిని సీతారాములను పూజించుచుండె. ఓ పార్వతీ! రామదాసు శిష్యునకీ యానందరామాయణమును జెప్పి సంధ్యావందనము చేయుటకు గోదావరీనదికిఁ బోయె. మఱియు నో పార్వతీ! రామదాసు శిష్యునకుఁ జెప్పిన విధముగ నీకీ యానంద రామాయణమును జెప్పితిని. ఈ యానంద రామాయణమును వినుటవలన పుణ్యము వృద్ధి పొందుననిన విని పార్వతీదేవి సవినయముగ నిట్లనియె. ఓ దేవోత్తమా! వాల్మీకి మునివరునిచేత నీ యానందరామాయణ మెప్పుడు రచింపఁబడెను? వాల్మీకి మునివరుఁడీ రామాయణమును రచించునపుడు రామదాస విష్ణుదాసు లెక్కడ గలరు? ఈ విషయమునందు నాకు సందేహము కలదు. నా సందేహమును దీర్పుమనిన విని పరమశివుఁడు మఱల నిట్లనియె. ఓ పార్వతీ! వాల్మీకి మునివరుఁడు జ్ఞానదృష్టి కలవాఁడగుట చేత రాఁబోవునట్టి రామదాస విష్ణుదాసుల సంవాదమును దెలిపె. కావున నీ విషయమునందుఁ గొంచెమైనను సందేహమును పొందకుము. ఈ యానందరామాయణము ముక్తిని కలుగఁ జేయునట్టిదై యున్నది. పుత్రోత్పత్తికాలము, వివాహకాలము, వ్రతబంధకాలము, శ్రాద్ధకాలము మొదలగు సమయములయందు భక్తితో నీయానందరామాయణమును పఠింపవలయును. కారా గృహమునం గున్న వానికి విముక్తి కలుగుట కొఱకీ యానందరామాయణమును పఠింపవలయును. ఈ యానంద రామచరితమును భక్తి శ్రద్ధలతో వినువారును పఠించువారును సకల కామముల ననుభవించి వైకుంఠమును పొందుదురు. సకల దానములు నీ యానంద రామాయణము కంటె నధికములైనవి కావు. కావున నో పార్వతీ! ఈ యానంద రామాయణమును సర్వకాలములయందును భక్తితో పఠింపుమని చెప్పి ఫలశ్రుతి వచించె. ఎట్లనిన:—

శ్లో॥ రామోహత్వాదశాస్యం ద్విజవచన గురుత్వేన యాత్రాశ్చ యజ్ఞాన్ ।
కృత్వా భక్త్యాతిభోగా నవనితల విశంతీం గృహీత్వాఽథ సీతామ్॥
లబ్ధ్వా నానాస్నుషా స్తాస్త్వవనితలగతా న్పార్థివాదీంశ్చ జిత్వా ।
కృత్వా నానోపదేశాన్గ జపురనికటం స్వీయలోకం జగామ॥
వామే భూమిసుతా పురస్తు హనుమా న్పృష్ఠే సుమిత్రాసుతః ।
శత్రుఘ్నో భరతశ్చ పార్శ్వదళయో ర్వాయవ్యకోణాదిషు ।
సుగ్రీవశ్చ విభీషణశ్చ యువరా ట్తారాసుతో జాంబవాన్ ।
మధ్యే నీలసరోజకోమలరుచిం రామం భజే శ్యామలమ్ ।
ఆనందరామాయణ హాటకోపమం యే పూర్ణకాండం చరమం నరోత్తమాః।
పఠంతి శృణ్వంతి హరేః పరం పదం గచ్ఛంతి పూర్ణేఽపిత మాలభంతి తే॥
ఆనంద రామాయణ మేత దుత్తమం ।
జప్యం పవిత్రం శ్రవణీయ మాదరాత్ ।
యన్మంగళానామపి మంగళప్రదం ।
స్మరామి నిత్యం ప్రణమామి సాదరాత్ ॥

ఇట్లని శ్రీమదానంద రామాయణాంతర్గత పూర్ణకాండమునందుఁ
దొమ్మిదవసర్గము ముగిసెను.

శ్రీ మదానంద రామాయణము సర్వము సంపూర్ణము.

ఓం తత్సత్

శ్రీ రామార్పణ మస్తు.